# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

సంపుటి -1 సంచిక -1 ప్రారంభ సంచిక 2021 నవంబర్ 01



"జ్ఞానం ఎప్పుడూ
అభివృద్ధిని కోరుతుంది;
అది అగ్ని వంటిది,
మొదట ఇతరుల ద్వారా
వెలిగించ బడుతుంది.
కానీ, తర్వాత తనకు తానుగా
తన అస్తిత్వాన్ని చాటుకుంటుంది"

- క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే

# దీపావళి కథల పోటీ విజేతలకు అభినందనలు



**డా. సిహెచ్. సుశీల**

"బహుళ" త్రైమాసిక పత్రిక & కథా సాగరం సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథల పోటీ ఆహ్వానం మేరకు 39 కథలు వచ్చాయని, బహుమతుల కోసం మంచి కథలను ఎంపిక చేయమని శ్రీమతి జ్వలిత గారు నాకు కథల్ని మెయిల్ చేశారు. రచయిత్రుల పేర్లు లేకుండా కేవలం నెంబర్లలో ఉన్నాయి. చూశాను. అన్నీ మంచి కథలు. చాలా కథలు బాగున్నవీ, బహుమతులకు అర్హమైనవీనూ. కానీ ఉన్నవేమో ప్రథమ ద్వితీయ తృతీయ మరియు రెండు కన్సోలేషన్ బహుమతులు మాత్రమే. రెండు వడపోతలలో మిగిలినవి పది కథలు. ఇక్కడే నాకు కష్టమనిపించింది. చివరి వరకు వచ్చి నిలిచిన ఈ పది కథలు సామాజికపరమైన సమస్యలను దర్పణం పట్టేవి, మానవీయ దృక్పథంతో ఉన్నవి. అతికష్టం మీద పరిశీలనతో, చాలా కొద్ది మార్కుల తేడాతో కొన్ని జారిపోగా, మిగిలిన కథల్ని ఎంపికచేయడం జరిగింది.

కూతురు కాపురం నిలబడడానికి ఒక లక్ష, కొడుకు ఉద్యోగం కి రెండు లక్షలు, తండ్రి అనారోగ్యానికి హాస్పిటల్ ఖర్చు రెండు లక్షలు కావాల్సివచ్చింది. ఇక్కడే ఊహించని మలుపు ఉంది ప్రథమ బహుమతి గెలిచిన కథ "ఎర్ర రేగళ్ళు" లో. హాస్పిటల్లో ట్రీట్మెంట్ కోసం డాక్టర్ 14 లక్షలు వసూలు చేసి, మన్యంకొండ బతకాలంటే ఇంకా అవసరం అవుతుందని అతని కొడుకుకి చెప్పి, కోటి విలువచేసే స్థలాన్ని 60 లక్షలకు కొనేసి, కూతురికి బర్త్ డే గిఫ్ట్ గా ఇస్తాడు. తన భర్త ప్రాణాలు కాపాడిన దేవుడు డాక్టర్ అని దండం పెట్టుకుంటుంది మన్యంకొండ భార్య. అమాయకత్వం, అజ్ఞానం, నిరక్షరాస్యత వల్ల పేదలు ఎంత దోపిడీకి గురవుతున్నారో చెప్పిన ఈరచయిత్రి కి నా అభినందనలు.

"ది లాస్ట్ ఫ్యామిలీ" కథలో అమెరికా లో స్థిరపడ్డ స్థితిమంతుల అమ్మాయి 'శైల' కల్చరల్ కాంపిటీషన్స్ కోసం తన మూలాలను అన్వేషిస్తూ భారతదేశంలోని తన లంబాడా తండాకి వస్తుంది. తనకు జ్ఞాపకమున్న ఆనాటి తనవారి సంస్కృతి ఆనవాళ్ళు అన్నీ కొట్టుకు పోయాయి ప్రపంచీకరణ తెచ్చిన అధునాతన పాశ్చాత్య సంస్కృతి తో. ప్రతి ఇల్లూ వెదుకుతూ పోతే చివరి ఇంట్లో దొరుకుతాయి – "తన వారికి" సొంతమైన అద్దాలు కుట్టిన దుస్తులు వగైరాలు. ఇది లాస్ట్ హౌస్ కావచ్చు, కానీ నా సంస్కృతి కి లాస్ట్ కాదు అనుకొంటూ, తన "అస్థిత్వాన్ని" పదిలంగా పట్టుకుంటుంది. సంభాషణల్లో "సహజత్వం" ఉట్టిపడేలా లంబాడా భాషను ప్రయోగించిన ఈ రచయిత్రి కి అభినందనలు.

కటిక పేదరికం వల్ల గత్యంతరం లేక జోగిని గా మారి " పార్వతీ రాజేశం... బిచ్చం.." అంటూ అడుక్కునే లచ్చిమి తనకు దొరికిన పిల్లకి గౌరి అని పేరు పెట్టుకొని, తనలాగా కాకూడదని, బడిలో చేర్పించి చదివిస్తుంది. మాస్టరు గారి పుణ్యమా అని బాగా చదువుకుంటున్న గౌరి పట్నంలో హాస్టల్లో ఉండి చదువుకొని, పట్టుదలతో ఐపీఎస్ అధికారి గా మారడం "లచ్చుమమ్మ" కథ. సాంఘిక దురాచారాన్ని రూపుమాపి తర్వాతి తరాలకి ఆశాకిరణాన్ని చూపిన ఈ కథా రచయిత్రి కి అభినందనలు.

రెసిడెన్షియల్ కళాశాల్లో జరుగుతున్న అరాచకాలు, వారి నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు, శిక్ష నుండి యాజమాన్యం ఎంత తెలివిగా చెప్పించుకుంటుందో చెప్పే "నిర్లక్ష్యం" కథకు కన్సోలేషన్ బహుమతి. భర్త చనిపోతే ఆ భార్యకు జరిపే అహేతుకమైన, అన్యాయమైన "తంతు"ని వివరించే కథ "చివరి కోరిక". గాజు,పూస తీయవద్దని నాన్నగారు రాసిపెట్టారు అంటూ వీలునామా లో ఒక చిన్న అబద్ధం చేర్చి, 'ఇక ఇలాంటి తంతు ఎక్కడ జరిగినా మేం వ్యతిరేకిస్తాం' అన్న ఆమె పిల్లలు రాబోయే తరానికి ప్రతినిధులు.

చిత్తుకాగితాలు ఏరుకుంటూ, పెంచుకొన్న కూతుర్ని మనవడిని జాగ్రత్తగా చూసుకొంటుంది సాయమ్మ. మొగుడు తాగి వచ్చి తన్నుతున్నా ఓర్చుకొంటూ చివరికి శివమెత్తి , చెవులకున్న జుంకీలు, మెడలో పుస్తెలు తీసి ఎల్లయ్య మొహాన కొట్టేసరికి అపరకాళిలా వున్న ఆమెని చూసి భయపడి మళ్ళీ తాగుడు జోలికి పోలేదు "చిత్తు కాగితాల సాయమ్మ"లో.

తన వయసును మర్చిపోయి కూరగాయలమ్మితో ఆప్యాయంగా మాట్లాడే వామనరావుని చూసి దేవుడిలాంటి మనిషి అనుకొంది కనకం. ఇంట్లో బూజులు దులపడానికి సాయం చేయాలని వచ్చిన కనకమ్మకి తన కోర్కెను వెల్లడించిన వామనరావుని చెడామడా తిట్టి, తలుపు తీసేసరికి అప్పుడే వచ్చిన భర్త అడిగాడు – అయిందా క్లీన్ చేయడం అని. "పూర్తిగా దుమ్ము దులిపాను" అంది సీరియస్ గా. మగాడి లోని మృగాన్ని ధైర్యంగా ఎదిరించింది సామాన్య కూరలమ్మి కనకం "నువ్వు నాకు నచ్చావ్" కథలో.

ఇద్దరు కొడుకులు మంచి స్థితిలో వుండి ఇంటికి రమ్మని ప్రేమగా పిలిచినా వెళ్ళక తక్కువ జీతం వస్తున్న మూడో కొడుకు దగ్గరే ఆసరాగా వున్న ముసలి తండ్రి కథ " నాన్న మనసు". కడుపులో ఆడ శిశువు ఉంటే మాత్రం భార్యకి అబార్షన్ చేయించాలని హాస్పిటల్ కి తెచ్చిన పవన్ , ముందుగా డాక్టర్ స్కానింగ్ తీస్తూ మానిటర్ లో చూపిస్తున్న పిండాన్ని చూసి, తన రక్తంలో భాగమై, రూపుదిద్దుకుంటున్న ఆ అమాయకపు బిడ్డ ఆడైనా, మగ ఐనా ఒకటే అని మనసులోంచి ప్రేమ మమకారం వెల్లువెత్తి తన పాపపు ఆలోచన విరమించుకొంటాడు. ఈ లోకం లోకి ఆప్యాయంగా "ఆహ్వానం" పలకాలని నిర్ణయించుకొంటాడు. జెండర్ ని తెలుసుకోవడానికి కూడా ఇష్టపడక పోవడం మంచి సందేశాత్మక కథ.

ఈ కథలన్నీ బహుమతికి అర్హమైనవే. "పోటీ" అన్న మాటకి వున్న పరిమితి దృష్ట్యా కొన్ని ఎన్నిక చేయవలసి వచ్చింది.

మంచి కథలు చదివే అవకాశం ఇచ్చిన జ్వలిత గారికి ధన్యవాదాలు.

# ఎడిటోరియల్

"ఏం జరుగుతూ ఉన్నదో బిగ్గరగ చెప్పడమే ఎవరైనా ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని" – రోజా లగ్జంబర్గ్

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజలకు రక్ష లేదు పత్రిక లేనిచో" అని చెప్పిన పత్రికా సైన్యాధ్యక్షుడు నార్ల వెంకటేశ్వరరావు మాటలం గుర్తు చేసుకోవలసిన సమయమిది.

ఏ పత్రికా? ఎవరికి సైన్యము...? అంటూ ప్రశ్నలెయ్యకండి. ఎందుకంటే.. ప్రస్తుతం పత్రికల పరిస్థితి ఏమిటో.. ఎజెండా ఏమిటో.. చిన్నపిల్లవాడినడిగినా.. గుక్క తిప్పుకోకుండా ఏకరవు పెడతాడు..

మరి మనకు పత్రిక ఏది ? మన గురించి ఎవరు రాయాలి ? మన అంటే 95% జనభాలో సగం మిగిలిన 5% లో సగం, అంటే 47.5 % + 2.5% కలిపి 50% జనాభా మహిళలమే కదా.. వారి కోసం ఈ 'బహుళ' పని చేస్తుంది.

'కాదు.. మావి మాకున్నాయి' అంటారా... సంతోషం. బహుజన మహిళా పత్రిక 'బహుళ'.

మహిళల చేత మహిళల కోసం నిర్వహించే ఫత్రిక బహుళ... పిలవగానే ముందడుగు వేసి చేతులు కలిపిన మిత్ర బృందానికి, సలహాలతో వెన్నుతట్టిన పెద్దలకు ధన్యవాదాలు

- ★ బహుళకు మూలం ఏమిటంటే...
  అంతర్జాతీయ అంతర్జాల మహిళా త్రైమాసిక పత్రిక
- ★ బహుళపత్రికకు మూలం సావిత్రిబాయి పూలే భావజాలం.
  'బహుజన హితాయ – బహుజన సుఖాయ'లో 'మహిళల సాధికారత – సమానత్వం – ఐక్యత ' పత్రిక లక్ష్యం.
- ★ కుల,మత, ప్రాంత, వర్గ భేదం లేకుండా మహిళల సాధికారత కోసం, ఐక్యత కోసం నిలబడుతుంది.
- ★ అట్టడుగు వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళల చైతన్యం, అభ్యున్నతి దిశగా పత్రిక పనిచేస్తుంది .
- ★ సమాజంలోని మూఢనమ్మకాలకూ, వివక్ష, అవినీతి, లంచగొండితనం, మద్యం, డ్రగ్స్, అసమానత్వం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా మహిళలను సంఘటిత పరిచేందుకు కృషి చేస్తుంది.
- ★ మానవ సంబంధాలను మరింత మెరుగు పరిచేందుకై ,ప్రకృతి పర్యావరణ సంరక్షణకై కృషి చేస్తుంది.
- ★ అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ అప్రజాస్వామిక మత, జెండర్, వివక్షా పరమైన దాడులను బహుళ తిరస్కరిస్తుంది.
- ★ మనువాదాన్ని సమర్థించే రచనలకు పత్రికలో చోటు ఉండదు.
- ★ 'రాజ్యాధికారంలో బహుజన మహిళల వాటా' అంతిమ లక్ష్యంగా 'బహుళ' అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక పనిచేస్తుంది...
  మీ గళాన్ని అందించండి, మీ కలాన్ని కదిలించండి.. చదవండి... బహుళ మనదే.. మన కోసమే....

...జ్వలిత
ప్రధాన సంపాదకురాలు


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**ప్రధాన సలహాదారులు**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి

**సంపాదక వర్గం**
ఆచార్య సూర్య ధనుంజయ
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. త్రివేణి
డా. నందిగామ నిర్మల
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
డా. మారోజు దేవేంద్ర
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్లు కాదు.**

# విషయ సూచిక


| | ముఖచిత్రం | | శేష్రబహ్నం | |
|---|---|---|---|---|
| 1. | కథ | పల్లీబుట్ట | – ఆచార్య సూర్య ధనుంజయ | 5 |
| 2. | కవిత | MORNING SAGA | – shajahana | 7 |
| 3. | వ్యాసం | లైంగిక రాజకీయార్థిక కుల శాస్త్రం – మన సమాజం | – అనిశెట్టి రజిత | 9 |
| 4. | కవిత | కొన్ని సమయాలు | – కడెం లక్ష్మీ ప్రశాంతి | 11 |
| 5. | వ్యాసం | తెలంగాణా పోరాట నవలలో స్త్రీ చైతన్యం | – డా. తిరునగరి దేవకీ దేవి | 12 |
| 6. | కథ | 'వివక్ష' | – నాంపల్లి సుజాత | 14 |
| 7. | కవిత | మనువు | – చల్లా సరోజినీ దేవి | 17 |
| 8. | కవిత | సమానత్వాన్ని సాధిద్దాం | – సిస్టర్ అనసూయ | 17 |
| 9. | వ్యాసం | వయొలెన్స్… సైలెన్స్ | – జి. విజయలక్ష్మి | 18 |
| 10. | నాటిక | దర్పణం | – కీర్తి పూర్ణిమ | 22 |
| 11. | కవిత | గజల్ | – రావుల కిరణ్మయి | 26 |
| 12. | కథ | మరో మార్గం | – జయంతి వాసరచెట్ల | 27 |
| 13. | వ్యాసం | మట్టితో చెలిమి–ప్రకృతి మాలిమి | – కొల్లాపురం విమల | 31 |
| 14. | అనువాద కథ | కథల ఒడ్డున.. కాసాపు ఆగుదామా! | – నిగమ | 38 |
| 15. | మినీస్టోరీ | ఏది మా ఇల్లు | – తులసీ గుగులోతు. | 43 |
| 16. | కవిత | అలుపెరగని భూమిపుత్రి..!! | – బి. కళాగోపాల్ | 44 |
| 17. | కవిత | గెలుపుపాదం | – రమాదేవి బాలబోయిన | 44 |
| 18. | సాహిత్య విమర్శ | స్త్రీవాద రాజకీయాలు: దళిత స్త్రీవాదం | – నందిగామ నిర్మలకుమారి | 45 |
| 19. | అస్తిత్వ వ్యాసం | వందేళ్ల నిరీక్షణ తప్పదా? | – నస్రీన్ ఖాన్ | 48 |
| 20. | వ్యాసం | నాలుగు దశాబ్దాల సిజేరియన్ చరిత్ర | – డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి | 50 |
| 21. | న్యాయం | మహిళా చట్టాలు ఎందుకంటే..? | – డా. దెంచనాల సరళ కుమారి | 53 |
| 22. | లేఖ | మహానదీ తీరాన ధబలేశ్వర్ | – కుప్పిలి పద్మ | 55 |
| 23. | కవిత | ఆమె నానీలు | – డా. బండారి సుజాత | 57 |
| 24. | కథ | నరలోకంలో….. రచయిత్రి | – యడవల్లి శైలజ ప్రేమ్ | 58 |
| 25. | సాహిత్య విమర్శ | తెలంగాణ స్త్రీవాద కవిత్వం – సాధికారత | – డా॥ వి. త్రివేణి | 60 |
| 26. | కవిత | ఆమె | – శాంతి కృష్ణ | 60 |
| 27. | సాహిత్య పరిశీలన | రాజును ధిక్కరించిన కవి కుమార్తె ఆత్మగౌరవం | – డా॥ కొండపల్లి నీహారిణి | 65 |
| 28. | కవిత | ఫోన్ చేస్తే పలుకుతారా…? | – పురిమళ్ళ సునంద | 69 |
| 29. | కవిత | కొంచెం ! | – బైరి ఇందిర | 69 |
| 30. | లేఖ | మేఘ రాగమ్ | – వనజ తాతినేని | 70 |
| 31. | గళం | నమ్మకం | – నిరుపమ | 73 |
| 32. | గళం | ఒక హిజ్రా | – సరోజన బోయిని | 74 |
| 33. | కవిత | వయో వంచితులు | – డా. బి. మాధురి | 76 |
| 34. | హాస్య కథ | 'కాఫీలు తాగారా.. టిఫినీలు తిన్నారా' | – ఎన్నెల | 77 |
| 35. | కవిత | పిచ్చితల్లి | – హిమజ | 78 |
| 36. | పౌరాణిక వ్యాసం | మహేతిహాసంలో మహానాయక | – డాక్టర్ దాసోజు పద్మావతి | 80 |
| 37. | చారిత్రక వ్యాసం | తరతరాల తెలంగాణ –1<br>నిజాం కాలంలో భూములు – వివరాలు | – తంగెళ్ళశ్రీదేవిరెడ్డి | 82 |
| 38. | గళం | ఆధార్ కార్డ్ | – లావణ్య | 84 |
| 39. | వ్యాసం | శాస్త్రీయ దృక్పథం ఆచరణీయం..! | – సుజాత నాంపల్లి | 85 |
| 40. | లేక | లేఖలతో ఖండన... ఎందుకంటే..? | – జ్వలిత | 87 |
| 41. | కవిత | పంచభూతాలు పరవశిస్తాయి | – బండి ఉష | 91 |
| 42. | కవిత | వృద్ధుల శరణాలయం | – చౌటపల్లి నీరజచంద్రన్ | 92 |
| 43. | కవిత | ఎదురుచూపు | – పి. సుష్మ | 93 |
| 44. | కథ | నవనీతం | – రోహిణి వంజరి | 94 |
| 45. | కవిత | జీవన వ్యాపారం | – శ్రీదేవి సురేష్ కుసుమంచి | 97 |
| 46. | కథ | ఏదిజరిగినా మన మేలుకే ! | – దామరాజు విశాలాక్షి | 98 |
| 47. | కవిత | చెట్టూ – పిట్టా | – స్వాతీ శ్రీపాద | 99 |
| 48. | కథ | పెళ్లి లొల్లి | – పెద్దపల్లి తేజస్వి | 100 |
| 49. | కవిత | నా రాత మీన మన్నువడ | – సొన్నాయిల కృష్ణవేణి | 102 |
| 50. | కళ | నేనూ…. నా ఆర్ట్. | – డా. లక్ష్మీ రాఘవ | 103 |
| 51. | కవిత | చదువు | – డి సాయి హర్షిత | 104 |
| 52. | బాల బహుళ | | | 105 |

# పల్లీబుట్ట



- ఆచార్య సూర్య ధనుంజయ

"ప్రయాణికులకు విజ్ఞప్తి ట్రైన్ నెంబర్ 25790 విజయవాడ నుండి సికింద్రాబాద్ వెళ్ళవలసిన శాతవాహన ఎక్స్ ప్రెస్ మరికొద్ది సేపట్లో ఫ్లాట్ ఫామ్ నెంబర్ 02 మీదికి రానున్నది" అంటూ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో అనౌన్స్ మెంట్ వినిపిస్తుంది.

పూల్ సింగ్ తన భార్య సక్కుతో పాటు తాను పరుగెత్తుతూ "రోజు నీకు ఇది అలవాటై పోయింది. గాడి టైం అవుతున్నా కూడా ఇంట్లో ఏదో ఒకటి సర్దుతూనే ఉంటవ్. ఎందుకే నువ్వు. నీకు ఎన్ని సార్లు చెప్పాల్నే. నేను చెబితే ఎన్నడన్నా విన్నావా. రోజు నీతో గిట్ల నన్ను ఊరికిస్తున్నావ్" అంటూ సక్కును తిడుతున్నాడు. ఆమె అవేం పట్టించుకోవట్లేదు. తన గంపలోంచి ఏది కిందపడకుంటే అంతే చాలు అనుకుంటోంది. ఏదైతేనేం ఎట్టకేలకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ కు చేరుకున్నారు. ఎక్స్ ప్రెస్ ట్రైన్ ఒకటి అప్పుడే ఫ్లాట్ ఫామ్ కి వస్తుంది. "యాడియే ★దాస్ దాస్..." అంటూ సక్కు పూల్ సింగ్ లు పరుగెత్తుతూ స్టేషన్ చేరుకున్నారు. సింకిద్రాబాద్ నుండి గుంటూరు వెళ్ళే ట్రైన్ అప్పుడే అక్కడినుంచి కదిలింది. స్టేషన్ ఖాళీగా కనిపించింది. "హమ్మయ్య వెళ్ళింది గుంటూరు గాడి. ఆపన్ గాడి ఇంకా రాలేద"ని ఊపిరి పీల్చుకున్నారిద్దరు. అంతలోనే నగరంలోని పక్షులను చెట్లమీదినుండి అదిలిస్తున్నదా, వాహనాల చప్పుళ్లను మింగుతున్నదా అన్నట్లు పెద్ద పెద్దగా కూ... కూ...అంటూ హార్న్ సైరన్ తో సింకిద్రాబాద్ వెళ్లే ట్రైన్ వచ్చి రెండవ నెంబరు ఫ్లాట్ ఫామ్ పై ఆగింది. ప్రయాణికులందరూ ఎక్కాక గంపలోంచి మూడు బుట్టలు లోపల పెట్టాడు పూల్ సింగ్. వాటి మూతులు కాటన్ గుడ్డలతో చుట్టబడి ఉన్నాయి.

"జత్తన్ సక్కు. వచ్చిన పైసలు ఖర్చు చేయకుండా తీసుకురా. పిల్లల ఫీజు కట్టాలి మర్చిపోకు. నాస్తా కూడా చెయ్యలే నువ్ కాజీపేట స్టేషన్ల సమోసా తిని చాయ్ తాగు" అంటూ పూల్ సింగ్ సక్కును ట్రైన్ ఎక్కించాడు. పూల్ సింగ్ మహబూబాబాద్ మార్కెట్లో కూరగాయలు హోల్ సెల్ కి కొని ఊరూరా తిరిగి అమ్ముతుంటాడు. ఇద్దరూ పనిచేస్తేనే ఇల్లు గడిచేది. తండాలో భూమి లేకపోవడం,తన తల్లి క్యాన్సర్ తో ఈ లోకాన్ని వీడిపోవడంతో పిల్లలు, తండ్రితో కలిసి మహబూబాబాద్ వచ్చేశాడు. తాము కష్టాలు పడ్డా పర్వాలేదని పిల్లలు తమలా కష్టం చూడకూడదని పిల్లల్ని మంచి పేరున్న పబ్లిక్ స్కూల్ లో చేర్పించాడు. చదువుకొని మంచి స్థాయిలో తమ పిల్లలుండాలని వారిద్దరి ఆరాటం.

★ ★ ★

బోగికి బోగికి మధ్య ఉండే సందులో నాలుగు బుట్టల్ని సర్దింది సక్కు. కిక్కిరిసిపోయిన ట్రైన్ లో కూర్చున జాగాలేక చాలామంది నిలబడే ప్రయాణిస్తున్నారు. బోగీ సందులో కూర్చున్న ఒక ముసలయ్యకు బుట్టల్ని చూడమని చెప్పి ఒక బుట్టను చంకలో పెట్టుకొని "ఫళి ఫళి వేయించినవి, ఉడక బెట్టినవి" అంటూ జనాల్ని కదిలిస్తూ ముందుకు సాగింది. కొంతమంది విసుక్కుంటూ "ఏమిటమ్మా ఇది. నిలబడనీకే జాగా లేదు. మధ్యలో నీ లొల్లి ఏంది" అంటూ జరగలేక జరిగారు. ఎవరు విసుక్కున్నా, ఏమన్నా తానేమీ అనకుండా పల్లిలు అమ్ముతుంది.

కే సముద్రం దాటిన ట్రైన్ ఇంతలోనే వరంగల్ స్టేషన్ పరిసరాల్లోకి వచ్చింది. ఒక బుట్ట పల్లీలు అమ్మేసింది సక్కు సికింద్రాబాద్ వెళ్లేలోగా మూడు బుట్టలు అమ్మేయ్యాలి. రోజూ ఇదే ఆమె దినచర్య.

ట్రైన్ కాసేపట్లో ఫ్లాట్ ఫార్మ్ మీదికి చేరుతుందనే సమయంలో టీసీ ఒకడు తాను అమ్ముతున్న బోగి లోకి వచ్చాడు. టికెట్ లేని ప్యాసింజర్లు కొందరు అతని వెనకాల

దీనంగా "సార్ సార్ మమ్మల్ని వదిలేయండి సార్"అంటూ వస్తున్నారు. సక్కు రోజు చాలామంది టీసీలను చూస్తుంది. తనలాంటి పల్లీలమ్ముకునే వారిని ఇప్పటివరకూ ఎవ్వరూ ఏమి అన్న దాఖలాలు కనబడలేదు. ఇతనేవరో కొత్తగా డ్యూటీలోకి ఎక్కినట్టున్నాడు. బండి వేగాన్ని ఫ్లాట్ ఫార్మ్ పగ్గం వేసి లాగేసిందా అన్నట్టు ఒక్క కుదుపు కుదిపి ఆగింది రైలు. వస్తూ వస్తూనే "ఏయ్ నీకు లైసెన్స్ ఉందా ట్రైన్ లో వ్యాపారం చేసుకోడానికి. నువ్వు ముందు బండి దిగు" అంటూ ఆమెను కిందికి నెట్టేస్తున్నాడు. "సారు బతకనీ సారు. బీదదాన్ని సారు. ఇద్దరు పిల్లలు ఉన్నారయ్యా. ఇస్కూల్ పీజు కట్టాలి సారు. నేను పల్లిలమ్మి తీసుకపోయే పైసలే మా బతుకు దెరువు సారు. వదిలేయండి సారు. వదిలేయండి సారు" అని పొట్టను చూపుతూ వేడుకుంది. "ఏం మాట్లాడుతున్నావ్. చల్ చల్ కిందికి దిగు, రోజు మీకు ఇదొక ఆట అయిపోయింది. నువ్వు ముందు దిగు" అంటూ టీసి ఆమెను కిందికి తోసేశాడు. "సారు నా బుట్టలు లోపల ఉన్నాయి దింపుకుంటా సారు" అంటూ సక్కు ప్రాధేయపడింది. కానీ టీసి వినలేదు పైగా సెక్యూరిటీని పిలిచి స్టేషన్ బయటకు గెంటించాడు. ఆమె వద్ద ఇప్పుడు ఒక బుట్ట పల్లీలమ్మిన 200 రూపాయలు మాత్రమే ఉన్నాయి. అయినా ఆమెలోని ఆశ చావలేదు. ట్రైన్ ఇంకా కదలలేదు. డబల్ క్రాసింగ్ పడినట్టుంది. వెంటనే మళ్ళీ స్టేషన్ లోకి వెళ్లాలని ప్రయత్నించింది. కానీ లాభం లేకపోయింది.

ఆ చండశాసనుడు ఫ్లాట్ ఫామ్ మీదనే ఉన్నాడు. ఇంతలో క్రాసింగ్ బండి వెళ్ళిపోయింది. ట్రైన్ కదులుతుంది. ఆ టిసి సెకండ్ క్లాస్ బోగీల వైపు వెళ్లడం గమనించిన సక్కు వేగంగా పరిగెత్తి తన బుట్టలున్న బోగీలోకి ఎక్కేసింది. ఈ ప్రయత్నంలో ఆమె కాలుకు బోగి తలుపుతగులుకొని గాయం అయి రక్తం ధారాపాతంగా కారుతుంది. గాయం చేసిన నొప్పికి ప్రాణం పోయినట్లయింది. వెంటనే తేరుకొని కొంగు భాగాన్ని కాస్త చింపి కాలికి కట్టుకుంది. బాధను పంటికింద దాచుకుంది.

ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులైన ప్యాసింజర్ లు ఒకరిద్దరు "పాపం కడుపు కష్టం. ఏం జేస్తాం. ఎవరి కర్మ ఎలా ఉందో" అనుకున్నారు. ఖాళీ బుట్టను మిగిలిన బుట్టల కింద పెట్టి మరో బుట్ట తీసుకొని కుంటుకుంటూనే మరో బోగీలోకి వెళ్ళింది సక్కు. రిజర్వేషన్ బోగిని కలుపుతూ ఒకే కారిడార్ పరుచుకుని ఉంటుంది. అలా ఆమె ముందుకు కదులుతూ ఐదు బోగీలు దాటి ఆరో బోగీలోకి ప్రవేశించింది.

★ ★ ★

ఫళి ఫళి అనే స్వరాన్ని, ఆ స్వరంలోని బంజారా యాస సుగంధాన్ని వినగానే ఆమె ఎవరో తమ జాతికి చెందిన స్త్రీయే అనుకున్నాడు హీరానాయక్. తన పక్కనే కూర్చున్న తన చెల్లి పద్మతో "వస్తున్నది ఎవరో మన అమ్మాయిలాగే ఉంది. పల్లీలు కొందాం"అన్నాడు. ఆమె సరేనని తల వూపింది. హీరానాయక్, అతని చెల్లి డోర్నకల్ లో ఉండే తమ బంధువుల ఇంట్లో ★వాయా ఉంటే వెళ్లి తిరిగి హైదరాబాద్ వెళ్తున్నారు. ఇందాకా సక్కుతో జరిగిన సంగతి గురించి వీళ్ళకేం తెలియదు. ఆ బోగికి వీరు ప్రయాణిస్తున్న బోగికి చాలా దూరం ఉంది. దీనికి తోడు ప్రయాణికులు, చాయ్,సమోసా వాలాల గోల ఒకటి. దానితో కనీసం టీసి అరుపులు కూడా వినబడలేదు .

సక్కు వీళ్ళున్న కంపార్టుమెంట్ కి రాగానే "ఏ ★బాయి బీస్ రూపాయార్ పల్లీ ద." అన్నాడు హీరానాయక్. ఆమె దీనంగా ముఖం పెట్టి కాగితాల్లో తన కష్టాన్ని పల్లీలుగా చుట్టి అందించింది. ఆమెను చూడగానే హీరానాయక్ చెల్లి పద్మ "★భీయా ఈమెనెవరో కొట్టినట్టున్నారు. పాపం కాలికి గాయం కూడా అయింది. కుంటుతుంది. ఆమెను ముందు కూర్చోమను. ఆకలితో ఉన్నట్టుంది పులిహోర తింటుందేమో అడుగు" అన్నది. ముందు కడుపు చూసి తర్వాత హృదయం చూడాలంటారు బంజారా పెద్దలు. ఆమె తన తండ్రి చెప్పిన మాటల్ని తన అక్క చెబుతుంటే విన్నది. అందుకే ఆమె పరిస్థితి చూడగానే ఆమె ఆకలిని కూడా పసిగట్టేసింది. హీరానాయక్ ఆమెను కూర్చోమన్నాడు. సీటుపై కూర్చోకుండా కిందనే కూర్చుంది సక్కు. "కాయి బాయి కూనస్ తండో తార్. అన్నాడు హీరానాయక్. భియా తూ థం రే. బాయి తూ ముందుగా యే పులిహోరా ఖాల" అన్నది పద్మ. సక్కు సున్నితంగా వద్దని సైగ చేసింది. కానీ పద్మ బలవంతం ఆమె ప్రయత్నాన్ని విఫలం చేసింది. సక్కు ఎంతో కృతజ్ఞతతో ఆమె ఇచ్చిన పులిహోరా తిన్నది. ఆమె అనుభవిస్తున్న గాయం తాలూకు పీడనకు తోడు పిండేస్తున్న ఆకలిని పద్మ పెట్టిన పులిహోరా మాయంచేసింది.

దీనంగా ఉన్న సక్కును చూసి హీరానాయక్ "ఏం జరిగింది ఎందుకలా ఉన్నావ్ బాయి"అని అడిగాడు. ఇందాక జరిగిన వృత్తాంతం మొత్తం చెప్పి చీరకొంగుతో జలజలా కారిపోతున్న కన్నీటి సెలయేటికి అడ్డుకట్ట వేసింది సక్కు. ఆమె పరిస్థితికి హీరా, పద్మలిద్దరూ కదిలిపోయారు. పద్మ వెంటనే 2000 రూపాయలు తన హ్యాండ్ బ్యాగ్ లోంచి తీసి ఉంచమని చెప్పింది. ఆమె మొహమాటం పడుతుంటే చేయి లాగి మరీ ఆమె చేతిలో పెట్టింది. ఆమె వారి దాతృత్వానికి చలించిపోయి

పద్మ కాళ్లకు దండం బెట్టబోయింది. కానీ పద్మ ఆమెను వారించి "పెద్దదానివి బాయి. తప్పు. అట్లా మొక్కద్దు" అంది. వారిద్దరికీ కళ్ళతోనే కృతజ్ఞతలు తెలియజేసి వేరే బోగీలోకి వెళ్ళిపోయింది సక్కు. చూస్తుండగానే అప్పుడే ఘనపురం వచ్చింది.

★ ★ ★

చాలామంది ట్రైన్ దిగారు. కొందరు ఎక్కారు. అందులో ఒక పదిమంది దాకా యువకులు ఉన్నారు. అంతా కాలేజీ పిల్లలే. వాళ్లలో ఇద్దరు పల్లీలు ఇమ్మని సక్కును అడిగారు. పది రూపాయల పల్లీలకు వంద నోటు ఇచ్చారు. ఆమె బొద్దుకున్న ★ కోత్లి లోంచి చిల్లర తీసి ఇచ్చింది. అప్పుడు ఆ యువకుల కండ్లు జిగేల్ మన్నాయి. వారిద్దరి కండ్లకు పదుల సంఖ్యలో నోట్లు కనబడడంతో వారిద్దరి బుద్ధి పక్కతోవ పట్టింది. ఎలాగైనా ఆమె డబ్బు కాజేయాలనుకున్నారు. దూరం నుంచే ఆమెను అనుసరిస్తున్నారు. ఇంతలో ఆలేరు వచ్చింది. చాయ్ వాలాల

# MORNING SAGA

–shajahana



నేను పిలవను
తనే వస్తుంది
శూన్యానికి కొన్ని
రంగులు అద్దుతుంది
నా కను దోయితో
కాసేపు ఆటలాడుతుంది
సీతాకోక
పట్నంలో నాలుగు
కుండీలే తోట..
బద్ధకంగా నిద్రపోతున్న మొక్కల్ని తట్టి
నిద్ర లేపుతాను
కలలు చెదిరినన పిల్లాడు
పొద్దున్నే పేపర్ ని దర్వాజకిచ్చి వెళ్తుంటడు..
ఇంట్లోకి వెళ్ళే సరికి
నెత్తి మీద పల్లు వేసుకుని
ఆమె ఏదో ఒకటి చేస్తూ కనిపడుతుంది...
ఆమె మెడల మాసిన
ఒంటి పోస
నల్ల పూసల దండ..
ఒంటరిగ దిక్కులు చూస్తుంటుంది..
నీరు పట్టిన చార్మినార్
రాళ్ళ గాజులు
ఆమె వెలసిన జీవితాన్ని ..
ప్రతిబింబిస్తుంటయ్..
నుదుటి మీది బొట్టుతో బాల్కనీ
కదుగుతున్నప్పటి నీటి చుక్కలు సావాసం
చేస్తాయి కొద్ది సేపు...
పక్కింటి పాలిష్డ్ బండ మీద ముగ్గును
అతికిస్తుంది...
ఎప్పటి వలెనే..
ఆమెరకరకాలుగా కనిపిస్తుంది..
ఆమెకు అనేక రూపాలు
ఆమె రాని రోజు
అపార్ట్ మెంట్ లోని
ఆడవాళ్ళం
ఎవరింట్లో వాళ్ళం ఆమె గా మారిపోతాము
ఇంకెవరూ ఆమె రాలేదేమని వాకబు చేయరు..
ఆ వీధిలోని ఆమె లకు
ఏమయిందో..
ఎవరూ వాకబు చేయరు..
ఆమె మాకు
పని ఉన్నంత సేపే..
అనంతరం
మరుపు లో భాగం..
అవసరంలో భాగం..
సీతాకోక ఏ రోడ్ మీద ఎక్కడ చోటు
వెతుక్కుని నిద్ర పోతుందొ..
రోజు వలె చెట్లకు నీళ్ళు తాగించి జోల పాడి
నిద్ర పోతాను..
దునియాను
సౌకర్యం వంతంగా
గోడకు తగిలించి..
గాఢ సుషుప్తి లోకి..
అపుడు అనేక మంది
నిద్రను పక్కన పడేసి
పని కోసం
బయల్దేరుతారు...!

సందడి మొదలైంది. బుట్ట పూర్తిగా అమ్మిన లాలి మూడో బుట్ట కోసం మునుపటి బోగికి వెళ్ళింది. ఈ పిల్లలిద్దరూ ఆమెను గమనిస్తూనే ఉన్నారు. ఆమె ఎక్కడైనా దిగిపోతుందేమోనని కనిపెట్టుకొని ఉన్నారు. ట్రైన్ స్టార్ట్ అయింది. అప్పటివరకు తీరిక లేకుండా పల్లీలమ్మిన సక్కు కాసేపు బుట్టలున్న సందులో కూలబడింది. చూస్తుండగానే బండి ఘటకేసర్ దాటి సికింద్రాబాద్ పరిసరాల్లోకి వచ్చింది. కొద్ది నిమిషాలు ఫ్లాట్ ఫామ్ కోసం ఆగిన బండి మెల్లిగా ముందుకు కదిలింది.

★ ★ ★

"దయచేసి వినండి విజయవాడ నుండి సికింద్రాబాద్ రావాల్సిన శాతవాహన ఎక్స్ ప్రెస్ మరి కొద్ది సేపట్లో ఫ్లాట్ ఫామ్ నెంబర్ 08 మీదికి రానున్నది" అనౌన్స్ స్టేషన్ లో వినిపిస్తున్నది. ఇటు రైలులో ప్రయాణికులు అందరూ లేచి నిలబడ్డారు. ఇంతలో అనౌన్స్ మారింది బండి "ఫ్లాట్ ఫార్మ్ మీదికి వచ్చియున్నది" అంటూ స్టేషన్ లో, ట్రైన్ లో ఉన్న అందరినీ అలర్ట్ చేస్తున్నది. ట్రైన్ వేగం తగ్గి మెల్లగా ఆగిపోయింది. కిక్కిరిసిపోయిన ట్రైన్ లోంచి ప్రయాణీకులు ఒకరిని ఒకరు తోసుకుంటూ దిగిపోతున్నారు.

సికింద్రాబాద్ చేరిన ఈ బండి రూటు మారి నిజామాబాద్ వెళ్తుంది. దిగేవాళ్లకు తోడు ఎక్కేవాళ్ళ సందడి అంతా ఇంతా కాదు జేబు రుమాళ్లు తీసుకొని కిటికీ కిటికీకి తిరుగుతూ సీటు పట్టుకుంటున్నారు. కొందరు అత్యవసరపు కిటికీలోంచి

బలవంతంగా లోపలికి దూరి సీట్లు ఆపుకుంటున్నారు. సక్కు బోగి సందులో తన బుట్టల్ని సర్దుతోంది. ఇంతలో యువకులిద్దరు ఆమె సర్దుతున్న చోటు నుండి కిందికి దిగుతూ ఆమె నడుముకున్న సంచిని లాగేసుకొని జనాల్ని తోసుకుంటూ ముందుకు దిగి స్టేషన్ లోని జనాల్లో కలిసిపోయారు. వారిద్దరి హడావిడికి చిన్నపాటి తోపులాటే జరిగింది. ఈ తోపులాటలో సక్కుకి తన సంచి జారిపోయినట్టు అనిపించి ఒక్కసారిగా నడుముకు చెక్కుకున్న డబ్బు సంచి(కోత్లి) వైపు చూసుకుంది. సంచి మాయమైంది. జనం తోపులాటలో కింద ఎక్కడైనా పడిందేమో అని చూసుకుంది. కానీ ఎక్కడా తన కోత్లి కనిపించలేదు. ఆమె లబోదిబోమంటున్నా ప్యాసింజర్ లు ఆమె గోడు పట్టించుకోలేదు. ఆమె ఏడుస్తూనే ట్రైన్ దిగిపోయింది.

ఏం చేయాలో తోచలేదు. ఇక్కడ ఎవరూ తెలియదు. పోనీ రైల్వే పోలీసులకు కంప్లైంట్ ఇద్దామంటే తనకు లైసెన్స్ లేదు. రెండు చేతులు పైకెత్తి గుండెల్ని బాదుకుంటూ ఏడ్చేసింది. ఖాళీగా ఉన్న మూడు బుట్టల్లో ఆమె జీవితం కనిపించింది. ఆమె దగ్గర కనీసం ఫోన్ కూడా లేదు. భర్తతో విషయం చెబుదామంటే. పైనుంచి భర్త ఎంత తిడతాడోనన్న భయం ఆమెను దహించివేస్తుంది. ఆమె చీరకొంగు కన్నీళ్ళ ఉప్పుతో తడిసి ఎండిపోయింది.

★ ★ ★

చేతిలో పల్లీలతో నిండిన ఒక బుట్ట మాత్రమే ఉంది. సాయంత్రం ఆరింటికి విజయవాడ బండి ఉంది. ఒక్కసారిగా తన పిల్లలు, భర్త తన కళ్ళముందు కనిపించారు. వెంటనే కన్నీటి ప్రవాహానికి ఆనకట్ట కట్టేసింది. మనసు దిటువు చేసుకొని ఉన్న ఒక్క బుట్టను ప్లాట్ ఫామ్ పై అమ్మేసింది. సాయంత్రం బండికి తిరుగు ప్రయాణం అయింది. ట్రైన్ కదిలిపోతుంటే ఆమె గుండె చప్పుడు రైలు బండి చప్పుడును అనుసరించింది. రైలు ఇప్పుడు పట్టాల మీద పరుగెత్తడం లేదు ఆమె గుండె గదుల్ని పట్టాలుగా చేసుకుని లబ్ డబ్ మంటూ వేగాన్ని పెంచుకుంది.

సక్కు తనలో తాను లేదిప్పుడు. ట్రైన్ కారిడార్ లో బుట్టలపై తలపెట్టి విషాద సాగరపు లోతుల్ని మ్రింగుతోంది. ఒకరిద్దరు రైలు కదలికలకు కాళ్ళు చేతులు తొక్కినా ఆమెలో చలనం లేదు. స్టేషన్లు మారిపోతున్నాయి. దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. ఆమె మాత్రం అచలనపు అంధకారంలో బండబారిపోయింది. ఇంతలో చాయ్ వాలా ఒకడు ఈమె మహబూబాబాద్ అమ్మాయి అని గుర్తుపట్టి ఆమెను తట్టి లేపాడు. "పల్లీలన్నీ అమ్మేసినట్టున్నావ్. మళ్ళ ఏమైంది గట్లున్నవ్. ముందుగాల్ల గీ చాయ్ తాగు" అన్నాడు. ఆమెకు మనస్కరించలేదు. చెంపలమీది నుండి కన్నీళ్లు కారిపోతున్నాయి. "ఏమైందమ్మా ఎందుకు ఏడుస్తున్నావ్" అన్నాడు చాయ్ వాలా. తల అడ్డంగా వూపి ఏమీలేదంటూ మౌనంగా సమాధానమిచ్చింది. చాయ్ వాలాకు పరిస్థితి అర్థమైంది. తాను ఇలా కష్టాన్నీ చేజార్చుకున్న వారిని ఎందరినో చూశాడు. ఇంతలో మహబూబాబాద్ స్టేషన్ వచ్చేసింది.

★ ★ ★

పగలును ఎప్పుడో మింగేసింది రాతిరి. సమయం తొమ్మిది గంటలవుతున్నది. ఫ్లడ్ లైట్ కాంతుల్లో మహబూబబాద్ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫార్మ్ మీద పూల్ సింగ్ భార్య కోసం ఎదురుచూస్తున్నాడు. ట్రైన్ ఆగి ప్రయాణికులు దిగుతున్నారు. కానీ తన భార్య కనిపించలేదు. దీనితో అతనికి దిగులు మొదలయ్యింది. ట్రైన్ కదలబోతుంటే లేని శక్తిని కూడబెట్టుకొని కదులుతున్న ట్రైన్ లోంచి దిగింది సక్కు. పట్టుతప్పి ఫ్లాట్ ఫామ్ మీద పడిపోయింది. భర్త పూల్ సింగ్ ఈ దృశ్యాన్ని చూసి హడలిపోయాడు. సక్కుని లేపి కూర్చోబెట్టి ఆమె గడ్డం పట్టుకొని "కాయి వెగో, నీ హాలత్ ఇట్లా ఎందుకయింది. కాలికి ఆ గాయం ఏంది. ఏమైంది" అని కంగారుగా అడిగాడు. అతని మనసు భయంతో వణికిపోయింది. ఆమె ఏమి మాట్లాడలేదు. మౌనమే ఆమె సమాధానమైంది. భర్త భయానికి ఆమె పెదవి విప్పలేదు. వారిద్దరూ ఇంటికి చేరారు. భర్త చేతిని వదిలి గోడకు ఒక పక్కన వాలిపోయింది సక్కు. "బుట్టలు ఖాళీ అయ్యాయి. నువ్వు మాత్రం సోయి లేకుండా ఉన్నావ్. కాలికి ఆ గాయం ఎట్ల అయింది. ఏం జరిగింది" అన్నాడు పూల్ సింగ్. ఆమె స్థణువు లెక్క ఉండిపోయింది. పిల్లలిద్దరూ ఆమెని చుట్టుముట్టారు. తల్లినలా చూసి తల్లడిల్లిపోయిన వారి వెచ్చని కన్నీళ్లు సక్కుని ఈ లోకంలోకి లాక్కొచ్చాయి. భర్త ప్రేమతో అడుగుతుంటే భయాన్ని పక్కకునెట్టి విషయం చెప్పింది. పూల్ సింగ్ "అయ్యో" అంటూ ఒక్కసారి తల బాదుకున్నాడు. కానీ తన భార్య పడ్డ వేదనకు కరిగిపోయి ఆమె కనీళ్లను పంచుకున్నాడు. మూలకు పెట్టిన ఖాళీ పల్లీల బుట్టల వైపు చూశాడు. అవి అతని జీవితాన్ని వెక్కి రిస్తున్నట్టనిపించింది....

**ఆచార్య సూర్యాధనంజయ్**
అధ్యక్షులు, తెలుగుశాఖ.
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

వ్యాసం

# లైంగిక రాజకీయార్థిక కుల శాస్త్రం - మన సమాజం



- అనిశెట్టి రజిత

మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరూ సమాజంచేత స్త్రీగానో పురుషునిగానో మలచబడతారు. పుట్టగానే సమాజం మొదట లైంగిక వేర్పాటుకు గురిచేస్తుంది. వ్యవస్థ నేపథ్యం నుండి ప్రారంభమవుతుంది. అధికం, అల్పం అనే భావనల రూపకల్పన. పుట్టుకతోనే ఎక్కువవారూ తక్కువవారూ అనేది ఏర్పడుతుంది. ఆడ పనులు మగ పనులని శ్రమ విభజన కేటాయింపులు అప్పటికప్పుడే జరుగుతాయి. ఇది మహిళా లోకానికి మొదటి వెన్నుపోటు. కోల్పోయిన హక్కులకు చెందిన తొలి ఓటమి. మాతృస్వామ్యం వంచనకు గురైన ప్రథమ ఘాతుకం. మగ రాజకీయం వేసిన రాజకీయార్థిక అసమానత్వపు తొలి ఎత్తుగడ. రాజకీయార్థిక శాస్త్రాలు రూపొందిన క్రమం ఇక్కడి నుండే జరిగింది.

మానవజాతి ఆవిర్భవించిన ప్రథమ దశలో మగవాళ్ళు ఆటలు ఆటలుగా వేటలో గడిపితే, పిల్లలను కంటూ సంరక్షిస్తూ, ఇంటికి కాపలాగా ఉండి వ్యవసాయం, చేతి పనులు, గృహనిర్మాణం, గృహవైద్యం, పనిముట్లను, వంటకు ఇంటికి అవసరమైన పరికరాలను కని పెట్టడం, పశుపోషణలాంటి ఎన్నో ఉత్పత్తి పనులను కని పెట్టి నిర్వహించిన ఘనత స్త్రీది. అయినా అది చరిత్రలో నిక్షిప్తం చేయబడిన వాస్తవం. వెలుగు చూడని నిజం. వేట యుద్ధాలకు మార్గమయితే, గృహనిర్వహణ గృహబానిసత్వానికి మూలం అయ్యింది. "ఆశ, ఉష, నిశల" గుంపు నాయకత్వం క్రమంగా పురుషుని నాయకత్వంలోకి చేజారిపోయింది. మాతృత్వం – పిల్లల రక్షణ బాధ్యత ఇంత పనీ చేసింది. వరం కావాల్సింది మాతృత్వం శాపమైంది. ఇది రెండవ అతి పెద్ద ఓటమి స్త్రీ జాతికి. ఇంటిపట్టునే ఉండాల్సి రావడం ఇంటి పనుల నిర్వహణ స్త్రీని చాకిరి యంత్రంగా మార్చి గృహ నిర్బంధానికి గురిచేసింది. గర్వించాల్సిన పునరుత్పత్తి ప్రక్రియ అణిగిమణిగి ఉండేందుకు దోహదం చేసింది. గృహనిర్వహణ చేస్తూ పిల్లల్ని కని పెంచే ఆడది అసమర్థురాలని నిందలకు బందీ అయ్యింది.

దంపతి వివాహాల పద్ధతి వచ్చేసరికి పాతివ్రత్య సతివ్రతాలను, వంశం, వంశవృక్షాలను నెలకొల్పుకోవటం మొదలయ్యింది. రక్త సంబంధాల పవిత్రత ప్రాముఖ్యత పెరిగింది. శీలానికీ, పాతివ్రత్యానికి స్త్రీ ధర్మాలు వ్యాప్తిచేసారు. వీటితో ఇప్పుడు స్త్రీ వ్యక్తిగతమంతా రాజకీయం (సమాజమయం) అయిపోయింది. స్త్రీ నడక, నడత, దృష్టి, సేవలు, కర్తవ్యాలు, ప్రవర్తన, ఆలోచనల మీద శతకాలూ, ధర్మశాసనాలూ రూపొందాయి. మతం వీటికి ఆజ్యం పోస్తూ రగిలిస్తూ కాఠిన్యతను ప్రయోగిస్తూ శక్తివంతమైన పాత్ర నిర్వహిస్తూపోయింది. మత జోక్యంలేని సామాజిక నియమం లేకుండా పోయింది. విభజనలు చెందిన పనులు, వృత్తులు, మతం కలిసి కులాల్ని పుట్టించాయి. కులాలు బలపడిన కొద్దీ సమాజం చీలిపోయింది. చిన్నాభిన్నమైనది. కులాల దొంతరలు క్రమేపీ కరుడుకట్టిన వర్ణ వర్గ వ్యవస్థలుగా ఏర్పడి స్థిరపడటం మొదలయ్యింది. దీనికి 'దైవం' ఎంతో తోడ్పడింది. ప్రాకృతికంగా ఉద్భవించిన ఆడదేవుళ్ళ ప్రాముఖ్యతను తగ్గిస్తూ పురాణాలు పుట్టుకొచ్చాయి. ప్రాకృతిక శక్తులుగా కొలువున్న దేవతలను అనాగరికమని అంచులకు తోసేసారు . శక్తిని నిశ్చేష్టనూ, శక్తిహీనమైన అబలగా మార్చారు. అన్నీ అంతా కుట్రలతోనే.

యజమానులు – బానిసలు – మధ్యవర్గంవారు. నిచ్చెనమెట్ల కుల నిర్మాణం జరిగింది. పై మెట్టు మీది వారు దైవాంశులు, ఉన్నతులు, పూజనీయులు. రెండవ మెట్టుమీదివారు పాలకులు రక్షకులు, రాజులు, గౌరవనీయులు. మూడవ మెట్టు మీదివారు వ్యాపారులు. నాలుగవ మెట్టున ఉత్పత్తి కులాల వర్గాల (సమస్త చేతి వృత్తులు) జనసామాన్యం

. చివరన అన్ని మెట్లకింద నలుగుతూ అందరి బరువును మోస్తూ అంటరాని పారిశుధ్యపు పనులు చేసే పంచములు. వీరే దస్యులనీ, చండాలురని, అంటరానివారనీ నిందించబడేవారు.

నిచ్చెనమెట్ల కుల వర్గీకరణ స్పష్టత సంతరించుకునే క్రమంలో బానిసకొక బానిసగా స్త్రీ స్థానం కుదించబడింది. ఇక్కడే లైంగిక రాజకీయార్థిక కులశాస్త్రం జమిలిగా తన ప్రతాపం చూపించడం ఆరంభమయ్యింది. సామాజికంగా ఎలాంటి ఉన్నత హోదాలేని గుర్తింపులేని నిమ్నకుల స్త్రీల పై నిచ్చెనమెట్ల భారంపడి నిలువునా అణగదొక్కింది. నీతి, స్మృతి, ధర్మ, కుల శతకాలు సామాజిక సూత్రాలను నియంత్రిస్తూ క్రూరంగా అమల్లో కొచ్చాయి. నేటికీ అదే పంథాలో పనిచేస్తున్నాయి.

వివాహ – కుటుంబ వ్యవస్థల నిర్మాణాకృతులు వేయిగడపల లక్షగోడల చెరసాలగా జరిగింది. భార్యాత్వంలో ఇనుపకచ్చడాలు ధరించడం తప్పనిసరి నియమమయ్యింది. స్త్రీ శీలపవిత్రత లైంగిక కట్టుబాట్లు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భర్తృత్వం అనేది ఒక లక్షణంగాగాక అతి పెద్ద నియంతృత్వపు వ్యవస్థగా రూపాంతరం చెందింది.

అతని ఇల్లు, అతని ఆస్తి, అతని భార్య, అతని పిల్లలు, అతని సుఖం, అతని హోదాలు, పొందాయి. అతను ప్రత్యక్ష దైవం ఆమె పతిని ఎదురించక తలవంచి కొలిచే సేవించే భక్తురాలు, సేవిక. భయభక్తులు ప్రచారంలోకి వచ్చాయి. స్త్రీకి తన గురించిన అవగాహన, స్పృహ అడుగంటినాయి. ఆమె భర్త వంశాన్ని నిలబెట్టేందుకు సంతానాన్ని కనివ్వడం, పెంచడం, అతని హోదాను ప్రతిబింభించే అలంకరణ, ఆభరణాలు ధరించడం ముఖ్య విధులయినవి. శీలాన్ని కాపాడుకోవడం, పతివ్రతగా నిరూపించుకుంటూ ఉండటం, కన్యత్వం, భార్యత్వం, విధవత్వం అనే స్థితిగతులను విధేయంగా పాటించే మనస్తత్వమే జండర్ స్పృహగా ఉండేది. పెళ్ళి కాపురాలు నిలబడాలంటే ఆడది ఈనాటికీ కూడా కనిపించేవి, కనిపించనవీ అనేక అహేతుకాలను హింసాఘాతుకాలను నిశ్శబ్దంగా భరించాల్సిందే. ఏ కొంచెం గాలిసోకినా కుప్పకూలిపోయే పేకమేడలు మన ఇండ్లు సంసారాలు. అలా వీచకుండా తనను తాను కుదించుకునే స్త్రీ ఆదర్శ గృహిణి. అసలు ఆడది నోరు తెరిచి మాట్లాడితేనే కుటుంబం మేడిపండు' మెరుపులు, లోపలి డొల్లతనం వికృతంగా బయటపడిపోతాయి. వాటిని ఎదిరిస్తే ఆమె తిరుగుబాటుదారు, తిరుగుబోతు, గయ్యాళి, చెడు ప్రవర్తనగలది, సంసారానికి పనికిరాని కోవలోనిది.

స్త్రీకి ఇల్లే స్వర్గం, పెళ్ళే గమ్యం, మాతృత్వమే సార్థకం. సంపూర్ణ జీవితమంటే పూర్తిగా లొంగిపోయి జీవించడం. గడపదాటితే గౌరవంలేదు. పెళ్ళికాని బాలిక, కన్య ఒక గుదిబండ, గుండెల మీద కుంపటి. పెళ్ళని తిరస్కరించి స్వతంత్రంగా జీవించాలనుకునే ఒంటరి స్త్రీ సృష్టికీ సమాజానికి వ్యతిరేకం. సంసారాలు కూల్చే వినాశిని. విప్లవకారిణి. సంఘం దృష్టిలో ఒంటరి స్త్రీలు సంఘ విద్రోహులు, లైంగిక విశృంఖలత కలిగిన వాళ్ళు.

పెళ్ళికాని బాలికలను, యువతులను కన్యలనీ, వృద్ధకన్యలనీ హేళనలు. అసలు స్త్రీలంటే బాలికలు, కన్యలు/యువతులు, వృద్ధులు వెరసి ఆధారితులుగా వర్గీకరణ చెందుంటారు. వివాహిత స్త్రీ అందంగా అలంకరించుకుని భర్తను ఆహ్లాదపరుస్తూ పూజలు, నోములు, వ్రతాలు ఉపవాసాలతో ఊపిరి నిలుపుకుంటూ భర్త అడుగులకు మడుగులొత్తుతూ మళ్ళీ తోడునీడగా మసలుకునే అసలైన భారతీయ స్త్రీ! ఈ లక్షణాల్లో ఏది తగ్గినా సంపూర్ణ స్త్రీ కాదు ఆదర్శ గృహిణీ కాదు. పిల్లల్ని కనివ్వలేని స్త్రీ గొడ్రాలని వేధింపులకు గురికాబడుతుంది. మగపిల్లల్ని (వారసుల్ని) కనివ్వలేకపోయినా ఆమె పనికిరాని యంత్రంగా ఈసడింపబడుతుంది.

ఇక భర్త మరణించిన స్త్రీ విధవత్వం పాటిస్తేనే పతివ్రత. విధవత్వం ఆపాదించబడిన ఆ అబలలపై ఇంటిలోపల జరిగే లైంగిక అత్యాచారాలు, శ్రమదోపిడి గురించిన అభ్యంతరాలు, ఆందోళనలు ఏమీ ఉండవు. వాటిని అరికట్టే విధానం అవసరమే కనిపించదు పైగా "తలలు బోడులైన తలపులు బోడులవునా" అని వెకిలి సామెతలు. మరి ఆడదాన్ని చూస్తే ముసలి "బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు" అని సరిపెట్టుకోరెందుకో.

ఇవన్ని లైంగిక రాజకీయాలు, లింగ నియంత్రణలు, ఆర్థిక ఆలంబన లేకుండా స్వతంత్రంగా ఆర్జించుకుని దాన్ని వినియోగించుకునే స్థాయిలో లేని స్త్రీ ఆర్థిక బానిస. ఆస్తిలేక, అధిక కట్నం తేలేక సంపాందించే అర్హతలు లేక భార్యగా భరింపబడునదిగా బతికే స్త్రీ జీవితం దుర్భరం. ఎతృస్వామ్య రాజకీయాలు, ఆర్థిక కుతంత్రాలు, కులం మెట్లు అన్నీ ముప్పేట దాడితో జండర్ అణిచివేతను నిరంతర యుద్ధంలా సాగిస్తున్నాయి. జండర్ న్యాయం సంక్షోభంలో చిక్కుకుంది.

స్త్రీ కబేళాలో బలిపశువులా 'అనేక ఖండిత'గా నశించిపోవాల్సిందే అన్నట్లుగా ఉంటుంది సమాజ ధోరణి. ఈ సమాజం నీచత్వానికీ, మోసాలకీ మొదటా చివరా బలియ్యేది

స్త్రీయే. హద్దుల్లేని హింస, ఎల్లలులేని వివక్షత అడుగడుగునా ఆమెను పడగొట్టే జిత్తులమారితనం ఇదీ మన ప్రేమ శాంతి సహజీవనం సందేశం!?

ప్రపంచంలోని అతి ప్రాచీన భారతీయ సమాజం మూలాలు మనుధర్మ శాస్త్రంతో ప్రభావితమై ఉన్నవి. సంప్రదాయం, సంస్కృతి అనే పదాలు మంత్రాక్షరాలు. మతం యధాతధ వ్యవస్థ స్థితిని కాపాడుతుంది. కులం పుట్టుకతోనే మనిషి నుదిటి మీద కాలిన మచ్చలో వెంటాడుతుంది. జండర్ జన్మ తక్కువతనాన్ని రెండవ శ్రేణి హోదాని ఆపాదిస్తుంది. లెక్కలేనన్ని చిక్కు ముళ్ళతో మెలికలు పడిన దారపుండలాంటి చట్టాలుంటాయి. ఇదంతా చేసింది చేస్తున్నది పితృస్వామ్య చట్రమే. కులం తంతెలతో మానవజాతిని చీల్చినా, స్త్రీ లైంగికత పై అధికారం చెలాయిస్తున్నా, రాజకీయ ఆర్థిక రంగాల పై దురాక్రమణ చేసినా అంతా పితృస్వామ్యం దుండగీతనమే.

కానీ నేడు స్త్రీ స్పృహలో కొస్తున్నది. ఎంతో తెగింపుతో బరి తెగించి అవలక్షణాల వ్యవస్థ మురుగు ప్రవాహానికి ఎదురీదుతున్నది. అన్ని వ్యవస్థల్నీ పడగొట్టే దిశగా పయనిస్తున్నది. మత, మౌఢ్య సాంస్కృతిక విశ్వాసాల్నీ విలువల్నీ ధిక్కరిస్తున్నది. అన్యాయాలను, కాలం చెల్లిన ఆచారాలను కుళ్ళిన సంప్రదాయాలనూ సవాల్ చేస్తున్నది.

**"అన్నమూ పెట్టేటితల్లి / లాలనా జేసేటితల్లి**
**లాలనా జేసేటితల్లి / ఆలనా జూసేసి తల్లి**
**ఆలనా జూ సేటి తల్లి / పాలనాజే సేటి తల్లి**
**ఆడదంటూ లేకపోతే ఆగమవ్వును లోకమంతా**
**ఆడదాని శక్తి తోటే నిలిచి ఉన్నది లోకమంతా"**

ఈ నిజం వెలుగులో రేపటి ప్రపంచంలో రేపటి రాజ్యంలో స్త్రీదే నాయకత్వం. శ్రమలో తడిసి శ్రమలో పూసి శ్రమ సౌందర్యంతో జీవించే స్త్రీదే రానున్న యుగం. మేకతోలు కప్పుకోని పులిలా జులుం చేస్తున్న మన సమాజం తొడుగుల్ని విడిచేసి ముసుగుల్ని చీల్చేసిన వెలుగులో జరగాలి సమాజ నిర్మాణం. అదీ సమానత్వం దిశగా మానవత్వం నిండుగా. అప్పుడే జండర్ వివక్షత స్థానే జండర్ న్యాయం నెలకొల్పబడుతుంది.

**- అనిశెట్టి రజిత**

# కొన్ని సమయాలు



సెకండ్లముల్లుపై
విజయం సాధించడం
ఇవ్వాళ కొత్తేమీ కాదు
ఇల్లే నేనై
ఇంటా బయటా పరిభ్రమించడం మొదలుపెట్టాకా
నాకై మిగిలే సమయాలన్నీ శూన్యాలై వెక్కిరిస్తాయి
అనేకానేక సమయాలు వేళ్ళకొసలనుండి
అప్రయత్నంగా జారిపోతుంటాయి
వంటింట్లో కాఫీకప్ గానో,
టిఫిన్ బాక్స్ గానో మారిపోతుంటాయి

గంటగంటకి నడుమ
మిగుల్చుకున్న క్షణాలు
అనుకోని అతిధి సేవలోనో
అప్తమిత్రుల ఆగమనంలోనో కరిగిపోతాయి
సుతిమెత్తగా అల్లుకున్న బంధాలు
ఊపిరిసలపని పనులు
కాలాన్ని కబ్జా చేస్తాయి

కోల్పోవడానికి పరిమితులంటూ ఉండవు
కోల్పోతామంతే !!
పోగొట్టుకోవడానికి హద్దులుండవు
రోజులు,సంవత్సరాలే కాదు
ఒక్కోసారి జీవితకాలాన్నీ పోగొట్టుకుంటాం

కొన్ని సమయాలు కావాలి
అప్పుడప్పుడు
కాసింత విశ్రాంతి గడియలు
ఆశలకు కొత్తరంగుల్ని వేసే నిమిషాలు
అనుభూతుల్ని ఆస్వాదించే సమయాలు కావాలి

★ ★ ★

కడెం లక్ష్మీ ప్రశాంతి
ఫోన్ :7893399773

వ్యాసం

# తెలంగాణా పోరాట నవలలో స్త్రీ చైతన్యం



- డా. తిరునగరి దేవకీ దేవి

ప్రపంచ చరిత్రలోనే తెలంగాణ పోరాటం ప్రత్యేకత సంతరించుకున్నది .తర్వాత పోరాటాలకు మార్గ దర్శనమైంది. ఈ పోరాటంలో పురుషులతో బుజం బుజం కలిపి పోరాడిన స్త్రీల చరిత్ర మరువ లేనిదే కాదు చిరస్మరణీయమైనది.వాళ్ళు ఆ పోరాటాన్ని వెన్నంటే ఉన్నారు. పోరాటంతో వారికి గల సంబంధం అవినాభావం.

ప్రపంచంలో జరిగిన పోరాటాలలో స్త్రీలు భాగస్వాములై తమ హక్కులను సాధించుకొని ఫలితాలను పొందిన సందర్భాలనేకం.అనంతర కాలంలో మహిళాభ్యుదయానికి మరింత కృషి చేశారు.

పితృస్వామిక అలవాట్లలో మార్పు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న స్త్రీల చొరవ తెగువ అపూర్వమైనప్పటికీ తెలంగాణ పోరాట స్త్రీలతో పోల్చినపుడు అంతరం అధికమే. సంఘంగా మారిన ఈ పోరాట తీరుతెన్నులే వేరు. ఆ స్థాయిని ఏ పోరాటంతోనూ పోల్చలేము.

పోరాటాన్నిఅర్థం చేసుకోవడానికిదానికిసహకరించడానికి అందులో పాల్గొనడానికి చదువులేనితనం వారికి అడ్డుకాలేదు. ప్రపంచ పోరాటాలతో దీనికి పోలిక కొంత ఉన్నా, ఈ పోరాటం పునాదిగా అనేక ఉద్యమాలు ఉదయించి ఫలించినా వీళ్ళు పోరాడిన విధానంలో, చేసిన త్యాగంలో, చూపిన తెగువలో, పొందిన అవమానంలో,అనుభవించిన శిక్షలో దీనికో ప్రత్యేకత ఉంది. అది మరువలేనిది మరుపురానిది.స్త్రీలు పోరాటానికి సహకరించడంతోపాటు పోరాటంలో పాల్గొనవలసిన అవసరాన్ని పార్టీ గుర్తించి ప్రోత్సహించినప్పటికీ పోరాట లక్ష్యాన్నే కేంద్ర బిందువు చేసుకోవడం వల్ల స్త్రీల మనోభావాలు కొన్ని దెబ్బతిన్నాయి.పార్టీ ఉద్యమానికి స్త్రీల అవసరాన్ని గుర్తించింది కాని అదే ఉద్యమం లో స్త్రీల అవసరాలను పట్టించుకోలేదు.

అకస్మాత్తుగా 1952 లోపోరాటం విరమిస్తూ ఆయుధాలు అప్పగించిన సమయంలో ముఖ్యంగా స్త్రీలే దిక్కు తోచని పరిస్థితులకు నెట్టివేయబడ్డారు.ఇల్లు పిల్లలు సంసారాలను వదిలి వచ్చిన స్త్రీలు తాము కలగన్న సమాజాన్ని చూడలేక ఎంతో ఆవేదనకు గురయ్యారు. పోరాటంలో ఆయుధం

పట్టిన చేతులు తిరిగి వంట పనికి పరిమితమయ్యాయి.ఈ అనేక కారణాలతో ఆ స్త్రీలు మానసిక వేదనను క్షోభను అనుభవించడమే కాక పడరాని పాట్లు పడ్డారు.ఇప్పటికీ పడుతూనే ఉన్నారు.(బతికి ఉన్నవాళ్ళు) పోరాటం వల్ల సామాజిక మార్పు కొంత వచ్చినా వారి ఆర్థిక పరిస్థితులు పెద్దగా మెరుగు పడలేదు.కుటుంబ పనిభారం తగ్గలేదు.లింగపర వివక్షలో చెప్పుకోతగిన మార్పులేదు.అందువల్ల బ్రతుకు భారమై దుర్భరంగా జీవించాల్సిన పరిస్థితి తప్పలేదు.

తెలంగాణా పోరాటం సాగుతున్న కాలంలో స్వాతంత్ర్య పోరాటమూ కొనసాగింది. ఆ ఉద్యమ నేపథ్యంతో కూడా విలువైన సాహిత్యం వెలువడింది. ఆక్రమంలో నవలలూ వెలుగు చూసాయి.ఆ నవలలో స్త్రీల చైతన్య స్థాయి ఉన్నతంగానే ఉన్నప్పటికీ తెలంగాణ స్త్రీల చైతన్యస్థాయితో పోల్చలేము.

ఈ ఉద్యమ నేపథ్యంతో అనేక ప్రజాకళారూపాల ద్వార ఎంతో విలువైన సాహిత్యం వెలువ డింది. సమాంతరకాలంలో వచ్చిన నాట్లు ఉయ్యాల జోల పాటలలో ఐలమ్మ వంటి వీరవనితలు బందగీ దొడ్డి కొమురయ్య వంటి వీరులు స్థానం సంపాదించుకున్నారు.ఆ సాహిత్యంలోని వీరుల సాహసం ధైర్యం చొరవ సమకాలీన ప్రజలకుఎంతో స్ఫూర్తి నిచ్చాయి. అందువల్ల పోరాటం మరింత ముందుకు తీసుకపోయాయి..

తెలంగాణా పోరాట నవలలో స్త్రీలు అనేక రూపాలలో లైంగికంగా వేధించబడటంతోపాటు వివక్షకు గురికావడాన్ని గమనించాలి. అభ్యుదయం ముసుగులో ఉదారవాదులైన పురుషులను పితృస్వామ్య భావజాల చట్రంలోని స్త్రీలనూ చూడొచ్చు. అనల్ మాలిక్ నినాదం ప్రచారంలో ఉన్న నిజాం భూస్వామ్య రాజ్యంలో భూస్వాముల వేధింపులకు ముస్లిం

స్త్రీలు మినహాయింపు కాకపోవడం ఆ వ్యవస్థలోని వర్గ స్వభావం మనలను ఆలోచింపచేస్తుంది.రోజుకో రుచి మరిగిన భూస్వాములకు వివాహేతర సంబంధాలు సర్వసాధారణం కావడంతో లైంగికతలో నిరాదరణకు గురైన వాళ్ళ భార్యలు మానవ సహజమైన వారి కోరికలకు దూరం కాలేక అక్రమ సంబంధాలు సాగించిన సన్నివేశాలు, అక్రమ సంబంధాలలోని ద్వంద్వనీతిని ఈ నవలలు అద్దంపట్టాయి. వెట్టి చాకిరీ దోపిడీ వెన్నెముకగా జీవించిన దొరలకుటుంబాలలోని స్త్రీలు ఆ దొరల మార్గంలోనే దుర్మార్గాలకు పాల్పడడం, మానవీయ దృక్పథంతో పోరాటంలో పాల్గొనడానికి సుముఖత చూపించిన.. భూస్వామ్య కుటుంబాలకు చెందిన కొందరి స్త్రీలను పార్టీలో చేర్చుకోవడానికి నిరాకరించడం, పోరాటంలో పాల్గొన్న స్త్రీలను పోరాటం విరమించిన అనం తరం పార్టీ వాళ్ళ అతీగతీ పట్టించుకోకపోవడంతో ఆ స్త్రీల జీవితం వక్రమార్గం పట్టడం వంటి అంశాలు రచయితల దృష్టి నుండి తప్పించుకోలేక పోయాయి.

స్త్రీలు తమ జీవితాలను అర్థవంతంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయడం, అనేక అత్యాచారాలను, దుర్మార్గాలను ప్రతిఘటించడమేకాక జీవన క్రమంలో తమ ఉనికిని కాపాడుకోవడానికి భూపోరాటాలు చేయడం, సంఘం చేపట్టిన పోరాటానికి అనేక విధాలుగా సహకరించడం, అందు బాటులో ఉన్న ఆయుధాలతో శతృవులను ప్రతిఘటించడం, దెబ్బతీయడం వంటి అంశాలను రచయితలు ఈ నవలలో న్యాయంగానే పొందుపరచారు .ఈ విధంగా చైతన్యం పొందిన వారిలో భూ స్వామ్య కుటుంబాలకు చెందిన స్త్రీలను, వ్యక్తిగత జీవితానికన్నా వ్యవస్థలో మార్పుకే ప్రాధాన్యమిస్తూ ప్రేమ,వైవాహిక మాతృత్వ బంధాలను త్యాగం చేసిన వారి జీవితాలకు రూపకల్పన ఈ నవలలో కనపడుతుంది.

పోరాటాన్ని సఫలీకృతం చేసుకునేక్రమంలో స్త్రీలు తమ శక్తినంతా కూడతీసుకొని పితృస్వామ్యం బిగించిన చట్రంలోని పవిత్రతా భావాలను పట్టించుకోకుండా పనిచేయడం, పురుషాధిక్య భావజాలంతో పార్టీ స్త్రీలతో వ్యవరించిన రీతి, అనుమానించిన తీరు, ఏక పక్షంగా వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు, పోరాటకార్యకర్తల పట్ల ప్రవర్తించడంలో వారి ద్వంద్వనీతిని, పోరాటానంతర కాలంలో వాళ్ళు అనుభవించిన క్షోభ , ఆవేదన మొదలైన అంశాలను ఏ రచయితలూ ఈ నవలలో పొందుపరుచలేదు.

అనేక నవలలో స్త్రీలను సహకారపాత్రలుగానే చూపించే ప్రయత్నం జరిగింది. ఉద్యమకారులైన స్త్రీలను కొందరు రచయితలు నామ మాత్రంగానే ప్రస్తావించారే తప్ప వాళ్ళ పోరాటాన్ని చిత్రించే ప్రయ త్నం చేయలేదు.స్త్రీలు భూమికగా లేకుంటే పోరాటమేలేదనే విషయాన్ని అంచులకు నెట్టివేసారనే అభి ప్రాయం కలుగకపోదు.ముదిగంటి సుజాతారెడ్డి మలుపు తిరిగిన రథచక్రాలు,దాశరథి జన పదం నవలలో పార్టీ నిర్లక్ష్యం కారణంగా స్త్రీలకు జరిగిన అన్యాయాలు సరిగా రికార్డు కాలేదనిపిస్తుంది.

గత అర్ధ శతాబ్ది కాలంగా ఎన్నో ఉద్యమాలు ముందుకు వచ్చి స్త్రీల అస్తిత్వం నిరూపించుకోవడా నికి, హక్కులు సాధింకోవడానికి వీలు కల్పించాయి. ఆ ఉద్యమాలకు తెలంగాణ పోరాటం ప్రేరణనిచ్చిం ది. ఐనా అంతటి విశిష్టత కలిగిన ఈ పోరాటంలో పాల్గొన్న మహిళల అస్థిత్వం ఈ సాహిత్యంలో పరి పూర్ణంగా చిత్రించలేకపోయారనే అభిప్రాయం కలుగుతున్నది.

సమాజంలోని అసమానతలు, పక్షపాతాలు, దుర్మార్గాలు, కాఠిన్యాలు చవిచూసిన స్త్రీ విద్యావకాశాలకు దూరమైన పరిస్థితులలో రచనలకు మరింత దూరంకావడంలో విశేషమేమున్నది ?

ఐనప్పటికీ స్త్రీ తనను తాను నిరూపించుకుంటూ ఎంతోకాలంగా రచనావ్యాసాంగంలో ఎంతోకొంత ప్రవేశాన్ని కలిగిఉన్నది.తాళ్ళపాక తిమ్మక్కతో మొదలుకొని సంస్కరణోద్యమం వచ్చే వరకు వచ్చిన స్త్రీల రచనలన్నీ పితృస్వామ్య భావజాల చట్రంలోనే బిగించబడినప్పటికీ ఆ యా సందర్భాలలో కాలాలలో తమను రచయిత్రులుగా నిరూపించుకోవడానికి తమ మనోభావాలను వ్యక్త పరుచుకోవడానికి ఎంతో శ్రమ పడవలిసి వచ్చింది.ఈ సాహిత్యంలో స్త్రీవాద ధోరణి క్రమవికాసం కనపడుతుంది. స్త్రీ సమస్యల పట్ల సంస్కరణ దృష్టితో, అభ్యుదయ దృక్కోణంలో, ఉదారవాదంతో పురుషులు ఎంతో సాహిత్యాన్ని సృజించారు. ఐనప్పటికీ వాస్తవాల,అనుభవాల ప్రాతిపదికపై స్త్రీల అణచివేతను, సమస్యలను స్త్రీలు విశ్లేశించడం ద్వారా న్యాయం జరుగుతుందనేది నూటికి నూరుపాళ్ళ సత్యం.

ఈ క్రమంలో స్త్రీ విమర్శకులు సాహిత్యంలోని స్త్రీని అచ్చుగా అద్దంపట్టి చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనప్పటికీ ఒక వైపు స్త్రీల రచనలు మరోవైపు స్త్రీల పరిశోధనలు నిరంతరంగాను సమాంతరంగా సాగుతూనే ఉండాలి.అప్పుడే సాహిత్యంలోనే కాదు సమాజంలోనూ స్త్రీ సముచిత స్థానం పొందకలుగుతుంది.

**డా. తిరునగరి దేవకీ దేవి**

కథ



# వివక్ష

- నాంపల్లి సుజాత

సాయంత్రం ఐదు కావొస్తుంది.. పొలం పనులకెళ్లిన వాళ్ళు తిరుగుముఖం పట్టారు. ఎన్నడూ లేనిది మాపక్కింటోళ్ళింటి ముందు అంతమంది ఎందుకు గుమిగూడారో ఏమో..!?

అందరిముఖాల్లో ఏదో ఆందోళన కొట్టొచ్చినట్టు.. కనబడుతోంది

చీమ చిటుక్కుమన్నా పల్లెల్లో అందరూ పట్టించుకుంటారు ఏమయిందో ఏందో నని ఆరాటం.

ఊరుపూరంతా ఓ పెద్ద కుటుంభమే. ఒకరినొకరు వరుసలతోనే ఆత్మీయంగా పిలుచుకుంటారు.. ఒకరి కష్టాన్ని ఇంకొకరు పంచుకుంటారు. ఏదో జరిగినట్టుంది.. లేకుంటే ఇంతమంది ఇక్కడెందుకాగుతారు..

ఇక ఉండబట్టలేక ఆ వేపు నడిచాను. ఆ ఇంటి వాళ్ళమ్మాయి కనిపించటం లేదని గుసగుసగా అనుకుంటుంటే తెలిసింది.

" ఇంతకీ ఆమె ఎక్కడి కెళ్లిందో ఏమైనా తెలిసిందా..!?"

లోగొంతుకతో పక్కనున్న భార్గవిని అడిగాను.

"ఇంకా లేదక్కా.. ఏమ్ తెల్వలేదు"

అప్పట్నుంచీ వెతుకుతానే వున్నారు బాధగా

జవాబిచ్చింది భార్గవి.

వాడకట్టు మహిళలు విచారంగా, నిశ్శబ్దంగా, వాళ్ళింటి గేటు బయట నిలబడి ఉత్కంఠంగా... 'ఏమైందో.. ఏమో..!! పాపం చిన్నపిల్ల' అనుకుంటూ ఆందోళనగా ఎదిరిచూస్తునే ఉన్నారు.

అసలా పాపని ఎవరైనా ఏమైనా అన్నారా.. చెప్పకుండా ఎటు వెళ్ళింది.. ఎంత సేపటినుంచి కనబడలేదో తెలుసుకుందామని ముందుకి కదిలాను.

"వెళ్లకు.. వెళ్లకు లోపల పోలీసులు మాట్లాడుతండ్రు ఎవ్వరినీ రావొద్దన్నరంటా" ప్రమీలమ్మ నాతో గుసగుసగా..!

"ఇంతకీ ఈ అమ్మాయి ఎప్పటినుంచి కనబడుతలేదు!?"

ఎటెల్లివుంటుంది.. ఎప్పుడూ ఇల్లు దాటని పిల్ల ఏమయ్యుంటుంది..! అందరి ముఖాల్లో ఆందోళన..

వాళ్ళ స్కూల్ దోస్తుల ఇంటికి ఏమైనా వెళ్లిందేమో

కనుక్కున్నారా.!! ఎవరికివారు పలుపలు విధాలుగా ఆలోచిస్తున్నాము. అందరి మనసులూ కీడునే శంకిస్తున్నాయి. నిజమే ఆడపిల్ల బయట ఒంటరిగా కనబడితే బతకనిచ్చే రోజులా ఇవ్వి!?

నిమిష నిమిషానికి ఊరందర్లోనూ..

ఏదో ఆందోళన జరగకూడనిది జరిగిందేమోనని భయం..

అయ్యయ్యో..మధ్యాహ్నం మూడునుంచీ కనబడలేదంటే.. ఇప్పుడు టైం ఏడవుతుంది.. అంటే నాలుగుగంటలు.

అమ్మో..! చీకటి పడుతోంది..ఓ వైపు కటికచలి, అందరిలోనూ ఓ తెలియని భయం. పొద్దున్నే పనిమీద బయటకెళ్లి ఇప్పుడిప్పుడే ఇంటికి చేరుకున్నాను అందుకే.. పక్కింట్లో ఇంత జరిగినా నాకిప్పటిదాకా తెలియనేలేదు..!

వీళ్ళ ప్రయత్నాలు వీళ్ళు చేసాకే, అందరినీ విచారించాకే, అంతటా వెతికాకే పోలీస్ కంప్లైంట్.. ఇచ్చినట్టున్నారు.

ఈ మధ్య దరిద్రపు కరోనా వల్ల బడులు మూసేసిరాయే. పిల్లలు ఇంటిదగ్గరే ఆగమాగం..

యాడాది నుంచీ ప్రపంచమంతా ఇదే సంక్షోభం. ఎప్పుడు మునుపటి రోజులొస్తాయో తెలియదు.

పెద్దోళ్లకేమో వ్యవసాయం పనులు. వాళ్ళకా వెళ్ళక తప్పది..! పిల్లలను ఇంటికాన్నే విడిచిపెట్టి.. కొందరైతే.. పిల్లల్ని గూడా పనులకు.. తోలుకపోతాండిరి..

చదువూ సంధ్యలు... ఎప్పుడో ఎగిరిపోయినయి.. అన్నీ ఆంబుక్క పెట్టిన్రు.. మాయదారి కాలం.

బల్లు బంద్దైన మాట ఇంతకుముందు ఎప్పుడన్నా ఎరుగుదుమా..! ఎప్పుడు పోతదో..ఏమో..!

చక్కగా బడుంటే.. ఇవ్వేమీ జరిగేవి కాదుకదా..!

ఆ పాపకు ఓ పదమూడేళ్ళు ఉంటాయనుకుంటా అసలే మితభాషి..!

ఎవరితోనూ ఎక్కువ కలవదు మాట్లాడదు.. అడిగినంతే చెపుతుంది.. ఇంటిపక్కిల్లే అయినా నేనే ఓ రెండు మూడు సార్లు తనతో మాట్లాడినట్లు జ్ఞాపకం.. అవీ స్కూల్ విషయాలు అంతే..! అసలు తను ఇల్లు వదిలి బయిటికే రాదు.. ఇన్ని గంటలూ.. సైకిల్ పై ఎటు వెళ్లుంటుంది..!?

ఎట్లా మిస్ అయ్యిందీ..! పల్లెల్లో కూడా కిడ్నాప్ లుంటాయా, లేకుంటే ఇంటినుంచి అలిగి వెళ్లిపోయిందా, పేరెంట్స్ ఏమన్నా కోప్పడ్డారా, ఎవరన్నా ట్రాప్ చేశారా.. ప్రతీ వారి అంతరంగంలో పలుపలు ప్రశ్నలు.. ఊల్లెకు ఎవరైనా కొత్తవాళ్ళు వచ్చారా..!?ఎవరికి వాళ్ళు గాలిస్తూనే ఉన్నారు

వీళ్ళింటి తలుపులు దగ్గరగా పెట్టున్నాయి. లోపల్నుంచి పెద్దగా ఏడుపుల శబ్దం.. పోలీసుల ప్రాథమిక విచారణ ముగిసినట్టుంది.

వీళ్ళింట్లోళ్ళు బంధువులూ కలిసి పాపని వెతికేందుకు వేగంగా వాహనాల్లో దూసుకుపోయారు..

వెళుతూ వెళుతూఎక్కడెక్కడ సిసి కెమెరా లున్నాయో అక్కడక్కడ.. ఫుటేజీ చూస్తూ ముందుకు సాగిపోతున్నారు..

“ఆంటీ పాపని ఇంట్లో ఏమన్నా తిట్టారా”

అంటూ మెల్లగా వాళ్ళని ఓదార్చాలని ప్రయత్నిస్తున్న..

“ అక్కా తమ్ముడూ ఏమన్నా పొట్లాడుకున్నారా మరి.”..

“లేదు రా..!”

మా బంగారు తల్లిని ఎంత బాగా చూసుకుంటామో.. నీకు తెల్వదా..!?

ఇప్పుడు నా మనవరాలు నాగ్గావాలంటూ.. శోకం పెట్టుకొని ఏడుస్తూనే ఉంది.. పాప నాయనమ్మ ఎవరి ఫోన్లో నుంచి కూడా ఎలాంటి అపరిచిత నంబర్లూ.. రాలేదూ.. పోలేదూ..

అంతా ఓ వింత లాగే ఉంది..

“ఓ బిడ్డో..! నా బిడ్డా..!” పాపతల్లీ, నాయినమ్మా గుండెలవిసేలా రోధిస్తున్నారు.

ఎందరు వారించినా ఆగని దుఃఖం.. కట్టలు తెంచుకొస్తూంది.. కడుపు తీపి కదా..!

హమ్మయ్య..! ఈ ఊరు మెయిన్రో డ్డుమీది సి.సి కెమెరాలో ఓ ఆధారం దొరికిందట.

సైకిల్ మీద కరీంనగర్ వైపు వెళుతున్న అమ్మాయి దృశ్యం.. కనిపించింది..

పాప.. ఆచూకీ తెలుస్తోంది..

ప్రాణాలతోనే ఉంది.. వెంట ఇంకెవరూలేరు.

కానీ ఎటు వెళ్తోంది.. తన దగ్గర ఫోన్ కూడా లేదు.. ఒక్కతే వేగంగా వెళుతోంది.. అందరి మనసుల్లో దిగులు!

ఆపైన వచ్చే పల్లెపల్లెలోని పుటేజీలు చూస్తూ.. ఒక్కోపల్లె దాటిపోతున్న పాపనీ, ఆ సమయాన్నీ బేరీజు వేసుకుంటూ.. ముందుకు సాగిపోతూనే ఉన్నాయి.. విచారణా వాహనాలు పాపకీ వీళ్ళకి నాలుగ్గంటల తేడా..

ఎన్నడూ గడపన్నా దాటని అమ్మాయి అంతదూరం ఒక్కతే ఎట్లా వెళుతుంది.. అందరికీ ఆశ్చర్యం.. అదోలాంటి భయం

మూడేళ్ళ పాపకే రక్షణ లేని లోకం..

మొన్నీనడుమే 'దిశ' ఘటన.. ఊరు ఊరంతా

విచారంతో వీళ్ళింటిముందే.. క్షణమొక యుగంగా ఎదిరిచూస్తున్నం.

రాత్రి పది దాటింది.. ఇరవై మైళ్ళ ఆవల పెట్రోల్బంపు.. పుటేజీ దృశ్యాలూ.. చెప్తున్న మాట

అమ్మాయి... వెల్తూనే ఉంది వేగంగా..!

అమ్మాయికి ఏమైంది.!? చేతబడి గానీ చేశారా... గాలి పట్టిందా.. మతి స్థిమితం లేదా.. ఎవ్వరి ఆలోచనల్లో వాళ్ళు..

అమ్మాయి సేఫ్ గా రావాలని.. ప్రతీవాళ్ళూ దేవుల్లకి మొక్కుల మీద మొక్కులు

రాత్రి పన్నెండు.. దాటింది.. అంతటా అందరూ నిద్రించారు.. పుటేజీ ప్రయత్నాలు.. పాస్వర్డ్ దొరకక విఫలం.. ఇక చేసేదేం లేక గాలింపు చర్యల్ని తాత్కాలికంగా విరమించారు

ఊర్లో ఎవరికీ కంటిమీద కునుకులేదు

అమ్మాయి కోసమే.. అందరి ఆరాటం..!

★ ★ ★

ఇప్పుడు లోకం స్వరూపం తెలిసిపోతుంది

ఎందరు మంచివాళ్లో మరెందరో దుష్టులో తేలిపోతుంది.. పాప పరిస్థితిని బట్టి.!

తెల్లారగట్ల ఓ పెద్దమనిషి నుంచి ఫోను.. "హలో..! మీరు వెంకట్ గారేనా..

మీ అమ్మాయి కోసం వెతుకుతున్నారా..!?" ఆందోళన పడకండి ఇక్కడే ఉంది, మా ఊళ్ళో హనుమాండ్ల గుడిలో ఏడుస్తూ ఉంది. పొద్దున్నే కార్తీకమాస పూజలకు వెళ్లిన మా దంపతులకు భయపడుతూ, వనికిపోతూ కనబడింది.. వివరాలను అడిగితే ఏడుస్తూనే చెప్పిందట ..దారితప్పి వచ్చిందంట.. తిరిగి వెల్దామంటే చీకటయ్యిందంటా..!"

"హాల్లో..హాల్లో..!!ఆ..ఆ..ఆమె మా పాపే, అవునవును.. ఆమె మాపాపే..అంజలి..

ఎట్లుంది.. ఇప్పుడే వస్తున్నాం..మీ వూరెక్కడ ఏ ఊరు...!?" అందోళనగానే...

అవతలనుంచి..,

"ముల్కనూర్ దగ్గరనే..రాన్డి" అవతలి గొంతు

"మా బిడ్డ ఎట్లుంది..! మీరక్కణ్ణే ఉండండ్రీ ప్లీజ్.."పదినిముషాల్లో అక్కడుంటాం.. వస్తున్నాం.. ఇక్కడికి ఇరవై ఐదు కిలోమీటర్లు. మీ ఊరు మాకు" అంటూ... ఏడుస్తూనే.. బయలెల్లి పాపని ఇంటికి తెచ్చుకున్నరు.. పోలీసుల సహాయంతో...!

విచారణలో భాగంగా కూపీ లాగిన పోలీసులు..ఇంత జరగడానికి కారణం 'డిజిటల్ క్లాస్ ల కోసం ట్యాబ్..!'తనకు కొనివ్వకుండా తన కన్నా చిన్నోడైన తమ్మునికే ఇప్పించారనీ మనస్తాపంతో.. ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి అలిగి వెళ్లిందట. అయితే బాట తప్పి వెనక్కి రాలేకపోయిందిట.

హమ్మయ్య..!! ఎలాగోలా చివరకు కథ సుఖాంతమే... కానీ పిల్లల పట్ల వివక్ష ఎంతమాత్రం తగదు. ఇంటికి వారసుడూ మొగపిల్లాడంటూ వాడి గొంతెమ్మ కోర్కెలు తీర్చి ఆడపిల్లలని పట్టించుకోకపోవడం సరికాదనిపించింది.!

★ ★ ★

**నాంపల్లి సుజాత**

**9848059893**

కవిత

# "మనువు"



చిన్నారి పాపల్లారా! లేలేత మొగ్గల్లారా!
విరిసీ, విరియని పువ్వుల్లారా!
అర విచ్చిన నవ్వుల్లారా!
వినండి, వినండి ఓ మంచి మాట.
ఏమరక చనుడీ నే చూపిన బాట.
పండని కాయకు రుచి లేదు.
నిండనీ వయసుకు పస రాదు.
కసు గాయల నెన్నడు త్రెంచకుడీ.
పసి ప్రాయాన పెళ్ళి వద్దు సుమీ.
జీవితమెంతో  చిన్నదమ్మా.
అందు పరువం మరింత పిన్నదమ్మ.
అందుకే పొదుపుగా వాడాలిరా.
అదుపులోన వుంటేనే అందముందిరా.
తొందర పడకమ్మా చిలుకమ్మా.
ముందర చదువులు నేర్వవే బుల్లెమ్మా.
లోకాన  వింతలెన్నో వున్నాయి.
ఎంతెంతో చదివితేనే అవి నీకు కనబడతాయి.
వయసు పెరగాలి.
మనసు ఎదగాలి.
మంచి చెడులు తెలియాలి.
అప్పుడే మనువును ఎంచుకోవాలి.
మంచి వారితో బ్రతుకు పంచుకోవాలి.
..........

**చల్లా సరోజినీ దేవి**
కవయిత్రి, రచయిత్రి
ఖమ్మం, ఫోన్ : 9849826634

కవిత

# సమానత్వాన్ని సాధిద్దాం



**- సిస్టర్ అనసూయ**

ఆకాశములో పక్షులకు
ఆడామగా తేడా లేదు
ఆనందంగా ఎగురుతాయి
వాటి మధ్య హత్యలు
అత్యాచారాలు లేవు
బంధాలు అనుబంధాలు తప్ప
అక్రమ సంబంధాలు అసలే లేవు
పవిత్ర బంధం తప్ప
 వాటికి చదువు లేకున్నా
 సంస్కారం మిన్న

అయితే ....
మట్టిలో పుట్టి
మట్టిలో కలిసిపోయే మనుజులు మతం
మత్తులో మగ్గుతూ
కులం కుంపటిలో కాలుతూ
ఆడామగా తేడా చూపుతూ
 మందు మత్తులో మునిగి
కామాంధాకారములో పడిపోయి
పసి పిల్లమొదలుకుని
 పండు ముసలి వరకు
 ఆగం చేస్తుండ్రు భారతావనిని

అది పువ్వు కాదే
ఎవరు పడితే వాడు తెంచుకోవడానికి ప్రాణం
ఉన్న మనిషి కదా
ఆడదంటే బొమ్మ కాదే
అందరూ ఆడుకోవడానికి
ఆశలు ఆశయాలు ఉన్నా
అమృత మూర్తి కదా
స్త్రీ సమాజములో లేదా?
స్త్రీ సమస్య సమాజం సమస్య కాదా?
స్త్రీ మానప్రాణాలకు భద్రత ఏదీ?
ఎందుకీ దౌర్జన్యాలు?
ఎందుకీ మారణహోమం?
జంతువులకు ఉన్న విలువ ఆడవారి
ప్రాణాలకు  లేదు

 అందుకే
మనసున్న మంచి మనషులారా కదలిరండి
స్త్రీకి ఇంట బయట
సమానత్వం కోసం
కలిసి పోరాడుదాం
సమానత్వాన్ని సాధిద్దాం
★★★

**సిస్టర్ అనసూయ**
నల్గొండ
8074573716

వ్యాసం

# వయొలెన్స్... సైలెన్స్



- జి. విజయలక్ష్మి, ఎం.ఏ.ఎమ్.ఫిల్.

"అవనిలో సగం
ఆకాశంలో సగం
అంతరిక్షంలో ఘనం
అవమానాల్లో నిరంతరం
అత్యాచారాలతో భయం భయం"

కఠిన చట్టాలకోసం, క్రూరమైన శిక్షలకోసం నగర రహదారులు ర్యాలీల రిబ్బన్లవుతున్నాయి. కొత్త చట్టాలు భద్రమైన సమాజాన్ని సృష్టిస్తాయని మధ్యతరగతి కలలు కంటున్నది. యాదృచ్ఛికంగా పెల్లుబికే ఆవేశాల అణచివేతకు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో కేంద్రప్రభుత్వం దారుణ శిక్షల చట్టాల చిట్టాను వెలుపలికి తీసింది.

స్త్రీ ఆదిశక్తి, భరతమాత, జగన్మాత, మహాకాళి, మాతృ దేవత.... ఇది ఒక కోణంలో. మరో కోణంలో స్త్రీ బానిసకొక బానిస. ఈ బానిసత్వం ఒకనాటితో వచ్చింది కాదు. ఆదిమసమాజంలో మానవుడు తండాలుగా వేటమీద ఆధారపడి జీవించే దశలో, నీది నాది అనే స్వంత ఆస్తి భావన లేని రోజుల్లో పురుషులు వేటకి వెడితే స్త్రీలు పోడు, సమానశ్రమ విభజన వున్న వ్యవసాయం, పిల్లల సంరక్షణ చేస్తూ ఇంటి దగ్గరే ఉండే వారు. ఈ దశలో స్త్రీ, పురుష సంబంధాల మధ్య ఎలాంటి ఆంక్షలూ లేవు. ఆస్తి లేదు. కాబట్టి ఆడ, మగ మధ్య సంపూర్ణమైన సమానత్వం ఉండేది. అంతేకాదు, ఈ మాతృస్వామ్య దశలో మానవజాతి సృష్టికి కారకురాలుగా ఆమె అత్యున్నతంగా గౌరవించబడింది. ఆహార సేకరణ దశ, ఆహారోత్పత్తి దశకి చేరిన తర్వాత వ్యక్తిగత ఆస్తి ఏర్పడి క్రమంగా నీదీ, నాదీ అనుకునే దశలో స్త్రీని ఇంటిపనికి కుదించి పురుషుడు వ్యవసాయాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఏకభర్తృత్వం ద్వారా వ్యక్తిగత ఆస్తి పుట్టుకకు ముందే పితృస్వామిక సమాజం ఆవిర్భవించడంతో స్త్రీపై మొదటి అణచివేత ప్రారంభమైంది. చరిత్రలో మొదటి అణచివేత ఇదే. ఆ తర్వాత మిగులు ఉత్పత్తికి, ఆస్తికి పురుషుడు హక్కుదారుడయ్యాడు. వ్యక్తిగత ఆస్తి ఏర్పాటు కారణంగా తండా పద్ధతి నశిస్తూ కుటుంబ వ్యవస్థ గట్టిపడటం ప్రారంభమైంది. మాతృస్వామిక వ్యవస్థ స్థానంలో పితృస్వామిక వ్యవస్థ ఏర్పడింది. స్వంత ఆస్తి పుట్టుక స్త్రీని పురుషుడికి శాశ్వతంగా బానిసగా చేసింది.

స్త్రీని దశలవారీగా తండ్రి, భర్త, కుమారుల ఆధీనంలో నిర్బంధించి, సాంఘిక కట్టుబాట్లు ఏర్పరిచి గృహ కృత్యాలకు కట్టిపడేసి స్త్రీని ఈనాటి నికృష్ట జీవితానికి గురిచేసింది. దోపిడికి గురయ్యే పీడితులను అణచివేతను సైతం సహజమైనదిగా, దైవ సమ్మతమైనదిగా భ్రమింపచేయడంలో మతం కీలకపాత్ర వహించింది. అందులో భాగంగానే స్త్రీలపై పురుషాధిక్యత దైవసృష్టి అని ప్రచారం చేసి చిన్నప్పటినుంచే స్త్రీల మెదళ్ళలో పాతివ్రత్యాన్ని నూరిపోసి ఇలా నడవకూడదు, అలా నవ్వకూడదు అని ఆంక్షలు విధించారు. బాల్యం నుంచే స్త్రీని బలహీనురాలిననే ఆత్మన్యూనతా భావానికి గురిచేసి అబల అన్నారు. ఏ మతమైనా స్త్రీని అణచివేయడంలో ప్రధానపాత్రే వహించింది.

స్త్రీలపై జరిగే లైంగిక అత్యాచారాలు, తిట్లు, తన్నులు, ఆంక్షలు, సూటిపోటి మాటలు, లైంగికత్వంపై దాడి ఇవన్నీ స్త్రీలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సంఘటనలు. ఇవి కనిపించేవైతే గుట్టుచప్పుడు కాకుండా జరిగేవి కొన్ని ఉన్నాయి. ఇంటి చాకిరీ, పిల్లల పెంపకం లాంటి ఆదాయం లేని పనులు వాళ్ళకి అప్పగించి, వాళ్ళ శ్రమకి విలువ లేకుండా చేసి వాళ్ళకి ప్రత్యేకమైన వ్యక్తిత్వం లేకుండా చేశారు. అసలు కుటుంబమే ఇప్పుడున్న రూపంలో హింస. దానిని నిలబెడుతున్న పితృస్వామ్య వ్యవస్థ ఈ హింస అంతటికీ మూలకారణం. రాజకీయ వ్యవస్థలకంటే



బలమైనది కావడం వల్లనే ఇది మారకుండా అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది. స్త్రీలకు హక్కులివ్వడం, వాళ్ళకోసం చట్టాలు చెయ్యడం, కేవలం కాలానుగుణంగా చేసే మేకప్ మాత్రమే.

మహిళలపై హింసను నిరోధించటానికి పదహారు అంశాల కార్యాచరణను ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించింది. చట్టాలు అమలు చేసి రూపొందించటమే కాదు జాతీయ స్థాయిలోనూ, స్థానికంగానూ పటిష్ట కార్యాచరణ వ్యూహాల్ని చెపుతోంది. మహిళా హక్కుల్ని తొక్కిపట్టే కాలం చెల్లిన చట్టాలు ఇంకా రాజ్యాంగంలో అనేకం ఉన్నాయి అని జాతీయ మహిళా సంఘం ఏనాడో ప్రస్తావించింది. ఇటీవల తెచ్చిన పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక చట్టం వంటివి, కొన్నేళ్ళ క్రితం నాటి గృహహింస చట్టం వంటివి మాత్రమే స్త్రీలకు రక్షణ కవచాలు కాలేవు. అత్యాచార కేసుల్లో నేరం రుజువైతే శిక్షలు పడుతున్నవి కేవలం 24 శాతమే. సమస్య మూలం ఎక్కడున్నది అనూహ్యం కాదు. ఇండియాలో 2010 కంటే 7.1 శాతం అధికంగా 2011లో మహిళలపై 2,28,650 నేరాలు జరిగినట్లు జాతీయ నేర నమోదు సంస్థ లెక్కతేల్చింది. అభాగ్య స్త్రీలను వ్యభిచారంలోకి నెట్టడంలో ప్రపంచంలో ఇండియా రెండోస్థానంలో ఉంది.

టాటా వ్యూహాత్మక నిర్వహణ బృందం తాజాగా బహుళ అధ్యయనాలను విశ్లేషించి (వెల్ బీయింగ్ ఇండెక్స్) మహిళా రక్షణ సూచీలను వెలువరించింది. పంజాబ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, హర్యానాలు అగ్రస్థానంలో ఉంటే మహిళా రక్షణ సూచీలు హర్యానా, మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్లు అట్టడుగు స్థానాల్లో వుంటున్నాయి. స్త్రీలపై సాధారణంగా జరిగే లైంగిక అత్యాచారాలకు అంతేలేదు. ఆరేళ్ళ పసివారినుండి అరవై ఏళ్ళ వృద్ధురాలి వరకూ అత్యాచారాలకు గురవుతున్నారు. ఇంటినుండి బయటికి వెళ్ళిన మహిళ క్షేమంగా ఇల్లు చేరుతుందో లేదో తెలియదు. అసలు తన ఇంట్లో తానే సేఫ్ గా ఉండగలదా అనే ప్రశ్న.

రాణి రుద్రమ నుంచి మదర్ థెరిస్సా వరకు మహిళలు కేవలం వంటింటి కుందేళ్ళు మాత్రమే అనే దృక్పధాన్ని తప్పని ఏనాడో నిరూపించాం. నేటి ఆధునిక మహిళ అన్ని రంగాల్లో

తన ఉన్నతిని చాటుతుంది. కొన్ని రంగాల్లో పురుషులను కూడా అధిగమించి ముందుకు వెపన్లో దూసుకుపోతోంది. ఆర్థిక, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అగ్రభాగాన నిలచి విజయపతాక ఎగురవేస్తుంది. మహిళలను గత చరిత్ర నీడలు భయపెట్టినా వర్తమాన భవిష్యత్ చిత్రపటంలో తన హక్కులు నిలబెట్టుకోవడానికి నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంది. ఆకాశంలో సగం కాకుండా అనంతమంతా నేను అంటుంది.

నాణానికి రెండోవైపు చూస్తే అదే సమయంలో ఎంత విద్యావంతురాలైనా ఎన్ని ఉన్నత పదవులు నిర్వహించినా ఏదో హింసకు ప్రతి నిత్యం గురవుతోంది. వయోపరిమితి, వరసవావి లేకుండా ఇంటాబయటా అనేక హింసను ఎదుర్కొంటుంది. ప్రతిరోజు మన సమాజంలో ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరు ఏదో ఒక హింసకు బలవుతున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ప్రతి 26 నిముషాలకు ఒక మహిళ వేధింపులకు గురౌతుంది. ప్రతి 34 నిముషాలకు ఒక మహిళపై అత్యాచారం జరుగుతోంది. ప్రతి 42 నిముషాలకు ఒక మహిళపై లైంగిక వేధింపులు, అలాగే వరకట్నం కోసం ప్రతి 99 నిముషాలకు ఒక వధువు బలి అవుతోంది.

ఇక వివాహమైన మహిళలకు కొందరి జీవితంలో పెళ్ళంటే నూరేళ్ళపంట అనేకంటే బ్రతుకంతా మంట అనవలసి వస్తుంది. కన్యాశుల్కం నాటి నుండి వరకట్నం దాకా ఇది కొనసాగుతూనే ఉంది. ఎవరైనా చైతన్యవంతురాలైన మహిళ సాటి మహిళలకు సలహా ఇవ్వబోతే భర్తే ప్రత్యక్ష దైవం అంటూ వారిని ఎంత హింసించినా సతీసావిత్రి సతీఅరుంధతి లాంటి పతివ్రతలను తలుచుకొని నా మొగుడు గాక నన్ను ఇంకెవరు కొడతారు తిడతారు అనే వారు ఉన్నారు. మహిళ అయితే చాలు చిన్నారి అయినా, పిచ్చిదైనా వికలాంగురాలైనా అఖరికి వృద్ధురాళ్ళని కూడా అత్యాచారాలకు గురిచేస్తున్నారు. పెట్టుబడిదారులు వారి వారి వ్యాపార ప్రకటనల్లో, సినిమాల్లో, టీవీ సీరియల్స్ లో మహిళల్ని కేవలం వ్యాపారం అభివృద్ధి వస్తువుగా చూపిస్తున్నారు. సెక్స్ సింబల్ గా, జుగుప్సాకరంగా, విలన్లుగా చూపిస్తున్నారు. చదివిన దానికంటే కూడా చూసిన దృశ్యమే సమాజంపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఆ విధంగా చెడు ప్రభావానికి గురై లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, హత్యలకు, నేర ప్రవృత్తికి దారితీస్తోంది.

అత్తగార్ని కోడలు తల్లిలా ఎలా గౌరవించాలి, కోడల్ని అత్తగారు కూతురులా ఎలా అభిమానించాలి, చిన్నపిల్లల్ని ఎలా ప్రేమగా చూసుకొని ప్రేమతత్వాన్ని నేర్పాలి, వృద్ధుల మనోభావాలు దెబ్బ తినకుండా ఏ విధమైన పద్ధతులు ప్రవేశపెట్టాలి, ఏ వయసు వారికి ఆ వయసుకు తగిన వ్యక్తిత్వం ఎలా ఉండాలి – ఇలాంటి విషయాల పట్ల కనీస అవగాహన కల్పించే సామాజిక స్పృహ, బాధ్యతలు ఈ పెట్టుబడిదారులకుగానీ, ప్రభుత్వానికి గానీ, రాజకీయ నాయకులకు గానీ లేవు. కేవలం తమ తమ లాభనష్టాలు, స్వార్థ ప్రయోజనాలు మాత్రమే వారికి ముఖ్యం.

స్త్రీలను కేవలం మార్కెట్ సరుకుగా, సెక్స్ సింబల్ గా చూపిస్తున్న అన్ని వాణిజ్య ప్రకటనలు రద్దు చేయాలి. స్త్రీలు కేవలం లైంగిక సుఖాన్ని ఇచ్చే యంత్రాలుగా చూసే భావజాలం మారాలి. స్త్రీనా పురుషుడా అని కాకుండా మనుషుల్ని ఉన్నత వ్యక్తిత్వం ఉన్నవారిగా గౌరవించే సంస్కృతి రావాలి. అప్పుడు మాత్రమే అత్యాచారాల్ని హత్యల్ని ఆపగలుగుతాం. మహిళలపై జరుగుతున్న అన్ని దాడులకు ప్రభుత్వమే కారణం కాబట్టి మహిళలపై జరుగుతున్న హింసకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు, యాసిడ్ దాడులకు పాల్పడిన నేరస్తులను ఎన్‌కౌంటర్లు చేయడం, సామాజిక అత్యాచారాలు జరిగినప్పుడు మరణ శిక్షలు విధించటం సమస్యకు పరిష్కారం కాదు. ప్రజాస్వామ్య విలువలకై పోరాడుతూ, రేపటి తరం యువతను సామ్రాజ్యవాద విష సంస్కృతినుండి రక్షించుకోవడం మనందరి బాధ్యత. వ్యవస్థే నేరమయమైనపుడు వ్యక్తులు ఎలా నేరస్తులవుతారు. ఈ వ్యవస్థను తయారుచేస్తున్న ప్రభుత్వాలు రాజకీయపార్టీలే అసలు సిసలు నేరస్తులు. మహిళల వ్యక్తిత్వాల్ని దెబ్బతీస్తూ వారిని అంగడి సరుకుగా మారుస్తున్న మీడియా, పెట్టుబడిదారులు, ప్రభుత్వమే మహిళలపై జరిగే హింసకు కారణం.

ఫ్యాక్టరీల్లో యజమానుల లైంగిక వేధింపులు, కూలికెళ్తే కామందుల కామానికి బలి కావడాలు, మైనర్ బాలికల్ని పనుల్లో పెట్టుకొని తండ్రి వయసున్న యజమానులు వారిపై అత్యాచారాలు చేయడం, కులం పేరుతో కింది కుల మహిళలపై అగ్రకుల పురుషులు గ్యాంగ్ రేట్లు, హత్యలు చేయడం, గురువుల కామాగ్నికి బలయ్యే విద్యార్థినులు, ప్రేమను కాదన్నందుకు యాసిడ్ దాడులు, హత్యలు, కట్నం కోసం కిరోసిన్ బాత్ లు,

భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, మాతంగులు, ఆడపిల్లల అమ్మకాలు, బలవంతంగా వ్యభిచారంలో దించడం, కులాంతర వివాహాలు చేసుకున్నందుకు కన్నవారే కసాయిలుగా నరకటం ఈ జాబితాకు అంతే లేదు. ఇక పోలీసుల చేతుల్లో బలైన చిత్తాయి, సిలకమ్మలు ఎంతోమంది ఉన్నారు.

పిచ్చిదైనా, పసిదైనా, ముసలిదైనా, వికలాంగురాలైనా ఎవరైనా సరే, మహిళ అయితే చాలు ఈ మృగాళ్ళకు. విషపురుగుల్ని, హానిచేసే జంతువుల్ని గుర్తించవచ్చు గానీ మేక వన్నె పులుల్ని గోముఖ వ్యాఘ్రుల్ని గుర్తించడం ఎలా? వాటినుంచి లేడికూనల్ని రక్షించడం ఎలా? కూలి చేసే మహిళనుండి రాజ్యాన్ని ఏలే మహిళ వరకు ఈ లైంగిక వేధింపులకు, హింసకు గురవుతున్నారు. మహిళల్ని వేధింపులకు గురిచేసే వాళ్ళ లిస్టులో రాజకీయ నాయకులు మినహాయింపు కాదు.

దేశంలో రోజురోజుకీ స్త్రీలలో చైతన్యం అభివృద్ధి చెందుతోంది. స్త్రీలు తమ చరిత్రని తాము నిర్మించుకునే ప్రయత్నం చేస్తున్నారు. చరిత్రలో, సమాజంలో, రాజకీయాలలో కుటుంబంలో తమ స్థానంకోసం పోరాటం చేస్తున్నారు.

నిరంతరం మగపెత్తనానికి, పితృస్వామిక హింసకు గురవుతున్న భారత స్త్రీలకు తమపై అమలవుతున్న హింసను, ఆధిపత్యాన్ని వ్యక్తిగత స్థాయిలోను, సమాజస్థాయిలోను ప్రతిఘటించడంతో పాటు కరుడుగట్టిన పురుష దృక్పథంతో రూపుదిద్దుకున్న భారత న్యాయచట్టాల్లో స్త్రీలకు అనుకూలంగా మార్పులు తీసుకురావడానికి భారత స్త్రీలు పోరాడాలి. స్త్రీలపై జరుగుతున్న హింసాకాండను, మగపెత్తనాన్ని అత్యంత సహజమైన విషయాలుగా స్థిరీకరించిన పితృస్వామిక భావజాలాన్ని రూపుమాపేందుకు మహిళలు పిడికిలి బిగించాలి. స్త్రీమూర్తుల్ని సమర్థ మానవ వనరులుగా తీర్చిదిద్దకుండా సమానత్వం, సాధికారత రావు.

వాణిజ్య ప్రకటనల్ని, అందాల పోటీల్ని, మద్యపానాన్ని నిషేధించాలి. మానవ సృష్టికి మూలమైన సమాజంలో, సహజీవనంలో సగమైన స్త్రీ వ్యక్తిత్వాన్ని కాపాడేలా ప్రభుత్వాలు పనిచేయాలి. మగపిల్లలకు చిన్ననాటినుండే తమ తల్లి అక్క చెల్లిలానే ఎదుటి స్త్రీని గౌరవించే సంస్కారాన్ని తల్లిదండ్రులు నేర్పించాలి. స్త్రీల సమస్యలపై అవగాహన కల్పించాలి. అవసరం వచ్చినపుడు మాత్రమే నేర్పించడం కాకుండా ప్రాథమిక విద్య నుంచే ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలి. సంగీతం, డ్రాయింగ్, క్రాఫ్ట్ క్లాసుల్లాగానే స్కూళ్ళలో మార్షల్ ఆర్ట్స్ క్లాసులు నిర్వహించాలి. కార్యాలయాల్లో కంప్లైయింట్ బాక్సులు, కళాశాలల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలి. చట్టాల్లో మార్పు కన్నా సమాజంలో మార్పు, భావజాలంలో మార్పు కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి. థమిక స్థాయి నుంచి నైతిక విద్యాబోధన జరగాలి. దుశ్శాసన సంతతిపై కఠిన శిక్షల కొరడా పడాలి. అశ్లీలతకు అడ్డుకట్ట వేయాలి. వీటన్నింటికోసం సమాజంలో ప్రతి ఒక్కరిలో చైతన్యం పురివిప్పాలి.

దాదర్ ఎక్స్ ప్రెస్ నుంచి ఢిల్లీ బస్సులో నిర్భయ ఉదంతం వరకూ అత్యాచారాల చిట్టా పెరుగుతూనే ఉ ంది. నిర్భయ ఉదంతం జాతి గుండెలను కలచివేసినా పరమ జుగుప్సాకరంగా అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నది మనం మరవకూడదు. జస్టిస్ జెఎస్ వర్మ సూచనల్ని కొన్నింటిని తోసిపుచ్చి అత్యవసర ఆదేశాన్ని జారీచేసిన కేంద్ర ప్రభుత్వం సామాజిక విలువలు పెంచటంలో తన వంతు ప్రయత్నం ఏం చేసిందో... ఇంకా ఏం చేస్తుందో వేచి చూడాలి.

తలవంచుకుపోతున్నా గుచ్చి గుచ్చి కాల్చే చూపులు,
ఒంటరిగా కనిపిస్తే చాలు రేటెంతనడిగే బిజినెస్మన్లు
బస్సుల్లో రద్దీ ముసుగులో రుద్దేసే వెకిలి గాళ్ళు
ఢిల్లీ నుండి గల్లీ దాకా...
అమ్మకూ, అక్కకూ, చెల్లికీ, చెలికీ
అడుగడుగునా అవమానాలెన్నో, ఎన్నెన్నో
ఇవన్నీ ఎక్కడా నమోదు కాని వేదనలు!
మగజాతికి అనుభవం లేని అర్థం కాని నగ్నసత్యాలు.
ఇంకా ఎన్నాళ్ళు... ఎన్నేళ్ళు....
ఈ బాధలూ భయాలూ గాథలూ గారడీలూ
అవమానాలు అత్యాచారాలు
మా కడుపున పుట్టి మా పాలు తాగి పెరిగి మా పైనే అత్యాచారాలా?
మగాళ్ళూ ... మీరు ఎన్నటికీ మృగాళ్ళు!

- **జి. విజయలక్ష్మి**, ఎం.ఏ.ఎమ్.ఫిల్.
రచయిత్రి, జర్నలిస్టు

నాటిక

# దర్పణం

- కీర్తి పూర్ణిమ



**ఇతివృత్తం:**

తెలంగాణ ప్రాంతపు మాండలికం, బాష, వ్యవహారం, వారి అమాయకత్వం తెలిపే చిన్న సంఘటనలు, ఇంకా కొన్ని ప్రాంతాల్లో పేరుకుపోయి ఉన్న జాతి, కుల, మత వ్యత్యాసాలు, కులపు పునాదులపై నిర్మించుకున్న వారి ఆలోచనలు తప్పు అని తెలుసుకొని మారిన ఒక వ్యక్తి కథ.

**పాత్రలు:**

మోహన్ రావు: ఊరి సర్పంచ్. కులం, జాతి పట్టింపులు ఎక్కువ

యారన్న(యారి): మామూలు మధ్యతరగతి వ్యక్తి. ఎవరికి అపాయం కలిగినా తట్టుకోలేనీ మనస్తత్వం.

కాంతమ్మ: కుటుంబం అంటే ప్రాణంగా, లోకంగా భావించే యారన్న బార్య.

సంధ్య: యారన్న, కాంతమ్మల ముద్దుల కూతురు.

మిగిలిన కొన్ని చిన్న పాత్రలు సందర్భాలకి అనుగుణంగా తీసుకోవడం జరిగింది.

* * *

మోహనరావు: ఏందిరో యారిగా ఈ దినం పెద్ద బండకాడికి అందరినీ రమ్మని సెప్పినం గదా, నువ్వు ఎందుకు రాలేదురా... నీకు పత్తేకంగా బొట్టు వెట్టి జెప్పాలా ఏంది. ఒక్క మారు దండోరా వేయించినం అంటే రావాలె అంతే... పత్తోడికి రోజు రోజుకీ నెత్తిమీద కొమ్ములు వత్తున్నయి.

అంటూ నోట్లోనే విసుక్కుంటూ యారన్న సమాధానం చెప్పేలోపే నసుగుతూ తన ఇంటి మెట్లు ఎక్కడానికి అవస్థ పడుతూ గుండ్రాయి లాంటి తన శరీరం బరువుని బారంగా మోస్తూ లోపలికి వెళ్తాడు మోహన్ రావు...

తన పిలుపుకి ఆగి సైకిల్ మీద నుంచి ఒక కాలు కిందపెట్టి ఆగిన యారన్న రావుని అలా విసుగుకుంటు వెళ్ళడం చూసి తను మారే మనిషి కాదని తనలో తానే నవ్వుకొని మళ్ళీ తన సైకిల్ ఎక్కి ఇంటికి బయల్దేరాడు...

యారన్న: యెప్పుడు జూసినా తలుపులు దగ్గరికి యేసి ఉంచే కాంతమ్మ ఈ యేల ఎందుకో తలుపులు బార్లా తెరిచి పెట్టింది...

అని మనసులో అనుకుంటూ ఆరుబయట ఉన్న తొట్టిలో నుంచి నీళ్ళు తీసుకొని కాళ్ళు కడుగుతూ ఆలోచిస్తాడు. గుమ్మం నుంచే కాంతమ్మని పిలిస్తూ లోపలికి అడుగు పెడతాడు యారన్న... ఎప్పుడయినా తను రాగానే నీళ్ళ చెంబు పట్టుకొని వచ్చే కాంతమ్మ ఈ రోజు రాలేదు. తన కోసం వెతుక్కుంటూ ఇంట్లోకి వెళ్తాడు. నిండా దుప్పటి కప్పుకొని ములుగుతూంది... గబ గబా వెళ్లి దుప్పటి జరిపి తల మీద చెయ్యి వేసి చూసాడు. తల నిప్పుల కుంపటిలా కాలిపోతోంది...

యారన్న: ఏందే ఇంత జరం ఉంది... నేను పనికి పోయేటప్పుడు బాగానే ఉన్నావు గాదె ఇప్పుడు ఇలా అయిపోయావు...

కాంతమ్మ: (బారంగా కళ్ళు తెరిచి చూస్తూ) లేదయ్యా, నిన్న రాత్రి పూట నుంచే పానం సుస్తి చేసింది. పని హడావుడిలో పట్టించుకోలేదు. పొద్దున నువ్వు పనికి పోవాలె గాదె అందుకే లేచి డబ్బా కట్టిన...

యారన్న: కాంతమ్మా... నువ్వు లేకుంటే నా జీవితానికి కాంతి లేదే... లే ఏమయిన తిందువు.

కాంతమ్మ: నాది పక్కకి పెట్టయ్యా, పిళ్ళగాల్లు పొద్దటి నుంచి ముద్ద నోట్లో పెట్టలేదు. పండుగ కోసం పూలకని పొయ్యి ఇంకా జాడే లేదు...

అని కాంతమ్మ అంటుండగానే...

సంధ్య: అచ్చేసిననే అమ్మా, సూడు ఎన్ని పూలు తెచ్చిననో... పతీ ఏడు సూరమ్మ బతుకమ్మనే పెద్దగా ఉంటది గదా, ఈ సారి నేను తెచ్చిన పూలతో వాళ్ళ కంటే పెద్ద బతుకమ్మ సెయ్యే. ఆకలి ఘోరంగా అయితాందే, జల్ది అన్నం పెట్టు...

యీరన్న: తల్లీ, అమ్మకి జరం అచ్చిందే...

అంటూ కూతురి తల నిమిరాడు యీరన్న...

సంధ్య: అయ్యో! నాకు తెల్వదే, ఇప్పుడు ఎట్టుందే... (అని తల్లి తల మీద చేయి పెట్టి చూస్తూ) గుడ్డు కొడితే ఆమ్లెట్ అయ్యేటట్టు ఉంది గాదె. నువ్వు పడుకో, తమ్ముడూ నేనూ వంట చేత్తం...

అని, కాంతమ్మ వారిస్తున్నా వినకుండా వంట చేసి తల్లికి ప్రేమగా తినిపించారు పిల్లలు...

★ ★ ★

సంధ్య: అమ్మా, నా బతుకమ్మ అందరికంటే పెద్దగా అయ్యిందే. నేను అందరి వాట్సాప్ స్టాటస్ లు చూసిన... యెంకి గాడి అమ్మ తంగేడి పూలతో నీలి రంగు పూలు గలిపి బతుకమ్మ చేసిందే. చిన్నగా ఉన్నా మస్తు ముద్దగా గొడుతుంది...

కాంతమ్మ: సరే కానీ ఇంత పెద్ద బతుకమ్మ మోసుడు నాతో గాదు బిడ్డ... ఇక్కడ ఎత్తింది మళ్ళీ గద్ద కాడికి పోయే దాకా దించేది లేదు...

సంధ్య: ఏం గాదె అమ్మా, నేను ఎత్తుతా, నా నెత్తి మీద పెట్టు...

అని తన చున్నీని గుండ్రంగా చుట్టి తల మీద పెట్టుకుంది...

"జాగ్రత్తనే బిడ్డ" అంటూ బతుకమ్మని తల మీదకి ఎత్తింది కాంతమ్మ. కాంతమ్మ పాట పాడుతూ ఉంటే తన బిడ్డ తనతో తాళం కలిపింది. బరువునీ దూరాన్నీ సులభతరం చేసేందుకు అది ఓ చక్కని ఉపాయం.

రమణీ బిందా తీసుక మంచీ నీళ్లకి పోతె సోమవారం ఎదురాయనమ్మా ఆ సాంబశివుడు... "ఆ సాంబశివుడు..." రమణీ బిందా తీసుక మంచీ నీళ్ళకి పోతె మంగలారం ఎదురాయనమ్మా ఆ అంజనెయుడు... "ఆ ఆంజనెయుడు..." రమణీ బిందా తీసుక మంచీ నీళ్లకి పోతే బుదారం ఎదురాయనమ్మా ఆ బొజ్జగణపయ్యవాడు... "గణపయ్య వాడు..."

★ ★ ★

సంధ్య: కాస్త ముందుకు వెళ్ళాక "నాతో గాదె అమ్మా" అని అక్కడే వున్న బండమీద కూర్చుండిపోయింది ఆ బక్క ప్రాణం. దూరంగా సైకిల్ వేసుకొని వస్తున్న యీరన్నని చూడగానే...

సంధ్య : "అమ్మా, అటు సూడే" అని చూపించింది కాంతమ్మకి. దూరం నుంచి చూసి వాళ్ళ వైపుగా వచ్చాడు యీరన్న...

యీరన్న: ఏమయింది కాంతం, జరం తగ్గిందానే బతుకమ్మ పట్టుకొని ఎళ్ళినవు...

కాంతమ్మ : (యీరన్న వైపు చూసి చిన్న నవ్వుతో) ఏం గాదులే అయ్యా... ఏడాదికి ఓ మారు అచ్చే పండుగ ఎట్లా పోనియ్యాలే సెప్పయ్యా. పండుగ ఎప్పుడు వస్తది అని, పండగ



అయిపోయిన నాటి నుండి మళ్ళీ ఎప్పుడా వచ్చేది అని అనుకుంటూ ఎదురుచూస్తాది కదే బిడ్డ. అందుకే వచ్చిన...

యీరన్న : మంచిగున్నదిలే... లే లే కళ్ళు తిరిగి కిందపడితే ఎంకన్న సామి గుర్తు అత్తడు అప్పుడు. నీలాంటిది పక్షవాతం బోయి నాకు కాళ్ళు అత్తే నా చేతులు నీకు ఇత్తనయ్య అని మొక్కుకుంది అంట...

(అంటూ పక్కనే చెట్టు కింద సైకిల్ స్టాండు వేసి పెట్టి బిడ్డ నెత్తి మీద ఉన్న బతుకమ్మని ఎత్తి తల మీద పెట్టుకొని గద్ద కాడికి ప్రయాణం అయ్యారు... )

సంధ్య: అయ్యా... ఈ సారి గద్ద మస్తు ముస్తాబు చేసిల్లులే... దూరం నుంచే ఇంత ముద్దుగా కొడుతుంది అంటే దగ్గరికి పోతే ఇంక ఎంత ముద్దుగ కొడతదోనే...

యీరన్న: అవును బిడ్డా... ఆకాశంల కెళ్ళి నచ్చత్రాలు కిందికి దిగి గౌరమ్మ తల్లికి హారతి పట్టినట్టు అగుపడుతుంది కదనే...

కాంతమ్మ: ఎంత ముద్దుగా గొడుతుంది...

సంధ్య: అమ్మా... గాల్లో తేలుతూ ఎర్రగా ఎంత ముద్దుగా ఉన్నాయో...

కాంతమ్మ: గాల్లో తేలడం ఏందే ఎర్రి దానా...

అంటూ బిడ్డ నెత్తి మీద నవ్వుతూ మొట్టికాయ వేసింది కాంతమ్మ...

సంధ్య: అదిగో అటు చూడు అమ్మా...

అని గాలితో కబుర్లు చెప్తున్నట్లు గాలితో పాటు చెంగు చెంగున తేలుతున్న గ్యాస్ బుగ్గల్ని చూపింది...

కాంతమ్మ: కొనిస్తా లేవే తల్లీ... (అంటూ తన పుట్టింటి వాళ్ళు పెట్టిన నేత పచ్చ చీర కొంగు చివరన వేసిన ముడిని విప్పుతూ) ఇదిగో బిడ్డా నువ్వు అల్లరి మానేసి నేను చెప్పేది ఇనాలే మరి...

సంధ్య: సరేనే అమ్మా...

అని అంటూ కాంతమ్మ ఇచ్చిన మడిచిన పది రూపాయల నోటుని కేరింతలు కొడుతూ తీసుకుంది సంధ్య...

కాంతమ్మ: తల్లీ, మన బంటి గాడు ఏడి...?

సంధ్య : వాడు డప్పులతో బతుకమ్మని తోలుకపోయేటప్పుడే ఎల్లిపోయిండు గద్దె కాడికి...

కాంతమ్మ : వాడికి ఎప్పుడూ తొందరనే... తల్లీ, వాడికి ఒకటి కొనిచ్చి నువ్వు ఒకటి కొనుక్కో...

"ఆ సరే సేరే" అంటూ తన మిత్రులు కోలాటాలు పట్టుకొని బతుకమ్మ చుట్టూ ఆడటం చూసి, వాళ్ళ చెంతకి పరుగు తీసింది...

గద్దె వద్ద రెండు గుంపులు... ఒకటి పెద్ద కులం వాళ్ళది, ఒకటి చిన్న కులం వాళ్ళది... కాంతమ్మకి అంత దూరం నుంచి నడుస్తూ వచ్చే సరికి కళ్ళు బైర్లు కమ్మాయి అక్కడే కనిపించిన బండరాయి దగ్గర కూర్చుండి పోయింది... యీరన్నని తన ముందు ఉన్న గుంపు దగ్గర బతుకమ్మని పెట్టమని చెప్పింది... యీరన్న, బతుకమ్మని అక్కడ పెట్టి బండరాయి మీద కూర్చున్న కాంతమ్మకి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు... కాంతమ్మ గబ గబా నీళ్ళు తాగి అలిసిన శరీరంతో పెద్ద శ్వాస తీసుకుంది...

ఒక్కసారిగా యీరన్నకి వీపు మీద నెట్టినట్టు అయ్యింది... ధబేలున మోకాళ్ళ మీద వున్న యీరన్న బోర్లా పడ్డాడు. అప్పటి వరకు ఆటపాటలతో హడావుడిగా ఉన్న జనం అంతా తుఫాను ముందు ఉండే నిశబ్దంలా మారిపోయారు. కాంతమ్మ ఒక్క సారిగా లేచి, కింద పడిన యీరన్నని లేపే ప్రయత్నం చేసింది... బోర్లా పడటంతో అక్కడే ఉన్న రాయి చీరుకొని మోచేయి నుంచి రక్తం కారింది... వెంటనే కాంతమ్మ తన బతుకమ్మలో ఉన్న గౌరమ్మని మొక్కి, పసుపుతో చేసిన గౌరమ్మ నుండి చిటికెడు పసుపు పట్టుకెళ్ళి యీరి చేయికి గాయం అయిన చోట రాసింది.

అప్పుడే అక్కడ ఉన్న ఒక పెద్ద కులం గుంపు నుంచి ఒక మహిళ ముందుకు వచ్చి... "ఒసేయ్ కాంతం! ఏం చేస్తున్నావో ఏమైనా అర్ధం అవుతుందా నీకు? గౌరమ్మని తీసి పసుపు పెడతావా? ఎంత అపచారం! గౌరమ్మకు కోపం అత్తే మనం కాలి బూడిద అవుతాం. నీ వల్ల ఊరు ఊరంతా నాశనం అవుతుందే! అర్ధమయ్యిందా?" అని కనుబొమ్మలు పైకెత్తి నోటి మీద చేయి వేసుకుంటూ అంది...

కాంతమ్మ: అయ్యో! అట్ట అనకు తల్లీ... నా వల్ల ఊరికి కట్టం రానియ్యను తల్లీ...

అని మాట్లాడుతుంటే అదే సమయంలో అదే గుంపులో నుంచి ఒక మహిళ అమ్మోరు వచ్చినట్టుగా ఊగడం మొదలెట్టింది. అందరూ తనని "శాంతించు తల్లీ" అంటూ వేడుకుంటున్నారు. తెచ్చిన ఫలహారాలు, పెట్టిన అగరవత్తులు, తన ముందు పెట్టి హారతులు పడుతున్నారు ఆడబిడ్డలు... కాసేపటికి ఆ మహిళ మాట్లాడింది. "కాంతమ్మా!!" అని పిలిచింది. చుట్టూ

వున్న జనం దూరం జరిగారు. కాంతమ్మ వణుకుతూ ముందుకు వచ్చి "తల్లీ! తప్పయింది తల్లీ! సమించూ..." అంటూ మోకాళ్ళ మీద కూర్చుని వేడుకుంది. ఆ మహిళ, "నా బతుకమ్మకి వాడే పువ్వులే ఎంగిలి కాకుండా వుండే పూలతో సేత్తరు... అట్టాంటిది పసుపుతో చేసిన నన్నే ఎంగిలి సేత్తవా... నీకు ఎంత ధైర్యమే..."

కాంతమ్మ: లేదమ్మా తప్పయి పోయింది... (ఏడుస్తున్న స్వరంతో...)

ఆ మాహిళ : చేసిందంతా చేసి తప్పయింది అని లెంపకేసుకుంటే అయిపోతుందా?

"అమ్మా! ఏం చెయ్యమని అంటారు చెప్పమ్మా..." అని అందరూ చేతులు పైకి లేపి దండాలు పెట్టారు.

ఆ మహిళ: నా పూల పండుగ అయ్యే వరకు, ఆ గంగమ్మ ఒడిలో నేను అడుగు పెట్టే వరకు నువ్వు ఆ నీళ్ళ మధ్య నిలబడాలి.

అని ఊగుతూ కింద పడిపోయింది. ఎవరూ ఏం మాట్లాడక పోయినా కాంతం వెళ్లి నీళ్ళ మధ్య నిల్చుంది. అందరి నోరుకి బయపడి యిూరన్న కూడా ఏం మాట్లాడలేదు. అందరూ మళ్ళీ వెళ్లి బతుకమ్మ ఆడుతున్నారు. కాంతం నది నడుమ చల్లటి నీటిలో ఉంది...

అమ్మవారు వచ్చి కింద పడిన ఆ మహిళ కూడా లేచి మళ్ళీ ఆటలో పడింది. కాంతం వంక చూస్తూ "మంచి పనయింది దీనికి. లేక పోతే నాకు ఎదురు చెప్తుందా...". "ఏం అయింది అక్కా దానితో నీ గొడవ ఏమిటి? నీకు అమ్మవారు రాకున్నా ఎందుకు అలా నటించావు?". "మరి లేకుంటే ఏమిటే దాని పొగరు దాని తల పొగరు దించడానికి ఇలా చేశాను. మొన్న మా ఇంట్లో ఇల్లు సర్దుతుంటే పట్టు చీర కట్టుకొని పండుగ చేసుకో అని ఇస్తే అద్దు తల్లి అని వెనక్కి ఇచ్చింది. పోనీలే పాపం అని చూస్తే నాతోనే అలా ప్రవర్తిస్తుందా. అందుకే ఇప్పుడు ఇలా ప్రతీకారం తీర్చుకున్నా" అంటూ పొగరుగా ఒక చిరునవ్వు నవ్వి మళ్ళీ ఆటలో పడింది జోతి.

యిూరి కాంతమ్మ దగ్గరికి పోయి గట్టు మీద కూర్చున్నాడు. నీళ్లలో ఉన్న కాంతమ్మని చూస్తూ...

యిూరన్న: ఎందుకే, యిూరి గాడి కోసం ఇదంతా అవసరమా? కూలి పనిలో నాకు ఎన్ని దెబ్బలు తగులుతాయో తెలుసా? టిన్నేర్ రాసుకొని సప్పుడేక ఉంట. ఈ చిన్న దెబ్బ కోసం నువ్వు జరమచ్చి నీళ్లల్ల నిల్సున్నవు. రేపు పొద్దున లెత్తవా ఇగ...

కాంతమ్మ: ఎం గాదులే అయ్యా. నువ్వు అట్ట బాధ పడకు. అసలు ఈ పండుగ ఎవరి పండుగ అయ్యా?

యిూరన్న: ఏమోనే. నాకు సక్కగా తెలవదు. ఎన్నో కథలు ఉన్నాయి దీని గురించి. కానీ గిరిజనుల నుండే మొదలు అయ్యింది అని మా తాత చెప్పే వాడు. పుట్టిన పిల్లలు చనిపోయి మళ్ళీ పిల్లలు కాక బాధపడే వారికీ, పిల్లలు లేని వాళ్ళకీ పిల్లలు ఇచ్చే తల్లి అనీ, అలా పుట్టిన పిల్లలకి బతుకు అనీ, బతుకమ్మ అనీ బతుకయ్య అని పేర్లు కూడా పెట్టుకొనే వాళ్ళు. ఆ దుర్గమ్మ అవతారం అని ఎన్నో చరిత్రలు ఉన్నాయే ఏదో ఉత్తిగా అచ్చిన పబ్బం కాదే ఇది.

కాంతమ్మ: అవునయ్యా, రోజూ ఒకటి చేత్తం కదా, ఈ రోజు ఎందుకు రెండు బతుకమ్మలు చేయాలె?

యిూరన్న: ఏంలేదే, మన సంప్రదాయం అది. నువ్వు చూసినవా, ఎప్పుడయినా బోజనాలు పెడితే, ఒక్క సారి తిని లేవద్దు రెండో సారి కూడా కాత్త నైన తినాలే అని అంటాం. ఎందుకు? గౌరవం... మన పేమ ఆల్లకి అర్ధం కానీకి.. పెట్టింది తిని లేవద్దు రెండో సారి పెట్టుకో అని మళ్ళీ అలా సేత్తం. అది మన పద్ధతి, అంతేకాదు పెళ్లి కూతురితో పాటు ఒకరిని తోడుగా పంపిస్తాం అలానే బతుకమ్మని కూడా ఒంటరిగా కాకుండా చిన్న బతుకమ్మ చేసి పంపుతాం. అవునే ఇప్పుడు ఎందుకు ఇదంతా అడుగుతున్నావు?

కాంతమ్మ: ఏం లేదులే అయ్యా. అదిగో, బతుకమ్మ పండుగ అయినట్టు ఉంది అందరూ బతుకమ్మ పట్టుకొని వస్తున్నారు...

(అంటూ అటు వైపు చూసింది కాంతమ్మ. తన చూపుని చూస్తూ యిూరన్న కూడా చూసాడు. అందరూ వస్తున్నారు. మోహన్ రావు ముందు వస్తున్నాడు. చీకటి కారణంగా సరిగ్గా కనిపించక అక్కడే ఉన్న బురదలో జారి పడ్డాడు. బతుకమ్మలు పట్టుకొని వచ్చే వాళ్ళు అంతా ఆగిపోయారు. ముందే గుండ్రాయి లాంటి శరీరం, కింద పడగానే అరిచిన అరుపు ఊరి పొలిమేర వరకు వినపడింది. అందరూ తను లేవడానికి పడుతున్న ప్రయాస చూస్తూ వుంటున్నారు కానీ ఎవరూ వెళ్లి తనని లేపడానికి ప్రయత్నం చేయడం లేదు. యిూరన్న కూడా చూస్తున్నాడు. వెళ్లి లేపుదాం అని ఆలోచించినా వాళ్ళ ఊరి కట్టుబాటు గుర్తు వచ్చింది. తక్కువ కులం వాళ్ళని పెద్ద కులం వాళ్ళు తాకరు. పొరపాటున తాకినా వెళ్లి స్నానం చేస్తారు. కానీ పందులు అప్పటి వరకు ఆ బురదలో బొర్లి వెళ్ళడం చూసిన వాళ్లంతా మోహన్ రావుని లేపడానికి అడుగు వెనక్కి వేస్తున్నారు.

లేవడానికి ప్రయత్నం చేసి మళ్లీ దబాలున పడిపోయాడు. ఈసారి నడుముకి దెబ్బ తగిలింది కాబోలు నడుము పట్టుకొని అమ్మా! అయ్యా! అంటూ వాళ్ళ కులం వాళ్ళ వైపు చూస్తున్నాడు. అసలు ఎవరూ మొహం కూడా చూడడం లేదు. అంతలో యీరన్న చెయ్యి ముందుకు చాపి)

యీరన్న: రండి బాబూ నా చెయ్యి ఆసరా పట్టుకొని లేవండి. మోహన్ రావు అక్కడే నిలబడి చూస్తున్న వాళ్ళ వైపు చూస్తూ సూరన్నకి చెయ్యి అందించాడు. తనని చెరువు దగ్గరికి తీసుకొని వెళ్తుండగా వెనక నుంచి ఒక అరుపు... "చిన్న కులం వాడితో చెయ్యి కలుపుతావా" అని.

మోహన్ రావు వెనక్కి తిరిగి చూసాడు. ఎవరూ నోరు మెదపలేదు. దెబ్బ తగిలిన కాలిని నేలకు ఈడుస్తూ.. ఒక చేతిని నడుము మీద పట్టుకొని మరో చేయి సూరన్న మెడ మీద వేసి ముందుకు వెళ్తున్నాడు. వాళ్ళు చెరువు దగ్గరికి వెళ్ళడం చూసి "మేము బతుకమ్మని వదిలే చెరువులో ఈ బురద కలిపితే నీళ్ళు చెడిపోతాయి" వెనక నుంచి మరొకరి మాట.

ఈ సారి వెనక్కి కూడా చూడలేదు. ఆ నీళ్ళల్లో మోహన్ రావుని కడిగి యీరన్న బయటకి పట్టుకొని వచ్చాడు. మోహన్ రావుని యీరన్న ఇంటికి తీసుకొని వెళ్తున్నాడు అని అందరికీ అర్ధం అయ్యింది. ఒక్క క్షణం వాళ్ళ ముందు ఆగి

యీరన్న: "ఆ గంగమ్మకి మీలాగా మురికిని దాచుకొనే తత్వం లేదు".

అని ముందుకు వెళ్ళిపోతాడు మోహన్ రావు. ఆ గంగమ్మ గల గలా పారుతూ దర్పణంలా స్వచ్ఛంగా ముందుకి కదిలిపోతూంది. అందరూ వెళ్లి బతుకమ్మని సాగనంపి వెనుదిరిగి వస్తారు. మోహన్ రావు మనసులో ఎన్నో ఏళ్ల నుండి ఉన్న జాతి వివక్ష, కులపు గోడలు, గాయాలు కడిగిన నీళ్లలోనే వదిలి స్వచ్ఛంగా ఇంటికి బయల్దేరాడు.

మోహన్ రావు: యీరన్న వంక చూస్తూ "డబ్బు కట్టకుండా వచ్చి గద్దె కాడ బతుకమ్మని పెట్టినందుకు నిన్ను నెట్టేసాను. నువ్వు నాకు అయిన గాయం తుడిచావు. నన్ను మన్నించురా యీరన్న" అని అనుకుంటూ ఇంటికి వెళ్తాడు మోహన్ రావు.

ఆనాటి నుండి ఎవరినీ తక్కువ చేసి చూడలేదు మోహన్ రావు. కాంతమ్మని నీళ్లలో నిలబడేలా చేసిన ఆడవాళ్ళకి మోహన్ రావు మాట అర్ధం కాలేదు.

ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. కాంతమ్మ తన పిల్లలని పట్టుకొని ఇంటికి బయల్దేరింది, తను తెచ్చిన సత్తుపిండి ప్రసాదం అందరికీ పంచుతూ...

శుభం...

**రచన : కీర్తి పూర్ణిమ,**
వ్యాసకర్త, రచయిత.

# గజల్



నా అక్షరము లాలించగ కావ్యమయి పూసెనులే
నా గళమును సవరించగ శ్రావ్యమయి పూసెనులే

నే సాగును ప్రేమించగ నేలతల్లి పులకరించి
శేషమైన ఋణముండగ సేద్యమయి పూసెనులే

అకుంఠిత దీక్షను నే చందనముగ అద్దుకొనగ
అసాధ్యాలె లేకుండగ సాధ్యమయి పూసెనులే

మదుపుతోడ తరగకుండ రూపాయిని
నేదాచగ
ఎడతెగనీ సిరులజల్లు భాగ్యమయి పూసెనులే

నాభావన అరుణవర్ణ తొలివేకువ కిరణాలై
హృదయమ్మున ఆహ్లాదమె లాస్యమయి పూసెనులే

**రావుల కిరణ్మయి** హన్మకొండ

కథ

# మరో మార్గం



- జయంతి వాసరచెట్ల

బయట జోరుగా వర్షం కురుస్తుంది.

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది!

వృద్ధాశ్రమంలోని పెద్దలంతా ఒకే దగ్గర కూర్చుని వేడివేడిగా సుబ్బయ్య తెచ్చిన పకోడీలు తింటూ ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు.

వారు ఆనందంగా ఉన్నారో.... నటిస్తున్నారో....

ఆదుర్దాగా ఉన్నారో .... కానీ ఏ భావనా బయటకు కనిపించడంలేదు.

అందరికళ్ళూ మళ్లీమళ్లీ గేటు వైపు చూస్తున్నాయి.

ఈరోజు ఆదివారం కావడమే అందుకు కారణం.

తమ కుటుంబ సభ్యులు వాళ్లని చూడడానికి వస్తారు. వస్తూ వస్తూ వాళ్ళ మనవలనూ మనవరాళ్ళనూ తీసుకుని వస్తారు.వాళ్ళతో కాసేపు ఆడుకోవచ్చు కబుర్లు చెప్పుకోవచ్చు తమ కొడుకులను కానీ బిడ్డలను కానీ ఎవరూ లేకపోతే గార్డియన్లుగా ఉన్నవారిని కానీ కలుసుకుంటారు.వారితో వారి మనసులోని బాధను ఉన్నకాసేపట్లో చెప్పుకుని తృప్తి పడతారు.

కానీ పొద్దున్నుంచీ ఈ వర్షం పడుతూనే ఉంది.

మనవాళ్ళు వస్తారా రారా అని అందరి మనసుల్లో బాధ ఆదుర్దా తొంగి చూస్తుంది.

ఒక్కో నిమిషం సమయం గడిచినకొద్దీ కళ్ళల్లో నీళ్ళు నిండుతున్నాయి.

ఎవరికి వారు వాటిని కనిపించనీయకుండా చేయడానికి తెగ ఆరాటపడుతున్నారు.

★ ★ ★

అది "మరో మార్గం" వృద్ధాశ్రమం అక్కడ దాదాపు గా వందమంది దాకా వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

వాళ్ళు ఆర్థికంగా ఎదుగూబొదుగూ లేనివాళ్ళు కాదు. అందరూ మంచి ఉన్నతస్థాయి లో ఉన్న కుటుంబాల వాళ్ళే ... భర్త లేని భార్యలు, భార్యలు లేని భర్తలు, సంతానం లేని దంపతులు, విధిలేని పరిస్థితుల్లో ఆశ్రయం కోసం వచ్చిన వాళ్ళు ఉన్నారు.

ఇష్టపడి ఉంటున్నవాళ్ళెవరూ లేరు విధి లేని పరిస్థితుల్లో ఉన్న వాళ్ళే అందరూ. ఇక్కడి కి వచ్చిన తర్వాత అందరూ ఒకే కుటుంబం లా కలిసిమెలిసి ఒకరికి ఒకరం అన్న చందంగా ఉంటున్నారందరు.

అది ఆదివారం కావడంతో ...సాయంకాలం తమ వాళ్ళు వస్తారనే ఆనందం ఒకవైపూ వర్షం వల్ల ఎక్కడ రాకుండా పోతారోననే భయం ఒకవైపు అందరిలో కనిపిస్తూనే ఉంది.

ఎవరికివారు తోచింది మాట్లాడుతూనే ఉన్నారు కానీ.

అందులో ఆఖరి వరుసలో సోఫాలో వెనక్కి ఆనుకుని కూర్చున్న పెద్దావిడ వరలక్ష్మి వయసు 68 సంవత్సరాలు సరిగ్గా వినలేదు, నడవలేదు, ఆమెకు షుగర్, బిపి ,ఉన్నాయి. మాటలు స్పష్టంగా మాట్లాడడం రాదు.తనకున్న ఒక్కగానొక్క కొడుకు ఆరునెలల క్రితం మరోమార్గం వృద్ధాశ్రమం లో వదిలి వెళ్ళాడు.

" ఒక్కగానొక్క కొడుకు వాడిని ఎంత ప్రేమగా పెంచింది"

కొడుకు పుట్టిన రెండు సంవత్సరాలకే భర్తను కోల్పోయింది వరలక్ష్మి.

అప్పటినుండి వాడే తన ప్రాణానికి ప్రాణంగా పెంచి పెద్ద చేసింది. మంచి చదువులు చెప్పించింది. దాయాదుల దాడి నుండి తనను తాను కాపడుకుంటూ కొడుకు పై ఎవరి కన్నూ పడకుండా పెంచింది.

భర్త చనిపోయాక అతని ఉద్యోగం తనకు ఇస్తే ఎలాంటి అనుభవం లేకపోయినా పని నేర్చుకుని భర్త స్థానం లో తన పేరు ను నిలుపుకుంది.

"చిన్న వయసే మరో పెళ్ళి చేసుకోమ్మని చాలా మంది సలహా ఇచ్చారు."

కానీ తనకు అలాంటి ఆలోచనే లేదని మరోసారి తనవద్ద అలాంటి ప్రస్తావన తీసుకు రావద్దని తెగేసి చెప్పింది.

మనసును రాయిగా చేసుకుని జీవించింది.

కొడుకు కోసం వాడి భవిష్యత్తు కోసం తను శ్వాసించింది.

ఆస్తి అంతస్తులు సమకూర్చి మంచి కుటుంబానికి చెందిన అమ్మాయి తో పెళ్లి చేసింది. ఇప్పుడు వారికి ఇద్దరు పిల్లలు వాళ్ళతో ఆడుకోవాలనీ మంచి మంచి కథలు చెప్పాలని, నానమ్మా నానమ్మా అంటూ వాళ్ళు తనచుట్టూ తిరగాలనీ బుంగమూతి పెట్టుకుని అలిగితే తానే ఓదార్చి అడిగినవన్నీ కొనివ్వాలనీ ఎన్నో కోరికలు మనసులోనే పెట్టేసుకుంది.

ఏనాడూ తను వృద్ధాశ్రమంలో చేరాల్సి వస్తుందని తన జీవిత చరమాంకంలో ముక్కూ ముఖం తెలియని ప్రదేశంలో ఉండాల్సొస్తుందని ఊహ కైనా అందని విషయం.

అనుకోకుండా ఒకరోజు బీపీ ఎక్కువైంది.

ఆరోజు కొడుకు కోడలు ఇంట్లోనే ఉన్నారు. కుర్చీలో కూర్చున్నది కూర్చున్నట్లే కిందపడిపోవడమే గుర్తుంది

"ఆతరువాత కళ్ళుతెరిచిచూస్తే హాస్పిటల్ ఐసియూ వార్డులో ఉంది."

మూతి వంకరగా పోవడం వల్ల ఇకముందు మాటలు స్పష్టం గా రావని నడవడం చాలా కష్టం అనీ ఒక గాజు బొమ్మలాగా తనను చూసుకోవాలనీ డాక్టర్ తన కొడుకు తో చెప్పడం తనూ విన్నది.

భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తారు.తన బాగోగులు చూడడానికి ఇబ్బంది అవుతుంది అని నచ్చజెప్పి "మరోమార్గం" వృద్ధాశ్రమం లో తన స్నేహితుడి తల్లికూడా ఉంది అని ఇక్కడ జాయిన్ చేసారు.

ఇదే నా నేనుకోరుకున్న జీవితం .?

ఈ స్థితిలో కన్నకొడుకు దగ్గర లేకపోవడం ఇంత బాధగా ఉంటుందని అనుకోలేదు..?

ఎంత ప్రేమ గా పెంచాను వాడిని?

"ఒంటరి మహిళ కు ఈ సమాజంలో ఎలాంటి గౌరవం ఉంటుందో..,? "అందరి చూపులు తప్పించుకొని మౌనంగా ఎదగాలంటే ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కోవలసి వచ్చిందో కొడుకుకు తెలియదా .?

అయినా ..

వాళ్ళదీ నిజమే వాడు ఆఫీస్ కు వెళ్ళినప్పుడు తనకేమన్నా అయితే వాడు తట్టుకోగలడా?

ఎవరినైనా మనిషిని పెట్టి చేయించాల్సింది కదా.?

డబ్బుకు ఏమైనా కొదువా.? కాదుకదా?

వృద్ధాశ్రమం లో వదిలితే ఈకన్నపేగు ఎంతలా విలవిల లాడుతుంది.?

అని పరధ్యానం ఎక్కడో శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తుంది వరలక్ష్మి.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నట్లు "ఏమండోయ్ వరలక్ష్మి గారు ఇంకా మీ కొడుకు వచ్చినట్లు లేదు.." అంది 80 సంవత్సరాల సత్యమ్మ ఇంకా రాలేదమ్మా వర్షం పడుతుంది కదా అందువల్లే రాలేదేమో లేకపోతే వచ్చే వాడే అంది వరలక్ష్మి.

మధ్యలో కల్పించుకుని " అంతేలెండి మనం మన పిల్లలను వెనకేసుకుని రావాలి లేదంటే మరోవారం వాళ్ళు రాకపోవచ్చు... లేదంటే శాశ్వతంగా మనల్ని మర్చిపోవచ్చు" అన్నాడు అక్కడే మంచంపై కూర్చున్న 61 ఏళ్ల లక్ష్మయ్య .

"లక్ష్మయ్య గారు అలా నిష్ఠూరంగా మాట్లాడతారేంటీ అంది వరలక్ష్మి."

ఇందులో నిష్ఠూరం అనే విషయంఏమీ లేదమ్మా అనుభవం తో చెప్తున్నా.

నావిషయమే తీసుకోండి నేను ఎంతో కష్టపడి ఆస్తులు కూడ బెట్టాను.

పిల్లలందరి పెళ్లిళ్లు చేశాను.

నా అంత అదృష్టవంతులు ఎవరూ లేరని అనుకునేవాన్ని ఉన్నట్టుండి ఒకరోజు ఒళ్లంతా వాపులు వచ్చాయి. లేవడం పనులు చేసుకోవడం సాధ్యం కాలేదు. డాక్టర్ ఇది బోధవ్యాధి తగ్గేట్లు లేదు అన్నారు.

నా కుటుంబ సభ్యులు వచ్చి చూసారు.

ముఖం తిప్పుకున్నారు.అంతవరకూ నేనంటే గౌరవం చూపించే నా కోడళ్ళు నాకెక్కడ సేవచేయవలసి వస్తుందోనని తప్పుకు తిరుగుతున్నారు.

నా భార్య ఉంటేనన్నా నన్ను చూసుకునేదేమో....!!

కానీ అది నన్ను వదిలి నా కంటే ముందే వెళ్ళిపోయింది.

నా దర్జా దర్పం అన్నీ నావ్యాధి రావడం తోటే మాయమయ్యాయి.

"మనం ఒక్క నిమిషంలో కోటీశ్వరులం కావచ్చు ,మరు నిమిషంలో బిచ్చగాళ్ళ మై పోవచ్చు, కానీ జీవితం అనేది ఎవరికోసమూ ఆగదు కదా."

అందుకే నా పిల్లలకు భారంగా ఉండదల్చుకోలేదు.

మూడు సంవత్సరాలుగా ఇక్కడే ఇదే గదిలో నా జీవితం అన్నాడు లక్ష్మయ్య.

మరోపక్క చివరగా ఆసనం వేసుకుని టేప్ రికార్డరు లో పాటలు వింటున్న సుశీలమ్మ వీరి మాటలకు టేప్ రికార్డరు ఆపేసి చేతితో తిప్పుతున్న జపమాలను పక్కనే ఉన్న డబ్బాలో

వేసి ఇలా అంటుంది.

"మీరు ఏం కోల్పోయారని బాధ పడుతున్నారు. మనం ఈ ప్రపంచంలో కి వచ్చినప్పుడు మనం ఏమైనా తెచ్చామా...? తీసుకొని పోవడానికి ..?"

"ఇప్పుడు ఈ క్షణం ఇక్కడ ఒకే కుటుంబం లాగా ఉన్నాము రేపు స్మశానం లోకి జారుకుంటాము అంతే కదా ?"

"మనం పోయాక మనవాళ్ళు వచ్చి పిడికెడు మట్టి వేస్తారో లేదో తెలియదు"

వాళ్ళు వస్తే మన ఆత్మ శాంతిస్తుంది. లేదంటే ఈ ఆశ్రమంలో వస్తువు రూపంలో ఒక జ్ఞాపకం గా మిగిలిపోతాం.

ఇదిగో ఈ టేప్ రికార్డర్ లక్ష్మి అనే ఆమెది. ఆ వాల్ క్లాక్ కూడా ఆమెదే వాటిని చూసినప్పుడు ఆమె గుర్తొస్తుంది.

పోయిన సంవత్సరం ఆమె మరణిస్తే అంత్యక్రియలకు బంధువులు ఎవరూ రాకపోతే ఆశ్రమ నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు.

తరువాత కూడా ఎవ్వరూ ఆమెకోసం రాలేదు.

ఇప్పుడు ఆమె లేదు ఆమె గుర్తుగా ఈ టేప్ రికార్డర్ , గడియారం మిగిలాయి. ఆమె ఎప్పుడూ అంటూ ఉండేది.

"నాకు ఇక్కడ ఉండాలని ఇష్టం లేదు. అయినా ముసలితనం వచ్చాక ఎక్కడో ఒకచోట ఉండాలి కదా..!" అందుకే ఉంటున్నాను అనేది.

మధ్యలో మరో వ్యక్తి మాటకలుపుతూ .. "నాకు నవలలు చదవడం అన్నా ఆధ్యాత్మిక పురాణ గ్రంథాలు చదవడం అన్నా చాలా ఇష్టం అందుకే ఇక్కడ ఉన్న పుస్తకాలు చదువుతూ తీరికలేకుండా మనసు పిల్లలపైకి మళ్లకుండా ఉంటూ... మనసులోకి చెడు ఆలోచనలు రాకుండా చూసుకుంటున్నాను" అంది మరో మహిళ శాంతమ్మ.

మధ్య లోనే కేశవయ్య అనే వృద్ధుడు కల్పించుకుని "ఇప్పుడు మనం ఈకాస్తన్నా జీవితం అనుభవించి చివరిదశలో ప్రశాంతత కోసం వెతుకుతున్నాం కానీ ... "

"ఆ కానీ.." అన్నారు మరొకరు.

పుట్టగానే పసిపిల్లలను చెత్తకుప్పలో పడేసి చేతులు దులుపుకుని ఏమీ ఎరుగనట్లు కొత్త జీవితం మొదలు పెడతారే కొందరు కిరాతకులు. అలా అనాథలైపోయిన పసివాళ్ళ పరిస్థితి ఏంటీ.?

మనకు ఆర్థిక స్థోమత బాగానే ఉంది. ఎంతో కొంత జీవితాన్ని అనుభవించాము.ఎక్కడెక్కడి వాళ్ళమో ఇక్కడ సొంతవాళ్ళకన్నా ఆత్మీయులుగా ఉంటున్నాము.

మనలో ఎవరికి ఏమి జరిగినా మన హృదయాలు తల్లడిల్లుతాయి.

అన్నాడు కేశవయ్య.

అయితే ఏమంటారు మనవాళ్ళు రాకపోయినా ఆలోచించవద్దనా మీ ఉద్దేశం అంది సత్యమ్మ .

అలానేనేమీ అనలేదే...! ఎక్కువ బెంగ పడవద్దు అంటున్నాను అన్నాడు.

కొన్ని క్షణాలు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

వరలక్ష్మికి ఏదో ఆలోచన ఊపిరి పోసుకుంది.

వరలక్ష్మి గారు గొంతు సవరించుకుంటూ అందరినీ ఉద్దేశించి ఏదో మాట్లాడింది అందరూ ఆశ్చర్యపోయారు. నిజమే అనుకుని సంతోషంగా చప్పట్లు కొట్టారు.

కానీ మనం మా... అంటే రెండేళ్ళో.... మూడేళ్ళో..... మరి ఆతరువాత పరిస్థితి ఏంటీ...? అన్నారొకరు.

మనకు మన నిర్వహణ కోసం ఇచ్చే డబ్బులే ఖర్చు పెడుతున్నాం కదా..

అదీకాక కొంత మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తాను.

నా తరువాత కూడా నిర్వహించడానికి మీరందరూ లేరా...?

ఉన్న ఈ చివరి రోజుల్లో నైనా తృప్తి గా జీవిస్తాం కదా.... అంది వరలక్ష్మి.

అంతలోనే నిర్వాహకులు వచ్చి సర్ ఈరోజు మీవాళ్ళు వచ్చేటట్లుగా లేరు

బయట చల్లగా గాలి వీస్తోంది... చాలా చీకటి కూడా అయ్యింది రూం లోకి పదండి అన్నారు.

భారమైన హృదయంతో అందరూ వాళ్ళవాళ్ళ రూంలోకి వెళ్ళిపోయారు.

★ ★ ★

"మరో మార్గం "నిర్వాహకుల సహాయం తో ఖాళీగా ఉన్న ఒకహాలును యాభై పడకలతో సిద్ధం చేయించారు.వారి స్వంత డబ్బులతో బెడ్లు ఏర్పాటు జరిగింది.

ప్రభుత్వం వారితో మాట్లాడ్డం వెల్ఫేర్ అసోసియేషన్ వారితో కలిసి "జువైనల్ హోం" నుండి కొందరు పిల్లలను ఇక్కడికి తీసుకొచ్చి వారి రక్షణ బాధ్యత చేపట్టడం. వారి చదువు లు ఆ వృద్ధులు స్వయంగా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఆలోచన తనదే కాబట్టి ఓపెనింగ్ వరలక్ష్మి గారితో చేయిద్దామని నిర్ణయం చేసుకుని అంగరంగ వైభవంగా మొదలు పెట్టారు.

నెలరోజులు గడిచాయి.

★ ★ ★

పిల్లలతో ఆడుకుంటున్న వరలక్ష్మి దగ్గరికొచ్చి ప్యూన్ "అమ్మ మీ కొడుకు కోడలు వచ్చారమ్మా మిమ్మల్ని చూడటానికి అనే పిలుపు వచ్చింది. అనగానే ముఖంలో సంతోషం రెట్టింపైంది.

ఇక్కడికి రమ్మని చెప్పండి అంది.

ఉద్విగ్నతతో కళ్ళల్లో నిండిన నీళ్ళు తుడుచుకుంది వరలక్ష్మి.

మనవడు మనవరాలు పరుగెత్తుకుంటూ వచ్చి ఆమెను చుట్టుకున్నారు.

అయ్యో తలంతా తడిచిపోయింది వర్షం తగ్గాక రావచ్చు కదా బంగారు అంటూ తన చీర కొంగుతో తలను తుడుస్తూ అంది.

ఎంతైనా తన రక్తం కదా..అని మనసులోనే అనుకుంటూ

కొడుకు ని దగ్గరకు రమ్మని నుదుటన ముద్దు పెట్టుకుంది. కోడలి తలని నిమిరింది.

మాట్లాడుతున్నంతలోనే ఆశ్రమం లోని పిల్లలు నానమ్మా అంటూ కొందరు అమ్మమ్మా అంటూ కొందరు వచ్చి తలా ఒక చేయి పట్టుకొని లాక్కుపోసాగారు.ఒరేయ్ ఒరేయ్ నాకు నడవడం సరిగా రాదు కిందపడతానురా .,..బడవా అంటూ వాళ్ళల్లో కలిసిపోయింది.

నెలరోజుల్లో ఆపిల్లలకు బంధాలు బంధుత్వాలు ఎవరిని ఏమని పిలవాలి అనే విషయాలను బోధించారు.

తల్లి అలా వెళ్ళిపోయే సరికి

"కొడుకు మనసు కలుక్కుమంది"

"తన తల్లి మనసు ఇలాంటి సంతోషాన్నే కోరుకుంటుంది కదా.!"

నేనెందుకు ఆలోచించ లేకపోయాను.?

తనను తాను ప్రశ్నించుకున్నాడు

అమ్మ తనను ఎంత ప్రేమగా పెంచింది!

తనే లోకంగా బ్రతికింది.

చివరి రోజుల్లో అమ్మను ఇక్కడ వదలడం సరికాదు కదా?

తనేం చేస్తున్నాడు.

అని తనలో తానే మధన పడుతున్నాడు.

అక్కడ కాసేపు గడిపి తల్లిని చూస్తూ తనుచేసిన తప్పును తెలుసుకున్నాడు.

★ ★ ★

అమ్మా

ఒక్కసారి ఇలారా...అంటూ చేతులు పట్టుకుని ఆమె గదిలోకి తీసుకెళ్ళాడు.

రెండు చేతులు పట్టుకుని...

నన్ను క్షమించమ్మా ఇంటికెళ్దాం పదా .!

నీ మనవడు మనవరాలు తో ఆడుకుంటూ నీకు నచ్చినట్టు ఉందువు గానీ అన్నాడు.

నన్నుకూడా క్షమించండి అత్తయ్యా....మీ ఆరోగ్యపరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది కదా ఇక్కడైతే క్షేమంగా ఉంటారని అనుకున్నాం కానీ పిల్లలతో గడపడమే మీకు ఆరోగ్యం అని గ్రహించలేకపోయాము అన్నారిద్దరూ.

రా నానమ్మా అంటూ పిల్లలు చేయిపట్టి లాగారు.

వారి తలపై నిమురుతూ బంగారుకొండలు రా మీరు నా వరాలమూటలు.

నుదుటన ముద్దుపెట్టుకుని.

మీరు ప్రతీవారం ఆడుకోవడానికి ఇక్కడికి రండి అప్పుడప్పుడూ చూసి వెళ్ళండి. ఇక్కడ బోలెడు మంది అన్నలు అక్కలు ఉన్నారు...వాళ్ళదగ్గర బొమ్మలు కూడా ఉన్నాయి.అంది వరలక్ష్మి. ముఖాలు మాడ్చుకున్నారిద్దరూ.

కొడుకు దిక్కు తిరిగి నన్ను బలవంతపెట్టకండి నాన్నా.

నిర్ణయం తీసుకున్నాను. ఒక బాధ్యత తలకెత్తుకున్నాను.

నిన్ను పెంచి పెద్ద చేయడం లో అనుభవం సాధించాను.

మీరు ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. మా అంటే రెండేళ్ళో నాలుగేళ్ళో అంతేగా నేను జీవించేది. నాకెలాగూ పెన్షన్ వస్తుంది.

దానితో ఈనాలుగురోజులు ఇక్కడే గడిపేస్తాను.నన్ను ఇబ్బంది పెట్టకండి బాబూ...అంది.

తన వల్ల తల్లి హృదయం ఎంతలా గాయపడిందో అర్థం చేసుకున్నాడు కొడుకు.

ఇక్కడే నా ఆనందం దాగివుంది ఒక నిర్ణయం జరిగిపోయింది.

జీవితం ఆనందమయం చేసుకోవడానికి" మరో మార్గం" వెతుక్కున్నాను అని స్థిరంగా అంది వరలక్ష్మి.

★ ★ ★

జయంతి వాసరచెట్ల
హైదరాబాద్ 9985525355

వ్యాసం

# మట్టితో చెలిమి ప్రకృతి మాలిమి



- కొల్లాపురం విమల

**"చలి కాలంలో నేనొక గొడ్డుని**
**వసంతకాలంలో ఒక మొక్కని**
**వేసవిలో ఒక పురుగుని**
**శిశిరంలో ఒక పిట్టని**
**మిగిలిన కాలంలో**
**నేనొక స్త్రీని"** (వెరపావ్లోవా, తెలుగు : చరణ్)

మొన్న పొద్దున్నే ఉస్మానియా యూనివర్సిటీ వాట్సప్ గ్రూప్ తెరవగానే కన్పించిన పై కవిత చూసినప్పుడు నాలో చెప్పలేని ఉద్వేగం కల్గింది. నాలోకి నిస్తేజాన్ని విదిల్చి ఒక్క వూపున రాత్రంతా నా యీ ఆలోచనలను విత్తనాలుగా సాలు పోసేందుకు పురికొల్పింది. ఎంత అద్భుతమైన కవిత!! తనకు అర్థమైన వాస్తవ ప్రపంచం మొత్తాన్ని కేవలం ఐదు పాదాల్లో ఇమిడ్చి మనకందిచ్చిన ఆ కవి అవగాహన నేరుగా మనకు చేరుతుంది. అంతేకాదు, ప్రకృతికీ – స్త్రీలకీ మధ్య తెగిపోని బొడ్డు సంబంధాన్ని తెల్పే మన బతుకమ్మ పండుగను సైతం గుర్తుచేస్తుంది. యే నాగరికితకైనా సాలు పోసేది ప్రకృతే, దాన్ననుసరించిన వ్యవసాయ సంస్కృతే. అందుకేనేమో ప్రకృతి బిడ్డలుగా లోతట్టు ప్రాంతాల సమూహాలుగా ఆదివాసీ సమాజాలు మలిచిన సాంస్కృతికభావనలూ–పండుగలూ–ఆహార సంస్కృతులూ తరాలు గడిచినా ఈనాటికీ మనకందుతూనే వున్నై. పురా నాగరికతను గుర్తుచేసే ఇలాంటి సాంస్కృతిక ఆచరణలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచీన నాగరికతా కేంద్రాలైన భూభాగాల్లో కొనసాగుతూనే వుండటం చూడొచ్చు. ఉదాహరణకి మన ప్రాంతాన్నే తీసుకుంటే సింధూ నాగరికత పరిఢవిల్లుతున్న కాలంలో పండించిన ఓ రకం 'గోధుమ' వంటి ధాన్యం ఇప్పటికీ నల్లమల ప్రాంత పరిసరాల్లోనిరైతులు పండించడం చూడొచ్చు. వేల సంవత్సరాల ధాన్య సంస్కృతికీ, విత్తన వినిమయ జ్ఞానానికీ ఇది నిదర్శనం. స్థానికులు 'యువలు' అని పిలుచుకునే ఈ ధాన్యం మా అమ్మమ్మ వాళ్లూరైన కొన్నాగుల (కొండనాగుల్) అనే పాలమూరు ఆదివాసీ గ్రామం పరిసరాల్లో ఈ ధాన్యాన్ని పండించడం, పండుగపూట వాటిని విసిరి 'బచ్చాలు'(బక్ష్యాలు) చేసుకోవడం గురించి మా అమ్మ చెప్పగా విని తెలంగాణా స్థానిక జీవజాతులు–పంటల గురించి తెల్సుకోవాలనే ఆసక్తి నాలో కల్గింది. అందులో భాగంగా మౌఖిక కథనాలు సేకరించడం మొదలు పెట్టిన. ఆ అన్వేషణకు నాకు కావాల్సిన అవగాహనలను మాత్రం కొల్లాపురంలో పుట్టి పెరిగిన నా గతం అందిచ్చిందనే నాభావన. 60–70ల నాటి నా చిన్నతనంలో ఎవరింటికి కావాల్సిన కూరగాయలు వాళ్లే పండిచ్చుకునేది. బీర, కాకర, అనప, చిక్కుడు, దొండ, పొట్ల, గుమ్మడి, తమాట, మిరప, ముల్లంగి, మునగ, చెమ్మకాయ, చెవులకాయ వంకాయ వంటి ఇంకెన్నో రకాల కాయగూరలూ, పుంటికూర, సుక్కకూర, తోటకూర, దొగ్గలి కూర, మెంతి, పొన్నగంటి, కరియాపాకు వంటిఎన్నో రకాల ఆకుకూరలూ వున్న చేరెడు జాగాల్లో వేసుకొనేది. మా స్నానాలూ పానాలతో చెట్టు చెట్టును అవ్వ–అయ్య పేర్లతో బతికించుకునేది. దొడ్లో ఓ మూల పెంటగా పోగుపడిన మా వంటింటి వ్యర్థాలు రైతుల చేన్లకి ఎరువయ్యేవి. 'ఇంటికి వంటిల్లు ఎట్లనో పెంటకుప్ప అట్ల' అన్నట్లు ప్రతి ఇంటి దాపున్నో, దొడ్లనో పెంటకుప్ప ఉండేది. యే గుడిసె చూసినా పచ్చగ పూసిన గుమ్మడి, బీర పువ్వులతో కళకళలాడుతుండేది. మాక్కావాల్సిన గుడ్లు, మాంసం మేం పెంచుకునే కోళ్ళూ, బాతులూ, సీమకోళ్లూ క్రమం తప్పకుండా అందిచ్చేవి. నెమిళ్లూ, పావురాలూ, చిలుకలూ, కుందేళ్లూ, అడవి మేకలూ, కొండ గొర్రెలూ, సీమ పందులూ వంటి జీవులను జంతుప్రేమికులు సాక్కుంటే మేకలు, గొర్లు, బర్లు, ఆవులు, ఎద్దులు, వ్యవసాయదారుల ఇండ్లల్ల వుండేవి. గాడిదలు, గుర్రాలు, పందులు, కుక్కలు, పిల్లులు, కొండకచో కోతులు ఊరుమ్మడి సభ్యుల్లా బజార్లలో ఠీవిగా తిరుగుతూ కన్పించేవి. ఇంటి చూర్లకు ఊరపిచ్చుకల గూళ్లు, గోరింకలు వాలిన పొగడచెట్లు, వేపచెట్లపై పువ్వుల్లా పరుచుకున్న కొంగలు, చిలుకలు వాలే జామచెట్లు, రేగిచెట్టు మీది నుంచి కిందపడి

ఎగరలేనిపిల్ల కోసం గుంపుగ కదిలే కాకుల గుంపులూ, వేప తీపి మెక్కి తీయగ పాడే కోకిలలూ, గిజిగాళ్లు, గువ్వలు, కవ్వర, వడ్రంగి, లకుముకి, పికిలి పిట్టలు, తోక పిట్టలు, తేనె పిట్టలు, పాలపిట్టలు, కండ్ల కపటి, పైడికంట్లు, సీత్వలు, గద్దలు ఇంకా ఎన్నెన్నో పక్షులూ, చెట్లూ –జంతువులూ వైవిధ్య ప్రపంచ దూతలుగా కన్పించేవి. చిటిమిటి పండ్లు,జానపండ్లు, కలింపడ్లు, తుత్తూరు పండ్లు, సింతోల పండ్లు, మావిడి, బాదం, నేరేడు, సీమచింత,జామ, దానిమ్మ, తాటి, ఈత, రేగులు, గేగులు, బొంతకాకర, ద్యావదారు కూర, చింత చిగురు లాంటి ఎన్నో రుచులను నల్లమల మాకు మురిపెంగా తినిపిచ్చేది. కృష్ణమ్మ దాపున్నే వున్నా తాగేనీళ్లకు కష్టమైనా పాడి వున్న వాళ్ల ఇంటికితూగు పట్టుకొని పోతే నిండ 'సల్ల' పోసి దీవించేది. పాలు కరువైనా 'సల్ల' మమ్మల్ని ఎండతాపం నుంచి కాపాడేది. మేక పొదుగులు చప్పరించి అప్పుడప్పుడైనా పాలరుచి తెలుసుకునేది. కొర్రన్నం,జొన్న రొట్టె, ఆర్కబువ్వ, అంబలీ, ఇంట్లగాసే కూరగాయలూ ఇవీ మా రోజువారీ ఆహారం. పండుగలప్పుడే వరన్నం పొలావు వండేది. ఐదు రోజులు పాఠాలు చెప్పే పంతులుగా, ఆదివారం నాడు రైతుగా మా నాన్న పొలం బాటపట్టేది. మాయింటి మందం వరి పండిచ్చేది. ఇంటికి తరిగిపోని భరోసాగా దొడ్లపచ్చగ పాకే కూరగాయ మొక్కల్ని సవరిస్తూనో, బొగ్గు గుర్తుపెట్టిన పొదిగేసిన గుడ్లను ప్రతిరోజు తిప్పి పెడుతూ 'తల్లికోడి' కి సాయపడుతూనో మా అమ్మ విరామం లేకుండా గొడ్డూ–గోదాతో సహా మా అందరి తిండీ తిప్పలు చూసుకునేది. మా వంతుగా పిల్లలందరం పంటల కాలంల ధాన్యం ఇంట్లకు చేరేయడంలోనో, సంతకెల్లి ఉప్పుపప్పు దినుసులు తేవడంలోనో అమితోత్సాహంతో పనిచేసేది. ఇట్లా సమతుల ఆహారం యే ప్రచార్భాటాలు లేకుండానే మాకు చేరేది.

కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. నాలుగు లేన్ల రహదారి కోసం మా వూరు ఎడారైంది. వందేండ్ల చెట్లు ఒక్క రోజునే సామూహికంగా మరణించినై. యవల ధాన్యం అయ్య అవ్వల జ్ఞాపకాల్లోనే కన్పించే పంటైంది. మారిన ఆహార సంస్కృతి వల్లా, కొర్ర బియ్యం ఆడించే మిల్లులు అందుబాటులో లేకా, గిట్టుబాటు లేదా, విత్తనాలను భద్రం చేసుకోకపోవడం వల్లా కొర్రలు పండే భూముల్లో అనువుగాని పంటలు వేస్తున్నారు చాలామంది రైతులు. లోతట్టునున్న 'సోమశిల' చుట్టుపక్కలున్న ఊళ్లల్లో కొద్దిమంది రైతులు మాత్రమే ఇప్పుడు కొర్రలు పండిస్తున్నరు. రుచీకీ, ఆరోగ్యానికీ, శ్రేష్టమనే స్త్రీల భావన వల్ల 'యవలు' ఒకటి రెండు మళ్ళలోనైనా కొనసాగుతున్నె. అట్లే కొర్రన్నమే తమకు 'కడుపాసర' ఇస్తుందనే నమ్మకంతో కొంతమంది రైతులు తమ ఇంటి మందం మాత్రమైనా పండిస్తుండడం వల్లే ఇప్పటికీ కొర్ర ధాన్యం ఉనికి నిలబడింది. స్త్రీలూ, రైతులూ ఇట్లా విత్తన సంపద భద్రం చేయడంలో, వాటిని తరాలుగా పంచుకొనిపెంచుకోవడంలో కావొచ్చు, జీవ వైవిధ్య పోషణకై కావొచ్చు, వెచ్చిస్తున్న శ్రమకీ, జ్ఞానాలకీ ఇది ఓ చిన్న ఉదాహరణ మాత్రమే. ఇది కొంత ఓదార్పు కల్గించే విషయమే అయినప్పటికీ మనం పోగొట్టుకున్న లేదా పోగొట్టుకుంటున్న పంటలూ – జీవజాలం తక్కువేమీ కాదు. నిజానికి మనం నిలబెట్టుకున్న వాటికంటే పోగొట్టుకున్నదే ఎక్కువ. ఇదే విషయాన్ని గుర్తు చేసుకుంటూ గనపురం సాంబలు వంటి మేలురకం వొడ్లు కండ్లకు 'కానాకుండా' పోయిన విధానాన్ని ఓ అమ్మ ఇలా పాడింది.



**"ఆ పెద్ద సెరువెనుక ఉయ్యాలో-యేమేమి పండు ఉయ్యాలో**
**సాంబ వరి బియ్యమ్ము ఉయ్యాలో-సాయ కొమ్ముల పసుపు ఉయ్యాలో**
**అవే మంగమ్మకు ఉయ్యాలో - ఒడి బియ్యమమ్మ ఉయ్యాలో**
**అవీ తలువాలు కావు ఉయ్యాలో-అవి మంచి ముత్యాలే ఉయ్యాలో"**

మంచి ముత్యాలంత 'సొక్కమైన' బియ్యం మన గనపురం సాంబలు. ఇప్పుడు మనకు అందుబాటులో వున్న అనేక హైబ్రిడ్ వంగడాలకు గనపురం సాంబలు మాతృకగా వాడారని విన్నప్పుడు ఆశ్చర్యపోవడం నా వంతైంది. ఆ సొక్కమైన రకం ఇప్పుడుయే అమెరికా జీన్ బ్యాంకుల్లోనో మాత్రమే ఉంటుందని తెల్సుకోవడం ఈనాటి విషాదం. జీవ వైవిధ్యం ప్రకృతి ఆరోగ్యానికి సూచిక. అట్లే తల్లి ఆరోగ్యమే బిడ్డకు రక్ష అన్నట్లు ప్రకృతి ఆరోగ్యమే మన ఆరోగ్యం. ఆహార గొలుసు ద్వారా మనం ప్రకృతితో బొడ్డు సంబంధం వున్నవాళ్లం. ఇట్లా చూసినప్పుడు జీవవైవిధ్యాన్ని కోల్పోవడమంటే కొన్ని రకాల వృక్ష, జంతు, కీటక జాతులు అంతరించిపోవడమే కాదు, వాటితో పాటుగా విశ్వం కోల్పోతున్న ప్రాణశక్తి నష్టం యే సైన్సూ పూడ్చలేనిదని ప్రకృతి అధ్యయనాలు చెబుతున్నె. కొన్ని రిపోర్టుల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికి మనం 10,000 రకాల జీవజాతులను కోల్పోయినం. కొన్ని వందల రకాల వరి పంటలు పోగొట్టుకున్నాం.భారతదేశ విషయాన్నే తీసుకుంటే 14,000 సంవత్సరాల క్రితం నుంచే 'వరి' పండిచ్చే నాగరికత కన్పిస్తుంది. పోయిన 10,000 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా దాదాపు 1,10,000 రకాలైన వరి పంటలను మన రైతులు వృద్ధి చేసారు. కాని ప్రస్తుతం వాటిలో 6,000 మాత్రమే మనుగడ కొనసాగిస్తున్నె. స్థానిక వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా, పరిణామ క్రమంలో అధిక సహిష్ణత, పోషకాలున్న పంటలుగా పాలు పోసుకునేందుకు స్థానిక జాతులకు తోడై నిల్చినవాళ్లు మట్టిని నమ్ముకున్న మన రైతులు. ప్రకృతిని కొల్లగొట్టకుండా మనుగడ సాగించడం ఎలాగో తెలిసిన శాస్త్రవేత్తలు. వేల ఏండ్ల వ్యవసాయ నాగరికతలోంచి నడచివచ్చిన తాత్వికులు. తెలంగాణాలో సైతం మన సమీప గతంలోనే పైన ప్రస్తావించిన గనపురం సాంబలతో పాటు ఎన్నో 'వడ్ల' రకాలుండేవని ఓ బతుకమ్మ పాట గుర్తుచేస్తుంది. దున్నడం దగ్గర్నుంచి ఎన్నిరకాల వొడ్లు ఎవరెవరు (కులాల వారీగా) తినేవారు వరకు విపులంగా వివరిస్తుందీ పాట. మచ్చుకి

**"నల్లరేగడి భూమి ఉయ్యాలో-సక్కంగా దున్నారు ఉయ్యాలో**
**కాలితోని పదును ఉయ్యాలో- తన్ని చూసేరు ఉయ్యాలో"**

అంటూ మొదలు పెట్టి పంట చేతికొచ్చే వరకు సాగే క్రమాన్ని వివరించి "పెద్ద వరి ధాన్యాలు ఉయ్యాలో –కాపోళ్లు తిన్నవీ ఉయ్యాలో" అంటూ ఎన్నో రకాల స్థానిక వడ్లను పేర్కొంటుంది. పెద్ద వరి, వెల్లంకణాలు, తెల్ల బాలోరీ, గవిరి వజ్జాణాలు, ముతక వజ్జాణాలు, శామంచనాలు, వాయిలపాటి సన్నాలు, మల్లి సన్నాలు, దూది బోగములు, కాకిమూతి సన్నాలు, యర్రబాలు, కాయిరి ధాన్యాలు, బలరామ బోగాలు, రక్తసరి ధాన్యాలు, సన్న సూద్రుల్లు, బంగారు తీగెలు, దాళవా ధాన్యాలు, సత్తికపు ధాన్యాలు, గుత్తు బాసికాలు, బుడమ ధాన్యాలు, మడి రాసికాలు, చేమంచనాలు, యెల్లంకణాలు అమృత పాణీలు, రాజునాలు– ఇలా వివిధ రకాల వడ్ల గురించి ఈ పాట ద్వారా మనకి తెలుస్తుంది. వీటిలో ఏ ఒకటి రెండో తప్ప తెలిసిన వాళ్లు ఈ తరంలో అరుదు. మరో ఉయ్యాల పాట జొన్నలు, పికిలి కుంచెలు, నకిలికుంచెలు, కొర్రలు అంటూ నవధాన్యాల సాగును కైగడుతుంది. వీటిల్లో మనకున్నవి ఎన్నో పోగొట్టుకున్నవి ఎన్నో తెల్సిన వాళ్లు మరింత అరుదు. ఇలాంటి విషయాలను అందరికీ ఎరుకపర్చాల్సిన మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలూ – పరిశోధనా సంస్థలూ "అధిక ఫలసాయం" ఇచ్చే పంటల ప్రచారంలో కొట్టుకుపోతున్నె. "Our focus is on the overall development of improved varieties .... with an objective to improve 'profitability' of farmers!" (18th April 2016, Deccan Chron–ical) అంటూ మన వ్యవసాయ విశ్వవిద్యాలయ సైంటిస్ట్ అన్న మాటలు అందుకు దాఖలా. ఈలాంటి ధోరణుల వెనుక 'హరిత విప్లవం' పేరున 60ల నుంచి మొదలై ఇప్పటి ప్రపంచీకరణ నేపథ్యంలో మరింత బలపడిన వలసవాద ధోరణులున్నె. లాభాపేక్షే ధ్యేయంగా వ్యవసాయ రంగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న కార్పొరేట్ సంస్థలున్నె. హరిత విప్లవం మొదలైతున్న నాటికి మనదేశంలో దాదాపు 42,000 స్థానిక జాతులైన పంటలు వుండేవని Dr. Deb నిర్ధారించిండ్రు. ప్రస్తుతం అవి వందల్లోకి కుంచించుకపోయినై. అధికోత్పత్తి పేరున గుప్పించిన ఏకరూప హైబ్రిడ్ పంటల వల్లా, సంరక్షణ పేరుతో వాడే రసాయనాల వల్లా, క్రిమి నాశకాల వల్లా ఇట్లా జరుగుతున్న నష్టాలకు ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న 'ఆరోగ్య విపత్కర' పరిస్థితే దాఖలా. గ్రీన్ గ్యాసెస్ ఉద్గారాలతో ఉడుకుతున్న భూమే సాక్ష్యం. పోగొట్టుకుంటున్న జీవ వైవిధ్యమే నిదర్శనం. కొన్ని అంచనాల ప్రకారం మనదేశంలో 95% స్థానిక వొడ్ల రకాలను పోగొట్టుకున్నాం. అంతేకాదు, ఆయాజాతులమనుగడపై పెరిగిన వొత్తిడి వివిధ వడ్ల జన్యు సంచయం (gene pool) పై ప్రభావం చూపడం మూలంగా మరిన్ని జాతులు అంతరించి పోయే ప్రమాదం వుందని పరిశోధనలు చెబుతున్నై. వలసవాద

చదువుల దన్నుతో స్థానిక జ్ఞానాలను 'వెనకబడిన' భావనలుగా తోసివేయడంతో మొదలైన 'ప్రపంచీకరణ' ప్రస్థానం ఇట్లా స్థానిక ఆహార సంస్కృతులను, వ్యవస్థలను చెదరగొట్టడంతోనే ఆగిపోలేదు. భూమి, నీరు, అడవులు, గుట్టలు అన్నింటిని వనరుల కింద కుదించేసి ధ్వంస రచనకు పూనుకున్నది. స్థానిక వాతావరణ పరిస్థితులనూ, ఆహార సంస్కృతులనూ బేఖాతరు చేసే పాలసీలతో ఇప్పుడు మరెన్నో వేల లక్షల జీవజాతులకు మరణశాసనాలు రచిస్తున్నది. 2021 సెప్టెంబరు 23న న్యూయార్క్ లో కలిసిన UN Food Systems Summit (UN FSS) ఇందుకు నిదర్శనం. ఈ క్రమానికి మరో సాక్షి దక్కను నల్ల గొర్రె. ఎటువంటి పరిస్థితులైనైనా తట్టుకోగల్గే జీవ లక్షణాలతో వెచ్చని, నల్లని ఉన్నిని గొంగడిగా, తెలంగాణా ఆత్మ గౌరవ పతాకగాఅందిచ్చిన మన దక్కను నల్లగొర్రెను రూపులేకుండా చేసే 'పాలసీ' చంద్రబాబునాయుడు కాలంలోనే మొదలైంది. అడవులు నాశనమవడానికి మేకలూ, ఆదివాసీలూ కారణం అన్న 'తెలివి' ఆనాటి పాలకులది. ప్రాచీన భూఖండంలో భాగంగా తెలంగాణాకే ప్రత్యేకమైన నల్లగొర్రె వంటి జీవజాతులు మరెన్నో కన్పిస్తే. నల్లమలలో కన్పించే అమ్రాబాదు ఆవులూ; కొన్ని రకాల అడవికోడి జాతులూ; నీటి కుక్కలూ; మెదక్ పరిసరాల్లో కన్పించే ప్రత్యేకమైన మేకజాతీ (పంచోది చెట్టుని మేసే ఈ జాతి మేకల్లోని 'మేకరాళ్ల' ను విలువైనవిగా భావిస్తారు); కొన్నివేలరకాల వృక్షజాతులూ; (టయాసిక్ కాలం మంచీ కొనసాగుతున్న వందల రకాల పూల జాతి మొక్కలూ, అరుదైన శిలలూ, రాళ్లూ, రప్పలూ వంటివి తెలంగాణా అందుకున్న అపురూప ప్రకృతి కానుకలు. అంతేకాదు, ఎన్నో రకాల తృణధాన్యాలకు ఈ పీఠభూమి పుట్టినిల్లు. గోండ్వానా నాగరికత అందిచ్చిన 'నవధాన్య' ఆహార సంస్కృతికి కేంద్రం. ఇదే విషయాన్ని రికార్డు చేసిన బతుకమ్మ పాటలు ఎన్నో వున్నె. వలసపూర్వ, వలసానంతర తెలుగు సాహిత్యంలో సైతం ఈ విషయాలను ఆనవాలు పట్టొచ్చు ఉదాహరణకి గంగుల శాయిరెడ్డి అనే రైతు 1937 సంవత్సరంలో రాసిన పద్యకావ్యంలో మన 'నవధాన్య' ఆహార సంస్కృతిని కళ్లకు కట్టినట్లు చూపిస్తరు. బంగారం, వెండి, రాగి, ఇనుము రంగుల్లో మెరిసిపోయే నవధాన్యరాసుల గురించి వివరించే పద్యంలో రంగులను బట్టి ఇలా విభజించి చూపిస్తరు. బంగారం వన్నె ధాన్యాలు సెనగలు, పసుపు, ధనియాలు, పుట్నాలు, మెంతులు; వెండిరంగు ధాన్యాలు–సీత తలంబ్రాలు (తెల్లజొన్నలు), పత్తి, వెల్లుల్లి, కుసుమలు; రాగి రంగుధాన్యాలు – బెబ్బర్లు / అలచందలు, కందులు, ముసికపట్టిన జొన్నలు, యవలు, రాగులు, అవిసెలు, మిరపకాయలు; ఇనుపరంగు ధాన్యాలు – అనుములు, ఆవాలు, నల్ల నువ్వులు, ఆముదాలు, లంకలు, మినుములు, ఉలువలు, పెసర్లు మొదలైనవి. ఇక పసరు రంగులో వుండే పెసళ్లు, చామరంగులో మెరిసిపోయే సజ్జలు, చామలు, వరిగెలు వంటి ధాన్యాలన్నీ భూదేవి మెడలో మెరిసిపోతున్నాయి అంటూ పంట పొలాలను చూసిన పరవశంతో పద్యాలు రాసిండు. అంతేకాదు "శ్రేష్టమౌ బీజముల్ సేకరింపకపోతే" చేసిన కష్టం మంటిలో కలిసిపోతుందని తోటి రైతులను హెచ్చరిస్తడు. అదివరకే దాచి పెట్టుకున్న విత్తనాలకు (జొన్నలు, కొర్రలు వంటివి) కలెగలుపు ధాన్యం (దోస వంటివి) కలిపి విత్తనం తతికి (కోస్తా ప్రాంతంలో ఏరువాక అంటరు) బైల్దేరడం గురించిన వర్ణన మన 'మిశ్రపంటల' సంస్కృతిని చెబుతుంది. ఇక 'విత్తనం వున్న వాళ్లదే పెత్తనం', 'విత్తనాలుంటేనే పెత్తనాలు' వంటి జనం నోళ్లలో నానిన ఎన్నో సామెతలు సైతం మనకు 'విత్తన' ప్రాముఖ్యతను నిత్యంగుర్తు చేస్తూనే వున్నె. అందుకే ఈనాటి కవి కత్తిపద్మారావు గారు "విత్తనం జీవన సౌధం" అని ఒక్క మాటలో తేల్చి చెప్పడం చూడొచ్చు. ఇక ఇప్పుడు 'విత్తనం నాగరికతకు తరగని భరోసా' అన్న మన ఆర్గానిక్ మేధావుల మాటలను గుర్తు చేసుకోవాల్సిన అనివార్య సందర్భం వచ్చింది. మట్టిపొరలను చీల్చుకొని పిడికిలి ఎత్తే విత్తనం మన ఆహార సార్వభౌమత్వానికీ, స్వేచ్ఛా సమానత్వాలకు ప్రతీక అని గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిది. 'విత్తనం నాటడమంటే సామాజిక న్యాయానికి పునాదులువేయడమే' అంటాడు జరాత్రుస్ట అనే తాత్వికుడు. ఇప్పుడు ఆయన మాటల్ని మనం 'Who sows local seeds sows justice' అని తిరగరాసుకోవాల్సిన సమయం వచ్చింది. నాటు విత్తనాలే నేటి అవసరం అంటూ మన నవధాన్య సంస్కృతిని ఉద్యమ స్థాయిలో ఎలుగెత్తి చాటాల్సి వుంది. 'ఇలాంటి అత్యవసర సందర్భంలో, ఇంతటి వైవిధ్య భరిత స్థానిక నవధాన్య సంస్కృతిని కాదని 'ఈనాటి' ప్రభుత్వం 'ఆర్థిక భద్రత' పేరిట పత్తి, చెరుకు వంటి వ్యాపార పంటలు వేయమని నిర్దేశించడం, పెద్ద చారిత్రక తప్పిదం. 'రేగడి విత్తులు' అనే ఓ తెలుగు నవల ఇలాంటి వలసవాద ధోరణలను ఎత్తిపట్టడాన్ని తెలంగాణ సమాజం తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణా విత్తన చట్టం తేవాలనీ, ప్రకృతి సేద్య రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనీ 'తెలంగాణ మహిళల మానిఫెస్టో' 2013 సం॥లో డిమాండు చేయడాన్ని ఈ నేపథ్యంలో చూడొచ్చు. వ్యాపార పంటలను ప్రోత్సహించే ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాల వెనుక 'గ్రీన్ రెవల్యూషన్' నుంచి 'మెకనైజేషన్' మీదుగా ఈనాడుఊపందుకున్న జన్యుమార్పిడి పంటల వరకు బలపడిన విధ్వంసకర వలసవాదధోరణులున్నె. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న

ఆధునిక పోకడలను ఇంకా 'వల్లె వేస్తున్న' మధ్య తరగతి విద్యావంతుల తరం వుంది. కేవలం 'మనుష్య' కేంద్రంగా ఇట్లా ఆలోచించడం వల్ల సమస్త జీవావరణాన్ని జడంగా గుర్తించే విపరీత ధోరణులున్నై. ఫలితంగా పండే భూమిపై, ఆడదానిపై ఆధిపత్యానికై పోటీ మరింత పెరిగింది. భూమిని తమ సొంత ఆస్థిగా ప్రకటించుకునే పురుష దురహంకారాలు భూమి ఉసురు తీసే కర్షన ఉద్గారాలై చెలరేగినై. చివరాఖరికి విజ్ఞాన శాస్త్రాలను సైతం పితృస్వామ్య ధోరణులు ఆక్రమించినై. సైన్సు పెత్తందారుల సిఇఒగా కుంచించుకుపోయింది. ఇలాంటి కల్లోల కరోనా సందర్భంలో ఇప్పుడు మనం ఉన్నాం. ఈ విషయాలను ముందే పసికట్టిన 'మహాశ్వేతాదేవి' వంటి మేధావులు Social forest-ryలో భాగంగా విచక్షణా రహితంగా యూకలిప్టస్ పెంపకాన్ని ప్రోత్సహించడం చూసి "I am concerned with the India I know. My India is of the poor, starving and helpless people.... To cover (This land) with encalyptus, will be to rob my India of drinking and irrigation water" అంటూ నీటి ఎద్దడికి కారణమైన తప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా ఖండించింది. ఇక ఇప్పటి ప్రకృతీ ప్రేమీ, మేధావీ అయిన వందనా శివ మాటల్లో చెప్పాలంటే "Many of the economic probles of the poorest of mankind are rooted in the ecological distruction caused by excessive demands on the natural resources by the elites of the world" అని చెప్పొచ్చు. ఐతే ప్రకృతిపై కనిపించని యుద్ధాన్ని ప్రకటించిన ఈలాంటి విధ్వంసకర శక్తులను కొంతైనా నిలువరించి మన ప్రాంత జీవ వైవిధ్యాన్ని, ప్రకృతి ఆరోగ్యాన్ని కాపాడుతున్నది బహుజనుల జీవన విధానాలే. లోటు (Scarcity) అన్న భావనను తమ తాత్విక పరిధిలోకి తీసుకొనని ఈ బహుజన సమాజాల వల్లే ప్రకృతి దాన్ననుసరించిన వ్యవసాయం ఇంకా కొనసాగుతోంది. ఈ విషయాలను ప్రపంచ దృష్టికి తేవడం కూడా ప్రకృతే వ్యవసాయాన్ని కొనసాగించడంలో భాగంగా గుర్తించాలి.

మన పంటలు - వంటలు, మన చెట్టూ-చేనూ, మన చేనూ-చెల్క, మన గొడ్డూ-గోదా, సమస్త జీవావరణంతో కలిసి పనిచేసే మన తత్వం, భూమిని కొల్లగొట్టకుండా బతికే విలువలూ - వీటన్నిటి గురించి విస్తృతంగా చర్చించుకోవాలి. మాట్లాడాలి. రాయాలి. ఆచరించాలి. అందులో భాగంగానే నా (మన) చిన్నతన అనుభవాల దగ్గర్నుంచినేటి బతుకమ్మ పాటలు చెప్పే పాఠాల వరకు చదువరులతో పంచుకున్న తప్పితే ఈ విషయాలు చదువరులకి తెలియదని కాదు. భూమీ-నీరు-గాలి వంటి పాంచ భౌతిక ప్రాణశక్తులను ఆదరవులుగా గుర్తించి గౌరవించుకోవడం మన 'మట్టి సంస్కృతులు' (Soil cultures) మనకందించిన గొప్ప విలువ. ఈ విషయాలను మన సంవిధాన రచయితలు గుర్తించిండ్రు కాబట్టే భూమీ, నీళ్లూ, గాలి వంటి ప్రకృతి శక్తులపై గుత్తాధిపత్యం ఉండకూడదని నిర్దేశించిండ్రు. ఆదేశిక సూత్రాల్లో మన సంవిధానం ఈ విషయాలను చాలా స్పష్టంగా చెప్పింది. ఐనా యే మాత్రం ఖాతరీ చేయకుండా దేశం యావత్తూ కరోనాతో గజగజలాడుతున్న ఈనాటి సందర్భంలో సైతం మన పాలసీకర్తలు సమతుల ఆహారహక్కు, ఆరోగ్యంగా జీవించే హక్కు వంటి ప్రాథమిక హక్కులను కాలరాయడం చూస్తున్నాం. 'మానిటైజేషన్' పేరజాతి సమిష్టి సంపదలను అమ్ముకోవడాన్నీ, అనుంగులకు అద్దెకిచ్చుకోవడాన్ని చట్టబద్ధం చేసే ప్రణాళికలు సిద్ధమైనై అని నిన్నటికి నిన్న వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలు చెబుతున్నై. అందరికీ అన్నం పెట్టే రైతులు ఢిల్లీ వీధుల్లో తుపాకీ నీడన పస్తులతో నినదించడం ఇప్పటి ఆ సందర్భానికి పరాకాష్ఠ.

ఇట్లా అంతులేని లాభాపేక్షతో జలగల వంటి గ్లోబల్ కార్పొరేట్ సంస్థలూ - ఆ సంస్థలకు దాసోహం అయిన ప్రభుత్వాలూ కల్గించే నష్టం కోవిడ్ సృష్టించిన విలయం కంటే పదింతలు ఎక్కువ. కరోనా వైరస్ కేవలం 'మనుషుల' ఆరోగ్యాన్ని పణం కోరుతున్న పెడధోరణులను దృష్టికి తెచ్చింది. కానీ అభివృద్ధి పేరున ప్రకృతి పరిసరాలపై చెలరేగిన కన్పించని యుద్ధంలో కొన్ని వేలకోట్ల పక్షి, జంతు, వృక్ష, కీటక జాతులూ, మన్నూ-మిన్నూ నీళ్లూ ప్రాణాలు విడుస్తున్న వాస్తవాలు తెరమరుగున్నే వుండిపోయినై. యే జీవికైనా మరణం విషాదమే. బతుకు సంరంభమే. ఐతే 60ల నుంచీ కొన్ని లక్షల ఎకరాల వృక్షాలు కూలిపోతున్నప్పుడూ, వేల రకాల కీటక పక్షి జంతుజాలం ప్రాణాలు కోల్పోతున్నప్పుడూ అంతర్జాతీయ సమాజం నోరెత్తలే. "అనారోగ్య శరీరం ఆలోచించే శక్తినీ వివేచననూ కోల్పోతుంది" అని బుద్ధుడు చెప్పినట్లు చదువు 'కొన్న' మధ్య, ఉన్నత తరగతుల విద్యావంతులు ఆలోచించే శక్తి, తెగువా కోల్పోయి 'అమ్నీషియా' లో భద్ర జీవితం గడుపుతున్నరు. విచక్షణ లేని ప్రణాళికలతో నగరాలు 'విశ్వ' రూపమెత్తుతుంటే, బాధ్యతలేని నిస్తేజంలో పౌరులు కార్పొరేట్ సంతానంగా మట్టినీ, గాలినీ, నీటినీ చిదిమేస్తున్నరు. ప్లాస్టిక్ సమాధులపై వెలసిన మురికివాడల్లో ఒకవైపు పట్టణ పేదలు మగ్గుతుంటే ఇంకోవైపు నకిలీ విత్తనాలతో విషతుల్యమైన రసాయనాలతో సాయం దొరకని వ్యవసాయం చేతికీ నోటికీ రాక పల్లె రైతులు పురుగుల మందులు తాగి జీవితాలు కడతేర్చుకుంటున్నరు. చివరాఖరికి వలసవాద అభివృద్ధి

ధోరణులు స్థానిక సేద్య రీతులను పూర్తిగా కమ్మేసినై. అధిక ఫలసాయం యావకి 'మట్టి' లోని ప్రాణం శక్తికి తూట్లు పడింది. నవధాన్య సంస్కృతి రద్దైంది. మాదకద్రవ్యాల తర్వాత అంత పెద్ద ఆర్థిక నేర వ్యవస్థ' గా బలపడిన environmental crimes వల్ల సమస్త జీవావరణం చిన్నాభిన్నమైంది. జిడిపిలు పెంచుకునే ప్రపంచదేశాల మధ్య పోటీలో ప్రాణాలు విడుస్తున్న జీవజాలం గురించిన లెక్క ఇంకా తేలాల్సే వుంది. వ్యవసాయంలో కార్పొరేటీకరణ, పారిశ్రామికీకరణ ధోరణుల వల్ల చిద్రమౌతున్న 'మట్టి సంస్కృతులెన్నో' మాట్లాడుకోవాల్సే వుంది. మొత్తానికి ఇప్పుడు వ్యవసాయ రంగంలోకి చొచ్చుకు వచ్చిన జీవ వైవిధ్యాన్ని రద్దుచేసే లాభాపేక్ష ధోరణుల వల్లా, మట్టిలో జీవించే వేలకోట్ల మైక్రోబ్స్ ని పొట్టన పెట్టుకునే రసాయన ఎరువుల వల్లా, అధిక ఫలసాయం కోసమని సృష్టించే జన్యుమార్పిడి పంటల వల్లా మనుష్య జాతికి వొరిగిందేమీ లేదు. నిజానికి తరిగిందే ఎక్కువని ఈ మధ్య వెలువడిన రిపోర్టులు చెబుతున్నై. ఉదాహరణకి ఇండస్ట్రియల్ అగ్రికల్చర్ ప్రపంచవ్యాప్తంగా 70–90 % అడవుల నరికివేతకు కారణమైంది. ప్రపంచంలోని 75% జీవ వైవిధ్యాన్ని బలితీసుకుంది. కార్పొరేట్ వ్యవసాయమూ ప్రపంచ ఆహార వ్యాపారసంస్థలూ 40% గ్రీన్ హౌస్ ఉద్గారాలకి కారణమైనై. 'అందరికీ ఆహారం' అంటూ గొప్పగా ప్రచారం చేసుకునేగ్లోబల్ ఆహార వ్యవస్థల వల్ల ప్రపంచ 'ఆకలి సమస్య' తీరలేదు. పైగా 2020 నాటికి 815 మిలియన్ల జనాభా ఆకలి కేకలకు కారణమైనవని అధ్యయనాలు చెబుతున్నై. ఈనాటి విధ్వంసకర పద్ధతులు గనుక ఇలాగే కొనసాగితే 2050ల నాటికి క్లైమేట్ చేంజ్ వల్ల దాదాపు 500,000 మంది మనుషులు చనిపోయే అవకాశం వుందనీ, ప్రతి మనిషికీ ఆహార లభ్యత 3.2% పండ్లు, కూరగాయల లభ్యత 4% వరకు పడిపోతుందని పరిశోధనలు చెబున్నై. ఉత్పత్తి కంటే వ్యర్థాల భారం ఎక్కువైన కార్పొరేట్ ఆహార వ్యవస్థ "negative productivity" పునరుత్పత్తి చేస్తుందనీ, ఆ మూల్యాన్ని చెల్లించాల్సిన భారం తిరిగి మనవంటి "అభివృద్ధి" చెందుతున్న దేశాలపైనే పడుతుందనే అంచనాలున్నై. ఒకే రకం పంటలను ప్రోత్సహించే గ్లోబల్ ధోరణుల వల్ల ప్రస్తుతం 96% ప్రపంచ జనాభా ఆకలి తీర్చే భారం కేవలం 30 రకాల మొక్కజాతుల పైనే పడుతోంది. 4 రకాల ఆహారపంటలపైనే అత్యధిక ప్రపంచ జనాభా ఆధారపడుతున్నరు. ఈ మధ్య తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం బతుకమ్మ, తెలంగాణ సోన,కూనారం సన్నాలు పేర్లతో కొత్త వంగడాలను, మార్కెట్లో ప్రవేశపెట్టింది. సంతోషం కానీ ఇప్పుడు 'కనిపెట్టే' కొత్త విత్తనాలలోని పోషకాలతో పోలిస్తే మనం పోగొట్టుకుంటున్న స్థానిక విత్తనాల్లోని పోషక విలువలు ఎన్నోరెట్లు ఎక్కువ. మనదేశంలో కోల్పోయిన వరి, గోధుమ, మక్కల్లోని రకాల వల్ల మన ఆహారంలో 60% కాలరీలు, 56%ప్రొటీన్ల లభ్యత కొరవడుతోంది. మరి మనం కోల్పోయిన మరిన్ని పంటల వల్ల ఎంత పోషకాహారాన్ని నష్టపోయి వుంటం!? ఎవరైనా ఆ దిశగా పరిశోధనలు చేస్తే గానీ లెక్క కట్టలేం. 'World Watch Studies' ప్రకారం ఇప్పుడు మనకు ఆహారంలో 10–25% కంటే తక్కువ ఐరన్, జింక్, ప్రొటీన్, కాల్షియం, విటమిన్–సి–అందుతున్నై. సమతుల ఆహారం కరువై 2025 నాటికి ఊబకాయం, సంతానలేమి వంటి ఆరోగ్య సమస్యలపై బిలియన్ల ట్రిలియన్ల డాలర్లు ఖర్చుచేయాల్సి వుంటుందని ఓ అంచనా.

ఐతే ఈ క్రమానికి సరిగ్గా భిన్నంగా ఎన్ని కరువు కాటకాలెదురైనా ఈనాటికీ 70% ప్రపంచ జనాభాకి ఆహారం అందిచ్చేది మాత్రం చిన్న, మధ్య తరగతి గ్రామీణ రైతులే అన్న విషయం నేటి పరిశోధనలు నిర్ధారించినై. ఎన్నో ఏండ్ల క్రితమే సువాసన ఇచ్చే వొడ్లను పండించగల్గిన మన భారతీయ గ్రామీణ రైతుల వృక్షశాస్త్ర జ్ఞానాన్ని ఈనాటి విశ్వవిద్యాలయ, పరిశోధనా సంస్థల్లోని శాస్త్రజ్ఞులు అందుకోలేక పోయారని డా. డెబ్ సాక్ష్యాలతో నిరూపించిండ్రు. మన దేశంలో జుగాల్ అన్న పేరున్న రెండిత్తుల వొడ్లు' సతీర్ అని పిలుచుకునే 'మూడిత్తుల వడ్ల' ను తన అన్వేషణలో భాగంగాతెలుసుకున్న ప్రకృతి పరిశోధకునిగా డా. డెబ్ రైతుల జ్ఞానాలను గుర్తించడం గౌరవించడంలో ఇప్పటి శాస్త్రజ్ఞులు వెనకబడ్డారని వ్యాఖ్యానించిండు. ఇక నిన్నటికి నిన్న periodic labour force survery (2019–20) చెప్పిన ప్రకారం భారతదేశంలో లేబర్ మార్కెట్లో సంక్షోభం కరోనా కంటే ముందునుంచే నెలకొని వుంది. కరోనా 'లాక్ డౌన్' సమయంలో ఉన్న కాస్త ఆధారాలు కూడ కరువై 'దెబ్బ తగిలిన బిడ్డ తల్లి వొడికై వెతుక్కున్నట్లు వలస కార్మికులందరూ తమ సొంతూళ్లకు మళ్లడం చూసినం. వందల మైళ్లు కాలినడకన ఊళ్లకు మళ్లిన వలస కూలీల రక్తం వోడిన పాదముద్రలకు మనం ప్రత్యక్ష సాక్షులం. అట్లా 'అమ్మా' అంటూ వెనక్కొచ్చిన జనాన్నందరినీ అక్కున చేర్చుకొని, జీవనోపాదులను అందించింది ఒక్క వ్యవసాయ రంగమే. కల్లోల కోవిడ్కాలత సందర్భంలో వ్యవసాయమే "employer of last resort" అని PLF surveryఅభివర్ణించింది. అంతేకాదు, ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మనదేశంలో ఎక్కువ మంది స్త్రీలకు జీవనోపాధి అవకాశాలను అందిచ్చేది కేవలం వ్యవసాయరంగమే."The penetration of capitalism has often withnessed the removal of women from their means of production and from their productive func–

tions. It has further brought about a change in the sexual division of labor to their disadvantage" అంటూ bulletin of concerned Asian scholors–1980 ల్లోనే హెచ్చరించడం చూడొచ్చు. పెట్టుబడిదారీ సమాజం స్త్రీలను మరింత అస్వతంత్రత లోకి తోస్తే వ్యవసాయ రంగం మాత్రం స్త్రీలకు తమ కాళ్లపై తాము నిలబడగలిగే సైర్యాన్నిస్తోంది.

ఈ నేపథ్యంలో మనం చిక్కుకున్న విషవలయం లోంచి బైటపడాలంటే ప్రకృతి వ్యవసాయమే ఆచరణ యోగ్యమైన పరిష్కారం. ప్రకృతి వ్యవసాయమంటే స్థానిక జీవావరణం పట్ల పూర్తి అవగాహనతో భూమిని కొల్లగొట్టకుండా బతకడం. మనతో పాటు నలుగురిని బతికించడం. సమస్త జీవావరణాన్ని ధ్వంసం చేసే వలసవాద ధోరణులను తిరస్కరించడం. విషతుల్య రసాయనాలను గుప్పించే అశాస్త్రీయ వ్యవసాయ ధోరణులను నిలువరించడం. కార్పొరేట్ చెరలో వున్న భూవమ్మ ను విడిపించుకోవడం. మట్టికోతనూ, నీటి ఎద్దడినీ, మందుల వాడకాన్ని అడ్డుకోవడం. సమస్త జీవావరణం పట్ల విముఖతా ధోరణులను 'ఇంజెక్ట్' చేస్తున్న పితృస్వామ్య వలసవాద ధోరణులను తిప్పికొట్టడం. కేవలం 3 కంపెనీలు 60% ప్రపంచ విత్తనాలపై చేస్తున్న పెత్తనాన్ని ధిక్కరించడం. ఉద్గారాలతో కుములుతున్న భూమమ్మ తాపాన్ని తగ్గించడం. భూమికి అండగా నిలబడ్డం. మన ఆహారమే మన ఆరోగ్యమని తెలుసుకోవడం. అన్నిటికీ మించి మన ఆహార సార్వభౌమత్వాన్ని తిరిగి సాధించుకోవడం. సర్కారు తుమ్మల్లాగా ప్రబలిన వలసవాద ప్రపంచీకరణ ధోరణులను ఎదురించాలంటే మనందరం నాటు విత్తనాలను పెంచుకొని పెంచాల్సిందే. నాగళ్లు పట్టి దున్నాల్సిందే. శారీరక శ్రమ మేధో శ్రమకు యే మాత్రం తక్కువ కాదనే అవగాహనకు వచ్చిన తరం మనది. బతుకు అమ్మను పదిలంగా ముందు తరాలకు అందించాలనే బాధ్యత తెలిసిన ఉ ద్యమకారుల తెలంగాణా మనది. పేటెంట్ల విష వలయాన్ని బద్దలు కొట్టి నవధాన్యాలను నాగేటి సాళ్లకు సాక పోయాల్సిన తరుణమిది. ప్రకృతికి దూరమైన పురుషుల విముఖతాధోరణులను ధిక్కరించే అమ్మ లకాలమిది. అక్కల ఆచరణ ఇది. బతుకమ్మ సందర్భమిది. 'యే ఇంటి వంట – ఆ ఇంటి పంటతో' అనే నినాదంతో మన వ్యవసాయ క్షేత్రాలను కాపాడుకుందాం. నాటు విత్తనాలు–నేటి అవసరం – రేపటి ఆరోగ్యం అని ఎలుగెత్తి చాటుదాం. స్థానిక వాతావరణ పరిస్థితులూ, బహుళ పంటల మన జ్ఞానాలను పరిగణలోకి తీసుకునే; biopiracyని రద్దుచేసే తెలంగాణ విత్తనచట్టం సాధించుకుందాం. దేశీ /నాటు విత్తన కేంద్రాలను ఊరూరా అందుబాటులో వుంచే వ్యవస్థలకై డిమాండు చేద్దాం .

పోయిన నెల శ్రీలంక ప్రభుత్వం రసాయన ఎరువుల దిగుమతులూ –వాడకంపై నిషేధం విధించినట్లు మన ప్రభుత్వాలు సైతం కదిలేలా ఉద్యమిద్దాం. ప్రకృతి సేద్య రాష్ట్రంగా తెలంగాణాను తీర్చిదిద్దుకుందాం.

ముగించే ముందు మరొక్క మాట–పాట. వినగల్గాలే గానీ భూమి మనతో పంచుకునే ఊసులెన్నో. చెప్పే సుద్దులెన్నో. హెచ్చరించే సూచనలెన్నో. 'గ్లోబల్ వార్మింగ్' సంకేతాలతో ప్రస్తుతం భూమి మన 'భవిష్యత్ వాణి' గా హెచ్చరిస్తున్న సంగతి మనకి తెలిసిందే.

**"ప్రేమ కొండకు బోయి ఉయ్యాలో-రేవ సూలలు దెచ్చి ఉయ్యాలో**
**బుట్టొక్కటల్లరే ఉయ్యాలో-భూమి ఎరుకతకు ఉయ్యాలో**
**బుట్టలో తంగెళ్ళు ఉయ్యాలో - బతుకమ్మ తల్లికీ ఉయ్యాలో"**

అంటూ మన అమ్మలు పాడుకునే పాట సరిగ్గా ఇదే విషయాన్ని చెబుతుంది. భూమిని ప్రాణమున్న అమ్మగా మన భవిష్యత్తుకు సంబంధించిన సంకేతాలు అందించే ఎరుకత' గా (భవిష్యవాణి) రూపుగట్టిస్తుంది. మట్టి సంస్కృతుల్లోని ఇలాంటి భావనలు బహుజనులకు అందించిన గొప్ప వారసత్వం మట్టితో చెలిమి–ప్రకృతి మాలిమి. ఈనేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం చేయడమంటే వెనకకు మళ్లమనో ముందుకు తోసుకుపోమనో చెప్పే ఛాందస వాదం కాదని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. అట్లే ఇది కేవలం 'పరిరక్షణ' వాదమూ కాదు. ఇది ప్రకృతి పెంచి పోషిస్తున్న వేల జీవాల్లో మనం ఒకరం అన్న ఎరుక. సహజీవన విలువలను ఆచరించడం. శ్రమ జీవన సౌందర్యాన్ని ఆవాహన చేసుకోవడం.కార్తెను బట్టి భూమితో సంభాషించగల్గిన ప్రకృతి శాస్త్ర జ్ఞానం. చలనశీల దృక్పథాలను అనుభవం ద్వారా అందుకోవడం. అందుకే ప్రకృతి వ్యవసాయం అంటే సార్థక జీవన తాత్వికత–భౌతిక వాస్తవికత – బౌద్ధ జీవితం. 'గడ్డిపరక' తో విప్లవానికి దారులు వేయడం. ఇది ఇప్పటి అవసరం.

ఇటువంటి చారిత్రక మలుపులో భూవమ్మను బంతిపూల తెప్పమీద పొదివి పట్టుకొని అచ్చం 'భూమి ఎరుకత' వోలె బుట్టపట్టుకొని బయలుదేరిన విమలక్క బృందాన్ని మనస్పూర్తిగా అభినందిద్దాం. మనవంతుగా 2 నాటు విత్తనాలను ఇచ్చిపుచ్చుకుందాం. రండి – బహుజన బతుకమ్మతో కలిసి అడుగులేద్దాం. ★

(''ప్రకృతి వ్యవసాయం – రక్షిత ఫలసాయం'' అన్న నినాదంతో 'బహుజన బతుకమ్మ' బైల్దేరిన సందర్భంగా – అభినందనలతో)

# రసోత్కృష్టం

## కథల ఒడ్డున...

- నిగమ



సృష్టిలో ఉత్కృష్టభావాన్ని భాగాలుగా విడగొడితే అందులో మాతృప్రేమకే అగ్రస్థానం లభిస్తుంది. అది పశువైనా శిశువైనా సరే. జంతువులు పశుపక్ష్యాదులు అనేక కీటకజాతులలో మాతృప్రేమ సొంతంగా మనుగడ సాగించేంతవరకే పరిమితంగా వుంటుంది. తర్వాతంతా ఆ సంతతి ప్రకృతిలో తమలాగానే ఇంకొకటిగా అనుకుంటూ మనుగడ సాగిస్తాయి.

ప్రత్యేకంగా మనిషికి మాత్రమే కొన్ని బంధాలు అనుబంధాలు జీవితాంతం పెనవేసుకుని వుంటాయి.

అందులో ప్రతి మనిషికి అమూల్యమైనది మాతృప్రేమ.

మాతృ ప్రేమకు మించిన ప్రేమ ఉంటుందా లోకంలో అని ఆశ్చర్యపడటం వింతేమి కాదు కూడా.

ఇటీవల కాలంలో అప్పుడప్పుడూ మాతృత్వ లక్షణం మసకబారుతున్నదా అనే అనుమానాలు పొడజూపినట్లనిపించినా.. అనేకానేక ఉదంతాలు విన్నా చూసినా చదివినా హృదయం చెమరిస్తుంది. అమ్మ ప్రేమకు మన అణువణువు అంజలి ఘటిస్తుంది.

చాలాకాలం క్రిందట ఒక ఉర్దూ కథ చదివాను. ఆ కథ చదివిన పిమ్మట చాలా దుఃఖం కల్గింది. ఆ దుఃఖాన్ని అనుభవించడం ప్రతి మనిషికీ చేతనవును కూడా మరీ హృదయం అంత పాషాణం కాకపోయినట్లేతే.

మనకుతల్లి లేదా అమ్మ అనే భావనే అపురూపం. తల్లిబిడ్డలది నాభీసంబంధం. ఎక్కడో దూరంగా బిడ్డకు ఇసుమంత కష్టం కల్గినా నొప్పి కల్గినా.. అది అమ్మ మనసుకు తెలిసిపోతుంది. బిడ్డ క్షేమం కోసం తల్లడిల్లుతుంది. వీలైతే ఆ బాధ తాను భరించి బిడ్డకు ఆ బాధనుండి విముక్తి కల్గించాలని తపన పడుతుంది. కానీ దేహమానసిక బాధలు ఎవరివి వారే భరించాల్సిరావటం ప్రకృతిచ్చిన శిక్ష.

ఈ కథలో తల్లి అత్యంత సాధారణమైన తల్లే. ఆమెలో ఏ ప్రత్యేకతలు లేవు. అయితే మాత్రమేం.. ఆమె నిరంతర ఆలోచనా స్రవంతి కొడుకు చుట్టూనే. అతని బిడ్డల చుట్టూనే.

ఏనాడు చిన్న ఆరోపణ కూడా చేయని ఆమె తల్లి ప్రేమ మనల్ని వెక్కివెక్కి ఏడిపిస్తుంది. ఎన్నో ఏళ్ళ తర్వాత తనను చూడవచ్చిన బిడ్డకు రాచమర్యాదలు జరిపించాలని ఘనమైన అతిథి సత్కారాలు చేయాలని అతనికీ అతని బిడ్డలకూ కానుకలనివ్వాలని తపించిపోయింది. ఆ కొడుకుతో పాటు కథ చదువుతున్న మనం కూడా ఉద్విగ్నతకు గురవుతాం. కొడుకు పశ్చాతాపంతో మొదలైన కథ ముగింపుకొచ్చేసరికి అణువణువును కరిగించి కన్నీటి వర్షంలో తడిపేస్తుంది. ఒక స్త్రీ రచయితగా మరొక స్త్రీ అంతరంగ చిత్రణను అద్భుతంగా ఆవిష్కరించిన కథను అందరూ చదివితీరాలనే ఆకాంక్షతో ఈ కథను పరిచయం చేస్తున్నాను..

మీరూ ఈ కథను చదవండి. మనలో ఆవిరైపోతున్న మానవత్వ విలువలను మేలుకొలుపుతుందీ కథ. మనని కనిపెంచిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదని మనను సున్నితంగా హెచ్చరిస్తుంది.

రుకైయ్యా రీహానా వ్రాసిన "తల్లి" కథను నేను చదివిన ఉత్తమకథలలో ఒకటిగా బహుళా త్రైమాసిక వెబ్ సంచికలో పరిచయం చేస్తున్నాను చదవండి.

- నిగమ

**పరిచయం**

రుకైయ్యా రీహానా ఉన్నత విద్యావంతురాలు. స్త్రీ జీవితాన్ని చిత్రించడంలో అసమానమైన ప్రతిభావంతురాలు. ఉర్దూ కథాసాహిత్యంలో విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్నది. ఆమె రచనలలో మానవహృదయంలోని ఆంతరంగిక వేదనా, మాతృత్వ, నారీత్వములలోని తీపి, ప్రధానస్థానాన్ని ఆక్రమిస్తవి. "తల్లి" ఆమె ఉత్తమకథలలో ఒకటి.

# "తల్లి"

మాష్టరు హమీద్ ఢిల్లీలో బారహటోటేలోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు. అతడి అసలు నివాసస్థానం రషీదాబాదులోని వహాడీ మొహల్లా, అతని తండ్రి రషీదాబాదులో కంచరి పనిచేస్తూఉండేవాడు. హమీద్ బాల్యంలో తన పేటలోని మసీదులోనూ, తరువాత కొద్ది రోజులు ముల్లా సాహెబు బడిలోనూ, ఆ తరువాత తండ్రిగారి ఇష్ట ప్రకారం కొంతకాలం తాలూకా స్కూలులోనూ చదువుకొన్నాడు. హమీద్ ఉర్దూ ప్యాసయిన రోజుల్లో రషీదాబాద్ లో ప్లేగువ్యాధి వ్యాపించి హమీద్ తండ్రిని బలిగొన్నది. ఆయన అంత్యకర్మలన్నీ పూర్తి చేసిన తరువాత హమీద్ తల్లి దగ్గర లెఖ్ఖ చూచుకొంటే డెబ్బయి రూపాయలు మిగిలినవి. మిడిల్ ప్యాసయిన తరువాత హమీద్ కు ఇంగ్లీషు గూడా చదువు కొందామని అభిలాష కలిగినది. కాని ఎలాగా చదువుకోడం?

వీరి పేటలో ఉండే ఒకాయన ఢిల్లీలో పోలీసుగా ఉండడంవల్ల హమీద్ రెండు మూడు సార్లు ఢిల్లీని గురించి విని ఉన్నాడు. అందువల్ల తల్లి దగ్గర పది హేను రూపాయలు తీసుకొని మెల్లగా ఢిల్లీ చేరుకొన్నాడు.

పోలీసు కానిస్టేబుల్ నసరుల్లాఖాన్ ఇల్లు ఎలాగ తెలుసుకోవడం, చచ్చి చెడి అతని ఇల్లు తెలుసుకొన్నాడు. నసరుల్లాఖాన్ హమీద్ తండ్రిని బాగా ఎరుగును. అందువల్ల అతను హమీద్ ను ఆదరించి తన ఇంట్లో ఉండి చదువుకోడానికి అవకాశం కలుగజేశాడు. నసరుల్లాఖాన్ ఇంట్లోనే ఉంటూ హమీద్ మూడు సంవత్సరాల్లో పదో క్లాసుకు వచ్చాడు. లెఖల్లో హమీద్ నిధి. ఒక సహాధ్యాయుడికి పాఠం చెప్పడం ప్రారంభించి నెలకు ఏడు రూపాయలు సంపాదించడం ఆరంభించారు. ఏడు రూపాయలు తన భోజనానికి సరిపోతవి గనుక వేరుగా ఉంటానని తాను ఎంత బ్రతిమి లాడినా నసరుల్లాఖాన్ అంగీకరించనందున, హమీద్ విధిలేక అక్కడే ఉండిపోయినాడు.

'ఆ విధంగా పది నెలల్లో హమీద్ డెబ్బయి రూపాయలు రొట్టం నంపాదించాడు. తల్లి దగ్గరనుండి తెచ్చినవి పది రూపాయలు మిగిలి ఉన్నవి. ఒకసారి తల్లి రెండు రూపాయలు మనియార్డరు పంపించింది. మొత్తం అతని దగ్గర ఎనభయి రెండు రూపాయలు పోగుపడినవి. స్కూలుకు వేసవికాలపు సెలవులిచ్చారు. నసరుల్లాఖాన్ గూడా సెలవు బెట్టాడు. ఇద్దరూ కలిసి రషీదాబాద్ వచ్చారు.

అప్పటికి హమీద్ తల్లి దగ్గర భర్త అంత్యక్రియలు చేయగా మిగిలిన డబ్బు పన్నెండు రూపాయలు మిగిలి ఉన్నవి. ఇంటిముందున్న పనసచెట్టు అమ్మడంవల్ల ప్రతి సంవత్సరం పాతిక రూపాయిల ఆదాయం వస్తూ ఉండేది. ఇంటికి పోయేటప్పటికి తల్లి హమీద్ కు వివాహసంబంధం మాట్లాడి సిద్ధంచేసి పెట్టింది, ఆ డబ్బు హమీద్ దగ్గర ఉన్న డబ్బు అంతా ఖర్చు పెట్టి ఏదోవిధంగా హమీద్ వివాహం పూర్తిచేసింది. పెళ్ళి అయిన ఏడోరోజున తిరిగి హమీద్ ఢిల్లీ వెళ్ళాడు. ఆ సంవత్సరం పరీక్షలో కృతార్థుడు అయినాడు.

ఇక ఉద్యోగం ఒక ప్రైవేటు స్కూల్లో కొద్దిరోజులు నౌకరీ కుదిరింది. తరువాత ఇంకొక స్కూళ్ళో ఆ తరువాత ఇంకొక స్కూళ్ళో –చివరకు ఒక స్కూళ్ళో అతని పని చూసి సంతోషించి ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడు అతడి ఉద్యోగం ఖాయంచేశాడు.నెలకు ఇరవయి రూపాయల జీతం. ఇక వేరే కాపురం పెడతానని హమీద్ నసరుల్లాఖాన్ ను అడిగారు.

ఒంటరిగా కాదు. భార్యనుగూడా తీసుకొనిరమ్మని నసరుల్లాఖాన్ మూడు రూపాయలు అద్దెకు ఒక చిన్న ఇల్లు కుదిరించి పెట్టారు. హమీద్ ఖాన్ రషీదాబాద్ వెళ్ళి భార్యను తీసుకొచ్చి ఆ ఇంట్లో కాపరం పెట్టాడు. రషీదాబాద్ లో తల్లి ఒంటరిగా ఉండిపోయింది.

హమీద్ భార్యను ఢిల్లీ తీసుకొనివచ్చి ఏడు సంవత్సరాలు గడిచింది. అతనికి ముగ్గురు మొగపిల్లలూ, ఒక ఆడపిల్లా పుట్టారు. వారిలో ఒక మొగపిల్లవాడూ, ఆడపిల్లా చనిపోయినారు. హమీద్ భార్యకు గూడా చాలా జబ్బు చేసింది. ఒకసారి హమీద్ కు ఎండదెబ్బ తగిలి పది హేను రోజులు మంచంలోనే ఉండిపోయినాడు. అటుస్కూల్లో పని పెరిగి పోయింది. ఇటు జీతం ముప్పయి రూపాయలయింది. పదిరూపాయలు ప్రైవేటు చెప్పి సంపాదించేవాడు. కాని ఢిల్లీ లో ఆ డబ్బు అతనికి ఏమాత్రమూ సరిపోయేది కాదు. తల్లి రషీదాబాద్ రమ్మని ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాసేది. కాని డబ్బులేక తల్లిని చూడవలెనని ఎంత కుతూహల మున్నా హమీద్ రషీదాబాదు పోలేకపోయినాడు.

రోజూ ఉదయమే లేచి మసీదుకు పోయి నమాజు చేసుకోవడం, ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఖురాన్ లోనుండి ఒక అధ్యాయం పారాయణం చేయడం అతనికి అలవాటు. మసీదు నుంచి ఇంటికి వస్తూ ఉన్నప్పుడు రోజూ ముసలి చాకలిది జానకి నడుము వంగిపోయి కర్రపోటు వేసుకొంటూ చాకిరేవుకు పోతూ కనపడేది, కాని ఎందువల్లనో ఐదు రోజులనుండి జానకి కనపడడం లేదు, హమీద్ కు ఆశ్చర్యం వేసింది. జానకి కనపడని రోజు లేదే: ఎందువల్ల ఐదు రోజులనుండి కనపడడంలేదో తెలుసుకుందామని జానకి ఇంటికి వెళ్లాడు, జానకి ఏమైందని అక్కడివాళ్ళను ప్రశ్నిస్తే విన్నరాత్రి చనిపోయిందని వాళ్ళు జవాబు చెప్పారు.

జానకి చనిపోయిందని వినగానే హమీద్ గుండె గుభీలుమన్నది. జానకికి హమీద్ కు ఏమి సంబంధమున్నదో భగవంతునికి తెలియాలి , స్కూలుకు పోయినాడు. అక్కడ అతనికి ఏమీ తోచలేదు. ఏదోవిధంగా కాలక్షేపం చేసి స్కూలు వదలి పెట్టగానే ఇంటికి చేరాడు. భార్య "శరీరం బాగాలేదా ?" అని అడిగింది. ఏమీ వినిపించుకోలేదు. తెల్లవార్లూ అతనికి నిద్ర పట్టలేదు. మర్నాడు బక్రీదు. స్కూలుకు సెలవు. స్టేషన్ కి పోయి రషీదాబాద్ కు టిక్కెట్టు కొన్నాడు. రైల్లో పడ్డాడు. బక్రీదురోజు పగలల్లా రైల్లోనే గడిచింది. నమాజులేదు. కుర్బానీ లేదు. ముసలితల్లి ధ్యాసే. కళ్ల ముందు ముసలితల్లి కన్పించడమారంభించింది. తెల్లబడిపోయిన వెంట్రుకలు, ముడతలు పడిపోయిన శరీరం, వంగిపోయిన నడుము.

భార్య, పిల్లలమీద మక్కువవల్ల హమీద్ ముసలి తల్లిని మర్చిపోలేదు. నాలుగైదుసార్లు ఏడెనిమిది రూపాయలు తల్లికి మనియార్డరు గూడా పంపించాడు. ఆ డబ్బు పంపినప్పుడల్లా తనూ, తన పిల్ల లూ చాలా ఇబ్బంది పడే వాళ్ళు, తన తల్లికి ఉత్తరాలు వ్రాసినప్పుడు పిల్లలచేత గూడా ఆ ఉత్తరాల మీద ఏవో గీతలు గీయించేవాడు. ఆ పిచ్చిగీతలు చూసి తన తల్లి సంతోషించవలెనని అతని అభిప్రాయం. అతని భార్య గూడ వ్రాయడం నేర్చుకొన్నది. అత్తగారికి సలాములు తెలియపరుస్తూ ఉండేది. అటునుండి తల్లి మాటమాటకి రమ్మనీ పక్క ఇంటి దర్జీఆమె చేత ఉత్తరాలు వ్రాయిస్తూ ఉండేది. వచ్చే సంవత్సరం పంట రోజుల్లో తప్పక వస్తానని వ్రాసేవాడు. కుటుంబంతో పోవాలి. చేసేది ఉద్యోగం గనుక యేవోకానుకలు తీసుకొనిపోవాలి. పళ్ళు ఫలాలు తీసికొనిపోవాలి. అందుకు డబ్బుగావాలి. వచ్చే జీతంతో తిండి గడవడమే కష్టంగా ఉండేది. అందువల్ల ఎప్పటికప్పుడు ప్రయాణం ఆపుకొనేవాడు. కాని జానకి మరణవార్త వినిగుండె పగిలినట్లయి ఆగలేక ఒంటిరిగా బయలుదేరాడు.

బక్రీదునాడు సూర్యాస్తమయం సమయానికి హమీద్ రషీదాబాద్ చేరాడు. పైనుండి భోరున వర్షం కురవడం ఆరంభించింది. అతనికి స్మృతి వచ్చినట్లయింది, గొడుగుమాత్రం చేతులో ఉన్నది. అయ్యో! గుడ్డలన్నా తెచ్చుకోలేదనుకున్నాడు. గొడుగు వేసుకొని బయలు దేరాడు. జనం నివసించే చోట నీళ్ళు నిలవగూడదనే ఆరోగ్య సూత్రం గ్రామస్తులకు అర్థమే అయ్యేది కాదు, అర్థమైనా వాళ్ళు పట్టించుకొనే వాళ్ళుకాదు. మోకాళ్ళతోతు నీళ్ళలో పడుతూ, లేస్తూ మెల్లగా యింటికి చేరుకొన్నాడు. తలుపు లోపల వేసి ఉన్నది. తలుపు తట్టాడు. "అమ్మా ! అమ్మా !" అని పెద్దగా పిలిచాడు.

లోపుల నుండి ఒక లావుపాటివాడు వచ్చి తలుపులు తెరిచాడు. బక్రీదు పిండివంటలన్నీ తిని అరగడానికి నిద్రబోయి

అప్పుడే లేచినట్లు కనపడ్డాడు, హమీద్ ను గుర్తు బట్టి మూడు సంవత్సరాల క్రితం ఆ యిల్లును కొన్నట్లున్నూ. హమీద్ తల్లి దర్జీ ఆమె ఇంట్లో వున్నదని చెప్పాడు. తలుపు వేసుకొని లోపలికి వెళ్ళిపోయినాడు.

హమీద్ కు అడుగు ముందుకు పడలేదు. ఇల్లు కూడా అమ్మవలసినంత కష్టంలో తల్లి పడిపోయింది కాబోలు ననుకున్నాడు. వనపచెట్టు ఆదాయంతో కాలక్షేపం చేస్తున్నదనుకొని చాలా పొరపాటు చేశాననుకున్నాడు. ఆ తల్లికి మొఖం చూపించడమెలా , ఎంత స్వార్ధం తనలో బలిసిపోయింది. తన పిల్లల మంచినీ, తన మంచినీ తను చూసుకున్నాడే గాని ముసలి తల్లిని గురించి ఆలోచించనైనా లేదుగదా అని పశ్చాత్తాన పడ్డారు. మెల్లగా దర్జీఆమె ఇంటిదగ్గరకు కాళ్ళీడ్చుకుంటూ చేరాడు. తలుపు కొట్టబోయాడు. చెయ్యి లేవలేదు. మెల్లగా తలుపు కొట్టాడు. "అమ్మా !" అని పిలిచాడు. దర్జీ సోతి వచ్చి తలుపు తీసింది. హమీద్ ను గుర్తు బట్టింది. "హమీద్ వచ్చాడు. హమీద్ వచ్చాడు" అంటూ లోపలకు పరుగెత్తింది.

హమీద్ తల్లి ఈమధ్య ఆసక్తతవల్ల ఇంట్లో అటూ ఇటూ నడవడం కూడా మానుకొన్నది, ఆమె కళ్ళు కూడా ఏమీ కన్పించేవి కావు. కాని హమీద్ వచ్చాడనడంతోనే ఆ సంతోషంలో ఎక్కడ నుండి శక్తి వచ్చిందో రఫీమని లేచి వాకిట్లోకి దూకి హమీద్ ను ఆలింగనం చేసుకొన్నది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె శరీరంలో ఎముకలు తప్ప ఏమీలేవు. తలమీద వెంట్రుకలు తెల్లబడి పోయినవి. నడుము వంగిపోయింది. మెడ శిరస్సు భారాన్ని గూడా వహించలేకుండా ఉన్నది. ప్రేమవల్లనో, లేక ముసలి తనం వల్లనో ఆమె శరీరం వణక నారంభించింది. చాలాసేపు ఇద్దరూ మాట్లాడలేకపోయినారు. చివరకు తల్లి మెల్లగా కంఠం పెకలించుకొన్నది "నాయనా , చాలా దూరం నుండి వచ్చావు. గుడ్డలన్నీ తడిసిపోయినవి. గుడ్డలు మార్చుకో, టీ తీసుకొని వస్తాను, పిల్లలంతా కులాసాగా ఉన్నారా ?" అని ప్రశ్నించింది.

అమ్మా, ఇల్లు అమ్మివేశావా ? నాకు తెలియజేయలేదేమి " అని అడిగాడు.

"నాయనా! నీకు తెలియజేస్తే మాత్రం నువ్వేమి చేస్తావు, నీకు మాత్రం కష్టాలు తక్కువగా ఉన్నవి గనుకనా, కానీ. ఈ దర్జీ సోతి నాకు చాలా సహాయం చేస్తున్నది. నీ కష్టాలు మీకు గాక నా బాధ కూడా మీకెందుకు నాయనా, ఈ జన్మలో నిన్ను చూడలేనేమో అనుకున్నాను, నువ్వు వచ్చావు" అన్నది.

హమీద్ కళ్ళవెంట బొటబొటా నీళ్లు కార్చాడు. ఇల్లు నలువైపులా కలయ చూచాడు. ఎదుట చిన్న మంచం మీద దర్జీ ఆమె ఇద్దరు పిల్లలూ నిద్రబోతున్నారు. ఒక పిల్లవాడు కింద ఆడుకుంటున్నాడు.

దర్జీ సోతి పొయ్యి రాజేస్తున్నది. ఆమె తొడుక్కున్న రవిక వీపుమీద చిరిగిపోయి వున్నది. గుడ్డలు మాత్రం తెల్లగానే ఉన్నవి.. బక్రీదు పండుగ కదూ!

"అమ్మా , రోజూ నీవు ఇక్కడనే నిద్రపోతూ ఉంటావా?"

"కాదు నాయనా ! ఆమె ఈ గదిలో పిల్లలతో పడుకొంటూంది. నేను అవతల గదిలో పడుకొంటాను" అన్నది తల్లి.

"అమ్మా! నీవు ఇంకా పనిచేస్తూనే ఉన్నావా? చేతులు పని చేయనిస్తున్నయ్యా!"

"చేతులు బాగానే ఉన్నవి గాని కళ్ళు మాత్రం నెల రోజుల నుండి కనపడడంలేదు నాయనా"

"కళ్ళు కనపడడంలేదా ? అన్నాడు ఆతురతతో హమీద్,

తల్లి హమీద్ తలను చేతితో నిమిరింది. చెయ్యి బుగ్గలదాకా పోనిచ్చింది. అతని తలను తన హృదయానికి హత్తుకొన్నది. చిరునవ్వు నవ్వింది. "నాయనా, కళ్ళు కనపడడం లేదా అంటున్నావా , నాయనా నీవు కనపడుతూనే వున్నావు. రోజూ సూర్యుడు కనబడతాడు అంతే. మిగిలిన వస్తువులు ఏమీ కనబడవు. చిన్న పిల్లవాడు కులాసాగా ఉన్నాడా? వాడి వయస్సెంత? అని అడిగింది.

"సంవత్సరంన్నర"

"అయితే చొక్కా, టోపీ వాడికి సరిపోతవి" అంటూ ఒక పాత గుడ్డల మూట విప్పి అందులోనుండి ఒక చొక్కాను, బుటేదారీ పనిచేసి యున్న ఒక టోపీని బయటకు తీసింది.

"మజీద్ కోసం ఇవి తయారుచేశావా ? అని హమీద్ కన్నీళ్ళు కార్చాడు.

కాదు నాయనా సలమా కోసం కుట్టి తయారు చేశాను. పంపుదామంటే నీవు రానేలేదు. తరువాత సలమా చచ్చిపోయిందని ఉత్తరం వ్రాశావు అని చొక్కా వంక చూసి కన్నీళ్ళు పెట్టుకొన్నది. లేచి లోపలికి వెళ్ళిపోయింది. టీ తెచ్చి ఇచ్చింది. తాగారు. తల్లి మంచం మీద కూర్చొని ఉండిపోయినాడు.

ఏమిటేమిటో ఆలోచనలు హమీద్ తనను తాను మరచి పోయినాడు. అలా రెండు గంటలు గడిచింది. పక్క ఇంటి నసీబన్ గూడా వచ్చింది. నసీబన్, హమీద్ తల్లి, సోతి వంట ఇంట్లో ఏమేమిటో చేస్తూ ఉండిపోయినారు.

సుమారు ఎనిమిది గంటలకు హమీద్ తల్లి బయటికి వచ్చి "నాయనా! భోజనానికి లేవమన్నది.

అప్పటికి హమీద్ కు కొద్దిగా నిద్రపట్టింది. ఉలిక్కి పడి లేచాడు.

బీద స్థితిలో ఉన్నది గనుక తల్లి జొన్నరొట్టె తయారు చేసి ఉంటుందనుకొన్నాడు. కాని వడ్డించిన పదార్థాలను చూసి ఆశ్చర్యపడ్డారు. కబాబు, మేక గుండెకాయ కూర, పొరాటాలు, మినప్పప్పు పప్పు గారెలు,మామిడి కాయ పచ్చడి, ఒక కప్పులో మీగడి, ఒక ప్లేటులో వండిన మామిడి పండు ముక్కలు ఘుమఘుమ లాడుతున్నవి. ఇంత బీదతనంలో ఉన్న తల్లి ఈ సామానంతా ఎలా సేకరించిందా అని ఆలోచించాడు. భోజనం చేశాడు. భోజనం చేసినంత సేపూ తల్లిదగ్గర కూర్చొని లోకాభిరామాయణం చెప్పింది. కొసరి కొసరి వస్తువులు వడ్డించింది. తృప్తిగా భోజనం చేశాడు. లేచి చేతులు కడుక్కొని మంచం మీదకు చేరాడు.

దర్జీఆమె, నసీబన్ ఇద్దరూ బయటకు వెళ్ళి కొంత సేపట్లో తిరిగి వచ్చారు.

తల్లి హమీద్ దగ్గరకు వచ్చింది. "నాయనా ! ఒక్క మాట చెపుతాను. వింటావా ?" అని అడిగింది.

హమీద్ మొఖం వెలవెల బోయింది. గుండె దడదడ లాడింది. బహుశా తల్లి తనతోగూడా ఢిల్లీ వస్తానంటుందనుకొన్నాడు. లోలోపల అనేక ఆలోచనలు తనకు వచ్చే జీతం చాలా కొద్ది, ఢిల్లీ లో ఆ కొద్ది జీతం మీద అంతమంది బ్రతకడం ఎలాగా? భార్యా, పిల్లలూ, తల్లీ యింత మందినీ తను పోషించగలడా . తల్లి వంక అలాగే చూస్తూ ఉండి పోయినాడు.

"నాయనా నీవు పట్టణంలో ఉండేవాడివి. నౌకరీదారుడివి. నేను పరాయవాళ్ళ పంచల్లో తలదాచుకొంటున్నాను. నీకు ఎలా మర్యాద చేయగలను నసీబన్ ను పంపించి ఖాన్ సాహెబుగారి ఇంట్లో ఒక గది బాగు చేయించాను. మంచం, పక్కా వేయించాను. కాని నీవు నాతోబాటే ఉంటే బాగా ఉంటుందని నా మనస్సు కోరుతున్నది. ఈ ముసలిముండతో కూర్చోమంటే నీకు మనస్సుకు ఏమి కష్టం కలుగుతుందోనని చూస్తున్నాను. భయపడుతూ ఉన్నాను. నాయనా ! నా కోరిక పూర్తిచేస్తావా, అని భయపడుతూ అడిగింది.

"అదుగో, మంచం కూడా తెప్పించాను" అని ఎదుటపరచి ఉన్న మంచం చూపించింది.

తల్లి మాటలకు హమీద్ గుండె కరిగిపోయింది. నోటనుండి మాట రాలేదు. "అమ్మా! నీ దగ్గర ఉండకపోతే నేను యింకెక్కడకు పోతాను" అన్నాడు.

తల్లి ఆనందసంభరితురాలైంది. హమీద్ శిరస్సును ఆఘ్రాణించింది. నసీబన్ ను పిలిచి మంచం తన గదిలో వేయించింది. ఒకమూట విప్పి తెల్ల దుప్పటి బయటకు తీసింది. ఆ దుప్పటిమీద రకరకాల లతలు కుట్టి ఉన్నవి. ఆ మూటలోనుంచి రెండు దిండ్లు బయటకు తీసింది. తెల్లటి గలీబులు తొడిగి ఉన్నవి. చిన్న సీసాలోనుంచి అత్తరు తీసి గలీబులకు అత్తరు రాసింది. మంచం కింద ఒక పీక్ దానును పెట్టించింది. ఢిల్లీ పూల నల్ల చెప్పుల జోడు – కొత్తది – మంచం కాళ్ళ వైపున పెట్టి "నాయనా ! అలసిపోయినావు. ఈ మంచం మీద పడుకొని నిద్రబొమ్మన్నది.

హమీద్ ఈ తమాషా అంతా చూస్తున్నాడు. యా అల్లాహ్ ఈ సామనంతా ఎలా వచ్చింది . చివరకు తల్లిని అడిగాడు.

రషీదాబాద్ గూడా చిన్న బస్తీ లాంటి గ్రామమే. అన్నీ ఈ ఊళ్లోనే దొరికినవని జవాబు చెప్పింది.

"అమ్మా! భోజనం సంగతి సరే. ఈ చెప్పులు, ఈ పీక్ దాను. ఈ దుప్పటి ఇవన్నీ ఎలా కొన్నావు ?"

తల్లి వేడివేడి కన్నీళ్లు కార్చింది. మాతృదేవతా వాత్సల్యం అనుపమానం "ఏడు సంవత్సరాలు ఎదురు చూశాను. ఇల్లు అమ్మాను. పొట్ట బిగించుకొని నీ కోసం, నీ పిల్లల కోసం ఈ వస్తువుల్ని సేకరించాను. నీ కోసం ఎదురు చూసిచూసి కళ్ళు కాయలు గాచినవి. నాయనా ! ఈ వస్తువుల్ని సేకరించడానికి ఏడు సంవత్సరాలు పట్టింది. సల్మాను చూడనే లేదు " అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది. .

తల్లి మాటలను విని శాంతిదేవత ఆ చిన్నగదినిండా తన రెక్క లను విప్పింది. ఇక ఎవరూ ఏమి మాట్లాడలేదు.

తెల్లవారిపోతుంది హమీద్ తల్లి ఇక కళ్లు తెరవలేదు. ★

**సేకరణ - నిగమ**



# ఏది మా ఇల్లు

- తులసీ గుగులోతు

సుధా వంటగదిలో పనులు అన్నీ పూర్తి చేసుకొని ఎక్కడివి అక్కడ సర్ది పెడ్తుంది.వివేక్ వచ్చి, ఓయ్....మీ ఇంటికి వెళ్ళాకా నన్ను నెగ్లేట్ చెయ్యకు. త్వరగా వచ్చేయి. పుట్టిల్లు అంటే చాలా ఆనందం కళ్ళల్లో ఇక్కడ ఏం కష్టం అనో!... అనుకుంటూ ఆఫీస్ కి వెళ్ళిపోయాడు.

అత్త,మామా అందరూ వున్న ఉద్యోగ రీత్యా ఒంటరి జీవితాలు నేడు.. ఇంటికి లాక్ వేసి పుట్టింటికి వెళ్ళింది...

పుట్టి నిల్లు.... వెళ్ళి వెళ్ళగానే అమ్మ అడిగిన ప్రశ్న "మీ ఇంట్లో అందరూ కులసాయేనా". ఆ అమ్మ అందరూ బాగున్నారు.. అని చెప్పి ఇల్లంతా చూడలనిపించి వెళ్ళింది సుధా. గుమ్మానికి రెండు తలపులు ఒకటి మూసిన ఒకటి తెరిచేవారు. ఎత్తు తక్కువ వున్న ప్రహరీ గోడ, ఎన్ని ఊసులో ...

ఏడిస్తే రెండు చేతులు గోడ మీద పెట్టి చేతుల మీద తలపెట్టి ఏడిచిన రోజులు. అదే గోడ మీదకు మల్లె తీగను ఎక్కించి పూలు కోసిన రోజులు. స్నేహతురాలితో కలిసి గోడ దుకిన రోజులు..తెలిసి తెలియని పరువంలో అడ్రస్ లేని ఎన్ని బహుమతులు ప్రత్యక్షం అయ్యేవో. ఆ గోడ మీద.. ఆ గోడ ఇప్పుడు చిన్నపోయి కనిపించింది.

ఇంటి లోపల బావి నీళ్ళు చేది చేది చేతులు సున్నితత్వాన్ని కోల్పోయాయి.. ఒక రోజు ఎవరో అన్నట్లు గుర్తు నీ చేతులు సున్నుతంగా వుండవెందుకు..? అని. నవ్వే సమాధానం.

బయటకు వచ్చి చూసింది...

ఇంటి ముందు అంతా తారు రోడ్డు.. పండుగలు వస్తే శుభ్రంగా కళ్ళాపి చల్లి ముగ్గు వేస్తే ఇంటి ముందు ఆగి, ముగ్గులు అయిన వారి పొగడ్తలు అన్నీ ఆ రోడ్ క్రింద పుదుకు పోయాయి.

ఇంటి చుట్టూ పెద్ద, పెద్ద అపార్ట్ మెంట్ లో ఎక్కడో గాలి కూడా చొరపడని గదులు... ఎంతగా మారిపోయింది కాలం.

లోపలకు వచ్చి కూర్చుంది అమ్మ కాఫీ తీసుకోమని, మీ ఇంటి సంగతులు చెప్పు అని అడిగింది.

మాదెంవుందిలే గానీ అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్దామా ఎప్పుడైనా అని అడిగిన సుధా కు వాళ్ళమ్మ మా పుట్టిల్లు అని చెప్పడం మొదలు పెట్టింది...

అమ్మ!

సుధా నవ్వుకుని బయలు దేరుతా అమ్మ అని ఇంటికి పయనం అయింది... ఇంటికి వచ్చి సింగిల్ డోర్ ఓపెన్ చేసింది..

కూతురు అనంత స్కూల్ నుండి వస్తు, వస్తు మా ఇంటికి రండి అని ఫ్రండ్ తో చేపడం వినపడింది...

సుధా నవ్వుకుంటూ పనిలో నిమగ్నం అయింది....

★ ★ ★

- **తులసీ గుగులోతు.**
భద్రాచలం,
భద్రాద్రి కొత్త గూడెం జిల్ల

కవిత

# అలుపెరుగని భూమి పుత్రి..!!



ఋతువు మారినా..
మారని నుదుటి రాతను
అనుభవాలతో పండిన ముడతల్లో...
శ్రమైక జీవన సౌందర్యపు సారంగా లిఖించుకుంటావు!
కన్నబిడ్డలు కానకున్నా..
కాదు రమ్మని పిలుస్తున్నా
మొక్కవోని ధైర్యంతో..
అచంచల దీక్షతో..
ప్రకృతి వైపరీత్యాలను ఎదురొడ్డి..
కల్లెంలో ధాన్యపు రాశిని కన్నులందు నిల్పుకునే
పొలం గట్లపై పొడిచే పొద్దుతిరుగుడు పువ్వవయ్యావు!
మన్నును జున్నుగా మార్చే
రహస్య రసవిద్యనేదో నేర్చిన కర్మయోగినిగా
ఆకుపచ్చ ఉషోదయాలను స్వాగతించే..సతతహరిత
స్వాప్నికవయ్యావు!
పెయ్యి మూయని బట్టతో..మట్టి గంధపు లేపనంతో..
చేతబట్టిన వరినాట్ల సాక్షిగా
అనవరతం పొలం ఒడిలో తిరుగాడే అవిశ్రాంత పోరాట
భాస్వరానివయ్యావు..!
గుండెలకద్దుకున్న పుడమితల్లిని
నిత్యమూ పావురంగా నిమిరి
మట్టిస్పర్శతో పునీతమయిన భూమిపుత్రిగా..
ఊపిరున్నంత వరకూ..
ఎవుసమే ముద్దు అని..
మేరునగధీరపు ఆత్మవిశ్వాసంతో
సమస్త సిరిసంపదల్ని మట్టిరేణువులుగా భావించే
స్థితప్రజ్ఞురాలవయ్యావు!
కాడి తప్పని తొలిపొద్దును భుజానకెత్తుకొని
ఆకుపచ్చని కన్నీళ్లను దిగమింగుకున్న చెమరింతల కళ్ళతో
జీవన మలిసంధ్యలోనూ..
పొద్దుచాలని సేద్యం చేస్తూ
బిడ్డల ఆకలి తీర్చే అమృతవర్షిణి అన్నపూర్ణగా..
సస్యసంరక్షణే కర్తవ్యంగా
అనితరసాధ్యమైన దిగుబడే ధ్యేయంగా సాగిపోయే అభినవ
పర్యావరణ శాస్త్రవేత్తగా..
భూమాత నుదుటన తడియారని పచ్చబొట్టు చిరునామాను
లిఖిస్తున్న
హరితవర్ణ సహజాతవయ్యావు..!!

★★★

(వృద్ధులైనా..గట్టి సంకల్పంతో.. ఇప్పటికీ వ్యవసాయం చేస్తూ..
మనకు తిండి పెడుతున్న రైతక్కలపై. రాసిన కవిత

**బి.కళాగోపాల్**
నిజామాబాద్, చరవాణి:–944163102

# గెలుపు పాదం



ఒకానొక నిర్లిప్తఘడియలో
మూతపడిన గుండెగుహలో
టపటపలాడే తలుపుల కావల
భ్రమల అలల సుడులు భయపెడుతుంటే

అచేతనంగా అనంత దుఃఖాన్ని
కళ్ళగడపల్లో దాచుకున్న నిశ్శబ్దసదులు కలవరపెడితే

ఆనందం ఆమడదూరంలో నిలిచి
ఆశలబుడగల్నిపుట్టిస్తూ ఊరిస్తుంటే

బాధల్ని కౌగిలించుకున్న దేహం
ఆత్మన్యూనతా ఉరితాళ్ళను
తప్పించుకోవాలని తపనపడుతుంటే

మనోవేదనాముళ్ళకంచె
ముప్పేటలా అల్లుకుపోతూ
గాలిలోదీపంలా మారిన ప్రాణాన్ని
నిలబెట్టుకోమంటూ సవాలు విసురుతుంటే

అనుక్షణం మరణిస్తూ బ్రతుకుతూ
మౌనభాషణమే గాని మాటేకరువైపోతుంటే

మనోనిబ్బరపు చురకత్తులతో
వేదనా సాలెగూళ్ళను తెంచి
జ్ఞానసంచయజోలెనునింపుకుంటే చాలు
నేడు కాకున్నా రేపైనా
కూలే స్వప్నాలను కూర్చుకుని
ఆవలితీరంలో గెలుపు పాదాన్ని మోపగలవు...!

**రమాదేవి బాలబోయిన**
వరంగల్
6281216735

సాహిత్య విమర్శ

# స్త్రీవాద రాజకీయాలు దళిత స్త్రీవాదం



- నందిగామ నిర్మలకుమారి



వందల ఏళ్ళుగా ఈ సమాజం మీద పురుషుడు ఆధిపత్యాన్ని చెలాయించాడు. పురుషాదిఖ్యత వ్యవస్థీకృత మై తన ఆదిపత్యాన్ని చెలాయించడం మొదలు పెట్టింది. ఆదిమ సమాజాల నుండి మనిషి ఆధునికుడిగా మారేదాకా "న స్త్రీ పూజ కనర్హం" అనే పేరుతో స్త్రీని విద్యకు బహిరంగ నాగరిక జీవనానికి దూరంగా ఉంచారు. ఇది కేవలం ఒక్క భారతదేశం లో మాత్రమే లేదు ఆసియా, ఐరోపా, అమెరికా, మొదలు ప్రపంచం అంతటా వ్యాపించి ఉంది. దానిని అదిగమించడానికి కొన్ని వందల ఏళ్ళుగా అనేక పోరాటాలు జరిగాయి జరుగుతూనే ఉన్నాయి. మనిషి ఆలోచన, ఆహార్యం, ఆహారం, పని, కట్టు, బట్ట, నైతికత, నియమ నిబంధనల మీద నియంత్రణ, లింగ బేధం తర తరాలుగా వ్యాప్తి చెందుతూ పలు పాయలుగా విస్తరిల్లింది.మొదట స్త్రీల పట్ల ఈ అణిచివేత బలప్రయోగం ద్వారా పెత్తనం చెలాయించింది మతం . స్త్రీ అణిచివేతకు మూలాలు అనేక మతాలలో ఉన్నాయి. హిందూ మతం లో స్త్రీలు వేద అధ్యయనానికి దూరంగా గుడిలో ప్రవేశం కూడా లేకుండా చేసింది.ఇలా స్త్రీని అనిచివేసే ధోరణి అన్ని ధార్మిక పాయల్లోనూ ఉంది. పదిహేడో శతాబ్దం చివరిదాకా స్త్రీలను విద్యకు ముఖ్యంగా క్రైస్తవం మహిళల మీద అనేక ఆంక్షలు పెట్టింది. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల సమాన హక్కుల కోసం సమాన గౌరవం కోసం గుడిలో బడిలో ప్రవేశాల కోసం అచంచల విశ్వాసంతో పనిచేసిన స్త్రీవాదులు ఎంతో మంది ఐరోపా అమెరికా దేశాలలో త్యాగాలు చేసారు. పదహారు పదిహేడో శతాబ్దాల చివరినాటికే స్త్రీల కోసం ప్రత్యేక విద్యాలయాల నిర్మాణం జరిగింది. పద్దెనిమి పందొమ్మిదో శతాబ్ద చివరినాటికి భారతదేశంలో సతీ సహగమనం, కన్యాశుల్కం కు వ్యతిరేకంగా వితంతు పునర్ వివాహ వ్యవస్థకోసం అనేక సంస్కరణలు మొదలయ్యాయి. మొదట స్త్రీని మనిషిగా గుర్తించడానికి, పనిలో సమాన వేతనం కోసం, రాజకీయ స్వావలంబన కోసం కుటుంబ ఆస్తిలో హక్కుకోసం అంతిమంగా రాజకీయ ప్రాతినిధ్య పోరాటం. ఇది కేవలం ఒక్క రోజులో జరిగిన పోరాటం కాదు. దాని వెనక అమెరికా, ఆసియా ఐరోపా దేశాలలో జరిగిన మేధో చర్చలు వలస దేశాలలోకి వ్యాప్తి చెందాయి.

వీటి అన్నిటికన్నా ముఖ్యంగా ఆడ-మగ అనే రెండు జీవుల మధ్య శారీరక మానసిక అంశాల ను శాస్త్రీయంగా పరిశోధన చేయడం మొదలు అయ్యింది.ఇలా లింగ బేధం అనేది పుట్టుకతో ఆపాదించబడినా, తన వైయుక్తిక అలవాట్లు అభిరుచులకు అనుగుణంగా తన లింగ మార్పిడి చేసుకునే క్రమం కేవలం శారీరక సర్దుబాటు మాత్రమే కాకుండా సాంస్కృతికంగా ఉత్తమ లేదా అధమ అనే పేరుతో జరుగుతున్న లింగ వివక్షను మేధోపరంగా ఎదుర్కొనే క్రమానికి ఈ చర్చలు దోహదపడ్డాయి. పందొమ్మిది వందల అరవై వ దశకంలో అమెరికా కేంద్రంగా అనేక ప్రత్యామ్నాయ ఆలోచనలు బయలుదేరాయి.

1982 లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం చాలా దేశాలలో స్త్రీవాదులను మేల్కొలిపింది. తర తరాలుగా పితృస్వామిక భావదాస్యం, పీడనను,స్వేచ్ఛా రాహిత్యాన్ని

ఎండగట్టారు సంఘటితం అయ్యారు. సామాజిక సాంస్కృతిక వెనకబాటు తనాన్ని ప్రశ్నించారు.

"60వ దశాబ్దంలో పౌరహక్కుల,నల్లజాతివారి హక్కుల,యుద్ధ వ్యతిరేక ఉద్యమాలలో చురుగ్గా పనిచేసిన పాశ్చాత్య దేశాల మహిళలు తాము పనిచేస్తున్న సంఘాల్లోనే, తమ కామ్రేడ్లే, తమ పట్ల వివక్ష చూపుతున్నారని బాధపడ్డారు. ఈ స్త్రీలలో చాలామంది వామపక్షాలకు చెందినవారు. వాళ్ళ పార్టీలలో పురుషాదిపత్యాన్ని గురించీ,సెక్షిజమ్ గురించి ప్రశ్నించడం, పోట్లాడడం మొదలు పెట్టారు." (ఓల్గా. నీలి మేఘాలు. 26: 2007).

ఈ వివక్ష అణిచివేత వెనక తరతరాలుగా వ్యవస్థీకృత అయిన పురుషాదిపత్య అహంకారం ఉంది అని నాడు కొందరు స్త్రీవాదులు గ్రహించారు. స్త్రీల సమాన హక్కుల కోసం జరిగిన పోరాటం కావొచ్చు, అవాంచిత గర్భ విచ్చిత్తి హక్కు కావొచ్చు, పనిలో సమాన గౌరవం కోసం తాము పనిచేస్తున్న కార్యాలయాలలో ఇంట బయటా ఆ అణచివేతను ప్రశ్నించడం మొదలు పెట్టారు. అమెరికా ఫ్రాన్స్, బ్రిటన్ లాంటి దేశాలలో సామాజికంగా రాజకీయంగా తమ కలాలను గళాలను బలంగా వినిపించడం మొదలుపెట్టారు. దాని మొదలు స్త్రీవాద రాజకీయాలు ఒక బలమైన తాత్విక పాయగా బయలుదేరాయి . ఆనాడు పలు దేశాల్లో స్త్రీల పట్ల ఉన్న అప్రకటిత వివక్షకు వ్యతిరేకంగా చట్టాలు మొదలు పెట్టాయి . దేశ శాస్త్ర సాంకేతిక రంగాలలో రక్షణ రంగం లో సైతం మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉండాల్సిన ఆవశ్యకతను పౌర సమాజం గుర్తించింది. మొత్తంగా స్త్రీవాద రాజకీయాలు ఎక్కడ మొదలు అయినా వాటి ప్రాసంగికత మాత్రం తగ్గలేదు. పురుష ఆధిక్యతను ప్రశ్నించడానికి ఎక్కడినుండో వాదాలను అరువు తెచ్చుకోవాల్సిన అవసరం లేకున్నా తెలుగు నేల మీద స్త్రీవాద రాజకీయాలు ఆలస్యంగా నే మొదలు అయ్యాయి అని చెప్పుకోవచ్చు.

తెలుగు సమాజాన స్త్రీ సాహిత్యం లో పురుషులతో సమానంగా కావ్య రచనలో ఉన్నప్పటికీ ఆధునిక స్త్రీవాద దృక్కోణం నుంచి స్త్రీల సమస్యలను కవిత్వంలో భాగం అవడం పందొమ్మిది వందల డెబ్బైల తర్వాతనే మొదలు అయ్యింది అనుకోవచ్చు. వీటికి తోడుగా వామపక్ష, విప్లవ శిభిరాలలో సైతం స్త్రీల హక్కుల మీద చర్చలు మొదలు అయినవి. స్త్రీ శక్తి సంఘటన, ప్రగతిశీల మహిళా సంఘం, చైతన్య మహిళా సంఘం, మొదలు అనేక రాజకీయ పార్టీల లోనూ మహిళా విభాగాలు ఏర్పాటు జరిగినవి. అనేక కులసంఘాలు వాటికి అనుబంధంగా మహిళా కమిటీలు వేయడం కూడా తీవ్రతరం అయ్యింది. ఏది ఏమయినా అన్ని రంగాలలో స్త్రీల హక్కుల కోసం ఒక సానుకూల వాతావరణం మొదలైనది. పాక్షికంగా అయినా స్త్రీవాద రాజకీయాలకు అదొక సానుకూల ఘట్టం. కానీ ఆయా నిర్మాణాలలో ఆచరణలో సాధిం చాల్సింది మిగిలే ఉంది.

తెలుగు సాహిత్యం లో ప్రబంధ కవిత్వం మొదలు నవ్య, అభ్యుదయ కవిత్వం అనేక వందల సంకలనాలుగా ప్రచురించిన బడినప్పటికీ ఆయా సంకలనాలలో స్త్రీల కవిత్వానికి చోటే లేదు.1910-35 మధ్యల వచ్చిన కవిత్వాన్ని సామినేని ముద్దు కృష్ణ "వైతాళికులు" పేరుతో ప్రచురించాడు అందులో చాలా మంది కవుల పేర్లు చేరనివి చేరాల్సినవి ఎన్నో ఉన్నా అందులో ముగ్గురు స్త్రీలకు మాత్రమె ప్రాతినిత్యం దొరికింది. ఆ తర్వాత 'మహోదయము' అనే సంకలనం వచ్చినా పరిస్థితి మారలేదు. ఆ క్రమం లో స్త్రీల కు జరుగుతున్న అన్యాయం అప్రకటిత వివక్ష ముఖ్యంగా కవితాలోకం సహించలేక పోయింది. 1990 డిసెంబర్ లో కవిత్వం ప్రచురణలుగా త్రిపురనేని శ్రీనివాస్ "గురిచూసి పాడే పాట" గా ప్రచురించే నాటికి రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా స్త్రీవాద స్పృహ తో కొంతమంది మహిళా కవయిత్రులు ఆ సంకలనం లో తమ కవిత్వాన్ని నమోదు చేసారు. కొండేపూడి నిర్మల "హృదయానికి బహువచనం" అనే కవితతో మొదలైన ఆ కవితా సంకలనం లో విమల,ఓల్గా, వసంత కన్నభిరాన్, ఘంటశాల నిర్మల, జయప్రభ, సావిత్రి, శిలాలోలిత తదితురుల కవిత్వాన్ని మొదటిసారి ఆ సంకలం లో ప్రచురించారు. ఆ క్రమం లోనే అస్మిత రీసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ 1972-92 మధ్యలో వచ్చిన స్త్రీవాద సాహిత్యాన్ని "నీలిమేఘాలు" పేరుతో చారిత్రకమైన కవితా సంకలనం తెచ్చారు. తెలుగు సాహిత్యం లో అందునా స్త్రీవాద రాజకీయాల లో అది ఒక మైలురాయి.

తెలుగు సాహిత్యం లో ఇదొక సంచలనం. నీలి మేఘాల ఆగమనం మొదలు స్త్రీవాద సాహిత్యం చిరుజల్లు గా మొదలై జడివాన గా మారింది. కవిత్వం లో స్త్రీవాద పాయ ఒక బలమైన వ్యక్తీకరణ గా మారింది. అన్వేషి, అస్మిత, స్త్రీ శక్తి సంఘటన లాంటి సమూహాల స్త్రీవాద సాహిత్యానికి అనువైన పరిశోధనాత్మక వ్యాస సంకలనాలు, చర్చలు సెమినార్ల నిర్వహణ, అనువాదాలు మొదలు పెట్టాయి. విశ్వవిద్యాలయాలలో స్త్రీవాద సాహిత్యం పరోశోధనా అంశంగా మారింది. దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల లో సామాజిక శాస్త్రాల సంస్థల్లో 'సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ డిపార్టుమెంటు' లాంటి స్త్రీ వాద అనుకూల శాఖ ల ఏర్పాట్లు మూలంగా స్త్రీవాద రాజకీయాల చర్చలు

ఊపందుకున్నాయి.

అనుభవాల పునాదిగా స్త్రీవాద జ్ఞాపకాల చరిత్రలు ముందుకు వచ్చాయి. మొదటి తరం స్త్రీవాద నాయకత్వం “మనకు తెలియని మన చరిత్ర” పేరుతో ఒక పుస్తకాన్ని తీసుకొని వచ్చారు. జాతీయ ఉద్యమం లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం లో పాల్గొని చరిత్ర పుస్తకాల లో నమోదు కాని కొందరి జీవితాలకు చరిత్ర రచనలో స్థానం కల్పించే ప్రయత్నం చేసారు. స్త్రీవాద రాజకీయాలను మరింత ముందుకు తీసుకొని వెళ్ళడానికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషలలో సైద్ధాంతిక గ్రంధాలను అనువాదం చేసి ప్రచురించారు. ఇంత విస్తృతంగా బలమైన పాయగా విస్తరిల్లిన స్త్రీవాద సాహిత్యం ఒక రకంగా సాహిత్య వీధుల్లో ప్రకంపనలే సృష్టించింది. అది ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేయడానికి అంతర్జాతీయ కుట్రగా అభివర్ణించిన కొందరి వాదనలను తిప్పికొట్టారు. స్త్రీవాదం అది నీలి కవిత్వం అనీ, వార కవిత్వం అనీ, రక్తస్రావ కవిత్వం అనీ, వొళ్ళు బలిసిన కవిత్వం అనీ, స్త్రీల కవిత్వాన్ని వారి శరీర ధర్మాలనూ మళ్ళీ హేళన చేసారు. అంతే కాకుండా స్త్రీవాద కవిత్వం లో “శరీర స్పృహ తప్ప సామాజిక ధర్మం లేదని” ఈసడించిన పురుష మేధావులూ ఉన్నారు. వాస్తవానికి అది ఏటికి ఎదురీదడం లాంటిది.

ఒకవైపు స్త్రీవాద చర్చలు బలంగా ముందుకు వచ్చిన సందర్భం లోనే భిన్న వ్యక్తిత్వాలు భిన్న అస్తిత్వాలు తమ అనుభవాలు జ్ఞాపకాలు మిగతావారి కంటే ఎందుకు భిన్నమైనవో వాదించడం మొదలు పెట్టారు. కొంత మంది మహిళా కవయిత్రులు ఏర్పాటు చేసుకున్న ‘ప్రజాస్వామిక రచయిత్రుల వేదికలో’ భాగం కాని కొందరు దళిత బహుజన స్త్రీవాద రచయిత్రులు తమ అనుభవాలు హైజాక్ చేయబడుతున్నాయి అనీ, తమ సమస్య లను తామే పరిష్కరించు కుంటాము అని “మట్టి పూలు” అనే సాహిత్య వేదిక ఏర్పాటు చేసుకున్నారు ఈ ఆవిర్భావం చారిత్రాత్మకం. ఈ చర్చ కేవలం ఒక ప్రత్యామ్నాయ ఆలోచన మాత్రమె చేయదు అనీ దళిత బహుజన మహిళల కష్టసుఖాలు ఆధిపత్య స్త్రీల కు ఏనాటికీ అర్ధం కావనీ, వాళ్ళకు కేవలం సానుభూతి సహానుభూతి మాత్రమె సరిపోదు అనీ ఆ జీవితాన్ని అనుభవించిన వాళ్లకు మాత్రమె అర్ధం అవుతుంది అని వాదించారు. అగ్రవర్ణ స్త్రీవాదులు చెబుతున్న స్త్రీవాదం కేవలం వాళ్ల ఆధిపత్య కులాల సమాజాలు కల్పించిన వెసులుబాటు మాత్రమే అనీ దళిత స్త్రీలు ఒక వైపు కుల అణిచివేతను పితృస్వామిక దురహంకారాన్ని అనుభవిస్తున్నారు అని రెండు భిన్న ప్రపంచాలు అనీ, అవి ఎన్నటికీ కలవవు అని భిన్నమైన అభివ్యక్తిని తమ కవిత్వం లో భాగం చేసారు. జూపాక సుభద్ర, గోగుశ్యామల, షాజహానా, జాజుల గౌరీ, దెంచనాల జ్వలిత,వినోదిని,విజయ లక్ష్మి, చంద్రశ్రీ, మేరి మాదిగ, రాగరాజేశ్వరి , తదితరులు ‘మట్టి పూలు’ దళిత స్త్రీవాద సాహిత్య పాయను విజయవంతంగా నడుపుతున్నారు. అస్తిత్వ ప్రాతిపదికన నిలబడ్డ సమూహాలు పీడక పీడిత స్పృహ ఎరిగినప్పుడు మాత్రమే ఆ అస్తిత్వ సమూహానికి ఒక చారిత్రక విలువ సామాజిక ప్రాసంగికత ఉంటాయి. ఆ రకంగా చూసినట్టయితే ఆధిపత్య స్త్రీ అనుభవించే పీడన కింది సమూహాల నుంచి వచ్చిన స్త్రీలు అనుభవిస్తున్న వేదన పీడన ఒకటే అని మనం అనలేము. అవి రెండు భిన్నమైన సమూహాలు భిన్న అస్తిత్వాలు ఆ రెండు సమూహాలు అనుభవించే ఘర్షణ మాత్రం ఒకటే అనలేము. మొత్తంగా స్త్రీవాదం ఒక బలమైన పాయగా మొదలైనా ఒక సమస్య నిర్దిష్టత నుండి అతి నిర్దిష్టత గా ప్రయాణించి నట్లు స్త్రీవాదం దళిత, వెనకబడిన ముస్లిం అస్తిత్వం రూపంలో సారంలో ఒకటి కావనీ, శిల్ప సాదృశ్యం కావనీ, వేటి అస్తిత్వ ఉనికి వాటిదే అని పోరాడి నిలబడ్డారు. ఇది నిజానికి ఒక గుణాత్మకమైన మార్పు ఆహ్వానించ దగిన చర్చ. వర్తమాన సామాజిక సాంస్కృతిక చర్చల్లో, వాదాల లో మరింత జాగురూకతతో మమేకం అవడం మాత్రమే ఆ వాదానికి సార్ధకత ఇచ్చిన వాళ్ళం అవుతాం.

**ఉపయుక్త గ్రంధ సూచి**


1. ఓల్గా: నీలి మేఘాలు. స్త్రీవాద కవిత్వం.అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్. సికింద్రాబాద్,2007.
2. త్రిపురనేని శ్రీనివాస్. గురిచూసి పాడేపాట స్త్రీవాద కవితలు, కవిత్వం ప్రచురణలు, హైదరాబాదు,1990
3. ముదిగంటి సుజాతా రెడ్డి, తెలంగాణ తొలితరం కథలు రోహణం పబ్లికేషన్స్. హైదరాబాదు,2002
4. ఏ.కె.ప్రభాకర్. బహుళ : సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు. ప్రమేయాలు.పరికరాలు: పర్స్పెక్టివ్స్ ప్రచురణలు, హైదరాబాదు. 2018
5. ఎస్.వి సత్యనారాయణ. స్త్రీవాద వివాదాలు, విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాదు,1997. ★



**నందిగామ. నిర్మలకుమారి**

Asst.Prof. of Telugu

ప్రభుత్వ డిగ్రీ & పీజి కళాశాల, సిద్దిపేట, తెలంగాణ

neerunandigama@gmail.com

చరవాణి : 09490369252.

అస్తిత్వ వ్యాసం

# వందేళ్ల నిరీక్షణ తప్పదా?



- నస్రీన్ ఖాన్

ఆకులూ అలములు చుట్టుకునే దశలోనే నిర్ణయాత్మక పాత్ర పోషించింది మహిళ. అటువంటి మహిళ ఇప్పుడు సాధికారత దిశగా అడుగులు వేస్తోంది. అయినా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మరో వందేళ్లు గడిచినా సమానత్వం అనేది ఎక్కలేని కొండేనని ఇటీవల వెలువడిన నివేదికలు చెబుతున్నాయి. పురుషులతో సమాన హక్కులను రాజ్యాంగం కల్పించినప్పటికీ ఆచరణ శూన్యం. ఇక ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించడం అంటే ఇసుక నుంచి తైలం తీయడంలాంటిదన్నమాట. ఇవే కాదు అసమానతా ప్రపంచంలో కొట్టుమిట్టాడే మహిళ తన స్థానాన్ని మార్చుకోవాలని ఎంత ప్రయత్నించినా అడ్డంకులు ఎన్నెన్నో ఉన్నాయని 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్' స్పష్టం చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళల స్థితిగతులపై 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్'వాస్తవ స్థితిని తెలుసుకునేందుకు గత సంవత్సరం ఒక అధ్యయనం చేపట్టింది. స్త్రీ పురుష సమానత్వం నిరాశాజనకంగా ఉన్నట్లు నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో రెండు శతాబ్దాలు గడిచినా మహిళ కోరుకునే సమానత్వం దక్కుతుందనేది కల్ల అని అనుమానం వ్యక్తం చేసింది. ఈ అసమానత ఇలాగే పెరుగుతూపోతే మహిళల ఉనికి ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఎందుకిలా? మొక్కై వంగనిది మానై వంగునా? సామెత ఎంత పాతదో ఆడపిల్లల పట్ల వివక్షా అంతటి పాతది. ఆధునికత వైపు పరుగులు తీస్తున్న మన సమాజం అత్యంత అధునాతన సాంకేతికతను వినియోగించడంలో ముందుంటుంది. భూతద్దం అక్కరలేని బంగరు భవితను సృష్టిస్తున్నామని నిపుణులు, పాలకులు కలలుగంటున్నారు. ఒక్కసారి బాలలకు అందించే విద్యావిధానాన్ని గమనిస్తే ఆ భ్రమలు పటాపంచలు అవుతాయి. బాలలకు బోధనాంశాలను ఎంపికచేసే మేధావులు చేసిన తప్పిదాలు బాల్యం నుంచే ఆడపిల్లలపట్ల వివక్షను ప్రోత్సహించేలా ఉండడమే ఇందుకు కారణం.

తెల్లటి పేపరు వంటి బాలల మనోఃఫలకంపై ఏది లిఖిస్తే వారు పౌరులుగా ఎదిగాక అదే ప్రతిఫలిస్తుంది. ఇటువంటి స్థితిలో పిల్లలకు నేర్పించే పాఠాల రూపకల్పనకు పంచేంద్రియాలు నిమగ్నం చేయగలిగే మేధావులనే ఎంపిక చేస్తారు. అయినప్పటికీ విద్యాబోధనకు ఉపయుక్తమయ్యే పాఠ్యపుస్తకాలలో ప్రాథమిక స్థాయి నుంచే లింగవివక్ష ప్రారంభమవుతోంది. ఈ వివక్ష ఒక్క భారత్ లోనే ఉందనుకుంటే పొరపాటు. ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి బోధనే కొనసాగుతుండడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసినా ఇదే వాస్తవం. ప్రాథమిక విద్యను బోధించే ఒక పాఠ్యపుస్తకాన్ని పరిశీలిస్తే... ఇది ఎటువంటి ఆందోళనో అర్థమవుతుంది. ఉదాః

★అమ్మ – పిల్లల సంరక్షణ చూసుకుంటూ అన్నం వండుతుంది.

★నాన్న– ఆఫీసుల్లో పని చేస్తారు.

★పురుషుడు – పోస్ట్ మాన్ నుంచి వైద్యుడి వరకు విభిన్న వృత్తులకు సూచికగా.

★స్త్రీ – వంట చేయడం నుంచి బట్టలు ఉతకడం, పిల్లలు, వృద్ధుల సంరక్షణ, ఇంటిని చూసుకోవడం, ఇంటి పనుల్లో నిమగ్నమై ఉంటుందనేలా చిత్రీకరణ.

ప్రాథమిక విద్యను అందిస్తున్న పాఠ్యపుస్తకాల్లో

ఇటువంటి ఉదాహరణలు ప్రపంచవ్యాప్తంగా ఉండడం విచారకరం. పాఠాల్లోని వాక్యాలు, పేర్లు పెట్టిన పాత్రలు, శీర్షికలు, సూచనల్లో ప్రస్తావనలలోనూ ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే విషయంపై యునెస్కో గత ఏడాది ఒక హెచ్చరిక జారీ చేసింది. పాఠ్యపుస్తకాల్లోని లింగ వివక్ష ధోరణులు ఎంత లోతుగా ఉన్నాయంటే... అవి బాలికల విద్యను నిర్లక్ష్యం చేయడంతోపాటు వారి వృత్తిపరమైన, జీవనపరమైన ఆకాంక్షలను చాలా వరకు కబళించి వేస్తున్నాయని, లింగ సమానత్వాన్ని సాధించడానికి అవి పరోక్షమైన అడ్డంకిగా ఉన్నాయని స్పష్టం చేసింది. అంతేకాదు పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల రూపకల్పనలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడం కూడా ఒక కారణమని యునెస్కో 2016 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్(జీఈఎం) నివేదికకు డైరెక్టర్ గా పని చేసిన బెనావట్ అభిప్రాయం.

భాష కూడాః సామాజికాభివృద్ధికి వాడుక భాష ముఖ్యమైనది. అటువంటి భాషను రోజువారీ కార్యకలాపాలలో వినియోగించడంలోనే ఎన్నో అపశృతులు దొర్లుతుంటాయి. ఎలా అంటే... మానవాళి మొత్తానికి ప్రతినిధిగా పురుషుడిని మాత్రమే గుర్తించడం, పురుషులకు ఏవైతే పదాలు వాడతామో అవి ప్రత్యక్ష,పరోక్ష సందర్భాలలో వినియోగం అవుతుండడం. అంతేకాదు రోజువారీ జీవితంలో మహిళల పాత్రలు పురుషుల పాత్రలతో కలగలిసి అలా అనామకంగా అదృశ్యమవుతుండడం వంటి అనేక అంశాలు పరిగణలోకి తీసుకుని ఈ అధ్యయనాన్ని విశదీకరించారు. మహిళల పరిస్థితి విశ్వ వ్యాప్తంగా ఇలాగే ఉండడం విచారానికి గురి చేసే అంశమే.

విద్యా రంగంలోనూ వెనుకబాటే! ఇన్నాళ్లూ సంప్రదాయ సామాజిక శాస్త్రాలైన భాష, సాహిత్యం, లలిత కళలు, సామాజిక శాస్త్రం, చరిత్ర వంటి పరిమిత అంశాలనే ఎంచుకునే ఆడపిల్లలు ఇప్పుడు శాస్త్ర సాంకేతిక, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల్లో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎయిమ్స్‌లలో చదివే మహిళల శాతం ఏటా పెరుగుతూ వస్తోంది. ఈ పరిణామాలు మహిళల సాధికారతకు నిదర్శనంగా నిలుస్తున్నప్పటికీ పురుషులతో పోల్చిచూస్తే విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో స్త్రీల పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా ఆశించిన స్థాయిలో లేదనేది కఠోర సత్యం. ఇందుకు దిల్లీలోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ 2016లో రూపొందించిన విజన్ డాక్యుమెంటే నిదర్శనం. ఈ డాక్యుమెంట్ ప్రకారం భారత్‌లో ఉన్నత విద్యారంగంలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది. ఆర్ట్స్, సామాజిక శాస్త్రాల కోర్సుల్లో 40శాతం చేరితే; ఇంజినీరింగ్, టెక్నాలజీలో కేవలం 16.34శాతం ఉన్నారు. సైన్స్‌లో 12.6శాతం, ఐటీ–కంప్యూటర్స్‌లో 4.11శాతం, మెడిసిన్‌లో 2.87శాతం చొప్పున ఉన్నారు.

వివక్షను రూపుమాపే అంశంపై చిత్తశుద్ధిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లింగ వివక్షను ప్రోత్సహించే విద్య, భాష, ప్రవర్తనల పట్ల ప్రజలకు స్పష్టమైన నిర్దేశకాలు జారీ చేయడంతోపాటు వివక్షను ఎదుర్కొనే సామర్థ్యం పట్ల ఆడవారికి అవగాహన కలిగించే అవసరాన్ని ప్రభుత్వాలు తక్షణమే గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

సమానత్వంలో భారత్ ఎక్కడుంది?

– స్త్రీ–పురుష సమానత్వం విషయంలో భారతదేశం 21 పాయింట్లు దిగజారి 108 స్థానానికి పడి పోయింది.

– పొరుగు దేశాలైన చైనా, బంగ్లాదేశ్ కూడా భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

– మహిళలకు తక్కువ వేతనాలు, ఆర్థిక వ్యవహారాల్లో వారి భాగస్వామ్యం లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా డబ్ల్యూఈఎఫ్ అంచనా వేసింది.

– 170 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదిక తయారు చేశారు.

– మహిళలకు గోవా సురక్షిత ప్రాంతమని, బీహార్‌లో స్త్రీలకు రక్షణ తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది.

– మహిళా ఆరోగ్యం విషయంలో కేరళ టాప్ ప్లేస్‌లో ఉంది. ఆ తర్వాత తమిళనాడు, సిక్కిం, కర్ణాటక, ఏపీ, గోవా, మహారాష్ట్ర ఉన్నాయి.

– ఈ విషయంలో బిహార్ అట్టడుగు స్థానంలో ఉంది.

– విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో మొత్తంగా చూస్తే తెలంగాణ 11వ స్థానంలో, ఏపీ 12వ స్థానంలో ఉన్నాయి. ★

- నస్రీన్ ఖాన్

వ్యాసం

# నాలుగు దశాబ్దాల సిజేరియన్ చరిత్ర



- డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి
ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ & గైనాకాలజిస్ట్

ప్రజలలో డాక్టర్లపట్ల, వాళ్ళు చేస్తున్న సిజేరియన్ ఆపరేషన్లపట్ల చాలా అపోహలున్నాయి. వాటిని తొలగించడానికి, అపోహలు అనే తిమిరంలో వున్న పేషెంట్స్ ముందు సిజేరియన్ ఆపరేషన్లు ఎందుకు జరుగుతున్నాయి? అనే అంశాన్ని వెలుగులోకి తెచ్చి వాళ్ళని ప్రభావితం చేయకపోతే... అటు పేషెంట్లు నష్టపోతారు. ఇటు డాక్టరు కూడా అవిరామంగా అపనిందలపాలవుతూనే వుంటారు. అందుకే మెడిసన్ పట్ల సైంటిఫిక్ అవగాహన తెచ్చేందుకే ఈ ప్రయత్నం.

కాన్పు అంటే అది సహజంగానూ కావచ్చు. తప్పనిసరి పరిస్థితులలో ఆపరేషన్వల్లా కావచ్చు. కానీ కాన్పుకు నిర్వచనం ఇవ్వాల్సివస్తే అది తల్లినీ బిడ్డనీ క్షేమంగా విడదీసి అందించే ఒక నైపుణ్యమైన ప్రక్రియ.

ఏ డాక్టరూ ధనార్జనకోసమో, ఓపికలేకనో సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డనుతీయడంలేదు. ప్రతి డాక్టర్కి ఓపిక వుండాలి. ఎందుకంటే డాక్టర్లు దానికి సిద్ధపడే ఆ ప్రొఫెషన్ ఎన్నుకున్నారు. అది లేకపోతే వాళ్ళు రాణించలేరు. తొందరపడి ఆపరేషన్స్ చేస్తే వాళ్ళు ఫీల్డులో నిలవలేరు. ఇది సత్యం. మా కోసమైనా మేము, మా పేషంట్స్ కి ఓపిక+నైపుణ్యం కలిపిన ట్రీట్మెంట్ ఇచ్చి తీరాలి.

పేషంట్స్ కి ఫలానా తేదీ లోపల మీ కాన్పు జరగాలి అని చెప్పినా కొందరు. రారు. అలా ముందుగా వెళ్తే ఆపరేషన్ చేస్తారని భయం.

తల్లి గర్భంలో వున్న బిడ్డ 9 నెలల 7 రోజులు పెరిగిన తర్వాత ఈ ప్రపంచంలోకి వచ్చేయాలి. ఆలస్యం చేస్తే తల్లి గర్భకోశంలో పెరిగిన ఆ బిడ్డకు ఇక అక్కడ పెరిగే అనుకూల వసతులు లేక కడుపులోనే కన్నుమూసే అవకాశం వుంది లేదా బతికి పుట్టినా గర్భాశయంలో తగిన ఆక్సిజన్ అందక బ్రెయిన్ పెరుగుదలలో లోపం వచ్చే ప్రమాదమూ వుంది. ఇప్పుడు వైద్య అవగాహన లేక అనవసరమైన అపోహలతోనూ సకాలంలో కాన్పు చేయించుకోనందువల్ల, తన రక్తంలో రక్తం అయిన తన బిడ్డ జీవితం నరకప్రాయం అవుతోంది. ఒకవేళ డాక్టర్ లెక్కలు కట్టి చెప్పిన టైమ్ కి ఇంకా టైమ్ వుందనుకున్నా హాస్పిటల్కు చెకప్ కొచ్చి ఆ విషయం డాక్టర్ని కన్సల్ట్ చేసి నిర్ధారణ చేసుకుని ఇంటికి వెళ్ళిపోవచ్చు.

మరి! అయితే ఇప్పుడు ఎందుకు ఆపరేషన్ కాన్పుల సంఖ్య పెరిగింది?. నిజమే ఆపరేషన్లు చాలా పెరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే మామూలు కాన్పులు ఆపరేషన్ల కాన్పుల సంఖ్య తిరగబడిపోయింది. 1970 ప్రాంతంలో 95% మామూలు కాన్పులైతే 5% సిజేరియన్ అయ్యేవి. 2020 నాటికి కొన్ని చోట్ల 90% పైనే ఆపరేషన్ కాన్పులవుతున్నాయి. ఇందులో 60% అవసరమై చేసే కాన్పులు. (ఆ అవసరాలేమిటో మరలా ప్రస్తావిస్తాను) మిగతా 40% అనవసరంగా ఆపరేషన్స్ అవుతున్నాయి. కారణం ఏమిటి ?

**మొదటి కారణం:**

పేషెంట్స్ వైద్య విజ్ఞాన రాహిత్యం

ప్రతి బిడ్డా గర్భకోశంలో వుండగా గానీ, కాన్పు అయ్యే ప్రయాణమార్గంలో గానీ, అంతోఇంతో ఉమ్మనీరు తప్పకుండా తాగుతారు. దానివల్ల ప్రమాదం ఏమీలేదు. పైగా ఈ భూమి మీద తొలిపాదం పెట్టిన ఆ ప్రాణికి తాను తాగిన ఉమ్మనీరులో వుండే ప్రోటీన్స్ చాలా అవసరం. కాకపోతే బిడ్డ శ్వాసనాళాల్లోకి ఆ ఉమ్మనీరు పోతేనే ప్రమాదం. దానికి కారణం డాక్టర్ల, నర్సుల అశ్రద్ధ కాదు. ఎందుకంటే ప్రసవం జరిగిన క్షణంలోనే బిడ్డను తలక్రిందులుగా పట్టుకుంటాం. శ్వాసనాళాల్ని గొట్టంపెట్టి శుభ్రం చేస్తాం. బిడ్డ ఒక్కోమారు భూమిమీద పడకముందే అంటే డాక్టర్ల చేతుల్లోకి రాకముందే తొందరపడి శ్వాస తీసుకుంటుంది. అలాంటి సమయాల్లో కూడా పల్చటి నీరు అంతగా ప్రమాదం కలిగించదు. బిడ్డ గర్భసంచిలో వుండగానే చిక్కటి మలవిసర్జన చేస్తే, ఆ చిక్కటి ద్రవం శ్వాసనాళాలకు అడ్డుపడి, ఎన్ని ప్రయత్నాలు జరిపినా, ఊపిరితిత్తుల్లోకి ఆక్సిజన్ వెళ్ళే మార్గం మూతబడి, ఆ లేత బిడ్డకు మరణం సంభవిస్తుంది. అలాంటి శిశుమరణాలు తప్పించడానికి, మామూలుకాన్పు లేటవుతుందనుకుంటే, మస్తుతో కూడిన ఉమ్మనీరు చూసినప్పుడు ఆపరేషన్ చేస్తాము.

పేషంట్స్ అపోహపడుతుంటారు. "మేము నెలనెలా పరీక్ష చేయించుకుంటూనే వున్నాము కదా! అప్పుడు ఆపరేషన్ అవుతుందని ఎందుకు చెప్పలేదు" అని రెగ్యులర్ పేషంట్స్ చెకప్కి

వస్తే... గర్భం వచ్చింది మొదలుకుని కాన్పు వరకూ ఎలాంటి ప్రమాదం సంభవించకుండా ముందుగా కాన్పురాకుండా చూడగలము. అంతేగానీ, కాన్పుటైము రాకముందుగానే ఆపరేషను అవుతుందని తొంభైతొమ్మిది పర్సెంటు కేసుల్లో చెప్పలేము. పేషంట్స్ పెల్విస్... అంటే బిడ్డ ప్రయాణం చేసి వచ్చే ఎముకల గూడు బిడ్డ తలకంటే చిన్నదిగా వున్నప్పుడు, మాయ గర్భసంచి. ద్వారానికి అడ్డంగా వున్నప్పుడు ఇదివరకు రెండు, మూడు కాన్పులలో బిడ్డలు చనిపోయివుంటే తప్ప చెప్పలేం. కాన్పుటైములో నొప్పులు రావాల్సినంత తీవ్రతతో రాకపోవడం, నొప్పులు వచ్చినా గర్భద్వారం విచ్చుకోకపోవడం, విచ్చుకున్నా బిడ్డ శిరస్సు తీసుకోవాల్సిన టర్న్ తీసుకోకపోవడం.. కడుపులో బిడ్డకు హఠాత్తుగా ప్రమాదాలు సంభవించడం, ఇలాంటివి ముందుగా తెలియవు కదా! అంతెందుకండి! కాన్పుటైమ్లో సైతం తొలిస్టేజ్లో తేలిగ్గా అయిపోతుందనుకున్నవి. ఆపరేషన్ కావడం. ఎంతకీ శిరస్సు దిగకుండా, ద్వారం ఏర్పడకుండా, పేషంటునీ, డాక్టర్ని టెన్షన్లో పెట్టి, ఆపరేషన్ అవుతుందనుకున్న కేసెస్ మామూలుగా అవడం చాలామార్లు జరుగుతూ వుంటుంది. మామూలు అనుకున్నవి ఆపరేషన్ అయితే ముందుగా చెప్పకపోతిరనో, మావాళ్ళంతా ఇంటికెళ్ళిపోయారనో, లేక ముందుగా చెప్తే డబ్బు సర్దుకునేవాళ్ళంకదా! అనే పెషంట్స్... ముందు జాగ్రత్తగా 'ఆపరేషన్ అవ్వచ్చు' అనిచెప్పి అప్పుడు మామూలు కాన్పయితే 'డాక్టర్స్ అనవసరంగా భయపెట్టారు' అంటారు. పేషంట్స్ అమాయకత్వానికి రెండు నాలుకలయితే డాక్టర్ల పరిస్థితి ముందుకుపోతే నుయ్యి వెనక్కువెళ్తే గొయ్యి అనేలా వుంటుంది.

రెండోది: డాక్టర్స్ భయం – ఈ భయం ఏమిటి? దేనిపట్ల భయం? ఎందుకు భయం?

ఆ కథలోకి వద్దాం... దశాబ్దాల క్రితం పేషెంట్స్ డాక్టర్స్ ని నమ్మేవాళ్ళు. డాక్టర్స్ పేషంటిని నమ్మేవాళ్ళు. ఇప్పుడు రెండూ లేవు. కాన్పు కొద్దిగా వెయిట్చేస్తే. మామూలు కాన్పు అయ్యే ఛాన్సులున్నా ఒకవేళ బిడ్డకి ఏదైనా రిస్క్ సంభవిస్తే.... ఎలాగైనా ఆపరేషన్ కాన్పువద్దు మామూలుగా కాన్పయ్యేలా చూడండి అనే పేషంట్స్ నాలుక ఇప్పుడు మరోలా అంటోంది. మేమేదో ఆశకొద్దీ అడిగామనుకోండి మీరు ఆపరేషన్ చేసేసుండాల్సింది అని ఒకటి.

అలాగే ఆపరేషన్ అవడానికి అవకాశం వుంది అని చెప్పి టెనషన్ పడి మామూలు కాన్పు చేస్తామనుకోండి. 'డబ్బుల కోసం డాక్టర్స్ అలా చెప్తుంటారు. అయిపోలా సుళువుగా ? అనే వ్యాఖ్యానం మరొకటి.

ఆపరేషన్ అవుతుందని చెప్పిన కేసులు మామూలుగా కావచ్చు. తేలిగ్గా అయిపోతాయి అన్న కేసులు ఆపరేషన్లో ఎండ్ కావచ్చు. తల్లి గర్భాశయంలో బిడ్డ ఈ కొత్త లోకంలో కాలుమోపాలంటే.. ఎంతో ప్రయాణం చెయ్యాలి. గర్భసంచి తన వంతుగా బిడ్డను క్రిందకు నెట్టే ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నంలో ఆ తల్లి పెల్విక్ కండరాలు ఆ కొత్త ప్రాణిని ఆహ్వానిస్తూ కదలాలి. బిడ్డ దిగేకొద్దీ ద్వారం బిడ్డ పట్టేంతగా సాగుతూ వుండాలి. తల్లి కండరాల్లో శక్తి లేకపోయినా, ద్వారం విచ్చుకోకపోయినా, బిడ్డ సజావుగా సర్దుకొని ప్రయాణించకపోయినా బిడ్డ క్రిందకు దిగదు. ఇలాంటి సమయాల్లో ఆ బిడ్డను ఆహ్వానించడానికి రెండు చేతులుంటే సరిపోదు. తల్లి పొట్టమీద గాటు తప్పదు.

మేము మెడిసన్ చదివేటప్పుడు ఆపరేషన్ ఎందుకు చేయాలి? అనేది చెప్తూ మా మేడమ్ ఒక జోక్ వేసేవారు. ఆఖరి ఇండికేషన్ డాక్టర్స్ టెన్షన్ అని. ఇప్పుడు అది రివర్స్ అయింది. పేషెంట్లే తొలి టెన్షన్ అయింది. మా అమ్మాయి కష్టపడలేదనో లేకపోతే బిడ్డకేమైనా అయిపోతుందనో అదీ కాకపోతే చెడ్డ ఘడియలు, వస్తున్నాయి చేసేయమనో తొందరచేస్తున్నారు పేషంట్స్ పేరంట్స్.

ఆ రోజుల్లో స్కేనింగ్లు లేవు ఫీటర్ మోనిటర్స్ లేవు బిడ్డ లోపల ఎలావుందో తెలుసుకోవడానికి... కేవలం డాక్టర్స్ సమర్థత, సీనియారిటీ, ఎక్స్పీరియన్స్ కౌంట్ అయ్యేవి. అంతే.. డాక్టర్ వేళ్ళు పేషెంట్స్ పొట్టమీద నాట్యంచేసి బిడ్డ ఏ పొజిషన్లో వుందో చూసుకునేవి. ఒక చిన్న గొట్టం ఒకవైపు పేషెంటు పొట్టమీద, మరోవైపు డాక్టర్ల చెవిదగ్గర పెట్టి అక్కడ వినపడ్డ లబ్ డబ్ శబ్దాలతో బిడ్డబాగుందని నిర్ధారణ చేసి పంపేవాళ్ళు. ఉమ్మనీరు ఎంతవుందో తెలీదు. మాయ ఏ ప్రాంతంలో వుందో తెలీదు. బొడ్డుతాడు బిడ్డ మెడకు ఉరితాడుగా వేలాడుతుందేమో అంతుబట్టదు. ఉమ్మనీటిలో బిడ్డ ముడుచుక్కూర్చుని శ్వాస నాళాల్లోకి ఆ చిక్కటి ద్రవాన్ని పీల్చుకుని తనకు తాను ఆ బిడ్డ అన్యాయం చేసుకునే పరిస్థితిని గ్రహించలేము. ఇలా ఎన్నో. అంటే ఆపరేషన్కి కారణాలు చాలా తెలిసేవి కావు. అందుకే ఆపరేషన్స్ తక్కువ జరిగేవి.

అందువల్ల పసికందులు కొందరు గర్భసంచిలోనే ఆఖరి ఊపిరి పీల్చేవారు.

స్కేన్ వల్ల చాలా లాభాలున్నా కొన్ని నష్టాలు కూడా వున్నాయి. బిడ్డ పరిస్థితిని ఆ మిషన్ బిడ్డకు ఏమైనా ప్రమాదం వుందని చెప్తే డాక్టర్స్ తొందరపడాల్సి వస్తుంది. బిడ్డకోసం ఆపరేషన్ చేయాల్సివచ్చి... చేస్తే బిడ్డ బావుంటే ఎందుకు చేసారంటారు. వాళ్ళు అడిగాక చేయకపోతే బిడ్డకు ఆరోగ్యం కాస్త అటూ ఇటూ అయితే ఎందుకు చేయలేదనే భావాన్ని ఎక్స్ ప్రెస్ చేస్తారు.

**ఇదివరకు రోజుల్లో -**

మీరుమాత్రం ఏం చేస్తారు ? చూడాల్సినంతసేపు చూసారు అని మమ్మల్ని అర్థంచేసుకునేవారు. ఇప్పుడంతా ఆఫ్

నాలెడ్జి అయిపోయింది. వాళ్ళ సంగతి వదిలేసినా... తొమ్మిది నెలలు మోసాక తల్లి చేతుల్లో బిడ్డతో హాస్పిటల్ గేట్టి. వెళ్ళకపోతే అది డాక్టర్కి ఎంత బాధ ? ఈ భయం వల్ల కాస్త ఎక్కువ ఆపరేషన్స్ జరుగుతున్నాయని కూడా చెప్పాలి. పేషంట్స్ డాక్టర్స్కి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన రోజులొచ్చాయి. ఎలా?

"ఫర్వాలేదు మీకు మామూలు కాన్పు అవుతుందనిపిస్తే అలాగే చేయండి. అని పేషంట్స్ ధైర్యం ఇస్తే ఆపరేషన్స్ సంఖ్య కొంత తగ్గుతుంది. డాక్టర్స్ కావాలని ఆపరేషన్స్ చేయడం లేదు. మనం తొందర పెట్టినందువల్ల ఇలా జరుగుతున్నాయని పేషంట్స్ అర్థంచేసుకుంటే ఆపరేషన్స్ తగ్గుతాయి ఖచ్చితంగా..

ఆ రోజుల్లో ఆపరేషన్స్ రేట్ తక్కువ అయినా బేబీలాస్ కూడా ఎక్కువగా వుండేది. అప్పటి కర్మసిద్ధాంతం ఇప్పుడు లేదు. వుండాలని నేను కోరుకోను. అది వాంఛనీయం కూడా కాదు. కాకపోతే డాక్టర్స్ టెన్షన్ని పేషంట్స్ అర్థం. చేసుకుంటే చాలు. పేషంట్స్కి కౌన్సిలింగ్ ఇస్తే వాళ్ళు కాస్త సహనం వహిస్తారు. అనుకుంటే ఇప్పట్లో అదీ లేదు. ఎక్స్ప్లెయిన్ చేసేకొద్దీ డౌట్స్ ఎక్కువ వస్తున్నాయి. ఆ సందేహాల్లోనుండి వాళ్ళ భయాలు పుట్టుకొస్తున్నాయి.

పై కారణాలు కొంతవరకు సమంజసమైనా ఒళ్ళు మండే కారణం ఇంకొకటి. వుంది. "మా అమ్మాయి కష్టపడలేదు ఆపరేషన్ చేసేయండి"

"ఇక నా వల్లకాదు ఆపరేషన్ చేసి బిడ్డను తీసేయండి" పేషంట్ బాధతో అలా అంటుంది. కానీ సహనం వహించాల్సింది పేషెంట్ పేరెంట్స్, డాక్టర్కి, పేషెంట్ పేరంట్స్కి మధ్య కొంత అవగాహన వుంటే ఆపరేషన్ రేట్ కూడా కొంత తగ్గుతుంది. ఇంకో ఇబ్బంది కూడా ఉంది. "తల్లీ బిడ్డ క్షేమంగా వుండాలి. మీ ఇష్టం మీ చేతిలో పెట్టేసాం... "

"అయితే బిడ్డ లోపల నలుగుతోంది. ఆపరేషన్ చేస్తే క్షేమం"

"ఆపరేషన్ అయితే ఆ తర్వాత మరలా మరలా ఆపరేషన్స్ అవుతాయట కాబట్టి ఆపరేషన్ వద్దులే డాక్టరమ్మా"

ఇది రెండో నాలుక, మేము అడకత్తెరలో పోకచెక్కలం. డాక్టర్ల బాధలు వదిలేసి సిజేరియన్క అసలు కారణాలు తెలుసుకుందాం.

**ఇండికేషన్స్ ఫర్ ఆపరేషన్స్ :**

1) మెటర్నల్ (తల్లిపరంగా)

2) ఫీటల్ (బిడ్డపరంగా)

**1) మెటర్నల్ :**

1) యుటిరైన్ ఇనర్షియా : – టైమ్ దాటిపోయినా నొప్పులు రాకపోతే.
2) సర్వైకల్ డిస్టోషియా (గర్భద్వారం విచ్చుకోకపోవడం)
3) సి.పి.డి. (బిడ్డ తల తల్లి పెల్విక్ గూడుకంటే పెద్దదిగా వుండడం)
4) నొప్పులు వచ్చినా బిడ్డ క్రిందకు దిగలేకపోవడం.
5) బిడ్డ తర్వాత రావాల్సిన మాయ ముందువుండటం (ప్లెజెంటా ప్రీవియా)
6) ఎ.పి.హెచ్. కాన్పుకు ముందే విపరీతమైన రక్తస్రావం.
7) మొదటి కాన్పులో సిజేరియన్ ఆపరేషన్ అయి వెంటనే గర్భం వచ్చినప్పుడు, కుట్లు పగిలే ఛాన్స్ వుంది కనుక
8) ఇంట్లోనే గర్భసంచి పగిలివచ్చినప్పుడు
9) హెర్పిస్ జెనిటాలిస్ అనే జబ్బు ప్రసవమార్గంలో వున్నప్పుడు.
10) పి.ఇ.టి. (గర్భస్థ శిశువు వల్ల బి.పి పెరిగి తల్లికి ఫిట్స్ వస్తాయని అనుమానించినపుడు.)

**2) ఫీటల్ :**

ఆగితే నార్మల్ కాన్పు అవుతుందని తెలిసినా ఈ లోపల బిడ్డకు ప్రమాదముందని 90% సందేహం వున్నప్పుడు చేసే ఆపరేషన్.

1) ఉమ్మనీరు తగ్గిపోవడం : ఉమ్మనీరు తక్కువైతే బిడ్డకి ఆక్సిజన్ అందక బిడ్డకు ప్రమాదం అవుతున్నప్పుడు.
2) ఫీటల్ డిస్ట్రెస్ : బిడ్డ నాడి ఇతర ఏకారణాలు లేకుండానే 120 కి తగ్గడం,160 కి మించి పెరగడం.
3) ఉమ్మ నీటిలో మస్ట్ వున్నప్పుడు
4) బొడ్డుతాడు బిడ్డ మెడకు టైట్గా బిగుసుకున్నప్పుడు (ఇది కాన్పులో బిడ్డ పరిస్థితిని బట్టి తెలుస్తుంది.)
5) బిడ్డ అడ్డంగా వున్నప్పుడు.
6) కడుపులో బిడ్డ నొసటితో ఫిక్స్ అయినప్పుడు ప్రసవమార్గం గుండా తప్పనిసరిగా రాలేదు కనుక
7) ప్రస్తుతం ఎదురుకాళ్ళతో వున్నప్పుడు కూడా 50% బిడ్డకు ప్రమాదం వుంటుంది కనుక
8) మామూలు కాన్పుల్లో బిడ్డలు చనిపోతున్నప్పుడు (విలువైన బిడ్డ కనుక).

ఇలా ఇంకా ఎన్నో ఎప్పటికప్పుడు తీర్మానించాల్సిన విషయాలు. కొందరు మూడో నెలలోనే మా అమ్మాయికి కాన్పు సుళువుగా అవుతుందా అని అడుగుతారు. సి.పి.డి. లాటి ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ముందుగా చెప్పడం కష్టం. మీలోని సందేహాల్ని మీ డాక్టర్ తీరుస్తారు. ఇంకా అపనమ్మకం వుంటే మరో డాక్టరు సలహా తీసుకోండి అంతేకానీ అపోహల్లో పడి డాక్టర్లకు అపనిందలు, మీ కడుపులో బిడ్డలకు ప్రమాదాలు కొనితెచ్చుకోకండి.

★ ★ ★

# మహిళా చట్టాలు ఎందుకంటే..?



- డా. దెంచనాల సరళ కుమారి
రిటైర్డ్ డిస్ట్రిక్ జడ్జి

ప్రస్తుతం మహిళలపై హత్యాచారాలు నేరాలు వేధింపులు పెరిగిపోతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరికీ అంటే బాధితులకు స్వార్థపరులకు నేరస్తులకు కూడా చట్టాల అవగాహన అవసరం. చట్టాలు బాధితులు తెలుసుకోవడం వలన న్యాయం కోసం ఏమిచేయాలో తెలుసుకొని ధైర్యంగా ఉంటారు. నేరస్తులు తెలుసుకోవడం వల్ల ఎటువంటి శిక్షలుంటాయో తెలుసుకొని నేరాలు చేయకుండా ఉంటారు.

మహిళా చట్టాలగురించి తెలుసుకొనే ముందు వాని యొక్క ప్రాధాన్యత ఏమిటి అనేది చూస్తే ఈ సంవత్సరం (2021)జనాభా లెక్కల ప్రకారం మహిళల సంఖ్య 49.54 కోట్లు, పురుషుల జనాభా సంఖ్య 53.26 కోట్లు, మొత్తం 102.8 కోట్లు. చాలామంది మహిళలు అనేక కారాణాల వలన జీవించే అవకాశాలు లేక చనిపోతున్నారు. గర్భస్థ శిశువు ఆడపిల్లని చట్టవ్యతిరేకంగా తెలుసుకొని బ్రూణహత్యలు చేస్తున్నారు.. పసివయసులోనే ఆడపిల్లలను అమ్ముకోవడం, అక్రమరవాణ చేయడం, వ్యభిచార కూపాల్లోకి లాగడం, వరకట్నం, ప్రేమ మోసాలు, పరువు హత్యలు, కులహత్యలు వంటి అనేక కారణాల వల్ల చనిపోతున్నారు. అందుకే వారి సంఖ్య తక్కువగా వుంది. వీరిలో 1.5 కోట్ల మంది బాలికలు మరియు మహిళలు వేశ్యా వృత్తిలో ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలు అవుతున్నా 20.5 కోట్ల మహిళలు నిరక్షరాస్యులుగా వున్నారు. 50% బాలకలు చదువు మధ్యలో ఆపివేస్తున్నారు.

పనిచేసే మహిళలు గురించి చెప్పాలంటే వారికిచ్చే వేతనం గౌరవమర్యాదలు తక్కువే. UNFA State world Population 2005 రిపోర్ట్ ప్రకారం 70% మహిళా డిగ్రీ పట్టభద్రులు ఇండియాలో నిరుద్యోగులు వారు గృహిణులుగా మిగిలారు. గ్రామీణ ప్రాంతంలో 78% మహిళలు వ్యవసాయ పనులకు, రోజువారి పనులకు పరిమితమయ్యారు. మహిళలు మరియు పిల్లలు చాలామంది బీడీలు, అగరుబత్తీలు, గాజులు, ఫైర్ వర్క్స్ (మందుగుండు సామాను), అల్లికలు, పాత్రలు, తోలు వస్తువులు, చేతిపని వస్తువులు తయారీలో వున్న సంగతి మనకు తెలిసిందే. వీరిలో ఎక్కువ మంది. తక్కువ వేతనానికి పనిచేస్తున్నారు. వీరికి సామాజిక భద్రత లేదు. సామాజిక పరిశోధనలు చెప్పిన విధంగా భారతదేశంలో మహిళ రెండవ శ్రేణి పౌరసత్వం కలిగి వున్నది. మరియు సమాన గౌరవము పొందడం లేదు. అనాదిగా మహిళలకు రెడవ శ్రేణి కంటే తక్కువ స్థానం ఇవ్వబడింది.

భారతదేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. అటువంటి కుటుంబ వ్యవస్థలో స్త్రీ యొక్క పాత్ర ఎంతో ముఖ్యమైనది. మరి అట్టి స్త్రీలకు ప్రత్యేక చట్టాలు కల్పించే అవసరం ఎందుకు ఏర్పడింది..? ఎందుకంటే అత్యధికమైన, అత్యున్నతమైన బాధ్యతలు పోషించే మహిళ వివక్షకు, చిన్న చూపుకు గురికావడమే. ఆ వివక్షను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగములో మగవారితో సమానంగా హక్కులు, బాధ్యతలు సమానంగా పొందు పరిచారు. వాటితో పాటు మహిళల గౌరవ మర్యాదలు రక్షణవిధానాలు కూడా చేర్చడం జరిగింది. రాజ్యాంగ పీఠికలో (The Preamble to the constitution) ప్రతి పౌరునికి – పౌరుడు అంటే స్త్రీ పురుష భేదం లేకుండా ప్రతి వ్యక్తికి న్యాయ పరంగా, సమాజ పరంగా, ఆర్థిక పరంగా మరియు రాజకీయంగా భద్రతను గురించి వివరించడం జరిగింది. మహిళల యొక్క ఆలోచించే స్వేచ్ఛ, వ్యక్తపరిచే స్వేచ్ఛ, నమ్మే స్వేచ్ఛ, నమ్మించే స్వేచ్ఛ, యిష్టమైన దైవారాధన, సమానమైన గౌరవం, హోదాకు అవకాశం, మిగతా అందరితో సమానంగా ఉండే విధంగా... గౌరవ మర్యాదలు వ్యక్తిగతంగా సమూహంగా పొందే విధంగా వీలు కల్పించడం జరిగింది. వీటి సంరక్షణలోనే వివిధ రకాలైన చట్టాలు ఏర్పాటు

చేసి అమలు చేయడం జరిగింది

ముఖ్యంగా మహిళలు వంటింటికే పరిమితం కాకుండా.. సమర్ధవంతంగా అన్ని రంగాలలో తమదైన శైలిలో పాల్గొంటూ... కుటుంబానికి మరియు దేశానికి సేవలందించిన ఉదాహరణలు చరిత్రలో చెప్పుకోదగినన్ని చాలా ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని పురాణాల్లో ఎన్నో కథలు వినిపిస్తుంటారు. చరిత్రలో జరిగిన విషయాలు మరియు పురాణాల్లో కథలు విని ఆనందించిన విధంగా జరుగుతున్న కాలంలో మహిళల ఉన్నతిని ప్రోత్సహించే సామాజిక పరిస్థితులు ఇంకా రాలేదని చెప్పవచ్చు.

చట్టాలు ఏర్పడటానికి కారణం ఏమిటంటే.. ఎక్కడైతే సామాజిక అసమానతలు తలెత్తుతాయో వాటిని సమతుల్యం చేయడం కోసమే.. ప్రతి ఒక్కరికీ న్యాయపరమైన సహాయాన్ని కల్పించడానికి చట్టాలను ఏర్పాటుచేసి, అసమానతలు తొలగించడానికి పోలీసు, రెవెన్యూ, న్యాయం స్థానాల ద్వారా ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించారు.

ఏ చట్టం ఎందుకు వచ్చింది ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక చట్టాలు ఎందుకు ఏర్పడ్డాయి..? వాటిని ఉపయోగించే విధానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు పరిష్కారం వెతుక్కునే దాని కంటే ముందుగా కొంత అవగాహన కలిగి ఉన్నట్టయితే.. ఆ సమస్యను సమర్ధవంతంగా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని పరిష్కార మార్గం తెలుసుకోవచ్చు. ఎందుకంటే చాలామంది పోలీస్ స్టేషన్ కు కానీ కోర్టుకు కానీ వెళ్లాలంటే భయపడతారు. అవమానంగా భావిస్తారు. ఈ రోజుల్లో స్వార్ధం, అవినీతి, అధర్మంతో కూడిన కొందరి పనుల వల్ల అమాయకులైన సామాన్యులు కూడా పై రెండు ప్రదేశాలకు వెళ్ళవలసిన పరిస్థితులు వస్తున్నాయి. ముఖ్యంగా కొందరి స్వార్ధవ్యాపారాలు, మరికొందరి భోగలాలస, పైశాచిక ప్రవృత్తులు, మిగిలిన వారి జీవితాలను తారుమారు చేస్తున్నాయి. అటువంటి పరిస్థితులలో సకాలంలో స్పందించి మనలను రక్షించే చట్టాలు ఎలా ఉపయోగపడతాయి అని కనీస అవగాహన అందరికీ అవసరం.

మహిళకు చదువు మరియు చట్టాల గురించి అవగాహన చాలా అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యంగా చట్టాల పట్ల సరైన అవగాహన చాలా కావాలి. న్యాయస్థానాల్లో ఏమి జరుగుతుంది, న్యాయం జరగాలంటే ఎలాంటి ఏమాజిక స్పృహ అవసరం అనేది కూడా ముఖ్యమే. ఉదాహరణకు చెప్పాలంటే, ఒక పెళ్లి అయిన స్త్రీ అత్త, మామలు మరియు భర్త వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్నా... లేదా చంపబడినా.. ఆ విషయం గురించి అనేక చర్చలు పత్రికల్లో యింకా టివీల్లో చర్చించ బడతాయి. అంతే కాకుండా బాధిత మహిళకు న్యాయం జరగాలని ప్రదర్శనలు జరుగుతాయి. కాని ఆ కేసు కోర్టులో ట్రైల్ (trail) జరిగి నప్పుడు మహిళకు తల్లి తండ్రులు లేదా కుటుంబ సభ్యులు, చంపిన వారితో రాజీ పడి (డబ్బు రూపేణా కాని, చనిపోయిన మహిళకు చెల్లె వుంటే... ఆ చెల్లిని చనిపోయిన మహిళ భర్తతో పెళ్ళికి ఒప్పుకోడం) చనిపోయిన మహిళ చంపబడ్డట్టు కాకుండా ఏదో జబ్బుతో చనిపోయినట్టుగా సాక్షం చెప్తారు. దానితో కోర్టులు ఏమి చేయలేవు. చంపిన వారు స్వేచ్ఛగా జీవితాన్ని గడుపుతారు. చూసే వారికి ఇదంతా తెలియక న్యాయస్థానాల్లో న్యాయం జరగదు అంటారు. ఇవన్నీ స్వార్ధం మరియు అవగాహన లోపం వల్ల జరుగుతాయి.

**కొన్న మహిళా చట్టాల వివరాలు:**

1. అనైతిక రవాణా(తరలింపు నివారణ) చట్టం–1956
2. వరకట్న నిషేధ చట్టం 1961, 1986లో సవరణ
3. మహిళల ప్రేరణ (నిషేధం) చట్టం 1986
4. ది కమిషన్ ఆఫ్ సతి (నివారణ) చట్టం 1987 (3 ఆఫ్ 1988)
5. గృహ హింస నిరోధక చట్టం 2005
6. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం మరియు పరిహారం) చట్టం 2013
7. ది క్రిమినల్ లా (సవరణ) చట్టం 2013 మొదలైనవి.

**స్త్రీలకు సంబంధించిన శాసనాలు**

1. ఇండియన్ పీనల్ కోడ్ 1860
2. ది ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872

పై చట్టాల గురించి వివరంగా తర్వాత తెలుసుకుందాం...

★ ★ ★

లేఖ

# మహానదీ తీరాన ధబలేశ్వర్



- కుప్పిలి పద్మ

మై డియర్...

చక్రబర్తీ రోడ్ అంతా వేకువనే లేచి నడుస్తూ సముద్రపు వొడ్డున నిలుచుని వుదయించే సూర్యున్ని చూస్తూంటే నువ్వు పక్కనుంటే అనుకున్నా.. అప్పుడు చూడాలి నీ గవ్వరేకుల కళ్ళని.. వాటిలో ప్రవహించే కరుణని.. మొన్న లాక్ డౌన్ తరువాత నువ్వు చిన్నగా కురుస్తోన్న వానలో గ్రాండ్ రోడ్ రాత్రి మిలమిలల్ని పట్టిచ్చావు చూడు.. గుడి ముందు అప్పటికే రథం పనులు మొదలు పెట్టారని.. షాప్స్ .. హోటల్స్ అన్నీ మూసేశారని.. మొత్తం మూసుకుపోయిన ఆ వానాకాలపు రాత్రులు.. యెన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే చిక్కని జనసందోహం..

మాస్క్ లు లేని వాళ్ళే యెక్కువ.. మాస్క్ తో బరువులు యెత్తటం కష్టంగా అనిపించి బస్తాలు మోసే వాళ్ళంతా మాస్క్ లు పెట్టుకోవటం లేదనుకొంటా.. ఆ కిటకిటని చూడాలని నిన్న రాత్రివేళ గ్రాండ్ రోడ్ కి వెళ్లాను. నీ అడుగులు.. నీ మాటలూ మనసులో మెదల్తుంటే చ్చెన్న పొద వొకటి తిన్నా.. తీయ్యగా. రసగొల్ల నోటిలో పెట్టుకోగానే భలే కరిగిపోతోంది. బెంగాల్ ల్లో వొడిస్సా లో రసగొల్లాలు భలే వుంటాయి. అప్పుడు నువ్వు తిన్నావా.. నీకు స్వీట్స్ అంటే యేమంత యిష్టంలేదు కదా.. అయినా నీకోసం వీటిని పట్టుకొస్తా. నువ్వు వొక ముక్క తినటం గొప్ప.. ఆఫ్ కోర్స్ పేరుకి నీకు.. కానీ తినేది నేనే అనుకో.. పంచదారని పంచధారతో అద్దుకు తినే బ్యాచ్ కదా...

అలా పూరీ సూర్యరశ్మిని మనసునిండా నింపుకొని అటూయిటూ తిరిగితిరిగి యిప్పటికి కటక్ చేరాను. యుగాల చరిత్రని గుండెల్లో దాచుకొని నర్మగర్భంగా అత్యంత నమ్రతగా ప్రవహించే మహానదీ ప్రవాహాన్నీ అలా మునివేళ్ళతో స్పర్శిస్తే తూర్పుతీరపు గంగా సామ్రాజ్యపు వైభవాన్ని.. వుద్ధన పతనాన్ని.. కళింగ యుద్ధపు కత్తుల సవ్వడిని.. మిగిల్చిన నెత్తుటి చారికల్ని గాథలుగా మన ముందుకు తెచ్చాయి. బరువెక్కిక గుండెలతో తలెత్తి చూస్తే గాయం మిగిల్చిన మచ్చలా యెర్రటి బరపాటికోట కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకి సాక్ష్యంగా సగర్వంగా నిల్చి కనిపిస్తోంది.

వెండి పూజా సామాగ్రిని తయారు చేసే కళాకారుల అద్భుత నైపుణ్యం కట్టి పడేస్తోంది. ముఖ్యంగా గంధం గిన్నెల చుట్టూ అల్లుకొన్న లతలు.. చూపుల్ని పరిమళింప చేస్తూ.. వొక ఆధునాత పురాతన నాగరికతలకి మధ్య వేసిన వారధిగా కటకం అణువణువూ మనకి తారసపడుతూనే వుంది.

కటక్ నుంచి మహానది తీరాన ఆ 10వ శతాబ్దంనాటి శివుని ఆలయం ధబలేశ్వర్ చుట్టూ అందమైన ఆకుపచ్చని సౌందర్యం.. చిన్నిచిన్ని పడవల్లో.. బల్లకట్టుపై ప్రయాణిస్తూ.. పుట్ వోవర్ బ్రిడ్జి మీద నుంచి వస్తూ ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి అబ్బురపడుతూ ఆలయంకి చేరుకుంటున్నారు యెందరో. నది వొడ్డున రెల్లుపూల సందడి లేకపోవటం చూడగానే. 'నది ఒడ్డున రెల్లుపూల ఉత్సవం ముగించుకొని శరత్తు వెళ్ళిపోయింది'.. అని'రాలిపోయిన చందమామ' లో మాటలు గుర్తొచ్చాయి. శిశిరంలో కదా యిప్పుడు.. అయినా నాథం గుర్తొస్తూనే వున్నారు.

మహానదీ ఆవలి నుంచి అరణ్య సీమల మీదుగా గుంపులుగా తరలి వచ్చే వలస పక్షులు యేవో సుదూర సీమల తాలూకూ యెడతెగని బెంగని మన మనోసీమల్లో వదిలి వెళుతున్నాయి. గోధూళివేళ నునులేత చీకట్లతో పాటు మహానది మీదుగా తేలివచ్చే సుందర్ బన్ తేమగాలులు మన యింటి బెంగని రెట్టింపు చేస్తున్నాయి. మన జ్ఞానదాహార్తిని తీర్చే కటకసీమ చరిత్రకి.. సంస్కృతికి మాత్రమేకాక అద్భుత సాహిత్యానికీ నెరవు కూడా. గొప్ప సాహితీవేత్తలూ.. వుద్దండ నేతలూ పుట్టిన నేల యిది. కాళీందీ చరణ్ పాణిగ్రాహి..

గోపీనాధ మహంతి..కాన్హూ చరణ్ మహంతి.. అసలు గోపీనాధ మహంతి గారు రాసిన 'అమృత సంతానం' నవల ఆదివాసీ జీవితాల చరిత్ర కదా. యెన్నెన్ని ఆకులు యెంతెంత వాన.. ఆ తడిసి ముద్దైన ఆకుల పరిమళాలు మనలోకి నిండిపోయి మన చుట్టూ వాన కురుస్తూ నానినాని చదువుతున్న పుస్తకం కూడా నాని చివికిపోతోన్నట్టు వుండేది.

యిందాక శివుని ఆలయం ధబలేశ్వర్ చూస్తుంటే 'రాలిపోయిన చందమామ' గుర్తొచ్చిందన్నాను కదా.. యెందుకంటే కటక్ అనగానే మన సాహితీమనోవీధుల్లో చప్పున గుర్తొచ్చే రచయిత ఉపేంద్ర కిశోర్ దాసు గారు. వారి 'రాలిపోయిన చందమామ' నవలని యింట్లో చూసి 'నాధం' అన్నావు కళ్ళ నిండా వెలుగుతో. గొంతులో ప్రేమ. అవును.. నాధంలా సున్నితమైన మనసున్నవాడివి కదా...

పుస్తకాల్ని ఆత్రంగా చదివే కాలంలో యెప్పుడో ఆ నవల అనుకోకుండా నా కంట పడింది. పెద్దగా యే expectation లేకుండా మొదలు పెట్టానా.. సత్య తన జీవితం గురించి చెప్తుతుంటుంది. పెళ్లి బై ఛాయస్ అనే మాటే వూహకందని కాలమది. అలాంటి కాలంలో వో గ్రామీణ యువతి యిష్టం లేని పెళ్లి చేసుకోవటం.. ఆ బంధం అనుబంధంగా కాకుండా వూపిరాడని బంధనంగా మారిపోయినప్పుడు సత్య హృదయ వేదనకి మన మనసు బరువెక్కిపోతుంది. నాధంలాంటి స్నేహితుడున్నా పల్లెపిల్ల కదా త్వరగా కట్టుబాట్లని తెంచుకోలేకపోతుంది. అంతేనా ఆమె తనని తాను కూడా సరిగ్గా అర్థం చేసుకోలేకపోతుంది. నాధంకి ఆమెకి మధ్య యెంతో చక్కని స్నేహం వుంటుంది. కానీ యెప్పుడు చూసినా అపార్థాలే వాళ్ళ మధ్య. అయినా మళ్ళీ యిద్దరూ ఆ స్నేహాన్ని విడిచిపెట్టరు..

సత్య నాధంని యెంత ప్రేమించినా ఆమె అతనికి తన మనసుని చెప్పలేకపోతుంది. సత్యా తండ్రి కూతురు పెళ్లిని వో రెండో పెళ్లి జమీందార్ తో కుదురుస్తారు. జమీందార్ కి వొక కొడుకుంటాడు. ఆ పెళ్లి యెలాగ జరిగిందో కూడా సత్యాకి తెలియకుండానే నిద్ర మత్తులో వుండగా జరిగిపోతుంది. ఆమెకి ఆ పెళ్లికొడుకు నచ్చలేదు కూడా. భయంగా అనిపించింది. పెళ్లి అయినా ఆమె అతనికి శారీరకంగా దగ్గర కాలేకపోయింది. కానీ జమీందార్ మొదటి భార్య కొడుకుని మాత్రం బాగ శ్రద్ధగా.. యిష్టంగా చూసుకునేదే. అత్తగారికి యిష్టంగా సేవలు చేసేది. ఆమెకి మెల్లగా తన భర్తకి ఆ యింట్లో పని చేసే స్త్రీతో శారీరక సంబంధం వుందని తెలుస్తుంది. ఆ జమీందర్.. ఆ యింట్లో పనిఅమ్మాయి కలిసి సత్యనే ఆ యింటికి పనిచేసే పనిమనిషిని చేసెయ్టం చూసి అత్తగారు యిల్లు వదిలి కాశీ వెళ్ళిపోతుంది.

జాతరకి వెళ్ళినప్పుడు జమీందార్.. అతనితో సంబంధం వున్న స్త్రీ కలిసి సత్యాని జాతరలో వదిలించుకొంటారు. అక్కడ ఆమెకి తారసపడిన నాధం ఆ రాత్రి వో పంచన సత్యాని వుంచి తెల్లార్నే భర్త యింటికి తీసుకొని వెళ్ళతాడు. సత్యాని భర్త నిందించి తిరస్కరిస్తాడు. సత్యా పేరెంట్స్ కలరా వచ్చి యీ ప్రపంచం నుంచి వెళ్ళిపోయారు. యేమి చెయ్యలేని స్థితిలో నాధం ఆమెని తనతో కటక్ తీసుకొచ్చి తన యింట్లో పెట్టుకుంటాడు. కొన్నాళ్ళకి నాధం వుద్యోగం పోతుంది. నాధం సత్యాని తీసుకొని తన వూరికి వస్తాడు. నాధం ఆమెని తనతో తన యింట్లోనే వుంచుకుంటాడు. సత్యా యెప్పుడూ సంఘం కట్టుబాట్ల నుంచి బయటకు రాదు. కానీ వీళ్ళిద్దర్నీ వూరి వాళ్ళు వెలివేస్తారు. సత్య యీ వెలిని తీసెయ్మని వూరివాళ్ళని వేడుకొంటుంది. ఆమె నాధాన్ని వదిలి వెళ్ళిపోతే అతని మీద వున్న వెలిని తీసేస్తాం అంటారు వూరివాళ్ళు. నాధం కోసంసత్యా అతనికి చెప్పకుండా యిల్లు విడిచి వెళ్లి నదిలో పడిపోయే ముందు తన జీవిత కథని చెపుతుంది.

సత్యా జీవితంలో యెంతో సున్నితమైన మనసున్న స్నేహితుడు నాధం వున్నా ఆమె తన హృదయాన్ని యెప్పుడు విప్పదు.. తనే తన హృదయపు మాటని స్పష్టంగా వినదు.. సత్యా సంఘ నియమాల్ని విడిచిపెట్టదు. అలాగని వున్న జీవితంలోనూ యిమడలేదు. తన మనసు కోరుకుంటున్నదాన్ని తన జీవితంలో వొంపుకోడానికి సంఘ నియమాల్ని నిబంధనలని విడిచీపెట్టలేకపోతుంది. యింతగా సత్యా సంఘంకి కట్టుబడి వున్నా బోలెడంత అపవాదుల్ని మోస్తుంది. వీటన్నిటి వల్ల చందమామలా వెలిగిపోవల్సిన సత్యా జీవితం అపకీర్తి చందమామై రాలిపోతుంది.

కటక్ లో నిలబడగానే చందామామలాంటి సత్యా.. వెన్నెలలాంటి నాధం తెగ మెదుల్తున్నారు...

1901లో ఉపేంద్ర కిశోర్ దాస్ గారు కటక్ లో సంపన్న కులీన కుటుంబంలో పుట్టారు. కటక్ లో స్తిరపడిన దాస్ గారు 1922లో వొడియాలో రాసిన నవల 'మాలా జాన్హ'. ఆ నవల తెలుగులోకి 1973లో వచ్చిన నాటికి యిప్పటి మన చుట్టూ జీవితాల్లో బోలెడన్ని మార్పులు వచ్చాయి. ముఖ్యంగా స్త్రీల జీవితాల్లో. బై ఛాయిస్ పెళ్లి చేసుకోవటం. చదువుకోవటం.

నచ్చిన పని చెయ్యటం. తన సంతోషం కోసం తన చుట్టూ జీవితాల్లో మార్పు కోసం పోరాటం చేసే ధైర్యం యిప్పుడు స్త్రీలలో చూస్తున్నాం.

వొక వైపు స్త్రీలు అత్యంత వేగవంతంగా అన్ని రంగాల్లోకి ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో స్త్రీలపై హింస పెరగటం చూస్తున్నాం. అత్యంత విషాదం యేమిటంటే స్త్రీలపై జరుగుతోన్న హింస వారు ప్రాణాల్ని కోల్పోయేట్టు చేస్తోంది. సమాజంలో రోజురోజుకి పెరుగుతోన్నఅనేక లైంగిక దాడులకి ప్రధాన కారణం రోజురోజుకి విషంలా వ్యాపిస్తోన్న పురుషాధిక్య ఆలోచనా ధోరణే .దీన్ని అడ్డుకోడానికి కేవలం చట్టాలు.. రక్షణ చర్యలే కాకుండా సాంస్కృతిక భావజాల విప్లవం అత్యవసరం.

ఆనాడు కిషోర్ దాసు గారు చెప్పింది స్త్రీలకి మహిళలకు హక్కులు లేకపోవటం అంటే సగం సమాజం 'రాలిపోయిన చందమామ'లా వెలవెలబోతున్నట్టే.

మనసంతా బరువుగా అయిపోయింది.. నువ్వు పక్కన వుంటే బాగుండును.. యిద్దరం అలా కాసేపు యినుపరజనుతో యెర్రగా మెరుస్తోన్న యీ రోడ్ల మీద నుంచి నడుస్తూ నడుస్తూ.. మహానదీ ఘాట్ లో కూర్చుని నదిలోంచి వుదయించే పున్నమినాటి నిండుచందమామని చూడాలి.. కాసేపు నీ కవిత్వం వినాలి..

నీ..

నేను

**కుప్పిలి పద్మ**

# ఆమె నానీలు



ముత్యమంత
నవ్వులతో మురిపించే
బాల్యపు
బంగరు నిధి -- 1

యవ్వనాల మువ్వ
అందరికి నేస్తం
నాన్న కంటి వెలుగు
అమ్మకు "అమ్మే"--- 2

కుసుమ కోమలి
సాధనలో సావిత్రి
నడతలో నవ్యత
ఇంటికి వెలుగు --- 3

చదువులో సరస్వతి
సాయంలో
సవ్యసాచి
నిత్యానందలహరి ---4

ఇంటిల్లి పాదికి
తలలో నాల్కల తరుణి
బయట మహంకాళి
స్వరూపం --- 5

మెత్తని మనసున్న
మమతల రాణి
ప్రేమను చెలిమెలా
పంచు పూబోణి---6

పూచే పూదోట
నడిచే కాంతికిరణం
నడకలో గంభీరం
అమృత నిధి ---- 7

తోడులో తొలకరి
శ్రమకు చేయూత
అమ్మ లాలన
ఆమె జీవితం --- 8

పుట్టింటి పుత్తడి
మెట్టినింటి
యశస్విని
తరాలకు తంతె --- 9

అమ్మలకు అమ్మ
అణుకువలో ఆకు
కలిమి చెట్టు
జయమే ధ్యేయం ---- 10

డా॥ బండారి సుజాత
హన్మకొండ, 9959771228

కథ

# నరలోకంలో..... రచయిత్రి



- యడవల్లి శైలజ ప్రేమ్

"హెడ్ లైన్స్ ఫ్లాష్ .... ఫ్లాష్ అవుతున్నాయి. ప్రముఖ నవలా రచయిత్రి 'తరంగిణి' ఆత్మహత్య ప్రయత్నం చేశారు.

ఐదు నిమిషాల కొకసారి ఈ విషయమే చూపించి ఆమె ఆవేదనను మరింత పెంచుతున్నారు. పేపర్వాళ్ళు, మీడియా వాళ్ళు.

అసలు కారణం ఏమై ఉందంటారు?

'ఆకలి' నవల ఇతివృత్తంతో పేరు వస్తుందనుకున్న ఆమె ఆత్మహత్యకు ఎందుకు ? పాల్పడింది. ఈ నవలలో రాగిణి పాత్రకు తరంగిణి జీవితానికి ఏమైనా దగ్గర సంబంధం ఉందా? రకరకాల ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి.

మరొక అర్ధగంట పోయిన తర్వాత 'ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు మన తరంగిణి గారు స్లీపింగ్ పిల్స్ తీసుకున్నారు అంటున్నారు ఆమెను మొదటిగా చూసినవారు. ఆమె కోలుకున్న తర్వాత మరిన్ని వివరాలను అడిగి తెలుసుకుందాం" అంటూ కెమెరామెన్ గంగతో రాంబాబు సినిమా స్టైలులో చెప్పారు. మీడియా, న్యూస్ చానల్స్ వాళ్ళు'.

'ఎవడి గోల వాడిది సురేఖా! నువ్వు ఒక్క విషయం గమనించాలి ఆమెను చూడటానికి వాళ్ళ ఇంట్లో ఒక్కరూ కూడా ఇంతవరకు రాలేదు అంటే ఆ ఇంటితో సంబంధాలు తెగతెంపులు అయ్యాయా? కనీసం ఆమె పిల్లలు కూడా రాలేదంటే......!!!!!?

ఆకర్షణీయంగా గుర్తులు, ఎమోజీలు పెట్టి మరీ వార్తలు వినిపిస్తున్నాయి . వారికి టి. ఆర్.పి రేటు పెరిగిపోతోంది.

కవి సమ్మేళనాలు, పురస్కారాలు, ఉత్తమ రచయిత్రిగా ఎంపిక అయినప్పుడు తీసుకున్న అవార్డులు రివార్డులు చాలా సంతోషాన్ని మిగిల్చాయి. ఒక రచయిత రాసే రచనలు తన జీవితంపై ప్రభావం చూపుతుందని అప్పటివరకు తెలియదు. సమాజంలో మార్పు రావాలని అందరి బాధలు తన బాధలుగా భావించి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకునే రచయిత్రిగా తరంగిణికి మంచి పేరుంది.

ఆడంబరాలకు పోకుండా సాదాసీదాగా ఉండటానికే ఇష్టపడతారు ఆమె. అందరి రచయితల్లాగానే కష్టాలు, కన్నీళ్లు, ఛీత్కారాలు, అవమానాలు ఎదుర్కొనే ఈ సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. వృత్తి రీత్యా అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం చేస్తున్నది. ఆమె పనిచేసే డిపార్ట్మెంట్ వాళ్ళు తమ ఆఫీసుకు కవులను ఆహ్వానించారు అప్పుడు తను కూడా తన భావాలు కవితగా వాళ్ళకు వినిపించింది. అందరూ కవిత విని చాలా బాగుంది, మీరు కవితలు ఎప్పడి నుంచి వ్రాస్తున్నారు ? అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

అదిగో అప్పటి నుంచి కవితలు రాయడం మొదలు పెట్టి నవలా రచయిత్రి అనుకునే స్థాయికి చేరుకుంది.

"చలం రచనల ప్రభావం వల్ల కూడా ఈ సమాజం లో ఆమెకు ఆ... విషయం లో స్వేచ్ఛ స్వాతంత్ర్యం ఎందుకు ఉండకూడదు అని అడిగింది".

ఆమెకు తెలిసిన విషయాలు చెప్పారు ఆమె స్నేహితురాలు కమల.

ఈ నవలా నాయికలు అని కాదు కానీ ఈ సమాజంలో ఎంతోమంది లేరు.

'మంజరి' చిన్న వయసులోనే తనకన్నా వయసులో పెద్దవాడైన ' రామప్ప' కిచ్చి పెండ్లి చేసారు.

వయస్సు తేడా ఎక్కువ ఉన్నా యుక్తవయసులో ఉండడం వల్ల దాంపత్యం సజావుగా సాగేందుకు ఏ ఆటంకాలు రాలేదు. పెళ్ళి, పిల్లలు ఉన్నారు.

ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది.

మంజరి భర్త తాగడం, కంటికి నచ్చిన అమ్మాయితో కోరిక తీర్చుకోవడం, జల్సాలు చేయడం.

మంజరి పక్కన చేరడం ఎప్పటికో!

మంజరి కి కూడా కొన్ని ఆశలు ఉంటాయి ఎంతైనా ఉప్పు కారం తినే శరీరం కదా!

పిల్లలు నిద్రపోయాక మొగుడు పంచన చేరినా బయట కడుపునిండా తినొస్తే ఇంట్లో కమ్మంగ వడ్డించినా ఎందుకూ పనికి రాదు అన్నట్లు గుర్రుపెట్టి నిద్ర పోతుంటే నాలుగు కన్నీటి బొట్లు కార్చి పడుకునేది.

ఆ సందర్భంలో పక్కింటి యువకుడితో శారీరక సంబంధం ఏర్పడింది. అతనికి డబ్బు అవసరాలు తీర్చడంలో ఈమె సహాయపడింది. ఎంతైనా అతడు మగాడు కదా.ఈ విషయం గర్వంగా తన స్నేహితులతో పంచుకోవడంతో వాళ్ళు ఈమెను కోరుకుంటారు. ఆ పక్కింటి యువకుడితో ఉన్నట్టు తన స్నేహితుడితో ఉండమని కోరాడు .మంజరి నిరాకరించడంతో ఆమెను చీదరించుకుని ఏదో అనబోయేంతలో నువ్వు నాకు అవసరం లేదు అని ముఖం మీదే చెప్పింది. ఇన్నాళ్లు వాడుకున్నానని కూడా ఆలోచించకుండా వెంటనే అతడు తన మగ బుద్ధిని చూపించుకున్నాడు.

ఇన్నీ జరిగినా కొంతలో కొంత మొగుడికి తెలియకుండా జాగ్రత్త పడింది మంజరి.

కాపురం కూలిపోలేదు అలాగని ఆనందం పొంగి పోలేదు.

జీవితంలో అతడు మళ్ళీ ఎదురు పడితే మంజరి ఏం చేస్తుంది?

పాత ప్రేమను పంచుకోవాలని అనుకుంటుందా?

మునిపటిలా ఆమె మారిపోతుందా?

తన కోరికలు అణుచుకుంటూ కాపురం నిలబెట్టుకోవడం కోసం ప్రయత్నిస్తుందా?

అన్ని ప్రశ్నలను సంధిస్తూ ముగించిన నవల.

విడుదల అయ్యిందో లేదో రచయిత్రిని చిత్రవధ చేస్తూ అందరూ బాణాలు విసిరితే ఆమెకు మరో మార్గం లేకపోయింది.

ఆసుపత్రిలో ఉన్నప్పుడు తరంగిణి తనలో తాను తర్కించుకుంది.

ఛీ.....ఛీ.... తను ఎంత తప్పుడు నిర్ణయం తీసుకుంది.

తను చేసిన పనికి చచ్చిపోయి మూడు రోజులు అయి ఉండేది.

సమాధానం చెప్పడానికి భయపడితే రచనలు ఎందుకు చేయాలి?

అందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందా?

మనసు గిజగిజ కొట్టుకుంటుంది.

తనకంటూ ఒక బాధ్యత ఉన్నదని భావించబట్టే కదా మార్గదర్శకపు బాటలని ప్రేరణా దాయకంగా రాసింది.

సమాజంలో మార్పు రావాలని ప్రయత్నించడం కూడా తన తప్పా!?

మంజరి లాగా ఎంతోమంది లేరు.

తనెందుకు చావాలి? ....!!!!!

అవును తనెందుకు చావాలి?

ధైర్యంగా వెంటనే ప్రెస్ మీట్ పెట్టింది తరంగిణి.

అందరికి నమస్కారం. నా ఆకలి నవల చదివిన మీకు ముందుగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

నన్ను మీరు మంజరి పాత్రతో ముడిపెట్టి చిత్రవధ చేస్తూ మాట్లాడారు.

అదే మీ అక్కో, చెల్లో ఆ పొజిషన్లో ఉంటే ఏం చేస్తారు? ఆమెను కూడా ఇలాగే చంపుకునేవారేమో!

పితృస్వామిక వ్యవస్థలో మగవాడు ఏం చేసినా కరెక్ట్ ఆడదానికి ఆ కోరిక తీర్చుకోవాలని ప్రయత్నిస్తే?

నా నవల మొత్తం మంజరి పాత్రనే కనిపిస్తుంది కానీ ఎన్ని విషయాలు ఇందులో ఉన్నాయో మీకు కనిపించలేదా?

కడుపాకలి తెలియని వారు ఇంతకంటే గొప్ప ఆలోచనలు ఎలా చేయగలరు. వీలైతే సమస్య అర్థం చేసుకోవచ్చు లేదా ఎవరి బతుకు వారిదని వదిలేయవచ్చు. ఒకరి సమస్యలు మరొకరికి తేలికగా కనిపించవచ్చు. అది అనుభవించిన వారికే అర్థమవుతుంది.

రచయిత్రి, రచయిత రాసేవన్ని స్వీయ అనుభవాలు కానవసరం లేదు. ఒకవేళ తాను రాసినా మీకేం నష్టం. ఆమె జీవితం మరొకరికి ఉపయోగపడుతుంది అని రాస్తుందేమో! ఈ సమాజంలో ఉన్నవారు అందరూ స్వచ్ఛంగా బతికేవాళ్ళేనా?

మిమ్మల్ని నొప్పిస్తే నన్ను మన్నించండి. పిలవగానే వచ్చిన మీకు కృతజ్ఞతలు.

మీరు నన్ను వెలివేయడం కాదు. నేనే మిమ్మల్ని వెలివేస్తున్నాను.

తరంగిణి ... తరంగంలా ధైర్యంగా కదిలిపోయింది. ★

**యడవల్లి శైలజ ప్రేమ్**, ఖమ్మం
చరవాణి: 9394171299

సాహిత్య విమర్శ

# తెలంగాణ స్త్రీవాద కవిత్వం - సాధికారత



- డా|| వి. త్రివేణి

**ఉపోద్ఘాతం :**

'సమానత్వం, సమానత్వం అంటూ ఉంటే నా చిన్ని బుద్ధికి అదే అందకుండా ఉంది. ఆనకుండా ఉంది. అర్థం కాకుండా ఉంది నాకు. ఒక వేళ పురుషులు పురుషులకి పుట్టినట్టయితే, స్త్రీలు స్త్రీలకు పుట్టినట్టయితే సమానమనడంలో అర్థం ఉంది. అట్లా కాదే... సృష్టే సృష్టిని ఆడవారి చేతిలో పెట్టింది. అంటే సృష్టే.. సృష్టి అంటే దేవుడనే వాడు ఒకడుండి సృష్టిని సృష్టించి ఆ సృష్టిని ఆడవాళ్లకి పెట్టిందని నా దృక్పథం. కనుక మరి ఆడవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మగవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మరి శరీరంలో ఉండే రక్తమాంసాలన్నింటిని కరిగించి వారికి జన్మనిచ్చే ఆడది గొప్పదా? జేబులో చేతులు పెట్టుకొని తిరిగే మగవాడు గొప్పవాడా? కనుక నా దృక్పథంలో... నా దృక్పథంలోనే కాదు అది యదార్థం, సత్యం, ఒప్పుకొని తీరాల్సిందే సమాజం ఒకరోజు'.

టి.ఎస్.సదాలక్ష్మి – నల్లపొద్దు సంకలనం (1952 సాధారణ ఎన్నికలలో కరీంనగర్ లోని సుల్తానాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి రిజర్వుడు సభ్యురాలిగా పోటీచేశారు)

She is not born, She is made – Saiman D Bihevar

'స్త్రీ స్త్రీగా పుట్టదు/ స్త్రీగా పెంచబడుతుంది'. – సైమన్ డి బిహేవర్

17, 18వ శతాబ్దంలో చెప్పిన ఈ నినాదమే అసలైన స్త్రీవాదానికి లేదా స్త్రీ సాధికారతకు తెరతీసింది. జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ ఫెమినిస్ట్ సైమన్ డి బిహేవర్. ఆమె చూపిన ఉద్యమ భావజాలం పునాదిగా చేసుకొనే ప్రపంచ వ్యాప్తంగా మహిళా పోరాటాలు జరిగాయి.

సెక్స్ – జండర్ మధ్య వ్యత్యాసముంది. సెక్స్ : పుట్టుకలో శారీరకంగా పురుషుల మధ్య ఉన్న అవయవ నిర్మాణంలో ఉ న్న తేడా సెక్స్. జండర్ : బాల బాలికలు పెరిగే కొద్దీ అలవాట్లలో, ఆచారాలలో, నీతులలో ఆపాదిస్తున్న తేడా. పితృస్వామ్యం – లింగ వివక్ష స్త్రీవాద అస్తిత్వ ఉద్యమంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి. పితృస్వామ్యం : వందల సంవత్సరాలుగా సమాజంలో పురుషుడిదే అధికారం, అన్ని రంగాలతోపాటు సమాజానికి కేంద్ర బిందువుగా నిలిచిన కుటుంబంలో కూడా పురుషుడిదే అధికారం అన్న న్యాయం కొనసాగుతూ వస్తుంది. లింగవివక్ష : పితృస్వామ్య సమాజం నడవడికను, నీతులను, సూత్రాలను, ధర్మాలను విడివిడిగా నిర్దేశించింది. దుస్తులు, ఆటలు, పాటలు ఇంటా బయట చేయవలసిన పనులు, వివాహం వంటివి విడివిడిగా నిర్దేశించబడ్డాయి.

ఫెమినిజమ్ అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో వాడుకలో ఉన్న శబ్దం స్త్రీవాదం. మానవ సమాజంలోని సగభాగమైన స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా అణచివేతకు గురి అవుతూ పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండడాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ విముక్తిని కాంక్షిస్తూ అభివృద్ధి చెందిన సిద్ధాంతం.

పితృస్వామ్య వ్యవస్థకు, సాహిత్యానికి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తించడం, పితృస్వామ్య సమాజాన్ని ధిక్కరించడం స్త్రీవాద కవిత్వంగా భావించవచ్చు. స్త్రీ అస్తిత్వం, ప్రయోజనం వంటి వాటిని పునాదిగా చేసుకొని, తదనంతరం స్త్రీవాదం బలంగా ముందుకొచ్చింది. సంస్కరణ, జాతీయోద్యమాలు, అభ్యుదయ, విప్లవ చైతన్యాల నుండి మార్పుకు అనువైన నేపథ్యాన్ని ఏర్పరుచుకొని స్త్రీలు ముందుకొచ్చారు. స్త్రీవాద కవిత్వాన్ని వెలువరింపజేశారు. ఈ ఉద్యమాలు స్త్రీలలో ఒక సిద్ధాంతపరమైన ఆలోచనాశక్తి, ప్రాపంచిక జ్ఞానం, పోరాట స్ఫూర్తి, ఉద్యమ భావజాలం పెంపొందింపజేశాయి. స్త్రీవాద సాహిత్యం 1975 తర్వాతనే ఒక నిర్దిష్ట రూపాన్ని దాల్చింది. 1975 కంటే ముందున్న సాహిత్యం కూడా స్త్రీ చైతన్యం, స్త్రీ అభ్యుదయం మీద వెలువడింది. తెలుగులో వచ్చిన మొదటి ప్రక్రియ 'కవిత్వం'. కవితా ప్రక్రియ ద్వారా స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం ఒక సమగ్రమైన రూపాన్ని ఏర్పరచుకొని, విస్తృతమైన నేపథ్యాన్ని సంతరించుకొంది. ఆధునిక తెలుగు కవిత్వం స్త్రీ సమస్యలలోని రాజకీయ స్వభావాన్ని గానీ, పితృస్వామ్య భావజాల మూలాలను గానీ, జండర్ రాజకీయాలను గానీ లోతుగా అధ్యయనం చేశాయి. స్త్రీవాద రూపురేఖల్ని బహుముఖాలుగా విస్తరింపజేశాయి.

స్త్రీవాద కవితా ధోరణులతో వెలువడిన కవితా సంకలనం 'నీలిమేఘాలు'. 1972–92 మధ్యకాలంలో రచించబడినవి ఇందులోని కవితలు. వీటికంటే ముందుగానే 'మాకు గోడలు లేవు', 'మూడుతరాలు', 'సవాలక్ష సందేహాలు', 'మనకు తెలియని మన చరిత్ర' వంటి పుస్తకాలు వెలువరింపబడ్డాయి.

స్త్రీవాద కవిత్వం ప్రదర్శించిన వస్తుతత్త్వం సాహిత్యాన్ని

విభిన్నమైన కోణాల్లో నిలబెట్టాయి.

**స్త్రీవాద కవిత్వాన్ని ప్రభావితం చేసిన అంశాలు :**

- శరీరం, శరీర రాజకీయాలు, సౌందర్యాత్మకహింస
- స్త్రీ, పురుష సంబంధాలు, లైంగిక స్వేచ్ఛ
- భావజాల రూపంలో స్త్రీలు చేసే చాకిరి, శ్రమ
- రకరకాల రూపాల్లో స్త్రీలు అనుభవించే హింస, వేదనలు, భ్రూణహత్యలు, అబార్షన్
- మాతృత్వం, రజస్వలకావడం
- లైంగిక దోపిడి, అత్యాచారాలు, వ్యభిచారాలు
- గృహహింస, వరకట్న సమస్య, లైంగిక వేధింపులు
- కవిత్వంపై దాడి, అణచివేత పట్ల తిరుగుబాటు
- పునరుత్పత్తి శక్తి, అస్తిత్వ పునర్వివేచన
- స్త్రీ జీవితంలోని 'ఆర్థికం', ఆర్థిక స్వావలంబన

తెలంగాణలో వివిధ అస్తిత్వ ఉద్యమాలలో స్త్రీవాదం బలంగా ప్రస్ఫుటమవుతుంది. ఈ కాలంలో స్త్రీవాద సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది. వచన కవిత్వంలో స్త్రీవాద భావజాలం కులమత అస్తిత్వాలకు ప్రాతిపదికంగా నిలిచింది. విభిన్న కవిత్యోద్యమాలు స్త్రీవాదంలో చోటుచేసుకున్నాయి. పితృస్వామ్య వ్యవస్థను ధిక్కరిస్తూ వచ్చిన స్త్రీవాదకవిత్వంలో దళిత స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం, బీసీ స్త్రీవాదం వంటివి ప్రవేశించాయి. అదేస్థాయిలో స్త్రీల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ధిక్కారం కవిత్వంలో బలమైన గొంతుకగా మారాయి.

అనిశెట్టి రజిత పితృస్వామ్య సంస్కృతి మీద తన కవితలతో తిరుగుబాటు చేశారు. స్త్రీల జీవితాలు ఏ విధంగా శాసింపబడుతున్నాయో, సంప్రదాయం ఆచారాలు, సనాతన సంస్కృతికి హేతువులైన స్త్రీల ప్రాతినిథ్యాన్ని ఆమె ఒక విధంగా ఖండించారు. స్త్రీల జీవితాలు ఈ కాలంలోనే బానిస స్థితిలోకి దిగజార్చుతున్నాయని ఆమె ఆరోపించారు. ఆమె కవితా సంపుటిలో 'గులాబీలు జ్వలిస్తున్నాయి'. 'నేనొక నల్లమబ్బునవుతా', 'చెమట చెట్టు', 'ఉసురు', 'అనగనగా కాలం', 'నిర్భయాకాశం కింద' వంటివి పురుషాధిపత్య సమాజంపై ధిక్కార స్వరాన్ని పలికించినవి.

ఈ సందర్భంలోనే అనిశెట్టి రజిత రచించిన కవిత్వం 'అవును మౌనాన్ని మాట్లాడుతున్నాను". "నిత్యగాయాల జ్యోతిలా మండుతూ, ఉద్యమ భాషపై మాట్లాడుతున్నాను". అంటూ ఆక్రోశాన్ని ప్రకటించారు."ఉద్విగ్న, జిగార్" వంటి కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించి రుద్రమ ప్రచురణల పక్షాన ప్రచురించారు."నిర్భయాకాశం కింద" కవితా సంపుటిలో స్త్రీల జీవితంలో గల ఆశను, ఆకాంక్షను పెంపొందింపజేశారు. నిర్భయ చట్టం అమలు, పునరావాస కేంద్రం, పనితీరు పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకొని సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు, సూచనలు చేశారు. నిర్భయ చట్టంలో డొల్లతనాన్ని, ఆ చట్టం వచ్చికూడా అత్యాచారాలు ఆగకపోవడాన్ని ఆమె నిరసించారు. నిర్భయాకాశం కింద శరీర సౌందర్యం, పురుషాధిపత్య ధోరణి, బానిస బతుకు, చిత్రహింసల జీవనం, అణగారిన జీవనఛాయ, సుఖతత్త్వం వంటి భావజాలం నుండి విప్లవ పిడికిళ్ళు ఎత్తిన చేతుల వరకు పరోక్ష పోరాటం చేసింది. అందులోని ఒక ఖండిక : 'గులాబీలు జ్వలిస్తున్నాయి'.

'చలింపజేసే సౌందర్యం తమ సొత్తని
మత్తెకించే మాధుర్యం తమ నైజమని
అనుభూతీ అనుభవాలే తమ ఉనికియని
మృదువైన తాజా స్పర్శతో
తన్మయులజేసే ఆ పూతా...
చిదిరి వేయబడిన అత్తరు కావడమే
వాటి జీవిత ధ్యేయం కాబోలని
అందరివలె నేనూ భావించిన – ఆ రోజులో

ఆడజన్మ మీద ఉన్న ఆంక్షలు, స్త్రీ ఒక సౌందర్యరాశిగానో, శరీర కాంక్షను తీర్చే ఒక మోహనాంగిగానో భావించే స్థితి నుండి బయటపడాలనే ఒక ఉత్తేజం, చైతన్యం మనకు కనిపిస్తుంది. దేశం కట్టుబొట్లు, సనాతన ఆచారాల వల్ల ఆడపిల్ల జన్మ మీదనే వక్రభాష్యం ఏర్పడిన స్థితిని ఆమె తన కవితల్లో పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆడజన్మ పట్ల ఒక బానిస గొడుగు కింద నిరసిస్తుందని, స్త్రీవాదం సైద్ధాంతిక నేపథ్యంలో ప్రపంచ నిర్ణీత సందర్భాలు నిలిచి ఉంటాయని చిత్రీకరించారు. అది మనకు 'ఒక ఆడపిల్ల జన్మించిన వేళ!' అనే కవితలో తెలుపబడింది. ప్రపంచ ప్రమాణాల మీద ఏర్పడిన స్త్రీవాదానికి PURD రచించిన 'INSIDE THE FAMILY' అనే కవిత్వాన్ని అనువదించి అంతర్జాతీయ స్థాయిలో కవితా కోణాల్ని ఆవిష్కరించారు.

'నీవు పుట్టిన రోజున నా చిన్నితల్లి
ఓహ్ దేవుడా ! నా కడుపు లోయల్లోకి
ఏదో కూరుకుపోతున్న అనుభూతి
నీవు పుట్టిన ఆ రోజున నా చిన్నితల్లీ!
అది నిరసించిన చీకటిరాత్రి
నా అత్తా ఆడబిడ్డా దీపాలు
వెలిగించడానికి కూడా నిరాకరించారు
మరి నా పతిదేవుడూ యజమాని
నన్ను కఠినంగా ఏమేమో అన్నాడు
ఓహ్ నీ పుట్టుకకు వైభవం
చేకూరనియ్ నా చిన్నితల్లీ!
ఆ సమయాన దేవుళ్ళంతా
ఈ భూమ్మీద నుండి వలసబోయారు'

స్త్రీ, పురుష సంబంధాలలో ఉన్న డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ ప్రగతిశీల భావజాల కవయిత్రిగా గుర్తింపు పొందినవారు జ్వలిత. స్త్రీవాద కవిత్వానికి స్పష్టమైన రూపురేఖల్ని నిర్దేశించింది. సబ్బండ వర్ణాల స్త్రీల సమస్యలను, యాంత్రికీకరణ దాంపత్యం, కార్పొరేట్ మోజులో పడి కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలు, ఆర్థిక వ్యవస్థ

వంటివి స్త్రీ జీవితాలపై అనితర ప్రభావాలను చూపింది. కవిత్వం ఆ దిశగా దృష్టి సారించింది. జ్వలిత రచించిన 'కాలాన్ని జయిస్తూ నేను', 'సుధీర్ఘ హత్య', 'అగ్నిపాపి' వంటివి స్త్రీవాదాన్ని బలంగా చూపిన సంపుటాలు. ఆడ శిశువులు బాల్యంలోనే అనాధలుగా మిగిలిపోతున్న స్థితిని, దానికి గల పరిస్థితులను స్త్రీవాద కవిత్వం సమస్యా అన్వేషణ సాగించింది. దీనికి ఆర్థిక రాజకీయ కారణాలు గానే చిత్రీకరించే ప్రయత్నం సమకాలీన కవిత్వం చేసింది. అనాధ బాల్యంగా ఆడపిల్ల గడుపుతున్న జీవితం, ఆమెపై గల ఆంక్షలు సమాజం సృష్టించిందా? లేక పరోక్ష రాజకీయ ప్రతిబంధకమా? ఈ సమస్యను చాలా గట్టి గొంతుకలలో స్త్రీవాద కవయిత్రులు వెల్లడించారు. అనంతసాగరాల చెలియలికట్టలు అధిగమించే స్వేచ్ఛ లైంగికత్వం ఒక శిశువుని ఏ విధంగా అనాధగా మార్చుతుందో నేటి కవిత్వం చూపుతుంది. దీనినుంచి బాల్యపురోదన విశ్వమహిషి చెవిన వీణాగానంగా చిత్రీకరించింది. నాన్నమ్మల, అమ్మమ్మల అరణ్య రోదనగా నిలిచింది. 'బాల్యాన్ని పాతరేసిన చోట' జ్వలిత ఆక్రోశించిన కవిత.

అత్యాధునిక యాంత్రిక యుగంలో సమాజంలో చోటుచేసుకున్న విషమ సంస్కృతి ఎంతటి వికృత పరిణామాలకు దారి తీస్తుందో స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది. స్వేచ్ఛా లైంగికత, వివాహం కాకుండానే తల్లికావడం, తల్లి వివాహిత కాకపోవడం, తల్లి సమాజం నుండి వెలివేయబడటం, 'సరోగసి' విధానం, 'గే' సంస్కృతి వంటివి ఆడ శిశువు పుట్టుకకు గుదిబండలాగా మారినాయి.

ఆడపిల్లల కిడ్నాపింగ్, ట్రాపింగ్ వంటివి ఈ రోజుల్లో స్త్రీవాద కవిత్వానికి ఒక పెద్ద సవాలుగా మారింది. కవిత్వం ఆడ పిల్లలు కనుమరుగవుతున్న వైనాన్ని ప్రదర్శించింది. ఏకపక్షంగా ముక్తకంఠంగా కవయిత్రులు ఈ సమస్య మీద స్పందించారు. కిడ్నాప్, యాసిడ్ దాడి, అత్యాచారం, వేట కొడవళ్ళతో హత్య చేయడం, వరకట్న కోరల్లో చిక్కుకోవడం అంతర్జాతీయ స్థాయిలో రక్షణ చట్రాన్ని కబలిస్తున్న సమస్య "కిడ్నాపింగ్". "కనుమరుగవుతున్న నేను"లో జ్వలిత "నవ నాగరికత నగ్న నృత్యమాడుతున్నది కిడ్నాపింగ్ అంతర్జాతీయ క్రీడ" అంటూ ఎద్దేవా చేశారు. రాజ్య అలక్ష్యం, స్త్రీ రక్షణ మార్గంలో విభేధింపబడుతున్న రాజ్యాంగ చట్టాలు స్త్రీవాద కవిత్వానికి వస్తువులుగా మారాయి.

అందమైన పువ్వులను
రెక్కలు రెక్కలుగా ముక్కలు ముక్కలుగా
కుత్తుకలు కత్తిరించడం
కొత్త ప్రక్రియ ఇప్పుడు
యాసిడ్ బాంబులు
ఉగ్రవాదుల ఆయుధం గతంలో
ఆమ్ల జల్లులు
అబలలను మార్చడం చూస్తున్నాం.

'స్త్రీకనుమరుగవుతుంది..!' ఈ హెచ్చరిక భవిష్యత్తు మానవ జన్మకు ప్రశ్నార్ధకంగా మారింది. భారత జనాభా గణన ప్రకారం కొన్ని నిర్దేశిత ప్రదేశాలలో మగవారి కంటే ఆడవారి నిష్పత్తిరేటు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. ఈ సూచిక రాబోయే తరానికి హెచ్చరికగా భావిస్తుంది. అందుకే చెట్టు, చెరువులను సహజవనరులుగా ఏ విధంగానైతే కాపాడుకుంటున్నామో, సృష్టికి సహేతుకులైన స్త్రీలు కనుమరుగు కాకుండా రక్షించుకోవాలనే ఆకాంక్ష స్త్రీవాద కవిత్వం అంతర్గతంగా సూచించింది.

స్త్రీవాద కవిత్వం అంటే పురుషాధిపత్య సమాజంపై ధిక్కారస్వరం ప్రకటించడమే అవుతుంది. అనేక విధాలుగా స్త్రీ పడుతున్న బాధ, వారిపై హింస, పీడన అది పురుషాధిపత్య భావజాలం నుంచే కలుగుతుంది. కుటుంబ పెత్తనం నుండి రాజకీయ వ్యవస్థ వరకు ప్రతి నిర్ణయాత్మకశక్తి పురుషుడి ఆధిపత్యం పైనే ఉంటుంది. పౌరహక్కులు, పంచాయతీ వ్యవస్థ, రాజ్యాంగ సవరణలు పురుషుడి భావజాలం దిశగా సాగుతున్నాయని స్త్రీవాదులు ప్రతిఘటిస్తున్నారు. రాజకీయ ప్రభావంతో ధ్వంధ్వవైఖరిని ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, ప్రభుత్వం అన్ని స్త్రీల హక్కుల మీద నీళ్ళు చల్లుతున్నాయని విమర్శించారు. జ్వలిత 'రోగగ్రస్త స్తన్యం' కవితలో....

వెనకకు నెట్టబడి నెట్టబడి
నేను శతాబ్దాలుగా
రోగగ్రస్త స్తన్యాన్ని కుడుస్తున్న శాపగ్రస్తను
కూటికి గుడ్డకే కాదు
బ్రతికే హక్కును కోల్పోతున్న
గంధర్వ పతులు లేని సైరంధ్రిని
కొత్త కలలు కంటున్న త్రిజటని
జండర్ అంటే వర్ణం కాదని
రాయితీలు రిజర్వేషన్లు
మనకు చెందబోవడం లేదని
కొత్త కాంక్షకాని పాత అవసరాన్ని
నిజం చేసుకోవటానికి
చట్టం చెయ్యి కాల్చక ముందే
ఆకులు వెదకాలి రండి

అంటూ రాజ్యం మహిళలపై చూపుతున్న అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని స్త్రీవాద కవిత్వం దుయ్యబట్టింది. పార్లమెంట్ లో మహిళా బిల్లును ఆమోదించలేకపోవడానికి రాజకీయంగా పురుష సంస్కృతి బలమైన ప్రభావాన్ని చూపుతుందని తెలియజేసింది. మహిళల రిజర్వేషన్లపై అవకతవకలకు పాల్పడడం, మహిళల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాళ్ళరాయడమే అవుతుందని మండిపడింది. సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజకీయ హక్కుల సాధన మీద పోరాటాన్ని అంతమొందించడానికి కుట్ర జరుగుతుందని, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఆంక్షలు ప్రతిబంధకాలు రాజకీయ పార్టీలు సృష్టిస్తున్నాయని ఖండించింది. సాలెగూళ్ళ లాంటి రాజ్యపాలన ఈ దుర్భర పరిణామానికి నిదర్శనం. 'కోటాలో కోటా

లేదంటూ... కొల్లగొడుతున్న కొల్లాయి వాదం' అనేది మహిళా బిల్లుపై చూపుతున్న అవ్యక్త ప్రతిపాదిత కవిత్వం.

పురుషాధిపత్య సమాజంలో ఆడవాళ్ళు ఎలా అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారో పై కవిత నిరూపిస్తుంది. రాజకీయ వ్యవస్థను తీవ్రంగా పరిగణిస్తూ, రాజ్యాంగం ఇచ్చిన హామీని నిలబెట్టుకోని సందర్భాలను గుర్తుచేశారు. స్త్రీల సంక్షేమం పట్ల రాజ్యవ్యవస్థ ద్వంద్వ వైఖరిని కవిత్వంలో వ్యతిరేకించారు. పురుషుడిలో అసందర్భంగా పుట్టే వికృత కామవాంఛను భండారు విజయ తన కవిత్వంలో చాలా గట్టిగానే ప్రతిఘటించారు.

'వాడికి ఒళ్ళంతా అంగాలే
వాడి మనసంతా రాటుదేలిన విషపు ముళ్ళే
వాడికి మనోవికారం ఎప్పుడు పుడుతుందో
వాడి అంగం ఎప్పుడు నిక్కబొడుస్తుందో
ఎప్పుడు మొనదేలి ఎగిరి పడుతుందో
ఎవరివైపు తిరిగి చీల్చివేస్తుందో
వాడిని చిత్రించిన వాడికి కూడా తెలియదు'

'ధిక్కార' సంకలనాన్ని చంటి ప్రసన్న కేంద్రం ట్రస్ట్ వారు ప్రచురించారు. ఇది అత్యాచారాలపై అగ్నిధార, అంకుశం సంధించి ఉరి బిగించిన ఛీంకారగా అభివర్ణించారు. 'ఉద్విగ్న' కవితా సంకలనాన్ని రుద్రమ ప్రచురణల వారు వెలువరించారు. అత్యాచార భారతంపై ఓరుగల్లు కవుల నిరసనను ప్రకటించారు.

**దళిత స్త్రీ వాదం :**

కులం పుట్టిన నాటి నుండి కుల పితృస్వామ్య పీడనకు గురి అవుతూ దళిత స్త్రీవాదం వెలువరింపబడింది. దళిత స్త్రీలు అనుభవిస్తున్న శారీరక, మానసిక హింసను కవిత్వంగా నివేదించారు. స్త్రీవాదం జండర్ వర్గంతో పోరాడితే దళిత స్త్రీవాదం జండర్ వర్గంతో పాటు కుల వర్ణాలను కూడా ఎదురుకోవలసి వచ్చింది. సాంఘిక ఆర్థిక సామాజిక అంశాలను జండర్ దృక్పథంలో దళిత స్త్రీవాద ఉద్యమానికి అనుసరణీయంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే దళిత స్త్రీవాదం ఒక సాహిత్యంగా బయటపడింది. దళిత కవయిత్రుల జండర్ స్పృహకు శతాబ్దాల పోరాటాలలో చాలా దగ్గరి సంబంధం ఉంది. సామాజిక ఉద్యమాలు, దళిత పోరాటాల ఉద్యమం నుంచి నేటి ఆత్మగౌరవ ఉద్యమాలు, దళిత మానవ హక్కుల ఉద్యమాలు, వాటి లక్ష్యాలు, లక్ష్యసాధనకు అవలంభించిన విధానాలు, వాటి భావజాలాలన్నీ కూడా దళిత కవయిత్రులు తమ భావాలను వ్యక్తీకరించడానికి నేపథ్యాన్ని అందించాయి.

గోగు శ్యామల, జాజుల గౌరి, జూపాక సుభద్ర, చల్లపల్లి స్వరూపారాణి, మేరీ మాదిగ వంటివారు వర్తమాన దళిత స్త్రీవాద కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. 'మాకు గోడలు లేవు' అన్న స్త్రీవాదులు కులం గోడలను వదిలి పెట్టలేకపోయిన స్థితిని దళిత స్త్రీవాదులు ఎత్తిచూపారు. దళిత స్త్రీ తాము తమ కుటుంబ పురుషాధిపత్య సమాజం నుండి గాక, అగ్రవర్ణ స్త్రీల ఆధిపత్యం నుండే పీడన, హింస ఎదుర్కొంటున్నారని వారి వాదన.

అదే నీలిమేఘాలలో ప్రచురింపబడిన జయప్రభ 'పైటను తగలెయ్యాలి' కవిత్వానికి నిరసనగా జూపాక సుభద్ర 'కొంగున బొబ్బెమీద కావలుండే బొంత పేగ్గాదు' దళిత స్త్రీవాద నేపథ్యంలో కవిత్వాన్ని వెలువరించారు.

జయప్రభ – పైటను తగలెయ్యాలి

పైట | ఊబిలో నన్ను గుంజేస్తూ ఉంటుంది
పైట | సుడిగాలిలా నన్ను తోసేస్తూ ఉంటుంది
నామీద | తరాల నుండే మోపిన | అపనిందపైట
నన్ను అబలని చేసిన | పితృస్వామ్య
అదృశ్యహస్తం పైట
దోపిడీ సంస్కృతి | నా వ్యక్తిత్వాన్ని శవంగా
చేసిన దాని పైన కప్పిన తెల్ల దుప్పటి పైట
నేను నడితే శవాన్ని కాకుండా ఉండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి
పైటని తగలెయ్యాలి.

జూపాక సుభద్ర – కొంగు నా బొచ్చెమీద కావలుండే బొంత పేగ్గాదు.

కొంగు నా ఆకలిని ముడేసుకొని
నా గడుపు కర్సుకొని కట్టుమీని మైసమ్మోలె
కావలి బంటది
కూలినాలికి నేను సెమట కాల్వనైతే
పిల్లగాలై అద్దుకుంటుంది
కాయగడ్డలకు, గాసం గింజలకు
కోమటి దినుసులకు
సుక్కల్ని పొదుపుకున్న సందమామోలె
నా నెత్తిన మాటై మెరస్తది
సేండ్లల్ల సెల్కల్ల అలిసి సొలిసి పుల్ల సీలితె
పక్క బట్టై పుర్సతిస్తది

దళిత స్త్రీ చైతన్యాన్ని తెలిపే కవితలున్నాయి. స్త్రీవాదులు దళిత కోణంలో అణగారిన జాతి విముక్తి కోసం స్పష్టమైన పోరాట స్ఫూర్తిని చూపారు.

**మైనార్టీ స్త్రీవాదం :**

దళిత స్త్రీల తిరుగుబాటు విధంగానే ముస్లిం మైనార్టీ స్త్రీలు నిరసనలు ప్రకటించారు. ముస్లిం కవయిత్రులు తమ సంస్కృతిలో ఉన్న స్త్రీ అవిద్య, బుర్క, తలాక్, గృహ హింస వంటి సమస్యలకు స్పందించి కవిత్వం వెలువరించారు. మత శక్తుల దాడులను, స్త్రీల మీద జరిగే అత్యాచారాలను ఖండించారు. షహనాజ్ ఫాతిమా, షాజహానా, షంషాద్, యాస్మిన్ బేగం, జరీన్ బేగం, జాకేరా, ఎం.ఎస్.బేగం, రజియాసుల్తానా వంటి కవయిత్రులు కవిత్వం రచించారు. ముస్లిమేతరులైన రాజ్యలక్ష్మి, గీతాంజలి వంటివారు ముస్లిం స్త్రీవాద కవిత్వం రచించారు. షాజహానా రచించిన 'అమ్మ నవ్వేది నాన్న' కవితలో ముస్లిం స్త్రీల ఆవేదన కనిపిస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా చితికిలబడిన ముస్లిం కుటుంబాలలో ప్రతి ముస్లిం గృహిణి అనుభవిస్తున్న

స్థితి కళ్ళకు కడుతుంది.

నాన్నా... నాన్నా...!
అమ్మ మొహంలో జీవం లేదేం?
ఎప్పటిదో మీ ఇద్దరి బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో అమ్మ
నెలవంకలా నవ్వుతుంటే
ఎంతందంగా నవ్వుతుందో
మళ్ళీ ఒకసారి అమ్మని నవ్వమని
అచ్చం అలానే నవ్వమని చెప్పవా...!
ఇప్పుడిక ఎవరూ అలా నవ్వలేరు
రేష్మా నవ్వింది చిన్నప్పుడు
కల్తీ లేని నవ్వు
ఇప్పుడు దానికి ఇరవయ్యేళ్ళు
అప్పటికీ ఆ నవ్వులో ఎన్ని రంగులో కలిసి
దాన్నవ్వు అది మర్చిపోయింది
అందరం ఎక్కడ మర్చిపోయామో...!
ఇన్ని నవ్వుల్ని ఒక్క దగ్గరే పోగేస్తే ఎలా ఉంటుంది
స్వర్గం అంటారే... అది కనబడదు!!
కానీ ఇలాంటి స్వర్గాలు నీకక్కర్లేదు నాన్నా!
నీకు పక్కింటి ఆంటీ నవ్వు కావాలి
ఖాదర్ బీ డబ్బు కోసం నవ్వే కక్కుర్తి నవ్వు కావాలి
ఆ ప్లాస్టిక్ నవ్వులకు పాకులాడ్డం
అలవాటయిన నీ కళ్ళకి
అమ్మ నవ్వు రెక్కరాల్చుకుందని గానీ
అమ్మమనసు కన్నీళ్ళు రాలుస్తుందని గానీ
అక్కర్లేదు నాన్నా...

ముస్లిం కుటుంబాలలో ఉన్న బహుభార్యత్వం, బుకఖా పద్ధతి, అసంఖ్యాక సంతానం, పేదరికం, గల్ఫ్ వలసలు, ముస్లిం ముసల్మాన్ వృద్ధులలో ముస్లిం బాలికల షాదీలు, తలాఖ్ వ్యవస్థ, పురుషాధిపత్యం, పితృస్వామ్యం వంటివి కవితా వస్తువులుగా ముస్లిం స్త్రీవాద కవిత్వం వెలువరింపబడింది.

**ఉపసంహారం :**

స్త్రీవాదం అంతిమ లక్ష్యం పురుషాధిపత్య సమాజంపై తిరుగుబాటు ధోరణిని వహించడం. అది తెలుగు కవిత్వంలో బహిర్గతమైంది. జండర్ అసమానతలను తుడిచివేస్తూ లింగవివక్షతను స్త్రీవాదులు నిరసించారు. సమానత్వ భావనను కల్పించడమే స్త్రీవాద సాహిత్యం ప్రధాన ధ్యేయం. మహిళా సాధికారతకు; స్వేచ్ఛా, సమానత్వం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రయత్నం చేయడం కూడా ఒక అంశమే. స్త్రీ అనుభవం, మనస్తత్వ నిర్దేశాల మూలంగా స్త్రీ అభ్యున్నతిని కాంక్షించారు. స్త్రీ, పురుషుల సంబంధం శారీరకమైందా? సామాజికతకు కొలబద్ధగా నిర్ణయించబడిందా? స్త్రీవాదం అధ్యయనాలు జరిపింది. రాజకీయ, అధికార సంబంధాలు, ఆలోచనలు, ఆచరణ విధానాలు స్త్రీవాదాన్ని విషవలయంలోకి నెట్టివేశాయి. ఆర్థికంతో ముడిపెట్టాయి. పర్యవసానాల పునర్విశ్లేషణలో స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం పురోగమించింది.


**డా|| వి. త్రివేణి**
అసోషియేట్ ప్రొఫెసర్,
తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం,
నిజామాబాద్ – 503322 ఫోన్ : 9951444803,
email : telugutriveni@gmail.com


# ఆమె...



ఆమె నవ్వులు
పురివిప్పిన మయూరాలవుతాయి...
మనసుపై తుమ్మెదలా వాలిన
ఏ జ్ఞాపకమో వర్షపు చినుకయితే....

ఆమె కన్నులు
పాలపుంతల వెలుగులవుతాయి...
మనకేసిన ఏ చిత్రమో
కన్నీటి లో మునకలు వేస్తుంటే...

నీలాకాశం నుండి జారిపడిన
నులి వెచ్చని
ఓ మేఘమాలలా

ఆమె కలం కవిత్వంగా మారితే
ఆగి ఆగి కురుస్తోన్న
వెండిపూల తుషారాలు
చిరునవ్వుల శబ్ద మాలికలవుతాయి...

అపుడు

ఏ వేకువో ఒలికించిన
ఓ వెన్నెల గీతం
ఎదలయలో నిత్యం మోహాక్షరమై
మనసు వనాన అనుభూతుల
సంగీతాన్ని
ఆలపిస్తుంటుంది అదేపనిగా...

ఆమెపుడు
విస్ఫోటనమైన నిశ్శబ్దం లో నుంచి
ప్రవహించే
జీవ నదం...

సుస్వరాల రాగలహరిలో
వినిపించే
ప్రణవ నాదం...!!


**శాంతి కృష్ణ ఎం.ఎస్,**
హైదరాబాద్. ఫోన్ : 9502236670

# రాజును ధిక్కరించిన కవి కుమార్తె ఆత్మగౌరవం



- డా॥కొండపల్లి నీహారిణి

**రాజు మరణించె నొక తార రాలిపోయె**
**కవియు మరణించె నొకతార గగనమెక్కె**
**రాజు జీవించె రాతి విగ్రహములందు**
**సుకవి జీవించె ప్రజల నాలుకల యందు.**

ఎంత సత్యం ! అక్షరం కదా నశించకుండా ఉండేది! కవిత్వ విలక్షణతనే గదా ఆకట్టుకునేది. ఏ దేశచరిత్ర పుటలను త్రిప్పినా రాజులూ, రాజ్యాల చరిత్రే. రాజ్యాలూ వీగిపోయాయి గాని కవిత్వమొక్కటే, సాహిత్యమొక్కటే చిరస్థాయిగా నిలిచి ఉన్నది. పేరుకు 'ఫిరదౌసి' కోసం రాసిన పద్యమే కావచ్చు కాని జాషువా మహాకవిగా స్థిరపడిపోయేంత అద్భుత భావాన్ని ఇముడ్చుకొని సుకవిగా ప్రజల నాలుకల మీద సులక్షణంగా నిలిచిపోయిన పద్యమిది. ఎలా? ఇందుక్కారణమేమిటో పూర్వాపరాలేమిటో తప్పక తెలుసుకోవాలి.

లోకంలో ఎందరో తల్లిదండ్రులు ఉన్నారు. కాని ఎవరి సంతానమైతే మంచి సంతానంగా, కీర్తిప్రతిష్టలు తెచ్చుకున్న సంతానంగా మనగలుగుతారో వాళ్ళ తల్లిదండ్రుల పేర్లూ వారి సంతానం పేర్లతో బాటు సాహిత్యంలోకి, చరిత్రలోకి ఎక్కుతాయి. అట్లాగే గుర్రం వీరయ్య, లింగమాంబల పేర్లను సాహిత్య చరిత్ర పుటల్లో నిక్షిప్తం చేయించాడు గుర్రం జాషువా. తను జన్మించిన స్థితి నుండి లోకుల హృదయాల్ని గెలుసుకునే స్థితికి ఎదిగిన జాషువా ఛాందసవాదాన్ని తన అక్షర ఖడ్గంతో ఖండించి విజయం సాధించాడు. తన కులంవారి నుండి, ఇతర కులాల వారినుండి, ఆధిపత్యభావజాలమున్న అగ్రవర్ణాల వారినుండి తనదైన ధిక్కార స్వరంతో సుస్థిరత సాధించుకున్నాడు. అంటరానితనమనే అన్యాయపు గాలి దుమారాలను సహిస్తూ ఒక వటవృక్షంలా నిలదొక్కుకున్న జాషువా గొప్ప పండితుడు.

అనాథ, స్వప్న కథ, గబ్బిలం, కాందిశీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫిరులు, నాగార్జునసాగర్ వంటి ఖండకావ్యాలను రచించినా, యుద్ధ ప్రచార గీతాలుగా ప్రసిద్ధికెక్కిన 'రక్తగానం' వంటి ఖండికలు రాసినా, హిమధామార్కధర పరిణయం, కన్యకా పరమేశ్వరి, శివాజీ ప్రబంధం వంటి పద్య కావ్యాలు (అముద్రితాలు) రాసినా, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర వంటి లఘుకావ్యాలు రాసినా జాషువా కవిత్వ పటుత్వమంతా తరతరాల సాహితీ సుగంధాలను విరజిమ్మేదే ! కుశలవోపాఖ్యానం, చిన్ననాయకుడు వంటి గద్యకృతులు రాసిన జాషువా 'నా కథ' అనే స్వీయ చరిత్రను పద్యంలో రచించాడు. రుక్మిణీ కల్యాణం, చిదానంద ప్రభాతం, ధ్రువ విజయం, వీరబాబు, తెరచాటు వంటి దృశ్యకావ్యాలను రచించిన జాషువా ఆనాటి కాలంలో ఎదుర్కొన్న అసమానతలు ఎప్పటికైనా ఆ పరిస్థితులు ఇంకా మారనంతవరకు కాలాన్ని నిలదీస్తూనే ఉంటాయి.

ఫిరదౌసి కావ్యంలోని జాషువా రచనా నైపుణ్యాలతో బాటు తెలుగు సాహిత్యంలో అగ్రతాంబూలమందుకున్న కావ్యాలను గుర్తుకు తెచ్చి తెలుగులో కవిగా అతనెదగడానికి ఎంత శ్రమించాడో అతని భాషా పాండిత్యాలెంత గొప్పవో ఉదాహరణగా తెలిపి నేటి కవులకూ ఆదర్శంగా నిలుస్తున్నది. ఫిరదౌసి కావ్యం నాలుగు ఆశ్వాసాలు గల కావ్యం. కృతి ఆరంభంలో కృతిపతి ప్రశంస చేస్తూ

**"బ్రహ్మ కులమున్న గల యన్వవాయములను**
**రాణఁ జెన్నారు శ్రీ సింగరాట్కులమునఁ**
**బ్రథితయశుఁడైన మల్లపరాజు గారు**
**ప్రభవమందెను గొనములు పరిమళింప**
**ఆరవ్యకీర్తి శాలికి**
**గోరికలు ఫలింప ముద్దుఁ గొమరుఁడు లక్ష్మీ**

నారాయణుండు పుట్టెఁ బ
యోరాశికి, బూర్ణ హిమమయూఖుండు బలెన్"

అంటూ తన 'ముద్దుల కృతి'ని 'కావ్య కన్యామణి'ని ఇస్తున్నట్లు అంకితంగా ప్రకటించేప్పుడు ఆవిధంగా ప్రశంసించాడు జాషువా. తన కావ్యాలలో అంకిత పద్యాలను జాషువా అగ్రవర్ణాల కవుల విధంగానే రచించేవాడు.

'ఫిరదౌసి' కావ్య కథా విశేషాలు గమనిస్తే గజనీ మహ్మద్ తన నిండు కొలువులో పారసీ కవులలో గొప్పవాడైన ఫిరదౌసిని పిలిపించి 'షానామా'ను తన వంశ రాజచరిత్రను రచించి తనకు అంకితం చేయమన్నాడు. ఒక్కో పద్యానికి ఒక్కో దీనారను, అంటే బంగారు నాణెం ఇస్తానని వాగ్దానం చేస్తాడు. అందుకోసం ఫిరదౌసి ముప్పైఏళ్ళు శ్రమించి అరవై వేల పద్యాలతో 'షానామా'ను రచించి తీసుకొని రాజసభకు వస్తాడు. రాజు సంతోషించి చదవమంటే తాను రాసిన షానామాను పండితులున్న నిండు సభలో పఠిస్తాడు ఫిరదౌసి కవి. తర్వాత రాజు కవి ఇంటికి బంగారు నాణేలకు బదులు వెండి నాణేలను పంపిస్తాడు.

బంగారు నాణాలను ఇస్తానన్న పాదుషా వెండి నాణేలు పంపినందుకు అప్రతిభుడై బాధపడి ఫిరదౌసి కొన్ని పద్యాలలో తన అభిప్రాయాన్ని రాసి పంపిస్తాడు. అది పాదుషాకు కోపం తెప్పిస్తుంది. కవిని పట్టి చంపండని భటులకు ఆజ్ఞ వేస్తాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఫిరదౌసి గజనీ పట్టణాన్ని విడిచి భార్యా పిల్లలతో తన స్వగ్రామమైన 'తూసు' పట్టణానికి వెళ్ళిపోతాడు. భయంకరమైన అడవులను దాటుకుంటూ ఎంతో ప్రయాసతో ప్రయాణించి పోయిన ఫిరదౌసి అక్కడే తూసులోనే జీవిస్తుంటాడు.

సామంతరాజులందరు కవిని దుఃఖ పెట్టవద్దని చెప్పడంతో పాదుషా మనసు మార్చుకొని భటులతో అరవైవేల బంగారు నాణేలు ఇచ్చి పంపిస్తాడు కవికి ఇచ్చిరమ్మని. కాని ఏం లాభం? ధనరాశి తూసులోకి తూర్పు ద్వారం నుండి ప్రవేశిస్తూంటూంది. ఇటు పడమటి ద్వారం నుండి పిరదౌసి శవము ప్రేతభూమికి పోతూ ఉంటుంది. వెంటనే రాజభటులు ఆ ధనాన్ని కవి కుమార్తెకు ఇవ్వబోగా, "నా తండ్రిని నిరంతరం దుఃఖ పెట్టిన ఈ నీచమైన ధనాన్ని నేను ముట్టను" అని నిరాకరిస్తుంది. ఈ ఘోరవార్తను విన్న మహ్మద్ కవి పేరుతో ఒక నక్షత్రశాలను తూసు పట్టణంలో కట్టిస్తాడు. ఆ చిహ్నాలు నేటికీ ఇందుకు రుజువుగా నిలుస్తున్నాయి. కాని ఒకరికి కీర్తి, ఒకరికి అపకీర్తి దక్కింది. ఇద్దరూ కాలగర్భాన కలసిపోయారు. కీర్తి అపకీర్తులు కీర్తనల్లో నిలిచాయి అంటూ జాషువాగారు ఒక చారిత్రకాంశాన్ని లోకమనస్తత్వ చిత్రీకరణలతో కావ్యంగా చిత్రించి శాశ్వత పరిచారు. ఈ పద్య విశేషాలలోని జాషువా పాండిత్య శక్తిని, భాషావధూటి సౌందర్యాన్ని తెలుసుకుందాము.

**మును గజినీ మహమ్మదు, డభూత పరాక్రమశాలి, వీర వా**
**హినుల బలంబుతో, బదియు నెన్మిదిమాఱులు కత్తిదూసి చి**
**క్కని రుధిరంబులో భరతఖండము నార మొనర్చి సోమనా**
**థునిఁ బెకలించి, కైకొనియె, దొమ్మిదివన్నెల రత్నరాసులన్.**

భారతదేశ సిరిసంపదలను దోచుకునేందుకు పద్దెనిమిది మార్లు యుద్ధాలు చేసినాండంటే గజనీకి "బంగారు నాణెముల్ బస్తాలకెత్తించి... గుట్టాల మూపులగుస్తరించిన విధానం తెలిసిపోతుంది" సమస్త దేశ సంపదనంతా ఎత్తుకెళ్ళిన గజనీ

**పదియునెనిమిది విజయరంభల వరించి**
**గాంగజలమున నెత్తుటి కత్తి గడిగి**
**సర్వము హరించి హిందుదేశంబు విడిచి**
**గజిని మామూదు గజనీకిఁ గదలిపోయె.** అంటూ చారిత్రకాంశాలను కవిత్వంలో శాశ్వతం చేస్తూ జాషువా ఆనాటి చరిత్రను రాస్తూనే

**భారత క్షోణిఁగల్గు దేవస్థలములు**
**చెదరి గజనీ పురాన మసీదులయ్యె**
**నిప్పటి మసీదు లేరూప మెత్తఁగలవొ**
**కాలమెఱుగును, ధారుణీ గర్భమెఱుగు** అంటారు జాషువా కాలమహిమను ప్రస్తావిస్తూ.

అటువంటి గజనీ క్రమంగా భారతదేశ ఔన్నత్యాన్ని హరిస్తూ తనదైన నిర్దయ పాలనను కొనసాగిస్తూ తన భోషాణాన్ని నింపుకొన్నాడు. ఇక్కడ కవిగా జాషువా గారు చమత్కరించిన విషయాన్ని గమనిస్తే..

**హిందువుల దోర్బలము నాశ్రయించి బ్రతుకు**
**ద్రవ్యసంపద, తురక భూధవునిఁజేరి**
**కాపురంబుండె నతని ఖడ్గమును వలచి**
**సిరి నిజమ్ముగ వట్టి టక్కరిది సుమ్ము"** అంటారు.

ప్రాబల్యం ఉన్నవాడి చెంతకే డబ్బు చేరుతుందన్న సామాజికాంశాన్ని ఆనాటి సమాజంలో జరిగిన విధానానికి

ఆపాదించి చెప్పారు. ఫిరదౌసి కవిని సభకు పిలిపించుకుని తన గొప్పనంతా గ్రంథస్థం చేయమని నిండుసభలో చెప్పిన సందర్భంలో అతని మాటలు విని "యద్భుతావేశ మంగంబు నాక్రమించే స్వాంతమునఁ దోఁచె నూత్న నిసర్గ కవిత" అని ఫిరదౌసి హృదయంలో సహజ కవిత పుట్టిందని జాషువా అంటారు. ప్రభువు చరిత్ర రాయడమంటే, అందులోనూ స్వయంగా అతనే కోరినందున రాయడమంటే నిజంగా గొప్ప విషయం కదా! అందుకే ఒక చెప్పలేని ఆవేశం అతని శరీరంలో కలిగిందనీ, మనసులో ఒక కొత్తదైన త్యాగశీల స్వభావం కవితలాగా కదలాడింద"ని, ఆ నిసర్గ కవిత్వం కోసం ఫిరదౌసిలో ఉప్పొంగిన భావాలన్నింటినీ అందంగా పద్యరచనలో పొదిగారు జాషువా!

ఫిరదౌసి కావ్యంలోని కవితాభివ్యక్తిని పరిశీలిద్దాం. స్వర్ణకారుడు బంగారాన్ని మూల వస్తువుగా తీసుకొని నగ చేసినట్లు కవులు మూలకథను తీసుకొని కథను అల్లుకుపోతారు. జాషువాగారు చారిత్రకాంశానికి ప్రాణం పోసి కావ్యమల్లారు. ఇంతగా కాన్సెప్ట్ కు దగ్గరగా ఇలా కావ్యం రాసి కవిప్రపంచంలో పేరెన్నిక గన్న కవులు అరుదుగా ఉంటారు. రాజులను మంచిమంచి విషయాలతో వర్ణించాలని ఎంతో గొప్ప వర్ణనలతో వారి వంశం పైనా, వారి ప్రజాపాలనపైనా, వారి యుద్ధనైపుణ్యాల పైనా అతిశయిస్తూ రాస్తారు కవులు. ఫిరదౌసి రాసినట్టే ఆ వర్ణనలకు రూపమిస్తూ జాషువా యుద్ధతీవ్రతను వర్ణించేప్పుడు గంగా జలంలో కత్తిని కడిగాడని చెప్పడమనేది మహమ్మదీయ దండయాత్రల పరంగా కాజ్ అండ్ ఎఫెక్ట్ Cause and Effect తెలుపడమన్నట్టు ఇది హిందువులను పరోక్షంగా జాగృపరచటమే.

ఇలాగే జాషువా గారి భాషా పాండిత్యాలెంత గొప్పగా యో ఉదహరించడానికి ఈ ఫిరదౌసి కావ్యంలో అనేక వాక్యాలు ఉన్నాయి.

**"విత్తనంబున మహావృక్షంబు నిమిడించి**
**సృష్టించి గారడీ సేయువాఁడ**
**కడుపులో శిశువును గల్పించి పదినెలల్**
**మోయించి యూపిరి వోయువాఁడ"**
**అంటూ రాసిన ఈ సీసపద్యంలోని విశేషాలైతేనేమి,**
**సంజకెంజాయలో జలకంబు సవరించి**
**పటెతెంచు సూర్యబింబమ్ములోన**
**పదునాఱు దినముల పరువు వచ్చిననాఁటి**
**చంద్రుని ధవళ హాసములలోన..."** అంటూ వర్ణించిన ఈ వర్ణనలైతేనేమి భాషపై జాషువాకున్న పట్టును, భావనాశక్తి ప్రకటన శైలిని తెలుపుతాయి.

అట్లాగే ద్వితీయాశ్వాసంలో ప్రకృతి వర్ణనలో

ఉ॥ **ఈ తొలికోడి కంఠమున నే యినబింబము నిద్రపోయెనో**
**రాతిరి, తూర్పుగొండ అభిరామములైనవి, దీని వక్రమం**
**గూఁతలమ్మా మేమి? కనుఁగొమ్మని యల్లన హెచ్చరించి ప్రా**
**భాత సమీర పోతములు పై కొనియెం దొలి సంజకానుపుల్"**

అంటారు జాషువా. ఈ కవిత్వ రచనా శిల్పం గానీ, వర్ణనా నైపుణ్యంగానీ శాశ్వత కీర్తిని తెచ్చి పెట్టేలా ఉన్నవి. తొలికోడి కంఠంలో ఏ సూర్యబింబమో నిద్రించిందట. రాత్రి అనడమిది. తూర్పుకొండ అభిరామంగా వుందనడం ఎంత గొప్ప ఊహతో రాసారో జాషువా గారు! ఫిరదౌసి ఎంతో కష్టానికోర్చి కావ్యాన్ని రాసి ఇస్తే రాజు తాను అన్న మాటను నిలుపుకొంటూ బంగారు నాణేలు ఇవ్వకుండా, వెండి నాణేలు ఇవ్వడమనేది ఈ కావ్యంలోని ముఖ్య విషయం. రాజుల ప్రలోభాలు ఎలా ఉంటాయో, రాజు మనస్తత్వాలు ఎలా ఉంటాయో ఈ కావ్యం ద్వారా తెలుస్తుంది. What is జాషువా అనే గాదు! What is Poetry అనేది తెలుస్తుంది. కవిత్వం అభివ్యక్తీకరించిన భావాలతో పాటు ఆనాటి సామాజిక స్థితిగతులు తెలుస్తాయి.

తనకు బంగారు నాణేలు ఇస్తానని చెప్పి వెండి నాణేలు ఇచ్చాడని, తెలిసి వాటిని తాను తీసుకోనని తిరస్కరించి తక్షణమే నగరం విడిచి చెప్పి వెళ్ళిపోయాడని ఫిరదౌసి మీద కోపగిస్తాడు వెంటనే కవి మనసు ఎలా ఉంటుందో చెప్తూ,

చ॥ **కృతియొక బెబ్బులింబలె శరీర పటుత్వమునాహరింప, శే**
**షితమగు నస్థిపంజరము జీవ లవంబున నూఁగులాడఁగా**
**బ్రతికియుఁ జచ్చియున్న ముదివగు మహమ్మదు గారి ఖడ్గదే**
**వతకు రుచించునా? పరిభవవ్యథ యింతటనంతరించునా?**

నన్ను చంపడానికి రాజు పూనుకున్నాడూ అంటే, నేను ధిక్కరించినానని కదా, కావ్యరచనతోనే చిక్కినటువంటి నేను, ఎముకలగూడుగా మిగిలిన నా శుష్కించిన శరీరం రాజు ఖడ్గదేవతకు రుచిస్తుందా? అని ఫిరదౌసి అనుకున్నట్టు రాయడం జాషువా గారి ప్రతిభకు నిదర్శనం. 'ఏదో జీవలవంబుతో'

అంటాడు. జీవ లవంబు అంటే అతితక్కువ ప్రాణమున్నది అనడం. అట్లాగే "ఈ కావ్య సముద్రం ముత్యాలను అందిస్తుందని మునకలేసి ముత్యాలు ఏరుకున్నానా అని చెప్పిన సందర్భంలోనూ ఒక్క ముత్యాన్ని నేను పొందలేదు చివరకు సముద్రం నన్ను మింగటానికే నోరు తెరచింది అనుకుంటాడు ఫిరదౌసి" అని రాయడంతో ఫిరదౌసి చరిత్రను అజరామరం చేసిన జాషువాగారి కవితా శైలిని ఎన్నివిధాలుగానో ప్రశంసించవచ్చు. ప్రతిభను ఎత్తి చూపవచ్చు. ఇక్కడ జాషువా గారు మనుషుల మర్మాలను ఒక మనస్తత్వ శాస్త్రవేత్తగా చెప్పిన విధానం గమనించాలి. 'ఒక్కో రాజుల కీర్తి ఒక్కో విధము" ఇక్కడ రాజు వాగ్దానం ఇచ్చి అది తీర్చలేదు. తీర్చని కారణం కేవలం రాజదర్పం. ఇక కవి నిర్లక్ష్యాన్ని సహించకపోవడం. ఇంత జరిగినా మిగతా ముస్లి దొరలు రాజునేమీ అనకపోవడం, కిక్కురుమనని విధానాన్ని రాసాడు జాషువా. ఫిరదౌసి కావ్య రచనా ప్రౌఢిమకు రాణివాసం మొత్తం ఆశ్చర్యపోతుంది. కాని సభలోని రాజులే ఈ అన్యాయాన్ని చూసి మాట్లాడనప్పుడు ఇక రాణివాసం ఎట్లా ఎదిరిస్తుంది?

సభ అంతా భేష్ భేష్ అని ఊగిపోయింది. అటువంటిది తర్వాత రాజు ఇట్లా ఎందుకు చేసాడో అని ఫిరదౌసి అనుకున్నప్పుడు "పండితులేమి చెప్పిరో" అని అనుకోవడం ప్రతిభావంతుల పట్ల ఉండే నిర్లిప్తతను మానవ నైజాన్ని నిరూపింపజేయడం అనే ఒక క్లూను జాషువా గారు చక్కగా వ్యక్తీకరించారు.

పూర్వకవుల రచనాగరిమకు తీసిపోకుండా, కావ్య ప్రయోజనం చెడిపోకుండా కవి గౌరవాన్ని అభివ్యక్తం చేస్తూ కావ్యాన్ని ముగింపుకు తీసుకురావడంలో సహృదయ పండితులకు జాషువా నైపుణ్యం తెలుస్తుంది. పాలక పాలిత వ్యవస్థలోని ఈ ఘట్టాన్ని బట్టి రాజు ధర్మం తప్పడం అనేది ఈ కథకు ముఖ్యమైంది. ఫిరదౌసి రాజ్యాన్ని విడిచివెళ్ళడం. ఆ బాధతో శుష్కించి మరణించడం అదే సమయానికి రోజులో కనువిప్పు కలగడం, తాను ముందు చెప్పినట్లు బంగారు నాణేలను అతనికి పంపడం ఆ ధనంతో భటులు వచ్చే సమయానికి, కవి మరణించాడనీ – శవం అటునుంచి వెళ్ళిపోయే సమయానికి బంగారునాణేలు ఇటు నుంచి వచ్చాయని రాస్తే పాఠకుల కళ్ళు చెమరించవూ! ఇది కదా కావ్యకల్పనా నల్ప శిల్పమనిపించదూ!

అయితే ఇక ఇక్కడ చెప్పాల్సిన ముఖ్య విషయం ఫిరదౌసి కుమార్తె దగ్గరికి వెళ్తుంది. తండ్రి లాగానే ఆమె కూడా అభిమానవతి! తన తండ్రిని వేదనకు, దుఃఖానికి గురిచేసిన ఆ ధనం నాకక్కరలేదని తిప్పి పంపిస్తుంది. ఫిరదౌసి కావ్యానికి ఇదే కేంద్రమైన స్థానం. గురజాడ రచించిన పూర్ణమ్మను తలపిస్తుంది. "రాజుకు అపకీర్తి భావనం ఏర్పడింది, కన్యకకు కీర్తిభావనం ఏర్పడింది" అని చెప్పిన గురజాడ గారి పంక్తులు గుర్తుకువస్తాయి. ఫిరదౌసి కుమార్తె రాజును ధిక్కరించి ఉండకపోతే, ఆ బంగారు నాణాలను తీసుకొన్నట్లైతే ఈ చరిత్ర కథగా ఇన్ని మలుపులతో రాయబడకపోయేది. ఆ ధనమంతా ఫిరదౌసి సంతానానికి ఎట్లాగూ హక్కు ఉంటుంది కాబట్టి ఆమె తీసుకోదగినవే! కాని తీసుకోదు. ఇది తండ్రి ఆత్మాభిమానాన్ని పుణికిపుచ్చుకున్న ఆమె ఆత్మాభిమానాన్ని సూచిస్తుంది. ఆమె తిరస్కరించినందుకే కవి కీర్తి అజరామరమై మనముందు ఈ కావ్యంగా నిలిచింది.

ఇంత చక్కని కథలను కావ్యంలో మలిచిన జాషువా గొప్పతనం అభినందనీయ జాషువా నాటి పండితలోకం అబ్బురపడి జాషువా గారి కాలికి గండపెండేరం తొడిగిన ఘట్టం, గజారోహణం చేయించిన ఘట్టం, స్వర్ణ కంకణ సమర్పణల సార్థకములేనని అంగీకరించక తప్పదు గాక తప్పదు. 'కవి కోకిల' బిరుదును సార్థకం చేసుకున్న జాషువా గారి రచనా పాటవాన్ని మొత్తం అధ్యయనం చేసి ఆనందించాలి అంతేగాని, ఏదో ఒక గాటన కట్టేయకూడదు. కవి ప్రతిభ, పాండిత్యం మరుగున బడకూడదు.

'ఫిరదౌసి' కావ్యం జాషువాగారి రచనా కౌశలంతో కావ్యం ముగింపులో మహోజ్వాలగా మెరిసింది. రాజు ఆ ధనరాశితో ఫిరదౌసి పేరున సత్రం గట్టించి చిరస్థాయిగా నక్షత్రశాలను సృష్టించిన విషయాన్ని కావ్యం యొక్క ప్రధాన ఉద్దేశాన్ని విస్మరించకుండా కవి కీర్తికి న్యాయం జరిగినట్టుగా ముగించాడు జాషువా. భౌతికంగా శరీరంతో ఆనందించ లేకపోయినా అతడు కీర్తి శరీరం చేత ఆనందించేట్లు మనచేత చదివేటట్టు చేసిందీ రచన. ఇందుకు కారణం రాజును ధిక్కరించిన కవికుమార్తె ఆత్మగౌరవం ఆదర్శమైందని నిరూపితమైంది! పులి కడుపున పులిబిడ్డ పుట్టినట్లు ఫిరదౌసి కూతురు అబ్బురమైన అభిమానపు బెబ్బులికూనగా చిరయశస్సును సంపాదించుకున్న ధన్యురాలు.

**- డా. కొండపల్లి నీహారిణి**

# ఫోన్ చేస్తే పలుకుతరా...?



ఎంత పిచ్చితల్లివే అవ్వా
చిలక్కు చెప్పినట్లు ముందు గాల్నే జెప్పిన
అడ్డాల నాడు బిడ్డలు
గడ్డాల నాడు కారే అవ్వా అని..

గదేదో శకునందప్పి ఒర్లినని ఇరుసక పడితివీ
నా బిడ్డలసుమంటోళ్ళు
ఈ దునియా లోనే లేరని
సంబురంగ జెప్పుకుంటివి–

బోసి చేతులు జూసి అడిగితే
బిడ్డల కట్టాన్ని తీర్చలేనివి
నాకెందుకంటూ
అయ్య అవ్వ గుర్తని అపురూపంగా సూసుకున్న గాజులు
కుదువ బెట్టనీకి ఇస్తివి
కుదవ బెట్టింద్రో అమ్ముకుంద్రో గని
కట్టం సేసి సేసిన గా సేతులు
కళ దప్పినట్టున్నయే అవ్వా!

రెక్కల కట్టం మీద తాత జేయించిండని
మురిసిన గా నాంతాడేదే అవ్వ అంటే
బిడ్డల ఆపతికి ఆదుకోనిది అవుసరమాని ఒంటిమీద్ది ఒలిచి
వాళ్ళ చేతుల్ల బెడితివి...
పావురంగా అల్లుకున్న తాత సేతుల్లా ఉండే గా తాడు లేని
మెడకాయ
తోడు లేక మోడైన సెట్టులా అగుపించి
గుండె కలుక్కు మంటుందే..

గిప్పుడేదే అవ్వా?
నీ ఆరాటానికి ప్రతిఫలం
నీ అంతులేని ప్రేమకు గాళ్ళ ఇస్పందన..
ఫోన్ చేస్తే పలుకుతరా కొడుకా? అని అడిగి
గా నెంబరెప్పుడో మార్సింద్రే అంటే నమ్మవైతివి?.
గట్లెట్లుంటది ఝూటా జెప్పమాకు అన్న
నీ మాటల స్వచ్ఛదనానికి గాళ్ళు అర్థులు గారే అవ్వా..
నువ్విప్పుడు ఒలికిపోయిన ఓటికుండవు
చిల్లుబెట్టిన కాటి కుండవు
కటికోడికి పంపే వయసుడిగిన ముసలావువు...
వాళ్ళు ఫోన్ చేస్తే పలుకరే అవ్వా..

ఇంత జేసినా గాళ్ళు సిన్నోళ్ళు
ఏం తెలియనోళ్ళనే
కొండంత ఎత్తైనసుమంటి నీ తల్లి మనసుకు దండాలే అవ్వా

**– పురిమళ్ళ సునంద**
కవయిత్రి, రచయిత్రి, సమీక్షకులు,
సాహిత్య సంస్థ వ్యవస్థాపకురాలు, ఖమ్మం.

# కొంచెం!



వాళ్లతోనే
మనకు మాటలొచ్చిన సంగతి మరిచి
అవసరానికి తప్ప
నోర్లు విప్పరా

దొరబాబులు, దొరసానుల్లా మీరుండాలని
రెక్కలు ముక్కలు చేసుకుంటే
కుక్కలకంటే హీనంచేసి
బానిసల్లా మార్చడమేంటి

జూ , కొక్కొక్కొ అని
మిమిక్రీ, సర్కస్ ఫీట్లతో
మీ కడుపులు నింపితే
నాలుగు మెతుకులకే
నక్షత్రాలు కనబడుతున్నాయా!!

కాలం కలిసిరాకో, కడుపుతీపో
నాలుగురోజులుందామంటే
'ఎన్నాళ్లీ పెంట' అంటారా!
వాళ్లిచ్చిన జన్మే కదా...
పనికొచ్చేవి లాక్కోవడమే మీ హక్కా!
చూడాల్సిన అక్కరలేదా!!

'ఎంతకాలమనంటూ' లెక్కలేసుకుంటే...
కడుపులో మోసినన్ని నెలలో
సంకనేసుకు సాకినన్ని రోజులో
కంటికి రెప్పలా కాపాడినన్ని యేళ్లో
అన్నీ ఎన్నో చూడండి

వాటికంటే ఎక్కువైతే
మీ కడుపున కాసిన 'వడ్డీ'లకు చేసిందీ చూడండి
ఆ లెక్కా మించిపోతే
సాటి మనిషిగానైనా చూడండి

--------------------------------

(కొన్ని సంఘటనలు, కొంతమందిని చూశాక)

**- భైరి ఇందిర**

లేఖ

# మేఘ రాగమ్

వనజ తాతినేని



ప్రియ నేస్తం నీలాంజనా..

ఎలా వున్నావు! మనసారా మాట్లాడుకుని చాలా కాలమైంది కదా.. అందుకే ఈ ఉత్తరం. అయినా ఉత్తరాలు చదువుకునే తీరిక ఎక్కడుంది చెప్పు. మన వాట్సాప్ స్టేటస్ చూసుకుని ఓ మెసేజ్ అటునిటూ ప్రవహిస్తూ వుంటే చాలు ఎంతెంత దూరమైనా చెంతనే వున్నట్టు అదో భరోసా నిశ్చింతానూ! మన తరం ఒక విధంగా దురదృష్టవంతులం. నిన్నెతే అనలేను కానీ నా గురించే నేను చెబుతున్నా. ముందుగా నీతో పోల్చుకుంటూ.. నా ఆలోచనలు నీతోనే పంచుకుంటూ..

ఎనభై యేళ్ళు దాటిన అత్తగారైన వృద్ధురాలి సేవలో అంకితమైన నిన్ను చూస్తుంటే.. గర్వం కల్గుతుంది. నా ఊహాచిత్రంలో పసిపాపల సేవలో నిమగ్నమైన ఓ తల్లి గోచరిస్తుంది.

కానీ నన్ను నీతో పోల్చుకుంటే సిగ్గేస్తుంది. ఎందుకంటావా? డెబ్బై పైబడిన నాన్నను ఎనభై దాటేసిన అత్తమ్మను చూసుకో లేనందుకు. వారికి కనీసం ఓ కప్పు కాఫీ నో టీ నో తయారుచేసి చేతికి అందివ్వలేని స్థితిలో వున్నందుకు. వారు వారి గృహాలను అలవాట్లను వారికి నచ్చిన మెచ్చిన సౌకర్యాలనూ వొదిలి ఈ అపార్ట్మెంట్ సంస్కృతిలో ఇమడలేమని బాహాటంగా అంటుంటారు.ఆర్థిక బలిమి వున్న వారిద్దరూ వారి ఇగోలను వొదలలేరు. అందుకే వారిని నేను బలవంతం చేయడం లేదు. అలా అని వొంటరిగా మిగిలిన నేనూ వెళ్ళి వారివద్ద వుండనూలేను. అటు బిడ్డలకు ఇటు పెద్దలకూ మధ్య మన తరం వారు వారధులమే కానీ ఎవరూ ఎవరితోనో కలిసి జీవించలేని కాలంతో యాంత్రికంగా బ్రతకడం అలవాటైపోయింది. ఇది ఆర్థికంగా ఇబ్బందులు లేని వృద్ధజీవనంలో ఒక పార్శ్వమైతే మరొక పార్శ్వం బీదరికంతో అలమటిస్తున్న వృద్ధుల జీవితాలు.

నన్ను ఈ మధ్య అతిగా కదిల్చివేసిన సంఘటన ఏమిటంటే వృద్ధాప్యంలో వున్న తల్లిని ఆదరించలేక కన్నబిడ్డే స్మశానవాటికలో వదిలివెళ్ళిన కథనం చూసి మనసు విచలితమైపోయింది. అది చూసిన తర్వాతే చాలా విషయాలు నీతో పంచుకోవాలనిపిస్తుంది. అసలు మన వృద్ధాప్యం గురించి మనమేమి జాగ్రత్తలు తీసుకుంటున్నామో తెలుసుకుంటూ ఇంకేమి తీసుకోవాలో అని ఆలోచిస్తూ వున్నాను.

పూలను సృష్టించినవాడే తుమ్మెదలను సీతాకోకచిలకలను సృష్టించాడు కానీ గొడ్డలిని సృష్టించలేదు..

అన్నానొక సందర్భంలో. ప్రకృతిని గౌరవించినట్లే మన ఉనికికి కారణమైన తల్లిదండ్రులను గౌరవించడంలో సంరక్షించుకోవడంలో మనమెందుకు నిర్లక్ష్యం వహిస్తున్నాం నిర్దాక్షిణ్యంగా వుంటున్నాం!? నిజంగా అంత అసహాయతలో మునిగిపోయామా లేక అశ్రద్ధ చేస్తున్నామా? అనిపిస్తుంది.

పెద్దలున్న పంచన సిరులు తాండవిస్తాయని పెద్దల మాట. అది నిజమని చాలామంది అంగీకరిస్తారు. కానీ బిడ్డలెందుకు ఇంత కాఠిన్యంగా వుంటున్నారు? నానాటికి లక్షలమంది జీవితాలు ఎందుకింత దుర్భరంగా మారుతున్నాయి. నిరుద్యోగం పేదరికం నియంత్రణ లేని ధరలు ఆర్థిక అసమానతలు ఉగ్రవాదం ప్రకృతి వైపరీత్యాలు కాలుష్యం ధన వ్యామోహం విశృంఖలమైన స్వేచ్ఛా జీవనం మత్తుపదార్ధాల సేవనం ఇంకా ఇంకా అనేక కారణాలతో మనిషి జీవితం నానాటికీ కుంచించుకుపోతుంది. మానసిక శారీరక అనారోగ్యాలతో మనిషి విలవిలలాడుతున్నాడు. వృద్ధాప్యం అయితే ఇక చెప్పనవసరం లేదు.

ముడుతలు పడిన శరీరంతో శక్తి సన్నగిల్లబడిన దేహంతో వొకింత వేగం మందగించిన నడకలో నరాల మధ్య ప్రవహించే రక్తంలో ఆవేశం అణిగి నెమ్మది సంతరించుకున్న ఆలోచనల్లోని అనుభవసారాన్ని విప్పి చెప్పే గళాలను వినే ఆసక్తి సమయం మనకు లేవు. వృద్ధాప్యాన్ని బాల్యాన్ని ముడిపెట్టి నిశ్చింతగా మనగల్గే కుటుంబ భద్రత మనకు కరువైంది. వ్యక్తి స్వేచ్ఛకు దాసోహం అయిపోయిన మనం చిన్న మందలింపును తట్టుకోలేకపోతున్నాం. ఎడగారు పిల్లలే కాదు ఎడగారు తల్లిదండ్రులు అయిపోతున్నారందరూ..

ఊరు పొమ్మంటుంది కాదు రావద్దు అంటుంది ఏం చెయ్యాలి అని దీనంగా వేడుకునే పేద వృద్ధుల ఆవేదన కలచివేస్తుంది. కనిపెంచిన బిడ్డలే తల్లిదండ్రులను ఆదరించక రాక్షసుల మాదిరిగా ప్రవర్తిస్తుంటే వారికి ఎంత వేదన. ఆ మూగరోదనలు నిస్తేజంతో కన్నీరు ఇంకిన గాజు కళ్ళు మేమింకా ఎందుకు బ్రతికివున్నాం భగవంతుడా! అని విలపించే రోదనలు వారి వేడికోళ్ళు హృదయఘోష వినగల్గే బిడ్డలు అయినవాళ్ళు ఎందరు? వృద్ధాప్యం ఎంత శాపం!?

మనుషులు ఇంత కరుడుగట్టిన కాఠిన్యంతో ఎలా బ్రతకగల్గుతారు అనే ఆశ్చర్యం వేస్తుంది. పుట్టుకముందు మనచుట్టూ కొన్ని ఆశలు మమకారాలు అల్లుకునివుంటాయి. పుట్టాక యెదుగుదల క్రమంలో జాగ్రత్తలు ఆంక్షలు ఆకాంక్షలు వుంటాయి. అధికారాలు అహాలు అసక్తతలూ నిస్సహాయాలు ప్రేమరాహిత్యం అన్నీ భరిస్తూనే వృద్ధాప్యపు వొద్దుకు యెప్పుడొచ్చి చేరుకుంటారో కదా! తరచిచూసుకుంటే యెన్నో అసంత్రుప్తులు ఆవేదనలూ ఆరోపణలూనూ. ఎవరిమీదో ఒకరిమీద ఆధారపడే స్థితిలో ఎన్ని ఆలోచనలూ ఎంత వేదన!

వృద్ధాప్యం ఓ శాపం కాదు, వ్యాధి కాదు, అది రెండో బాల్యం'' అన్నారట తిరుపతి వేంకట కవులు.

మన భారతదేశంలో పదహారు కోట్ల మంది వృద్ధులు బిడ్డల నిర్లక్ష్యాలకు గురైన వారు అనాధలగా వున్నారట. తల్లిదండ్రులను దేవతలుగా భావిస్తారనుకునే ఈ దేశంలో కుటుంబజీవనానికి గొప్ప చిరునామా అనుకున్న మనదేశంలో ఉన్న పరిస్థితి ఇది. ప్రపంచ వ్యాప్తంగా కూడా వృద్దులను నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజం చెప్పాలంటే ఇది ఉగ్రవాదం లాంటి ముఖ్యమైన సమస్య.

వృద్దులు పిడికెడు మెతుకుల కోసం పెట్టే ఆకలి కేకలు రోగగ్రస్త శరీరాలతో వారి ఆలాపనలు అరుపులు ఈ ప్రపంచానికి వినబడదు వినిపించుకోదూ. వారి అరుపులు వారికే ప్రతిధ్వనులతో వినబడి జీవితంపై అసహనం అసహ్యం పుట్టిస్తుందట. ఆ అసహాయ జీవం పిడికెడు ప్రేమ కోసం తహతహలాడుతూ చకోరంలా ఎదురుచూస్తుంది. తుదకు ఏదో ఒకనాడు మరణిస్తుంది.

మా పక్కన నివసించే ఒక వృద్దజంటను గమనిస్తూ వుంటాను. బిడ్డలతో అంటీముట్టనట్లు వుంటారని అనుకునేదాన్ని. కానీ కరోనా కాలంలో బిడ్డల క్షేమం కోసం వారు ఎంత అలమటించారో. బిడ్డలు వారి క్షేమసమాచారం ఎలానూ విచారించలేదు కానీ వారు ఎంత ఆత్రుత ప్రదర్శించారో తెలుసా! వారికి అయినవాళ్ళపై బిడ్డల ప్రవర్తనపై విసుగు విరక్తి రెండూ వచ్చాక మనుషులను వద్దనుకోవటం మరణించడం కన్నా తక్కువేమీ కాదు. చుట్టూ వున్న మనుషులు చెప్పాపెట్టకుండా మాయమై పోతున్నప్పుడు మనతో అనుబంధం వున్న మనుషులు హఠాత్తుగా గుర్తుకు వచ్చి అయినవారికి గుబులు పుట్టిస్తారనుకుంటా. ఆ వృద్దులిరువురూ ఆత్రుతగా వారి కుశలం అడగాలని ఫోన్ పట్టుకుని మళ్ళీ అంతలోనే ఆగిపోవడం. అపుడు నాకనిపించింది మనుషులు సంకోచాలను జయించడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. సంకోచం జయించినపుడు వచ్చే స్వేచ్ఛ ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు కానీ కచ్చితంగా సంతోషాన్ని మాత్రం ఇస్తుంది కదా అని.

తల్లిదండ్రులను ధనం కోసం పీడించే పిల్లలూ వున్నారు. వారు ఆశించినవి ఇవ్వడం కూడా అంత తేలికైన విషయమూ కాదు. అది శారీరక శ్రమా వస్తు రూపమా వడ్డీ రూపమా స్థిరచరాస్తులా అన్నది కాదు. అన్నింటి మీద తన హక్కులో ఇతరుల హక్కులో ఇష్టాలో అయిష్టాలో యెన్ని కలగాపులగమై వుంటాయసలు. ఇవ్వలేదని నిరసన అలక ఆరోపణ అన్నీ

ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతూ వుంటాయి. అవి వృద్ధుల మనసుకు తెలుస్తుంటాయి. మేమేం బండరాళ్ళం కాదుగా. బిడ్డల మాటలు ప్రవర్తన లోపలి మనిషిని పట్టిస్తాయి. ఒకవేళ వాటిని అవసరం మేర దాపెట్టినా మేము చూసింది విన్నది నిజం కాదనీ తెలుస్తూనే వుంటుంది. ఎందుకు ఇంత బాధని వున్నదంతా ఇచ్చేసాము, ఇక తర్వాత మా ముఖం చూసినవాళ్ళే లేరు అని వాపోయారు. ఇలా అన్నీ బిడ్డలకిచ్చేసి అనాదరణకు గురైన అనాథలైన వృద్ధుల గుండెల్లో చెప్పలేని కథలెన్నో.. అందుకే అంటున్నా, మన పూర్వులు చేసిన తప్పులు మనం చేయకుండా మనకోసం మనం కొంత సమయం కేటాయించుకుని అందులో లీనమైపోదాం.వీలైనంతగా బిడ్డల మీద ఆధారపడకుండా గౌరవంగా జీవనం సాగించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి అని. ఉరుకుల పరుగుల జీవనంలో యెపుడైనా మన కోసం మనం ఆగి చూసుకున్నామా అని విచారపడుతున్నాను కూడా.

కూటికిగుడ్డకు నోచుకోని నిరాదరణ పాలైన వృద్ధులు దిక్కులేని రెక్కలు విరిగిన పక్షులై దీనస్థితిలో ఫుట్ పాత్ లపైన స్మశానాల పంచన కాలం వెళ్ళదీస్తూ యెంతకూ రాని మరణం కోసం దుఃఖిస్తూ కన్నీరు కూడా రాని గాజుకళ్ళతో నిర్వేదంగా చూస్తున్న చూపుతో కలవరపెడతారు. ఎవరిదీ నిర్లక్ష్యం. ఎవరిదీ పాపం!? ఎక్కడుందీ మానవత్వం. వీరిని సేవించడానికి ఆకలి నింపడానికి యెన్ని ఆపన్నహస్తాలు కావాలి.అమెరికాలో మరికొన్ని దేశాలలో లాగా వృద్ధుల భాద్యతను ప్రభుత్వాలు తీసుకుంటే బాగుంటుందేమో!

పిల్లలు కూడా ఎంతసేపూ వారి వారి వ్యక్తిగత అభిరుచులకూ ఆకాంక్షలకూ అనుగుణంగా నడుచుకోవడమే తప్ప ఇతరుల గురించి ఆలోచించడం అంటే మానేసారు సరే.. కన్న తల్లి తండ్రి రక్త సంబంధం గురించి కూడా ఆలోచించకుండా వుండటం యెంతవరకూ సబబు అనుకుంటున్నాను. వృద్ధురాలైన తల్లికి గ్లాసుడు పాలు కొనడానికి డబ్బులేదన్న కొడుకు పట్టుమని పదేళ్ళు లేని తన పిల్లల కోసం మేకప్ కిట్ ల కోసం వేలకువేలు ఖర్చు పెట్టడం వింతగా తోసింది. ఏ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాం మనం. ఎంత విచారంగా వుంటుందో ఇవ్వన్నీ చూస్తుంటే.

ఇంకొక విషయం చెబుతాను విను. ఒక స్త్రీ మూర్తి కథ ఇది. నాకు పిన్ని వరుస అవుతారు ఆమె. కొడుకు ఆమె ఆశలకు విభిన్నంగా వివాహం చేసుకున్నాడు. దానిని ఆమె దశాబ్దాలుగా అంగీకరించలేదు జీర్ణం చేసుకోలేదు. అనారోగ్యం కల్గితే ఆసుపత్రికి కూడా వెళ్లదు.ఆమెకు పిసినారితనం లేదా డబ్బు వెసులుబాటు లేకపోవడమేమో కాదు. తనకు తనమీద శ్రద్ధ లేకపోవడం, ఆసుపత్రికి వెళ్ళడం పట్ల అయిష్టత,బద్ధకం, నిర్లిప్తత కూడా కావచ్చేమో. కానీ ఆమె పెదవులపై ఎపుడూ ఆరోపణ కొడుకుపై కోడలిపై భర్తపై ఆఖరికి ఆమెపై ఆమెకు కూడా. మనకు వొకరు చేసే అన్యాయం కన్నా మనకు మనం చేసుకునే అన్యాయం ఎక్కువ అని చెప్పాలనిపించింది. మనుషులు పైకి కనబడేదానికన్నా అంతర్గతంగా విభిన్నమైన వాళ్ళు. వాళ్ళు హఠాత్తుగా షాక్ యిస్తూ వుంటారు. నిజమా నిజమా అని మనం పదే పదే గిచ్చి చూసుకునేంతగా. అందుకే ఎవరిపైనా కచ్చితమైన అంచనాలు పెట్టుకోకూడదు. బిడ్డలైనా సరే వారిని గుడ్డిగా నమ్మకూడదూ. నమ్మకం పక్కన అపనమ్మకం వుండాలి పొర క్రింద పొరలా. మనుషుల మధ్యే కాదు బంధాల మధ్య కూడా ధనం ప్రవేశించి నీకింత సేవ చేస్తే నాకెంత ఇస్తావు అని అడగటాన్ని సహజంగా తీసుకోవాల్సి వస్తుంది. అమ్మనాన్నలంటే ఆఖరి రక్తం బొట్టు వరకూ ఉదాత్తంగా ఇచ్చేవారే కదా..అది మరుస్తుంది పిల్లల లోకం.

అప్రయత్నంగా ఎప్పుడో చదివిన కథలు గుర్తొచ్చాయి "రుకైయ్యా రీహానా" ఉర్దూ రచయిత వ్రాసిన "తల్లి" కథను నేనెప్పటికీ మర్చిపోలేను. ఇంకో కథ "జహీదా హీనా" అనే రచయిత వ్రాసిన "తితిలియోం దూండ్నే వాలే" అన్న కథ తెలుగు అనువాదంలో "నిష్క్రమణం" అనే శీర్షికతో చదివినపుడు ఎంత కదిలిపోయానో. అలాగే ఇటీవల చదివిన తమిళ రచయిత "పెరుమాళ్ మురుగన్" వ్రాసిన అమ్మ కథ ఎంత హృద్యంగా వున్నాయో! వాటిని చదివిన మనుషులెవ్వరూ అమ్మనాన్నలను నిర్లక్ష్యం చేయరు అనిపించింది. నేను చదివిన అత్యుత్తమ తల్లిదండ్రుల కథలను సంపుటిగా వేసి పంచిపెట్టాలనిపిస్తూ వుంటుంది. ప్రేమ కథలు కాదు ఇపుడు కావాల్సింది. తల్లిదండ్రులను వృద్ధులనూ ప్రేమించి ఆదరించే విధంగా కఠినశిలగా మారిన హృదయాలను తుత్తునియలు చేసే సాహిత్యం సినిమాలు చిన్న చిత్రాలు రావాల్సిన అవసరం వుంది. వీధి కుక్కల కళేబరాలవలె దిక్కుమొక్కు లేని అనాథ శవాలుగా మనుషులు మిగలకూడదని నా ఆశ ఆకాంక్ష. మీ అత్తగారితో పాటు అమ్మను కూడా మీ ఇంటికి తెచ్చుకుని ఆమెకూ నీ సేవనూ ప్రేమాప్యాయతలనూ పంచిపెట్టాలని కూతురివైతే మాత్రం ఏమిటీ అమ్మను చూడటం కూడా నీ భాద్యతే కదా అని నీకు గుర్తుచేయాలని అనిపించింది.

జీవిత తీరం దాటడానికి ఏం కావాలి చెప్పు? ఓ రెండు చాలు. పిడికెడంత ప్రేమ చిటికెడంత ఓదార్పు. వృద్ధాప్యాన్ని అదే రెండో బాల్యాన్ని మన బిడ్డల బాల్యాన్ని కాపాడినట్లు పదిలంగా కాపాడుకుందాం. అదే మనం చూపే అసలైన ప్రేమ భాద్యత. వృద్ధులను వినడం ఒక వరం చాదస్తపు కబుర్లు అని కొట్టి

పడేయకుండా మనసుపెట్టి వింటే ఎన్నెన్ని అనుభవపాఠాలు అనుకున్నావు. వారి కబుర్లలో చరిత్ర దాగివుంటుంది.లోకరీతి వుంటుంది.వారు అధిగమించిన అవరోధాలు వారి త్యాగాలు కఠినమైన మాట వెనుక దాగున్న మంచి విషయాలు ఇలా ఎన్నెన్నో.

వృద్ధుల అనుభవాలు జీవనసారం. వారి మాటను పెడచెవిన పెట్టకుండా విని ఆలోచిస్తే మంచి జరుగుతుంది అని నమ్మేదాన్ని. ఇప్పటికీ నమ్ముతాను. వృద్ధుల కౌన్సిలింగ్ యువతను పెడత్రోవ పట్టకుండా కాపాడుతుంది. నాయనమ్మలను అమ్మమ్మలను తాతయ్యలను మీ పిల్లలకు కానుకలుగా ఇవ్వండి అని విదేశీ తల్లిదండ్రులకు చెప్పి చెప్పి వెగటు కల్గిస్తున్నానట. నా కొడుకు హాస్యంగా చేసే ఆరోపణ. ఇపుడు నువ్వేమంటావో!

చివరగా మనుషులైన వారందరిని ఒకటే కోరుకుందాం...

"మిమ్మలను ప్రేమించే వారి హృదయాలను ఎప్పుడూ గాయపర్చకండి. ఎందుకంటే వారు మిమ్మల్ని యేమీ అనలేరు. మౌనంగా మీ జీవితం నుండి నిష్క్రమించడం తప్ప." అని.

వృద్ధుల యొక్క సంతోషపు జీవనసూచికతో మాత్రమే కుటుంబానికి అర్థాన్ని దేశానికి అభివృద్ధిని ప్రపంచానికి శాంతిని కనుగొనగల్గం అనిపిస్తుంది.

ఉంటాను మరి..

ప్రేమతో నీ ప్రియ నేస్తం

**"అమృత"**

గల్పిత

# నమ్మకం



**- నిరుపమ**

"నో బేటా అల్లరి చేయద్దు. కరోనా లాక్డౌన్ కదా. మమ్మీ ఏమీ చేయలేదు. నీకు బర్తడే ఫ్రాక్ ఈసారి కుదరదమ్మా. వచ్చే పుట్టినరోజుకు రెండు డ్రెస్సులు.." అంటున్న తండ్రిని ఆపి.

"నో డాడీ మీకు తెలవదు, మమ్మీ కెన్ డూ, నాకు మంచి డ్రెస్ వస్తుంది, మమ్మీ తెప్పించ గలదు డోంట్ వర్రీ. ఐ హావ్ హోప్స్" అంటుంది సమీర.

తెల్లారితే సమీర పుట్టినరోజు రాత్రి భోజనాల తర్వాత వంటిల్లు సర్దుతూ తండ్రీ కూతుళ్ళ మాటలు వింటూన్నది, సమీర తల్లి అనిత.

ఆరేళ్ళ సమీరకు తల్లిమీద ఎక్కడ లేని నమ్మకం. లాక్డౌన్ కఠినంగా అమలౌతున్న ఏప్రిల్ నెలలో సమీర పుట్టినరోజు. షాప్స్ మాల్స్ బంద్, ఆన్లైన్ మార్కెట్ కూడా బంద్ ఏమిచేయలో తోచట్లేదు అనుకున్నారు భార్యాభర్తలు. అందుకే బిడ్డకు సర్ది చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు సమీర తండ్రి. కానీ సమీర వినేట్టు లేదు.

ఆలోచనలలో ఉన్న సమీర దగ్గరకు పరిగెత్తుకొచ్చి "నాకు రేపు పుట్టినరోజు డ్రెస్ వస్తోంది కదా మమ్మీ" అన్నది ఆశగా.

"ఔను తల్లీ వస్తుంది. ఇప్పుడు వెళ్ళి హాయిగా పడుకో" అన్నది సర్ది చెప్తూ. ఓకే అంటూ పరిగెత్తింది.

ఏమి చేయలో తోచట్లేదు అనితకు, తండ్రీ బిడ్డలు నిద్రపోతున్నారు, ఆమెకు నిద్రపట్టడం లేదు. తేదీ కూడా మారింది. చివరికి ఒంటిగంటప్పుడు లేచి బీరువా తెరిచి తనకిష్టమైన నారింజ రంగు పెళ్ళి చీరను తీసుకుని, మిషన్ ముందు కూచుంది, ఎలక్ట్రిక్ మిషన్ శబ్దం లేకుండా గంట నడచింది. రెండింటికి నిద్రకుపక్రమించింది అనిత.

పొద్దున్నే ఏడింటికి లేచిన సమీర టేబుల్ మీద పింక్ రిబ్బన్ కట్టిన ప్యాకేజీ అందుకుని తండ్రి దగ్గరకు పరిగెత్తింది.

"డాడీ నా బర్త్ డే డ్రెస్" అంటూ లేపింది. ఆశ్చర్యంగా కళ్ళు నులుముకుంటున్న తండ్రిని వదలి, సంతోషంగా తల్లి దగ్గరికి వచ్చి "థాంక్యూ మమ్మీ" అంటూ తల్లిని హగ్ చేసుకుంది. ఆరెంజ్ రంగు పట్టులంగాలో బుట్టబొమ్మలా తిరుగుతున్న సమీర కళ్ళలో మెరుపులు చూసి, అనిత ధంపతులు తృప్తిగా నవ్వుకున్నారు.

**- నిరుపమ**

(గల్పికల సంకలనంలో ప్రచురించబడినది)

# ఒక హిజ్రా



- సరోజన బోయిని

ఇది ఒక సున్నిత మైన అంశమే అయిన ఎందుకో వీరి గురించి రాయాలి అనిపించింది.

ఈ సమాజపు చీత్కారాలతో వీరిని వివక్షకు గురి చేస్తున్న తీరు చాల బాధాకరం.

ఇది వారికి  ఒక విభిన్న లక్షణమే కానీ మానవత్వం మరిచిన మనుషుల మధ్య వారి జీవనం నరక ప్రాయంగా మారుతుంది.

వారిని చూసి జాలి,దయ కలగక పోను ఏవిదంగా సాయం చెయ్యక పోను,వారిని చూస్తే హేళన భావం వారి బ్రతుకును చూసి నవ్వడం చాలా బాధాకరం.

ఇక నేను వీరి గురించి రాయడానికి కళ్ళ ముందు కనబడిన కొన్ని దృశ్యాలు.వారు పడే బాధలు. నేను, మనలో అందరం వీరి పడే బాధలు కళ్ళార చూస్తాం . అయినప్పటికి వారిని వివక్షకు గురి చేస్తూనే ఉన్నాం.

అసలు తప్పు ఎవరిది అలా పుట్టడం, అల మారడం వాళ్ళ తప్పా..??

తప్పు,ఒప్పుల సంగతి పక్కకు పెడితే. వారిని కన్న తల్లి, తండ్రులే ఈ సమాజాన్ని ఎదిరించి బుద్ధిచెప్పి వాళ్లకు అండగా ఉండాల్సింది పొయ్యి వారే వాళ్లను అనాధలుగా చేసి ఇంట్లో నుండి వెల్లగొట్టడం విషాధం.

ఫలితం రైల్వేస్టేషన్లు,రోడ్లు,బస్ స్టాండ్లు వీరి నివాస స్థలాలుగా ఏర్పరచుకొని కడుపుకు తిండి లేక బట్ట లేక ఆకలి కోసం బిచ్చగాళ్లుగా మారుతున్నారు.

ఒకవైపు సమాజపు చీత్కారం, మరోవైపు కన్న వాళ్ళ ఈసడింపు, కనీసం ప్రభుత్వం కూడ వీరిని ఏ విదంగా ఆదుకోక పోవడంతో అత్యంత హేయమైన బ్రతుకుని కొనసాగించవలసి రావడం ..., వీరి తరపున మాట్లాడే గొంతులు లేకపోవడం గమనార్హం.

మరీ వాళ్ళు మనలాగే మనుషులే అని ఎందుకు గుర్తించ లేకపోతున్నాం ?

ఆడ మగ, అగ్రవర్ణం దళితులు, ఉన్నవారు పేదవారు, మనుషులు జంతువులు ..., అన్నప్పుడు కనీసం మరీ మనలో వారైనా హిజ్రాల గురించి ఎందుకు మాట్లాడటం లేదు ?

ఒక హిజ్రాకి తోడు కేవలం మరో హిజ్రానే. వారికి శారీరక, మానసిక బాధలు వుంటాయ్..

అనారోగ్యం తో మంచాన పడితే వారిని చూసుకునేది ఎవరు ? పేగు బంధం,ప్రేమ బంధం అన్ని బంధాలకు వారిని దూరంగా ఉంచి వివక్ష చూపుతుంటే.

వారిని ఆదుకునేది ఎవరు.??

అందుకే వారే ఒకరికి ఒకరు తోడుగా ఉండి సాయం చేసుకుంటారు.

ఇంత దుర్భర మైన జీవితం కేవలం పొట్ట గడవడానికే భిక్షాటన చేయడం.

రోడ్లు, రైల్వే స్టేషన్ లు, దుకాణాల వెంట తిరుగుతూ డబ్బులు అడుక్కోవడం.

కొంత మంది జాలితో ఇచ్చిన కొంత మంది ఇవ్వక పోను చూసి నవ్వడం,అసభ్య పదజాలం ఉపయోగించడం,లైంగిక దాడికి గురికావడం.వారి మనసులో సమాజం పట్ల గౌరవాన్ని పోగొడుతున్నాయి.

అందుకే బలవంత భిక్షాటన చేయడం ఇవ్వని వాల్ల దగ్గర

జెబర్దస్త్ చేసి లాక్కోవడం లాంటివి చేస్తున్నారు.

సమాజ ధోరణి వీరిని నైతిక విలువలు మర్చిపోయేలా చేస్తుంది.బడిలోకి వెళ్తే వివక్ష చిన్నచూపు ,హేళన చేయడం. తోటి విద్యార్థులు వీరితో కలిసి ఉండక పోవడం.

ఇక వీరి పిలుపులో కూడ తేడా అందరిని బావ అని సంబోధించడం.

"కానీ ఒకసారి మా ఊరికి కొంత హిజ్రాలు వచ్చింద్రు కానీ వాళ్ళు ప్రతీ ఒక్కరినీ అన్నా మీకు తోచినంత మాకు సాయం చేయండి అని అడిగారే తప్ప ఇంత ఇవ్వండి అని డిమాండ్ చెయ్యలే..

వుండబట్ట లేక నేనే అడిగా ఇంటికి 500 అడగచ్చుగా గా అని.

అప్పుడు వాళ్ళు చెప్పిన సమాధానం

" అక్కా..!

ఊళ్ళో అందరూ వ్యవసాయ కూలీలు అంత అడిగితే వాల్ల దగ్గర కూడ వుండాలిగా.. " అని.

వీరిలో అందరు ఒకే విదంగా వుండరు వారు పెరిగిన వాతావరణం తీరే వారి ప్రవర్తన ఉంటుంది.ఇందులో తప్పు వారిది కాదు..

హిజ్రా ల కోసం తీసిన ఒక మంచి సినిమా "కాంచన"

ఈ సినిమా నన్ను బాగ కదిలించింది.ఒక హిజ్రా అనాదిగా మారిన మరో హిజ్రాను దత్త తీసుకొని చదివించి డాక్టర్ ను చేయడం. అందుకు పైస,పైస కూడబెట్టడానికి తను పడ్డ కష్టాలు.

చివరకు హిజ్రా అని చూడకుండా తన మీద దయలేకుండ చంపి తన ఆస్తి గుంజుకోవడం. కంట తడి పెట్టించే దృశ్యాలు.

ఇలాంటివి సమాజంలో కోకొల్లలు.

వారి జీవనం భారం అవడంతోనే బిచ్చగాళ్లుగా మారిన వైనం.

అందుకే హిజ్రాలు అందరు కూడ కొంత,కొంత మంది జతగా ఒక ఇంట్లో ఉండి ఒకరికి,ఒకరు తోడుగా ఉండి సహాయం చేసుకోవడం.

కాని కొన్ని సందర్భాలలో వీళ్ళకి ఇల్లు కిరాయికి దొరకడం కూడ కష్టమే..

ఇలాంటి వారికి ఎవరు కిరాయికి ఇవ్వడానికి ముందుకు రాకపోవడం.

కానీ వీరి బిక్షాటనతో వచ్చే రోజు వారి ఆదాయం వారి తిండికె సరిపోదు మరి సొంత ఆస్తులు వీరు ఎలా సంపాదించుకోగలరు ?

వీరి సమస్యలు తీరాలి అంటే వీరిలో ఆర్థిక ఎదుగుదల ఎంతో అవసరం.

అందుకోసం వీరికి కూడ చదువు,వ్యాపారం,ఉద్యోగం లాంటివి వీరికి చాల ముఖ్యం.

రాజకీయ ఎదుగుదల కూడ వీరికి అవసరం.

హిజ్రాలు వాళ్ళ హక్కుల కోసం ఎంత పోరాటం చేసిన తగిన మద్దతు లేక అవి నీరు కారిపోతున్నాయి.

వీరిని పట్టించుకునే వాళ్ళు కూడ తక్కువే..

హిజ్రాలు వాళ్ళ హక్కుల కోసం పోరాటం చేసేటప్పుడు కేవలం హిజ్రాలే కాకుండ. సమాజం లోని అందరు స్త్రీ, పురుష భేదం లేకుండ వారికి మద్దతుగా ఉంటే వారు ఎంతో కొంత వారి హక్కులను సాదించుకోగలరు.

వారు మనుషులే వారికి అన్ని కోరికలు ఉంటాయ్.

చవుకోవాలని, ఉద్యోగం చెయ్యాలని, వ్యాపారం చెయ్యాలని, రాజకీయంగా ఎదగాలని.

తద్వారా ప్రజలకు సేవచెయ్యాలని,వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడి. ఎవరిని దేహి అని అడగకుండ బ్రతాకలని వాళ్లకు ఉంటుంది.

వీరిలో సామాజిక ఎదుగుదల ఉండాలే అంటే సమాజం తో పాటు ప్రభుత్వ అండదండలు కూడ వీరికి ఉండాలే.

వారి తల్లి,తండ్రులు వారి పుట్టుకను అవమానంగా భావించి కనికరం లేకుండ వదిలించుకుంటే.

కనీసం ప్రభుత్వం అయిన వీరికి అనాధఆశ్రమాలు ఏర్పాటు చేసి.వీరికి చదువు ఉద్యోగం లో కొంత రిజర్వేషన్లు లాంటి వెసలు బాటు కల్పించి. వీరిని ఆదుకోవాలి.

హిజ్రాల సంక్షేమం కోసం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన ఫలితం మాత్రం వారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది.

2014 ఏప్రిల్ 15 తేదీన హిజ్రాల కోసం వెలువరించిన "నల్సా తీర్పు" దీని ప్రకారం హిజ్రాలను థర్డ్ జెండర్ గా గుర్తించి. స్త్రీ, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలి అనేది దీని సారాశం.( ఇది నేను చదివి తెలుసుకున్నదే పరిశోధనాత్మకంగా తెలుసుకున్నది కాదు)

కానీ స్త్రీ,పురుషుల తో సమానంగా హక్కులు కల్పించక పోను పైకెళ్లి ఎన్నో అవమానాలు ఎదురుకుంటున్నారు..

కానీ ఈ మధ్య కాలం లో వచ్చిన మార్పు సమాజం లో కొంత మంది వీరికి అండగా ఉండి ముందుకు నడపాలే అని సదుద్దేశమే.

వీరిని రాజకీయాలలోకి ఆహ్వానించడం.

2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో "చంద్రముఖి" అనే ట్రాన్స్ జెండర్ కి బహుజన లెఫ్ట్ పార్టీ(blf) హైదరాబాద్ లోని గోషా మహల్ నియోజకవర్గం నుండి M. L. A. గా టిక్కెట్ ఇచ్చి అన్ని ప్రజా సంఘాల మద్దతు తనకు ఇచ్చిన ఓటమి పాలు అయింది.

కానీ ఇది తన ఓటమి ఇది వాళ్ళు వాల్ల గెలుపు వాళ్ళ జీవితాలలో వెలుగు నింపే ప్రక్రియ.

ఇలాగే నిరాశ చెందకుండ ముందగడు వేస్తే వారి జీవితాలలో అన్ని విజయాలు సాధించగలరు.

దానికి ఉదాహరణ prithika yasini అనే హిజ్రా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా( S.I) విధులు నిర్వహించడం.

ఈమె ఫస్ట్ ట్రాన్స్ జెండర్ పోలీస్ ఆఫీసర్ గా తమిళనాడు రాష్ట్రంలో విధులలో చేరారు.

తను 2014 ఏప్రిల్ 4 తేదీ నాడు ధర్మపురి పోలీస్ స్టేషన్ లో( S. I) గా విధులలో చేరారు..

ఇలాగే అన్ని రంగాలలో వీరు తమకంటు ఓ గుర్తింపు తెచ్చుకొని స్త్రీ,పురుషులతో సమానంగా బ్రతకాలని ఆశిద్దాం. మనవంతుగా వారికి మద్దతుగా నిలబడదాం.

**- సరోజన బోయిని**

# వయో వంచితులు



న్యాయదేవతలారా కదలిరండి
న్యాయమూర్తులారా కరుణించండి
కారుణ్య మరణానికి అనుమతించండి

వృద్ధాప్యం వెంటాడుతోంది
నిరాదరణ నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది
నిరాశా నిస్పృహలు వెన్నంటుతున్నాయి
కని పెంచినవారిమీదే కనిపించని కఠినత్వం

నాగరికత పెరిగింది
జీవనశైలి మారింది
మానవత్వం మసకబారిపోతోంది
ముసలితనం కంపుకొడుతోంది

మాకెక్కడా చోటులేదు
మా ఉనికి అందరికీ ప్రశ్నార్ధకమే
మసకబారిన మనసులు
వాడిపడేసే జాబితాలో చేర్చేశారు

అరమరికలులేని జీవితం గడిపాం
అరకొర వసతులతో జీవనం సాగిస్తున్నాం
వృద్ధాశ్రమాల దగ్గర హౌస్ ఫుల్ బోర్డులు
వయోవంచితులం విలాప వీచికలం

ఈ వేదనామయ జీవితంలో అలసిపోయాం
అనంతలోక ప్రాప్తే మాకు తృప్తి
వేతన జీవులకి 'పదవీవిరమణ' ఉన్నట్లే
వయోవృద్ధులకు 'జీవన విరమణ' చట్టం తీసుకురండి
న్యాయ మూర్తులారా కదలిరండి కరుణించండి

**డా.బి.మాధురి**
విశ్రాంత ప్రధానాచార్యులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మధిర

హాస్య కథ

# కాఫీలు తాగారా.. టిఫినీలు తిన్నారా



- ఎన్నెల

మా పెద్దక్క పెళ్ళప్పుడు మధ్యవర్తి ఒక మాట మోసుకొచ్చాడు. ఆ మాట విని పెళ్ళి పెద్దలకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. అసలు ఇదేం కోరిక అంటూ ఇటువైపు మధ్యవర్తి విరుచుకుపడ్డాడు. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కూడా పెళ్ళిలో ఉపాహారమంటే ఉప్మానే కదా. పెళ్ళి అవగానే భోజనాలే గనుకనూ, బ్రేక్ఫాస్టు బ్రేవుమనేలా తినేస్తే వండిన వంటలకి న్యాయం జరగదు కనుకనూ....పెళ్ళివారికి ఫోను, ఇంట్లో ఉన్నవారికి తలో పిడికెడూ వచ్చేట్లు పలుచటి ఉపమాలంకార ఉప్మా అనే ఉపాయాన్ని కనిపెట్టారుట మహర్షులు. అంతటి మహర్షులను కాదని ఈ కోరికలేంటట.. అడిగొస్తా అంటాడాయన. "పెళ్ళి వారు చీరలడిగారా తారలడిగారా పూరీ కూరా అంతేగా.. పెళ్ళి తంతు మొదలవకుండానే గొడవలెందుకు చేయించేద్దా"మంటారు నాన్న.. "ఇదెక్కడ గోల ..అంబట్లో కుంభంలా ఇవి పెట్టుకుంటే ఆదివారంలో సోమవారమయేట్టుంద"ని ఆదుర్దాగా చూస్తున్న వంట వాళ్ళు .

జూన్ నెల.. ఈదురు గాలులు, .. వర్షం.. ఇంటిముందు ఉండనా ఊడనా అంటూ ఊగిసలాడుతున్న టెంటు.. ఆ మధ్యన చిన్న కొబ్బరాకుల పందిరి... దాని చుట్టూ పిల్లల పరుగులు !! తర్జన భర్జనలయ్యాక వంటవాళ్ళ బెదురు కంటే పెళ్ళి వారి నదురే ముఖ్యం కాబట్టి "అలాగే కానిద్దాం" అన్నారు నాన్న. మా ఇంట్లోనూ, పక్క వాళ్ళ ఇళ్ళల్లోనూ ఉన్న గొడుగులన్నీ గాడి పొయ్యి మీద తెరుచుకున్నాయి. ఇంట్లో వత్తిన పూరీలు తడవకుండా పొయ్యి దగ్గరికి తేవడం గగనమవుతోంది. కూర చేసేసారు కానీ, నూనెలో నీళ్ళ చుక్కలు పడడంతో పూరీలు ఎక్కువ మొత్తంలో చేయలేకపోయారు . అందువల్ల యుద్ధ ప్రాతిపదికన మా ఊరి రేషను షాపు గోవర్ధన్ లాగా యమా స్ట్రిక్ట్ గా ఉండే మా పిన్నిని ఏకగ్రీవంగా టిఫినీల సెక్షనుకి హెడ్డు గా ఎన్నుకున్నారు. పెళ్ళివారికి మాత్రమే దండిగా కావలసినన్ని పూరీలు వడ్డించే ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో పిల్లలకి పూరీలు అంటే మహా ప్రాణం కదా..అందరం గుటకలు వేస్తూ చూస్తుండగా వాళ్ళందరూ తిని వెళ్లే వరకు గుడ్లురిమి ఆపిన పిన్ని, మిగిలిన చల్లారిన పూరీలని లిమిట్ లిమిట్ అంటూ ఒకటీ అరా పిల్లలకి తినిపించి ఆటకి తోలేసింది. అప్పటినుంచీ నాకు పెళ్ళి లో బ్రేక్ఫాస్టు అనే మాట వింటే మా పిన్ని లిమిట్ గుర్తొచ్చి నవ్వొస్తుంది . అసలు మా ఊర్లో పెళ్ళి కొడుకు వైపు బలగం పెళ్ళికి కొన్ని గంటల ముందు వచ్చి, ఆంజనేయ స్వామి గుడిలో కూచుంటే ,బామ్మర్దులొచ్చి బతిమాలి బామాలి తీసుకెళ్ళి పెళ్ళి చెయ్యటమే తప్ప నాష్టాల నష్టాలు కష్టాలు మాకెర్కనే లెవ్వు. అయితే కొన్ని సార్లు దూరాభారాల లెక్కలో బ్రేక్ఫాస్టులు పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకి. మా చుట్టాల పెళ్లి కి మహబూబ్ నగర్ వెళ్ళినప్పుడు పొద్దున పొద్దున్నే వేయించిన అటుకులు బ్రేక్ ఫాస్ట్ గా పెట్టారు. అయితే మరీ పెద్ద వాళ్ళు ఎవరూ ఆ బ్రేక్ ఫాస్ట్ తినలేక కేవలం కాఫీ తాగి, పెళ్లి అంతా అయ్యాక మూడింటి వరకు పస్తు ఉండేటప్పటికీ మరి నీరసం వచ్చి ఎక్కడికక్కడే ఒరిగిపోయారు తినడానికి కూడా ఓపికలేక!

అసలు మగపెళ్ళివారు బ్రేక్ఫాస్ట్ ఇంట్లోనే తినేసి పెళ్లికి ఒక గంట ముందుగా వస్తేనే మంచిదేమో .. .ఎందుకంటే.. మరీ పెళ్ళివారు ముందుగా అడిగితే తప్ప తెలుగు వాళ్ళ పెళ్లిళ్లలో బ్రేక్ ఫాస్ట్ కి పెద్దగా ఇంపార్టెన్స్ ఉండదని చెప్పుకోవచ్చు.

కొందరు పెళ్ళి లో మొక్కుబడులు ఉద్యాపనలూ చేసుకుంటూ బ్రేక్ ఫాస్ట్ అన్న పదాన్ని పూర్తిగా తీసేస్తూ ఉంటారు . దేవుని కల్యాణాలకి అయితే చెప్పనే అక్కరలేదు. అరే పెళ్ళి కదా టిఫిన్ తిని వెళదామంటే ఎవరూ ఒప్పుకోరు . మరీ మందులూ, మాకులూ వేసుకోవలసిన సీనియర్లు కూడా ఏ బిస్కెట్ లో ఏర్పాటు చేసుకోవాల్సిందే తప్ప తినేసి వెళ్ళే సవాలే ఉండదు మరి. పెళ్లి కొడుకు, పెళ్ళి కూతురూ

సంగతి సరేసరి! పెళ్ళి తతంగం ఎంత లేట్ అయినా సరే... వాళ్లు అలా ఉపవాసం ఉండి నీరస పడి పోయి, అగ్నిహోత్రం దగ్గర కళ్ళు మంటలు పెట్టేస్తూ మొహం వేలాడేసుకుని ఎప్పుడో ఏ నాలుగింటికో అందరూ తిన్నాక భోజనం చేయడమే తప్ప ,చక్కగా కడుపునిండా తిని పెళ్లి చేసుకోవడం అనేది ఉండనే ఉండదు.

మన దక్షిణం వైపేనేమో ఇదంతా..

ఇక్కడి కెనడాలో మనలా కనబడిన వారందరినీ " కడుక్కుని ప్రసాదం (పుల్లు మీలే) తినేసి రమ్మని ఆదేశము లాంటి అభ్యర్థన చేస్తారు. వారి ఉద్దేశ్యం ఏంటంటే మనము కడుపునిండా తిన్నప్పుడు మాత్రమే శ్రద్ధ ,భక్తితో ఇంకొకళ్ళకి సేవ చేసే మనసు కలిగి ఉంటామని. సరే మా అమ్మనిప్పుడు గుర్తు చేసుకోవడం అవసరమా? పోనీ చేసుకుందాం లెండి " చద్దన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదని చెప్తూ.. అందరూ తిన్నాక మాత్రమే తినాలి, కనపడిందని ముందు తినెయ్యకు అసలే పెద్ద కోడలివి అని చెప్పి పంపింది లెండి.. కానీ, మనకు కడుపు నిండి నప్పుడు మనము నిదానంగా తృప్తిగా

# పిచ్చితల్లి



ఎండిపోయి అట్టలుగట్టి
వేలాడుతున్న జుట్టు
బతుకులోని దయనీయత
మురికి చారికలైన ముఖం
దయదలచి ఎవరో ఇచ్చిన
పొడవాటి కోటులో
దుర్బలంగా ఇమిడిపోయిన శుష్కదేహం
లిబర్టీ చౌరస్తా సిగ్నల్ దగ్గర
వాహనాల చుట్టూ చాచిన చేయి తానై
ఇంకొన్నిసార్లు
ప్రపంచంతో నిమిత్తం లేనట్టు
అటుఇటు తిరుగుతూ
ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు
కాళ్ళతో భూమిని తంతూ
ఎవరైనా ఇచ్చిందేదో తింటూ
వెర్రిగా వెకిలిగా నవ్వుతూ
అంతదాకా పిచ్చిది మాత్రమే – ఆమె

నిశి మాటు నీడల కింద
బలిసిన ఏ తోడేలు విరుచుకుపడిందో
ఏ చీకటి జాగిలాలు చీల్చుకు తిన్నాయో
మెడకి వేలాడే చిరుగుల
చీర ఉయ్యాలలో
మూన్నెళ్ళ పసిగుడ్డుతో పిచ్చితల్లిగా మారింది
తన ఆకలికి కన్నపేగు కూడా తోడై
దిక్కుతోచని చూపుల్తో
చౌరస్తా మధ్యలో నిలబడింది
అఘాయిత్యం పాలై పిచ్చిదైందో
పిచ్చిదైనందుకు అన్యాయమైపోయిందో
చెప్పగలిగేదెవరు!
కళ్ళు మూసుకు పోయిన
కక్కుర్తికుక్కలకు
కాపలాగా నిలిచేదెవరు !

–~~~

**- హిమజ**

బంధుమిత్ర సపరివార సమేతంగా వచ్చెయ్యమని " పెళ్ళి కి పిలవరు . చాలా క్లుప్తంగా పాతిక యాభై మంది అంతే!

ఇక పంజాబీ వారికి గుడిలోనూ, బడిలోనూ భోజనాలుంటాయి కదా! "భోజనం కోసం వచ్చినా సరే ..గుడికి రావడం ముఖ్యం" అంటారు వారి మత పెద్దలు. మరి వంట ఎవరంటారా? మొక్కు పెట్టుకున్నట్టు రోజూ గురుద్వారాకి తెల్లవారుజామున వెళ్ళి వందలకొలది రొట్టెలు చేస్తుంటారు కొందరు. సేవ చేయడానికి ఇష్టమైతే మనని కూడ గురుద్వారాకి ఆహ్వానిస్తారు. అలా ఆహ్వానించినప్పుడు అప్పటికే అక్కడ పనిచేస్తున్న వాళ్ళు "ముందుగా కాళ్ళు చేతులు

ఇంకొకళ్ళకి చక్కని సేవచేసే అదృష్టం కలుగుతుంది కదా ! నాకు ఈ అభిప్రాయం సరియైనది అనిపిస్తుంది. కానీ మా అమ్మ శిక్షణ ఇచ్చింది కదా అలవాటయిపోయింది అలా. . సరే , మన పంజాబీలకి గుడిలోనే ఇంత ఉందంటే ఇంక పెళ్ళిలో ఊహించండి. స్నాక్సే చాలు ..పసందుగా పాతిక రకాలు. అందరూ తింటే కానీ పని మొదలెట్టరు.

ఈ మధ్య ఆఫీసులో పెళ్ళి అనే అంశం మీద మాట్లాడుకుంటుంటే ఒక సహోద్యోగి " బాబోయ్ వీళ్ళ ఇళ్ళలో పిల్లలని పెళ్ళి చేసుకునేరు తల్లోయ్.. పెళ్ళి పీటలమీదే నిరాహారదీక్షతో హత్యకు పాల్పడతారు. అబ్బాయికి, అమ్మాయికి, వారి తల్లిదండ్రులకీ ఉపవాస దీక్ష... ఏమీ పెట్టకుండా పెళ్లి చేస్తారుట "అని చెపుతూ "కదా ? " అంది నా వైపు చూస్తూ. నేను అవునని చెప్పనా కాదని చెప్పనా అని ఆలోచిస్తూ ఉండగా " మరి ఆకలితో నకనకలాడుతూ పెళ్లి ని ఎలా ఎంజాయ్ చేస్తారు?" అని అడిగింది . నాకు ఆ పాయింట్ సరిఅయినదే అనిపించింది. కానీ అందరిలో ఏమనాలో తెలియక " ఏదో మంచికారణం చేత పెట్టి ఉంటార"ని సమర్ధించడానికి ప్రయత్నం చేసా. ఈ అమ్మాయి అందుకుని " మాలో ఏ పరిస్థితిలోనైనా సరే ఆకలిగా ఉండడం నిషిద్ధం. పెళ్ళి, పేరంటం ,చావు, దినం ఏదయినా సరే..లోపలికి వస్తుండగానే గడపలో ఒక వ్యక్తి మనని స్నాక్స్ ఉన్న వైపు తీసుకువెళ్తారు. తిన్నాకే ఏదైనా" అంది. " మాలోనూ అంతే ..కానీ " అనబొయ్యా..

"నాకు కతలు చెప్పకు.. నా చిన్నప్పటి ప్రాణ స్నేహితురాలు ప్రియ తెలుగమ్మాయే . ఆ అమ్మాయి పెళ్ళికి కుటుంబం మొత్తం రావాలని మరీమరీ చెప్పింది. ఆదివారం పెళ్లి. అసలే అందరూ ఆలస్యంగా లేచిన మూలాన పిల్లల్ని రెడీ చేసి భర్త అత్తమామలతో వివాహానికి హాజరయ్యాను. వెళ్ళి చూస్తే అక్కడ మా ఇళ్ళలో పెళ్ళికి మల్లే బ్రేక్ ఫాస్ట్ కు సంబంధించిన విషయాలేవీ కనబడలేదు. కాసేపు పలకరింపులు అయ్యాక మాకు సుఖాసీనులు అవమని స్థలం చూపించిన ప్రియ అన్నయ్య మాయమయ్యాడు. తర్వాత ఇంక తెలిసిన వాళ్ళు ఎవరూ కనబడలేదు . పిల్లలు ఆకలి అని అల్లరి మొదలెట్టారు. అత్తమామలు కూడా ఆకలి అనడంతో ఏమీ పాలుపోక నెమ్మదిగా చుట్టుపక్కల ఏమైనా చిన్న చిన్న రెస్టారెంట్స్ కానీ దుకాణాలు కానీ ఉన్నాయేమో ఏదైనా తినేసి వద్దామని బయటికి వెళ్ళబోయాము. ఆ పెళ్ళి హాలు రెండు మూడు సెక్షన్లుగా ఉంది. అంటే మూడు సెక్షన్లూ విడిగా అద్దెకిస్తారన్నమాట. ఆ రోజు అక్కడ ఒక వైపు తెలుగు పెళ్ళి, ఇంకొకవైపు పంజాబీవాళ్ల పెళ్లి అవుతోంది. మేము ఇలా బయటికి వెళ్లామో లేదో ఒక చుట్టాలతను కనబడి ఎక్కడికి వచ్చారని అడిగాడు. ఇలా సౌత్ ఇండియన్ ఫ్రెండ్ పెళ్లికి వచ్చామని, బ్రేక్ ఫాస్ట్ గట్రా ఉన్నట్లు లేవని, పిల్లలు, అత్తమామలు ఆకలిగా ఉన్నారు కాబట్టి బయట ఏమైనా తినడానికి బయలుదేరామని చెప్పాము. దానికతను " భలే వారే! ఇటు మన పంజాబీ కుటుంబమే ! మనకి బాగా తెలిసిన వాళ్లే ఇటు రండి అని చెప్పి , స్నాక్స్ తినడానికి అటువైపు తీసుకుని వెళ్ళాడు. మొహమాటపడుతూనే కొన్ని స్నాక్స్ పిల్లలకి ఇప్పించి వెనక్కి తిరిగి వస్తుండగా పెళ్లి కూతురు తల్లి ఏదో తేవడానికి వెనక్కి వెళుతూ ఎదురైంది .పట్టుబడి పోయిన దొంగల లాగా మేము చాలా మొహమాటం పడిపోయాము. ఆవిడ అదోరకంగా చూస్తూ "ఎక్కడికి వెళ్లారు "అని అడిగింది. పిల్లలు చేతుల్లో కొన్ని స్నాక్స్ ఉండనే ఉన్నాయి. ఇంకనిజం చెప్పక తప్పిందికాదు. ఇలా పక్కన స్నేహితుల పెళ్లి జరుగుతోందని , పిల్లలు ఆకలి తట్టుకోలేకపోతుండడంతో స్నాక్స్ తినడానికి వెళ్లామని, ఇలా వెళ్లినందుకు ఏమీ అనుకోవద్దు అని చాలా మొహమాటంగా చెప్పుకొచ్చాము. ఆవిడ " మంచి పని చేశారు. అసలు...నాదీ అదే పరిస్థితి. కడుపులో నక నక లాడిపోతోంది. మా పెద్దవాళ్ళు కన్యాదానం చేస్తున్నామని నిన్న రాత్రి నుంచి ఉపవాసం ఉంచారు . నాకా షుగరు. నేను ఇంక ఒక్క నిమిషము దాటినా ఏ పనీ చేసే పరిస్థితిలో లేను. కళ్ళు తిరిగి పోతున్నాయి. మా పెళ్ళి తంతు జరిగి భోజనాలు అయ్యేటప్పటికి ఇంకో గంట పైగా పట్టే ఉంది. అందుకే ఏమైనా దొరుకుతాయేమో అని నేను ఇటు వచ్చాను మీరు ఏమి అనుకోకపోతే నాకు కూడా ఏమైనా చిన్న స్నాకు తెచ్చి పెట్టగలరా అక్కడినుంచి "అని అడిగింది . ఆశ్చర్యపోవడం మా వంతయ్యింది. అప్పుడు కానీ తెలిసింది కాదు మాకు. వామ్మో ! ఆ ఉపవాసాలేమిటో....తిండిలేని పెళ్ళి ఏమిటో !" అంది. ఈ స్టోరీ విన్న తర్వాత మా ఇంట్లో ఏ పెళ్లి పేరంటం జరిగినా మొదట " స్నాక్స్ బ్రేక్ఫాస్ట్, స్నాక్స్ బ్రేక్ఫాస్ట్ అంటూ పాట పాడి ..కాఫీలు త్రాగారా టిఫినీలు తిన్నారా అని అడగడానికి ప్రత్యేకంగా అరవై మందిని అమర్చాలని డిసైడ్ చేస్కున్నాను. ఇండయాలో కాసిని రోజులు తిరిగొచ్చిన నా పిల్ల మాత్రం...అలా పస్తులుంచే పెళ్ళి ఇండియాలో చూడనేలేదనీ , అన్ని చోట్లా పోటీలు పడి బోలెడు ఐటెమ్స్ పడుతున్నారని చెప్పింది. ఏదిఏమైనా' మీరు కూడా తగిన తిండి ఏర్పాట్లు చేయండి. లేకపోతే నాలాంటి వాళ్లు చెక్కరొచ్చి పడిపోతే మళ్ళీ ఆంబులెన్స్ ఖర్చులు ఆస్పత్రి ఖర్చులు మీవే అని పత్రం రాసి ఇయ్యాల్సిందే....

పౌరాణిక వ్యాసం

# మహేతిహాసంలో మహానాయక



డాక్టర్ దాసోజు పద్మావతి



భారతీయ పురాణాల్లో వందలాది స్త్రీ మూర్తుల గాథలున్నాయి.ఆ చరిత్రలన్నీ అధ్యయనం చేయదగ్గవే. పురాణాల్లోని స్త్రీ మూర్తుల జీవనపథం తెలుసుకుంటే మనకు ఏమిటి ప్రయోజనం ? అనే ప్రశ్న ఈ నాటిది కాదు. కానీ మనం నిశితంగా పరిశీలిస్తే వారు సత్య– ధర్మ తత్పరులు, స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని ప్రకటించినవారు. పురుషులతో సమానంగా వ్యవహార జ్ఞానం కలిగి ఉన్నారు. క్లిష్ట సమయాల్లోధైర్యంగా వ్యవహరించారు. అన్యాయాన్ని అనుక్షణం ఎదురిస్తూనే ఉన్నారు. జనహితం కోసం, దేశక్షేమం కోసం త్యాగం చేశారు. జ్ఞానజ్యోతులై నేటి ఆధునిక వనితలకు ఆదర్శ ప్రాయులైనారు.

మహాభారత మహేతిహాసములో మహిళలు అనగానే మనకు మొదట స్ఫురించే పేరు ద్రౌపది. ఆ తరువాత రాజమాత కుంతి, గంగా,సత్యవతి మాత. గాంధారి ఇలా ఎందరో ఉన్నారు. ఆయా సందర్భాల్లో కనిపించే వీరికి వారివారి ప్రత్యేక వ్యక్తిత్వాలున్నాయి. ఆ వివరాలు మనకు తెలియాలంటే భారత హృదయం తెలియాలి. వ్యాసుని వేదన అర్థం కావాలి.

మహాభారతంలోని పాత్రలన్నీ ధర్మం చుట్టూ పరిభ్రమించేవే, ఇది భారతీయ ధర్మం. భారత ధర్మం. ఈ ధర్మాన్ని అనుసరించి అందరూ సుఖంగా, ప్రశాంతంగా జీవించాలన్నది ఆకాంక్ష..

**యాజ్ఞసేని:-**

మహాభారతంలో మహిళామణులు ఎందరున్నా ద్రౌపదిని గూర్చి చెప్తేనే ఈ మహిళా భారతం పూర్ణత్వాన్ని సంతరించుకుంటుంది.

ద్రౌపతి యజ్ఞంలో పుట్టింది. యాజ్ఞసేని. ఆమె కృష్ణవర్ణ. పాంచాల రాజపుత్రిక పాంచాలి. దృపదుని తనయ. ఆమె వర్చస్వి, తేజస్వీ, ఓజస్వీ, తపస్వీ ,ధర్మాధర్మ ప్రజ్ఞా వచస్వి.

పంచ భూతాలే ఐదుగురుగా జన్మించారనుకుంటే శరీరాలు వేరైనా ఒకే ప్రాణంగా మెలిగిన పంచ పాండవుల సతియామె.

ద్రౌపదిని ధర్మరాజు మాయాజూదంలో ఒడ్డాడు. మొదట జూదంలో అన్ని కోల్పోయాడు. తర్వాత తన గర్వానికి కారణమైన సోదరులను ఆ తర్వాత ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టి ఓడిపోయాడు. ద్రౌపదిని నిండు సభలో కి లాక్కొని వచ్చాడు దుర్యోధనుని ఆజ్ఞ మేరకు దుశ్శాసనుడు. అప్పుడు ద్రౌపది అడిగిన ప్రశ్న ఈ నాటికీ ప్రశ్నార్థకంగానే నిలిచింది.

ద్రౌపది పంచ పాండవులకు పత్ని.ధర్మరాజు తాను

మొదట ఓడిపోతే ఆమెను పణంగా పెట్టడానికి వీలు లేదు. ఎందుకంటే  ఓడిపోయిన తర్వాత ఆమెపై అధికారం లేనట్లే లెక్క. మొదట ఫణంగా పెట్టడానికి వీలు లేదు. ఎందుకంటే తన నలుగురి సోదరుల అనుమతి తీసుకోకుండా, పైగా ఆమె అనుమతి కూడా లేకుండా పందెం కాయ రాదు.కనుక ఆమె అంగీకారం తీసుకొక పోవడం పెద్ద తప్పు. ద్రౌపది వస్తువు కాదు.అంతేకాదు ధర్మరాజుకు తన తమ్ములను కూడా పణంగా పెట్టే అధికారం లేదు. ధర్మరాజుకు తన మీద, తనకు లభించిన అర్ధ రాజ్యం మీద తప్ప మరి దేని మీద అతనికి అధికారం లేదు. అందుకే ద్రౌపది పరమ విజ్ఞతతో పై ప్రశ్నలను లేవనెత్తింది.

నిర్భయంగా నిండు సభలో ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం లేదు.ద్రౌపది వస్త్రపహారణ తర్వాత దుర్యోధన దుశ్శాసనులను భీముడు సంహరిస్తానన్న  ప్రతిజ్ఞ చేసాడు.ఆ ప్రతినతో కౌరవ సభ దద్దరిల్లింది. ద్రౌపది ఆవేదనతో శపించడం మొదలుపెట్టింది.

ద్రౌపదిని శాంత పరిచారు గాంధారి, కుంతి. ధృతరాష్ట్రుడు బెదిరిపోయి ద్రౌపదిని వరాలు అడగమన్నాడు. ఆమె కోరిక మేరకు పాండవులకు విముక్తిని ప్రసాదించాడు. వారి రాజ్యాన్ని వారికి ఇచ్చేశాడు . పాండవులకు తమ భూమి మీద హక్కు లభించడానికి, వారు దాస్యం నుండి విముక్తులు కావడానికి కారణం ద్రౌపది.

అరణ్యవాసంలోను భర్తలతో పాటు అష్టకష్టాలు పడింది. అజ్ఞాతవాసంలో కాముకుడైన కీచకుని హడలు కొట్టిన తీరు స్త్రీ జాతికే శౌర్య పరాక్రమాలు నేర్పినట్లు అనిపిస్తుంది.

కీచక ఉప కీచకుల వధకు ప్రధాన కారకురాలై నిలిచింది.

అరణ్య అజ్ఞాత వాసాల తరువాత శ్రీ కృష్ణుడు రాయబారానికి వెళ్లడానికి ముందు పలికిన పలుకుల వల్ల ఆమె మండే అగ్నిగోళంలా కనిపిస్తుంది.

దుశ్శాసనుని వేళ్ళుతగిలి తెగిన వెంట్రుకలను రాయబారానికి నువ్వు వెళ్లినప్పుడు గుర్తుంచుకో మని శ్రీకృష్ణుడికి  చెప్పిన తీరు ఆమె వేదనను తెలియజేస్తుంది. చివరగా ఒక మాట అంటూ నేను ఇన్నాళ్లు అగ్ని ఒడిలోనే కూర్చొని ఉన్నాను అంటుంది. పాండవులు ఎవరు ఇంత గట్టిగా అనలేదు. వారిలోని చైతన్యానికి శక్తిని ప్రసాదించింది ద్రౌపదే. జూదం తర్వాత స్వర్గారోహణ పర్వం వరకు పాండవులను నడిపింది ద్రౌపది. అశ్వద్ధామ కారణంగా ఐదుగురు కొడుకులు చనిపోయినప్పుడు ఆమె గర్భశోకం వర్ణనాతీతం. కానీ తనలాగా పుత్రశోకంతో అశ్వత్థామ తల్లి మనగలగడం తనకిష్టం లేదని అతని క్షమించి  వదిలిపెట్టమని భీమార్జునులను వేడుకుంది. ఎంత వీరత్వమొ అంతటి దయ.

ఎంత స్వాభిమానమొ అంతా ఆత్మ ప్రత్యయం భారత ఇతిహాసంలో స్త్రీమూర్తులు అందరూ ఆ యుగానికి సరిపడా వేదనను అనుభవించిన వారే ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ ధైర్యం గా నిలిచిన వారే కృతయుగంలో సత్యానికి తలవంచి చంద్రమతి  అమ్ముడుపోయింది.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుని ధర్మపత్ని సీతమ్మ రావణాసురుని చే అపహరణకు గురి అయింది.

ఇక ద్వాపరంలో నిండు సభలో విజ్ఞులైన పెద్దల సమక్షంలో వస్త్రాపహరణకు గురి అయ్యింది ద్రౌపది.ఆధునిక మహిళా – అన్నింటికి గురౌతుంది.కాని సంయమనంతో సమయస్ఫూర్తితో సమస్యలను ఎదుర్కొంటుంది ఆధునిక మహిళ.

మహాభారతంలో ద్రౌపదిదీ కీలక భూమిక.అందుకే భారతాన్నీ 'ద్రౌపదీయం' అని పిలుస్తారు. అసలు భారతమే మహిళా భారతం. ఏపాత్ర తన వ్యక్తిత్వాన్ని వదులు కోలేదు. స్వాభిమానాన్నీ చంపుకోలేదు.

కాలానుగుణమైన మార్పులను అర్థం చేసుకొని నాటి పరిస్థితులను బేరీజు వేసుకుని–ఆధునికతతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది ఆత్మాభి మానతో నేటి మహిళ.

ఎన్ని సమస్యలు ఎదురైన ధైర్యం గా తన ఆత్మాభిమానాన్ని కాపాడు కుంటున్న స్త్రీ మూర్తులకు స్ఫూర్తి ప్రదాత ద్రౌపది.

**డాక్టర్ దాసోజు పద్మావతి,**
తెలుగు అధ్యాపకులు
గురుకుల డిగ్రీ కళాశాల–ఇబ్రహీంపట్నం.

చారిత్రక వ్యాసం



# తరతరాల తెలంగాణ -1
# నిజాం కాలంలో భూములు - వివరాలు

తంగెళ్ళశ్రీదేవిరెడ్డి

భూమి స్థిరాస్తి. ఏ కాలంలో అయినా భూమికి ప్రాధాన్యత ఉన్నది. నిర్ణయించబడిన లేదా కేటాయించబడిన భూముల వివరాలు ఒక చరిత్ర. ఈ క్రమంలో నిజాం సర్కారు కాలంలో భూములు చరిత్ర గతినే మార్చాయి. వాటి వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.. మరి వాస్తవానికి నిజాం రాజ్యంలో ఉన్న భూములు.... వాటి వివరాలు ఏమిటీ?

భారతదేశం దేశీయ సంస్థానాలు అన్నింటిలో హైదరాబాదు సంస్థానం అతిపెద్దది. ఇది 82.698 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో, పంచకోణం ఆకృతిలో ఉండేది. దీనికి అనుబంధంగా 14 చిన్నా పెద్దా సంస్థానాలు ఉండేవి.. సంస్థానం మొత్తం ఆదాయంలో భూములదే మొదటి స్థానంగా ఉండేది. భూములు దొరలు దేశ్ముఖ్ ల అధీనంలో అధికారికంగా ఉండేవి.. ప్రభుత్వం తమ ఆదాయ మార్గం కోసం భూములను కొన్ని షరతుల ప్రకారం దొరలకు కేటాయించేది..

భూముల కేటాయింపు సర్కారు నిబంధన అయినప్పటికీ, కొందరు దొరలు సర్కారుకు సంబంధం లేకుండా భూములపై అధికారం పొందేవారు.

అప్పుల కిందికి పొలాలు జమచేసుకోవడం, ఎదుటి వాళ్ళ సమస్యను అవకాశంగా తీసుకొని భూములు చౌకగా కొనుక్కోవడం, అట్లాగే అవసరాలకు అమ్మిన పొలాలు కూడా కొనుక్కో వడం జరిగింది.

ప్రజల భూములు పంటపొలాలు గా మాత్రమే ఉండేవి. పంట నిబంధనలు కూడా కొనసాగేవి. సర్కారు భూములు మాత్రం వివిధ రకాలుగా విభజన జరిగి ఉండేవి.

**1.దివానిపొలాలు :**

నిజాం రాజ్యంలో భూస్వామ్య వ్యవస్థ అమలులో ఉండేది. వ్యవసాయం కింద 5 కోట్ల 30 లక్షల భూములు ఉన్నాయి. వీటిలో 3 కోట్ల ఎకరాలు ప్రభుత్వ భూమి శిస్తు వ్యవస్థ కింద ఉండేవి. అంటే 60% పొలాలు నిజాం ప్రత్యక్ష పాలన కింద ఉండేవి అన్నమాట. వీటినే దివాని లేదా ఖల్సా పొలాలు అనేవారు.

**2.జాగీర్దారీభూములు :**

కోటి యాభై లక్షల ఎకరాలు జాగీర్దారీ పొలాలు. అంటే ఇవి మొత్తం 30%భూములు. ఇవి సంస్థానాధీశులు, జాగీర్దార్లు, ఖజానాదార్లు, ఇనాందార్లు, పైగాలు, అగ్రహారీకులు వంటి భూస్వామ్య వర్గాల కింద ఉండేవి. సంస్థానాలు నిజాం రాజ్యానికి సామంత రాజ్యాలుగా ఉండేవి.

**3 సర్ఫ్ ఎ ఖాస్ :**

10% పొలాలు ఈ విభాగం కింద ఉండేవి. ఇవి నిజాం సొంత కమతం. వీటి కింద వచ్చే ఆదాయం నిజాం సొంతం ఖర్చులకు వినియోగించబడేది. హైదరాబాద్ చుట్టుపక్కల ఈ పొలాలు ఉండేవి. వీటిని 'అత్రాఫ్ బల్దా' అనికూడా పిలిచేవారు. అత్రాఫ్ అంటే పరిసరాలు అని, బల్దా అంటే నగరం అని అర్థం. ఇవి 8. 100 చదరపు మైళ్ళ వరకు 18 తాలూకాల్లో విస్తరించి ఉండేవి.

**4 పైగాలు లేదా పాయోగాలు**

జాగీర్ భూముల్లో పైగాలు లేదా పాయోగాలు అనేవి కేవలం రాజ బంధువులకు సంబంధం ఉన్న పొలాలు. వీరు ఈ భూములను అనుభవిస్తూ సొంతంగా సైన్యాలను పోషించేవారు. యుద్ధ సమయాల్లో రాజుకు తోడ్పడేవారు. ఇట్లా తెలంగాణ మొత్తం మీద 10 వేల గ్రామాల్లో 2600 గ్రామాలు జాగీరు

గ్రామాలుగా ఉండేవి. జాగిరుల్లో ఒకరైన సంస్థానాధీశులు దొరలకు సొంతంగా పన్నులు విధించే అధికారం ఉండేది. పన్నులు వసూళ్లు చేసేందుకు సొంత రెవెన్యూ అధికారులు కూడా ఉండేవారు. ఈ క్రమంలోనే కొందరు తెలంగాణ దేశ్ముఖ్ లు దేశ్ పాండేలు రైతుల నుండి విపరీతంగా పన్నులు వసూళ్లు చేసారు. పన్నులు కట్టని రైతుల నుండి పన్నుల కిందికి భూముల్ని ఆక్రమించుకున్నారు కూడా. కొందరు దొరలు పంటలు పేరుతో అధిక వడ్డీకి ఋణాలు ఇచ్చారు. అవి చెల్లించని రైతుల నుండి భూములు తీసుకున్నారు. ఇక్కడ వడ్డీ అనేది ఆ కాలంలో చాలావరకు 'నాగు' పేరుతో కొనసాగేది. అంటే ఒకటికి రెండింతలు తిరిగి చెల్లించడం. చెల్లించుకోలేక పోతే భూములు సమర్పించు కోవాల్సిందే.

**బగీలా పొలాలు**

ఇక 'బగీలా' అనేది అట్టడుగు ప్రజలను బానిసలుగా పరిగణించిన విధానం. ఈ పద్ధతిలో ఇంటికి ఒక్కరు తప్పనిసరిగా ఊడిగం చేయవలసిందే. చేయక పోతే జరిమానాలు కట్టుకోవాలి, కఠినమైన శిక్షలు అనుభవించాలి. ఈ బగీలా విధానంలో దొరల యాజమాన్యం కింద ఉన్న పొలాల నుండి ఒకటి నుండి రెండు లేదా మూడు ఎకురాలు కేటాయించేవాళ్లు. వాళ్ళు ఆ పొలాలను సాగుచేసుకోవాలి. కౌలు కిందికి ఎట్టి చేయాలి. శిస్తు సదరు దొరలే చెల్లించుకోవాలి. కాగా భూములు ఇచ్చామనే జులుంతో కొందరు భూస్వాముల హయాంలో గ్రామాల్లో శ్రమదోపిడి అనివార్యంగా జరిగింది. ఒకటికి నాలుగింతల పని తీసుకోవడం జరిగింది. ఎట్టి మనిషి మరణించినా, ఆరోగ్య పరిస్థితుల్లో ఎట్టి మానేసినా, ఎట్టి పొలాలు ఎనక్కి తీసుకోవడం జరిగింది. అయితే చరిత్రలో వెట్టిచాకిరి వికృత రూపాన్ని ఉన్నది ఉన్నట్టుగా ఆవిష్కరణ చేశారు. కానీ ఎట్టి పొలాలు గురించిన వివరాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. మరుగున పడేసారు.

ఇంకో ముఖ్య విషయం.... వెట్టి కిందికి కొన్ని కులాలు మాత్రమే కేటాయింపబడేవి.

దళితులు పొలాల్లో పనిచేయాలి. గడి బయట పనులు చేయాలి.

బెస్త వాళ్ళు కావడిలు మోయాలి. దేవాలయాలు శుభ్రం చేయాలి. దొరసాని పల్లకి మోయాలి.

గొల్ల వాళ్ళు గడి మొత్తం తిరుగొచ్చు. వీళ్ళు వంట పని, ఇంటి పని చేయాలి. దొరసానికి కాలక్షేపం కూడా వీళ్ళే. ఒకరకంగా గొల్ల కులస్థులు దొర ఇంటి మనుషులుగా వ్యవహరించబడే వాళ్ళు.

**ఇనాం భూములు**

ఈ భూములను ఎక్కువగా బ్రాహ్మణులు, కోమట్లు, సైనిక దళాలు ఎక్కువగా అనుభవించాయి. ఇవి శాశ్వత కానుకలు. వెనక్కి తీసుకునే ఆస్కారం లేనివి. ఈ పొలాలు మొత్తం సంస్థలు, సంఘాలు, దేవాలయాల పేరుమీద నమోదు చేయబడ్డాయి. పెద్ద మొత్తంలో కూడా ఉంటాయి. బ్రాహ్మణులు ఇనాం భూముల్ని అనుభవిస్తూ దేవాలయాలను పరిరక్షించాలి. ఎవ్వరు పౌరోహిత్యానికి కుదిరితే వాళ్ళే ఈ భూముల్ని అనుభవించాలి. ఇక కోమట్లు ఆనాటి సహకార సంఘాలు. వీళ్ళు ప్రజల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి, కష్టకాలంలో ఉద్దెరలు ఇవ్వాలి, పంటలకు నాగులు ఇవ్వాలి. ఇక సైనికులకు ఇతర అధికారులకు, కేటాయించే ఇనాం భూములు చేసిన సహాయానికి కృతజ్ఞతలుగా లేదా చూపెట్టిన ప్రతిభ / సాహసానికి గుర్తింపుగా ఉండేవి.

ఉత్పత్తి కులాలకు కూడా శ్రమ ఫలితంగా ఇనాం భూములు కేటాయించబడ్డాయి.

ఇవన్నీ చరిత్ర ఆధారంగా అట్లాగే ఇప్పటికీ బతికి ఉన్న అప్పటి తరం చెప్తున్న ప్రకారంగా, మనకు తెలుస్తున్న నిజాలు. మరి ఇక్కడ కనిపిస్తున్న పొలాల ముఖచిత్రంలో ఎక్కవ మొత్తం పెద్ద తలకాయల అధీనంలో ఉన్నాయి. భూములు కలిగి ఉండటం ఎంత పరపతో, ఆ భూములు నుండి ప్రభుత్వానికి పన్ను చెల్లించడం కూడా అంతే పరపతి !! ఎవ్వరి నుండి ఎంత ఆదాయం వస్తుంది అనేది రికార్డు అయ్యేది. ఎక్కువ మొత్తంలో చెల్లించే అట్లాగే సకాలంలో చెల్లించే దొరలకి సర్కార్ వద్ద ఎక్కువ పరపతి ఉండేది.

**తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి**

8555895827

రచయిత్రి / సామజిక వేత్త / చరిత్ర పరిశోధకురాలు

గళం

# 'ఆధార్ కార్డ్....'

- లావణ్య



ఈ దేశంలో ఆధార్ కార్డ్ కి ఎంత విలువ వుందో మనకు తెలుసు! అది మనకు ఒక identity card ఒక బ్యాంక్ ఖాతాకే కాదు అటువంటి ఎన్నో వాటికి identity అవుతుంది.. ప్రాణం లేని ఆధార్ కార్డ్ కే అంత విలువ వుంటే, ప్రాణం వున్న, ప్రాణం పోస్తూ వున్న మగువకి తగినంత విలువ ఉండాలి కదా!

జీవితంలో ప్రతి స్థాయిలో అతి ముఖ్యపాత్ర వహించే స్త్రీ.. పుట్టుకతో మొదలు పెడితే ప్రాణం గాలిలో కలిసి పోయే వరకు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుంది. తన మనసుని, తనువును, తన ఆలోచనలను, కలబోసి ఎన్నో రకాల మనస్తత్వాలను అర్థం చేసుకుంటూ, తనకు తానుగా నిలబడే శక్తి మగువ... ఈ సమాజం లో ఆమె ఎన్నో వివక్షలు ఎదుర్కొంటూన్నది.

పుట్టినపుడు మహాలక్ష్మి అంటారు కొందరు ఆడపిల్ల దరిద్రం అంటారు కొందరు... ద్వేషిస్తారు పుట్టక ముందే అంత మొందించే వారు కొందరు.. పుట్టిన తర్వాత మట్టు పెట్టే వారు కొందరు.

అమ్మో ఆడపిల్ల ఖర్చు అంటారు... అమ్మాయి అంటే మైనస్ అని, అబ్బాయి అంటే ప్లస్ అని లెక్కలు వేస్తారు, అమ్మాయిని దరిద్రం అనడం ఎంత తప్పో... లక్ష్మీ దేవి అనడం కూడా అంతే తప్పు.

అమ్మాయిలను, అబ్బాయిలను ఒకే రకంగా పెంచాలి, సమాన అవకాశాలు, సమాన గౌరవం ప్రాధాన్యత ఇవ్వాలి.

ఆడపని మగపని కాకుండా అందరూ అన్ని పనులు నేర్చుకోవాలి.. శ్రమను గౌరవించడం చిన్నతనం నుండీ తల్లి తండ్రులు అలవాటు చేయాలి.

ఇక అమ్మాయిల విషయంలో చిన్న చూపుతో.... పెట్టుబడి తప్ప రిటర్న్స్ వుండవు అనుకొనే వాళ్ళు కొందరు. అయితే అమ్మాయి అంటే పరువు అనుకొనే వాళ్ళు కొంత మంది, అమ్మాయి అంటే పిల్లలను కనడానికి తప్ప ఎందుకూ పనికి రాదు అనే భావన కొందరిది, ఏది ఏమైనా ప్రపంచంలో అమ్మాయికలకు భద్రత లేదు అని మాత్రం అందరికీ తెలుసు!! వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీల మీద అత్యాచారాలు జరుగుతున్నాయి. హింస పెరిగింది.

ఇప్పుడు ఆడపిల్లలు కూడా సంపాదిస్తూ ఉన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా ఉన్నారు.. ఇంటికి ఆసరాగా చేతోడో గా వుంటున్నా హింసను ఎదుర్కొంటున్నారు...

ఆడపిల్లలను సుకుమారంగా కాకుండా ఆత్మవిశ్వాసం కలిగి ఉండేలా.. స్వీయ రక్షణ శిక్షణలిచ్చి పెంచాలి..

ఆకాశంలో సగం ప్రచారం నిజం కావాలంటే పరస్పర గౌరవంతో స్త్రీలందరూ మెలగాలి.

మన దేశానికి ఆధార్ కార్డు వలే మన సమాజ మనుగడకు ఆధారం మగువ.

★★★

వ్యాసం

# శాస్త్రీయ దృక్పథం ఆచరణీయం..!



- సుజాత నాంపల్లి

ఏ విషయం పట్లనైనా శాస్త్రీయ స్పృహను, పరిశీలనా తత్వాన్ని కలిగిఉండడాన్నే .. శాస్త్రీయ దృక్పథం అనొచ్చు.!

శాస్త్రీయ అంటే సరియగు.. ఉన్నది ఉన్నట్లుగా చూడటం, దృక్పథం అంటే చూసే తీరు. వాస్తవాలను ఆధారంగా చేసుకొని చూడటం,మరియ తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధమైన వైఖరి ..!

ఈ నడుమ ఎక్కడ చూసినా చదువుకున్న ఆధునికుల్లో (ఏది చదువు... ఎవరు ఆధునీకులు అన్నది అకాడమీ చదువులకి సంబంధించిన చదువు కాదు ) సైతం శాస్త్రీయ దృక్పథం, పరిశీలనా తత్వం ఎందుకనో బాగా లోపించింది. ఆ కారణంగానే ప్రజల్లో తెలియని ఆశాస్త్రీయ భావనలు మూఢనమ్మకాలు వెనుకబాటు తనమూ అంధ విశ్వాసాలు పెరిగి చీకట్లో మగ్గిపోతూ.. వాళ్లకు వాళ్లే మోసపోతున్నారు. మరెన్నో సమస్యల సుడిగుండాల్లో ఇరుక్కుంటున్నారు..ఇంకెన్నో సంక్షోభాలకు కారణభూతులైతున్నారు

క్షుద్రపూజలూ చేతబడులూ మాయా మంత్రాల పేరిట వాళ్ళని వాళ్ళే మోసగించుకుంటూ అవాస్తవమైన అంశాల పట్ల ఆకర్షితులైతూ లేనివి ఉన్నట్లుగా భ్రమపడి ప్రలోభాలకు గురైతున్నారు ..

కోరుకున్నవన్నీ తేరగా సిద్ధిస్తాయనే వెర్రిఆశలతో బురిడీ బాబాలనీ మంత్రగాళ్లనీ స్వామీజీలని ఆశ్రయిస్తూ.. నిలువునా దోపిడీకి గురై మోసపోతున్నారు. వాళ్ళూ మనలాంటి మామూలు మనుష్యులేనన్న సంగతి మరచి వాళ్ళ నీటిమూటల మాయ మాటలు నమ్ముతూ వారికి ఏవో అతీంద్రియ శక్తులున్నాయని నమ్మి వాళ్ళ ఆదేశాలను ఆచరిస్తూ దేనికైనా సిద్ధపడుతున్నారు.. కర్మలూ పునర్జన్మలూ వుంటాయంటే తర్కించు కోకుండా విశ్లేషించుకోకుండా గుడ్డిగా వాళ్ళని వాళ్లు అంతమొందించు కుంటున్నారు తలలు నరుక్కొని గుడ్లు పీక్కొని ఆ శక్తులకు నైవేద్యం గా సమర్పించుకుంటున్నారు..మళ్లా పుడుతామనే వెర్రి భ్రమలతో..వాళ్ల మీద వాళ్ళకే నియంత్రణ లేకుండా నేరాల్లో మునిగి తేలుతూ ఎంతకైనా దిగజారుతున్నారు.. మరెంతటి దుర్మార్గాలూ దుశ్చర్యల కైనా సాహసిస్తున్నారు.. ఇంగిత జ్ఞానం కొరవడి చెప్పిందల్లా చేసేస్తున్నారు...

ఇవ్వన్నీ ఏమీ తెలియని ఆనాటి రాతియుగాల్లో జరుగాయంటే..తెలియని తనమో మరింకే అజ్ఞానమో అనుకోవచ్చు.. కానీ ఇప్పుడు ఈ అధునాతన రాకెట్ యుగంలో...ఈ ఆత్యాదునిక అనబడే విద్యావంతుల్లో..ఇంతటి సాంకేతిక విజ్ఞానం పరిఢవిల్లుతున్న ఈ రోజుల్లో కూడా..

శాస్త్రీయఆలోచనలు కొరవడి మూడాంధ విశ్వాసాల్లో మునిగి తేలుతూ...అవే నిత్యసత్యాలని తలచి వాటినే ఆచరిస్తూ వాటిలోనే దినదిన ప్రవర్ధమానమై మూడుమూర్ఖులూ ఆరుఅజ్ఞానులుగా తయారయ్యారు

కొందరు ఎలాంటి సాక్ష్యాదారాలూలేని ఊహాగానాలను నమ్మినంతగా అన్ని ఆధారాలూ కళ్ళముందే సుస్పష్టంగా కనబడ్డప్పటికీ వాటిని తిరస్కరించి, ఏ విషయాన్నీ పరిశీలించు కోకుండా, ప్రశ్నించుకోకుండా విశ్లేషించు కోకుండా.. మూర్ఖులను గొర్రెల గుంపుగా అనుసరిస్తూండడమ్ విచారించదగ్గ విషయం.

ఇంతకీ... ఎందుకు ఇంతటి మూఢనమ్మకాల్లోనే మునిగి తేలుతున్నారో అంతుపట్టని విషయమేమీ కాదు..! బహుశా..

రాకెట్ ప్రయోగిస్తున్న శాస్త్రవేత్తలే.. పూజాలూ పునస్కారాలతో పనులు ఆరంబిస్తున్నారనో..! దయ్యాలూ భూతాల సినిమాలను చూసో మతబోధనలూ,జాతకాలూ జ్యోతిష్యాలూ శకునాలు. రంగురాళ్ళూ అంటూ బుల్లి తెరల్లో చూస్తూనో..అవి నిజమే నని నమ్మి చీకట్లోకి తిరోగమిస్తున్నారు.

ఏ విజ్ఞానమూ తెలియని ఆదిమరోజుల్లో ప్రకృతి వైపరీత్యాలకు, ఉరుములకూ మెరుపులకు భయపడి.. వాటి గమనం తెలియక ఆ అంతు చిక్కని వింత పరిణామాలకు కారణమేమిటో తెలియక ఏదో ఒక అతీత శక్తి ఉందనినమ్మి, అందువల్లే అవన్నీ జరుగుతున్నాయనీ, భీతిల్లి తనకు తానుగా మానవాతీత అదృశ్య శక్తినో ఇంకదేన్నో మరోదేవున్నో సృష్టించుకున్నారు.

ఇక ఆ తర్వాతే.. ఒకదానివెంట.. మరొకటి నమ్మకాలూ ఆచారాలు ఆలయాలూ మతాలు మత వైషమ్యాలు, విద్వేషాలు లెక్కలేనన్ని ఊహాగానాలు పుట్టుకొచ్చాయి.

అయినా మంత్రాలూ మాయలతో ఈ విశ్వం సృష్టించ బడలేదు. ఏ దేవుని వరాలవల్లో ఈ భూమి, ఆవిర్భవించలేదు. భూగోళం మీద జీవిని ఒక్కసారిగా ఎవరూ పుట్టించలేదు. ఒక్కొక్కటిగా పరిణామక్రమంలో కాలగమనంలో వాటంతటత అవే ఏర్పడ్డాయి.. ఎందరో శాస్త్రవేత్తలూ పరిశోధించి పరిశీలించి జీవిపుట్టుకా, పరిణామం తెలియజేశారు.పై అన్ని విషయాలూ పాఠ్యపుస్తకాల్లో కూలంకశంగా చదివి కూడా గాలికి వదిలివేస్తూ ఉంటారు..! మనిషి ఆవిర్భవించాకే మతాలనీ, కులాలనీ, దేవుళ్ళని పుట్టించాం.!

అయినా ఇంకా ఏవేవో అతీతశక్తులూ మహిమలూ ఉన్నాయని భ్రమల్లో కాలం వెళ్లదీస్తున్న వారి సంఖ్య తక్కువేమీలేదు.. నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఎందుకూ.. ఏమిటీ ఎట్లా ఎక్కడా ఎప్పుడూ అని నిరూపించి చూపుతూనే ఉంది.. అయినా మనిషి వెర్రితలలతో వెనక్కే వెల్లుతున్నాడు.. పూజించడం,ప్రార్ధించడం తోనే మహత్యాలు జరిగిపోతాయని స్వార్ధ చింతనతో ఈనాడు మనిషి దిగజారుతున్నాడు.. కాల్పనిక ఘటనలను,గాథలను జీవింపచేస్తూ ఏదోలోకాల్లో విహరిస్తూ ఊబిలోకి కూరుకుపోతున్నాడు.. సరే.. అది వారివారి ఆలోచనలూ, ఇష్టాలూ వాళ్ళ సంతృప్తి అనుకున్నా ముఖ్యంగా వాళ్లే ఏదోరకంగా మోసాలకు దోపిడీలకూ గురవుతున్నారు.

అందుకే..మన "రాజ్యాంగంలో అధికరణ 5(a)హెచ్ ప్రకారం శాస్త్రీయ స్పృహను కలిగి ఉండడంతో,స్థిరత్వాన్ని,మా నవతావాదాన్ని,పరిశీలనా తత్వాన్ని, సంస్కరణాభిలాషనూ పెంపొందించడం ప్రతి భారతీయ పౌరుని విధి"అని చేర్చబడింది.

అంటే మన దేశ పరిస్థితుల్లో దానికో ప్రాధాన్యత ఉందన్నది వాస్తవం .. స్వాతంత్రానంతరం దేశం పురోగమించాలనీ,ప్రజల ఆలోచనా విధానాల్లోఅభివృద్ధికారమైన మార్పు రావాలనే ఉద్దేశం

చివరగా తెలుసుకోవలసింది ఏమిటంటే మతగ్రంధాల సారం వల్లగానీ, మత విశ్వాసాలవల్ల గానీ ఈ ప్రపంచం పుట్టలేదూ..ముందుకు నడవడం లేదు..

ఏ వైజ్ఞానిక సాంకేతికాభివృద్ధినీ సాధించలేదు. సాధించబోదు.. ఒకే ఒక్క శాస్త్రీయ పరిశోధనా శక్తి మాత్రమే మనిషికి తిండి బెట్టి బ్రతికిస్తోంది..జబ్బు చేస్తే నయం చేస్తుంది..వైద్య శాస్త్రాన్నీ ఆవిష్కరించింది, వైరస్ లకి వాక్సీన్లని కనిపెడుతోంది.అంతరిక్షం నుంచీ అగాధం వరకూ అన్నిరంగాల్లో ప్రయోగాలు చేస్తుంది..కొత్త కొత్త ఆవిష్కరణల నెన్నింటినో కనిపెట్టిచూపుతోంది..

కాబట్టి..

మనిషన్నవాడు మానవీయతను కలిగిఉండి మేలైన సరైన ఆలోచనలతో శాస్త్రీయ అవగాహనతో ముందుకెల్లినట్లైతేనే.. ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుంది..దేశమూ పురోగమిస్తుంది..!

**నాంపల్లి సుజాత**

98480 59893

లేఖ

# లేఖలతో ఖండన... ఎందుకంటే..?



- జ్వలిత

ప్రియమైన పాఠక మిత్రులారా....

ఉభయకుశలోపరి.... కొన్ని ముచ్చట్లాడుకుందామా....

దేని గురించి అంటారా.... చదవండి మరీ

'రవి గాంచని చోటు కవి గాంచును' అన్నారు కదా! కవి చూస్తున్నాడో లేదో ఒకసారి అంచనా వేయడం కోసం ఈ లేఖలకు ఆహ్వానం పలికాన్

మరీ విడ్డూరం కాకపోతే అది తెలుసుకోవడం కోసం ఒక పుస్తకం వెయ్యాలా అంటే .... డబ్బు జబ్బు చెయ్యని, కీర్తి దురద అంటని కొందరు నిశ్శబ్దంగా తమ వంతు పని తాము చేసుకుంటూ పోతున్నారు. వాళ్ళతో కలిసి నడుద్దామనే ప్రయత్నమిది.

రవీంద్ర భారతి సాక్షిగా 'నిన్ను మేమెవ్వరం పట్టించు కోవటం లేదు' అన్న అక్కుపక్షి అజ్ఞానపు హాస్యంతో కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ పదిమందితో కలిసి ఫక్కున నవ్వడమే ఈ ప్రయత్నం. హింసించే సమాజంలో మూలాలను వెదికి మూలికా వైద్యానికి ప్రారంభమే ఈ "లేఖావలోకనం". అత్యాశ, అతిశయోక్తి అనిపించిందా మీకు.. అనిపించాలి మరి.... అయితే ఒక విషయం వినండి.

'బొండుమల్లెలు' అనే కథానికను, ది.15-9-1943, ప్రజాశక్తిలో చాసో (చాగంటి సోమయాజులు) రాశారు. అందులో పేదరికంతో ఆనారోగ్యంతో నిరాదరణకు గురై ఒక ముసలివ్యక్తి మరణిస్తాడు. "అతనికి ఒక బిడ్డ ఉన్నది. కానీ, డబ్బివ్వనిదే అన్నం పెట్టదు. బిడ్డకు పెట్టాలని ఉన్నా.. పెట్టేందుకు తనకు ఉన్నదో లేదో.... తనకే లేని ఇంట్లో తండ్రికి పెట్టేందుకు, అల్లుడు ఒప్పుకోవాలి కదా" అంటారు రచయిత. "ప్రభుత్వం వారు వృద్ధాప్యపు పెన్షన్ వంటిది ఇచ్చి ఆదుకోవాలి" అని సూచన కూడా ఇచ్చారు.

మరి ఆ పెన్షన్ వృద్దులకు వివిధ ప్రభుత్వాలు గత రెండు దశాబ్దాలుగా అందిస్తూ ఆదుకుంటున్నాయి కదా.... (వృద్ధుల పెన్షన్లు కూడా మింగుతూన్న తిమింగిలాల గురించి ఆ రచయితకు తెలియదు, నాక్కూడా తెలియదు).

అదిగో అటువంటి సూచనలు, ఆలోచనలు లైంగిక హింసను అరికట్టేందుకు సాహితీ మిత్రులు పంచుకుంటారని ఆశతో లేఖలకు ఆహ్వానం పలికాను. నా ఆశను నిరాశ పరచకుండా అరవైమూడు లేఖలు పంపారు మిత్రులు. అందులో రెండో మూడో తప్ప మిగలిన లేఖలన్నీ నా కోరికను నెరవేర్చాయి.

లేఖావలోకనంలో మొత్తం 63 లేఖలున్నాయన్నాను కదా! ఇందులో స్నేహితులకు రాసిన లేఖలే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత తల్లికి రాసిన లేఖలు ఆరు, కొడుకులకు రాసినవి ఆరు ఉన్నాయి. ఎక్కువమంది లేఖకులు టీచర్ల అయినందువల్లేమో, తమ శిష్యులకు లేఖలు రాశారు. బిడ్డలకు ఐదుగురు రాశారు, మనవరాలికి ఒకరు. అక్కకు ఒకరు, అన్నయ్య ఒకరు, ఆత్మకు ఒకరు, శత్రువుకు ఒకరు, కాలానికి ఒకరు, కొత్త సంవత్సరం 2021కి ఒకరు, వెళ్లిపోయిన శార్వరి నామసంవత్సరానికి ఒకరు, భార్యకు రాసిన వారిద్దరూ, జోగుళాంబ తల్లికి విన్నపం ఒకరు, భయంకర కరోనాకు ఒకరు రాశారు, క్రాంతి జ్యోతి సావిత్రిబాయికి రాసారొకరు మళ్ళీ నువ్వు రావాలని ఆహ్వానిస్తూ.

మొత్తం మీద రెండో మూడో లేఖలు తప్పించి మిగిలినవన్నీ ప్రస్తుత సమాజంలో లైంగిక హింసలను అరికట్టేందుకు సూచనలతో కూడినవే.. కర్తవ్య బోధన చేసినవే... మరి ఆ లేఖల్లో ఎవరేమన్నారో చూడండి మరి.

**ఎవరేమన్నారంటే:-**

★ విద్యతోపాటు ఆత్మస్థైర్యం కలిగించాలి. అందుకు

అవసరమైన ఆత్మరక్షణ/ స్వీయరక్షణ విద్యలు నేర్పించాలన్నారు – ఆచార్య సూర్యధనుంజయ్, కె.ఎ.ఎల్.సత్యవతి, గోళ్ళమూడి సంధ్య, జోషి పద్మావతి, డా. దాసోజు పద్మావతి, డా.విజయశ్రీ, డా.శ్రీదేవి, డా.అనురాధ, తులసి, జయశ్రీ, కిరణ్మయి, సుమతీ, జమున, భవానీ లీలావతమ్మ, ధరణీప్రగడ వెంకటేశ్వర్లు.

★ స్వీయ రక్షణకు ఆయుధాలు కావాలన్నారు– అనిశెట్టి రజిత, జ్వలిత. డా.కె.గీత, రాజీవ.

సాంస్కృతిక భావజాల విప్లవం రావాలన్నారు కుప్పిలి పద్మ.

★ మార్షల్ ఆర్ట్స్ నేర్పాలి, దేహధారుడ్యం కోసం వ్యాయామశాలలకు వెళ్ళాలి అన్నారు రమాదేవి బాలబోయిన, మహతి తేజశ్వి.

★ కుటుంబం, పెంపకం, ఇరుకైన ఇళ్ళు, అదుపు లేని తండ్రుల బూతుపురాణాలు, మద్యం మత్తులో పిల్లల ముందే సరసాలు అన్నీ అరికట్టాలిసినవే అంటారు శిలాలోలిత.

★ ప్రభుత్వ పనితీరు, కుటుంబ పనితీరు, సమాజ తీరు మారాలి అన్నారు డా.తిరునగరి దేవకీ దేవి.

మద్యనిషేధం అవసరమన్నారు శాంతారెడ్డి.

★ పునర్మూల్యాంకనం కావాలన్నారు డా. కొండపల్లి నీహారిణి.

★ సంఘటిత ఉద్యమం అవసరమన్నారు రంగనాథ్ సుదర్శనం, డా.ప్రతిభా లక్ష్మీ.

★ ఇంట్లో స్త్రీలను గౌరవించడం నేర్పితే వివక్ష లేకుండా చేయవచ్చన్నారు సిస్టర్ అనసూయ, సరోజన.

★ వివక్ష లేని పెంపకం, సమదృష్టితో గౌరవించడం ద్వారా దేహాలను చూసే దృష్టి మార్చాలన్నారు: చల్లా సరోజిని, ఎన్నెల, వినోద, ఝాన్సీ కె.వి.కుమారి, పొన్నాడ వరప్రసాదరావు, డా.సి.హెచ్.సుశీల, పద్మశ్రీ, సైదులు.

★ సమయస్పూర్తితో ఆత్మస్థైర్యం ఆయుధంగా కలిగి ఉండాలి అన్నారు: నాంపల్లి సుజాత, జ్యోత్స్నదేవీ, వనపర్తి పద్మావతి, చీదెళ్ళ సీతాలక్ష్మీ. యడవల్లి శైలజ.

★ బాధ్యతాయుత యువత కావాలి అన్నారు హాసినీ విఠల్. సరితా నరేష్.




★ పరువు కోసం బలిపెట్టద్దు ఆత్మవిశ్వాసంతో బతకనివ్వండన్నారు పెద్దపల్లి తేజశ్వి.

★ కవిత్వమైన జీవితమైన సొంతకళ్ళతో చూసి, వ్యవస్థ లోపాలను పేల్చాలి... ఆత్మస్థైర్యమే ఆయుధమన్నారు కట్టా శ్రీనివాస్.

★ దేహ, దేశ, కాలం తో నిమిత్తం లేకుండా గౌరవించడమే మార్గమంటారు బి.వి.వి.ప్రసాద్.

మొత్తం చదివిన నా అభిప్రాయం ఏమిటంటే... పితృస్వామ్యం చూపిన శతాబ్దాల వివక్షను వదలడమే మార్గం. సమదృష్టితో స్త్రీని మానవిగా గౌరవించి ప్రేమించడమే తరుణోపాయం. కుటుంబ వ్యవస్థ మానవీయ విలువలు కలిగి సామజిక సాంస్కృతిక మార్పు అనివార్యం. ఆయుధాలివ్వడం, శిక్షలు పెంచడం కంటే పరస్పర గౌరవంతో జీవించే దృక్పథంతో పిల్లలను స్త్రీలను ప్రేమతో ఆదరించడము అవసరం. మద్యం, అంతర్జాలం, మీడియా ప్రభావం ఎక్కువే కనుక వాటి నియంత్రణ అవసరం. లైంగిక హింస లేని సమాజం సమిష్టి

బాధ్యత. అందరూ చిత్తశుద్ధితో నిజాయితీగా మెలగాలి. నేరస్తులతోపాటు నేరాలను సమర్ధించే వారికి శిక్షలు వెయ్యాలి అంటాను. మరి మీ అభిప్రాయం ఏమిటో ఒక లేఖ రాయండి.

నేస్తాలు అసలు లేఖా సాహిత్యం గురించి మాట్లాడు కుందామా మరి.....

లేఖ – ఉత్తరం – పత్రం పేరేదైన మనుషులు తమ క్షేమసమాచారాలు, భావోద్వేగాలు పంచుకోడానికి ఉపయోగపడే ప్రక్రియ ఇదని తెలుసు కదా..

మొదట లేఖలు మౌఖికంగా మనుషులే చేరవేసేవారు. వాళ్ళనే వార్తాహరులు, రాయబారులు అనే వారు. ఆ తర్వాత

పాలకుల తమ ఆజ్ఞలను, పాలితులు తమ అర్జీలను సమర్పించేందుకు లేఖారూపం సౌకర్యంగా ఉండేది.

ఉత్తరం రాయడానికి ఒక సంప్రదాయం ఉంటుంది, అది ఒక కళే, ఆ కళనే గ్రీకులు పూర్వకాలంలో Epistolog-raphy అన్నారట. ప్రాచీన కాలంలో తూర్పు రోమన్ రాజ్యాన్ని బైజాంటియమ్ అనేవారు. (తర్వాత 'కాన్ స్టాంట్ నోపిల్' అన్నారు. ప్రస్తుతం అది 'ఇస్తాంబుల్'గా మారింది.) పూర్వం బైజాంటియమ్ రాజులు శాశనాలను, చట్టాలను ప్రజలకు ఉత్తరాల రూపంలో తెలిపేవారట. రాజశిక్షణలో యుద్ధవిద్యలతో లేఖలు రాయడం నేర్పేవారట. దీనిని బట్టి లేఖలకు ఎంత చరిత్ర ఉందో చూడండి మరి...

(క్రీస్తుశకం:50 –120) ఆచార్య నాగార్జున శాతవాహన చక్రవర్తి రాసిన సృహుల్లేఖ అంటే మిత్రునికి ఒక లేఖ అర్థం మొదటి ఉత్తరంగా గుర్తించారు. సంస్కృత కవి కాళిదాసు 'మేఘసందేశం' లేఖా సాహిత్యమే.

అనగనగా కాలంలో మనుషులు పక్షులు జంతువులు సమాచారం చేరవేసేవారు. మన దేశంలో 1853లో రైళ్ల రాకతో 1854లో తపాలా అదే పోస్టు మొదలైంది. ఆ విధంగా పాలకులు, ఆధిపత్య వర్గాలకే కాక సామాన్య ప్రజలకు కూడా ఉత్తరాల చేరవేత అందులో అందుబాటులోకి వచ్చింది.

1863–1902 స్వామి వివేకానందుడు,

1876–1938 శరత్ చంద్ర చటోపాధ్యాయ,

1889 –1965 జవహర్లాల్ నెహ్రూ,

విశ్వకవి రవీంద్రుడు విక్టోరియా ఓకేంపో మధ్య లేఖలు ప్రపంచ చరిత్రలో నిలిచిపోయాయి.

తెలుగు సాహిత్యంలో అల్లసాని రచన విజయనగర చరిత్రలో పద్యలేఖ., రాయపోలు రచన 'స్నేహలతా దేవి లేఖ', గుర్రం జాషువా రచనలు గబ్బిలం, ఫిరదౌసి, తిరుపతి వేంకట కవుల 'గీరతం',

తిలక్ 'సైనికుని ఉత్తరం', గోపీచంద్ 'పోస్ట్ చేయని ఉత్తరాలు', 'పరమేశ్వర శాస్త్రి వీలునామా',

బోయి భీమన్న 'జానపదుని జాబులు' లేఖాసాహిత్యాన్న సుసంపన్నం చేశాయి.

పుట్టపర్తి నారాయణాచార్యుల 'మేఘదూతం' గేయరూపంలో సాగిన లేఖే.

యద్దనపూడి 'ప్రేమ లేఖలు', మరో హాస్య నవల 'ఉత్తరాయణం' , మల్లాది 'దూరం', చలం 'ప్రేమలేఖలు' నవలరూపంలో వచ్చిన లేఖలు.

సాహిత్య సంస్కృతికపరమైన గౌరవాన్ని కలిగిన లేఖల్ని లేఖా సాహిత్యంగా చెపుతారు.

వాస్తవమైన వ్యక్తుల మధ్యగాని లేదా ఊహాజనితమైన వ్యక్తుల మధ్యగాని లేఖలద్వారా సంభాషణ జరుగవచ్చు.

తెలుగులో లేఖల్ని స్వీకరించిన మొదటి వ్యక్తి చార్లెస్ పిలిప్ బ్రౌన్.

లేఖలకు సంబంధించి భారతీయ సాహిత్యంలో మొట్టమొదటి ప్రస్తావన "అభిజ్ఞానశాకుంతలం"లో ఉంది.

లేఖలకు సంబంధించి తెలుగులో మొట్టమొదటి ప్రస్తావన పింగళి సూరన "ప్రభావతిప్రద్యుమ్నము"లో ఉంది.

గుడిపాటి వెంకటాచలం ఉత్తరాల పేర్లు ప్రేమలేఖలు.

కనుపర్తి వరలక్ష్మమ్మ ఉత్తరాల పేర్లు శారద లేఖలు.

నెహ్రూ లేఖల్నితెలుగులోకి అనువదించినది కాటూరి వేంకటేశ్వరరావు.

బెంగాలీ రచయిత శరత్ చంద్ర చటర్జీ లేఖల్ని తెలుగులోకి అనువదించినది పురాణరాఘవ శాస్త్రీ.

జానపదుని జాబులు రచయిత బోయి భీమన్న.

గీరతం రచయితలు తిరుపతి వేంకటకవులు.

పోస్ట్ చేయని ఉత్తరాలు, ఉభయకుశలోపరిలను

రచించినవారు త్రిపురనేని గోపీచంద్. తెలుగులో ఉత్తరాల రచనలో ప్రసిద్ధుడు డా.సంజీవ్ దేవ్.

పోస్ట్ మ్యాన్ మీద కవితలు రాసినవారు తిలక్.

తెలుగులో లేఖా సాహిత్యంపై పి.హెచ్.డి చేసినవారు 1.మలయశ్రీ 2.సి.హెచ్.సీతాలక్ష్మి.

ప్రసిద్ధ లేఖల్లో సమాజానికి దారి చూపేవి... సావిత్రిబాయి పూలే జ్యోతిబా పూలేకు రాసినవి, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి శిష్యురాలు ముక్తా సెల్వే లేఖ. అబ్రాహం లింకన్ అతని కుమారుడి టీచర్ కు రాసిన లేఖ మొదలైనవి.

ఉద్యమ సాహిత్యంలో శ్రీశ్రీకి ప్రముఖ హేతువాది సీవీ రాసిన 'ఏకలవ్యుని బహిరంగ లేఖ', కేజీ.సత్యమూర్తి (శివ సాగర్) రాజీనామా లేఖ, విరసాన్ని ఉద్దేశిస్తూ రాసిన లేఖలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి..

కొడవంటి కుటుంబరావు , శ్రీశ్రీ, చలం, సంజీవ్ దేవ్ ఉత్తరాలు పుస్తకాలుగా వచ్చాయి.

యశస్వి భార్యకు రాసిన ప్రేమలేఖలు 'పరాంసుందరి' పేరున పుస్తకమయింది. 2012లో అంతర్జాతీయ బాలల దినోత్సవం వేడుక గురించి ఒక విద్యార్థి తన మేనమామకు రాసినట్టు ప్రస్తుత సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ రాసిన లేఖ సాహిత్యంలో నిలుస్తాయి.

మహిళా లేఖకులు: కనపర్తి వరలక్ష్మమ్మ మహిళలను చైతన్య పరిచేందుకు రాసిన "శారదలేఖలు" ప్రసిద్ధమైనవి.

కుప్పిలి పద్మ రాసిన 1993లో వచ్చిన "అమృత వర్షిణి" మొదటి ప్రేమలేఖలు, వారివే 2015లో వాకిలిలో శీర్షికగా వచ్చిన లేఖలు"ఎల్లోరిబ్బన్" 2020 పుస్తకంగా వచ్చింది. శిలాలోలిత భూమికలో రాసిన లేఖల పుస్తకం, ఆకాశవాణి ఉద్యోగిని సంవత్సరం పాటు రేడియోలో ప్రసారం చేసిన లేఖలు 'కొత్త ప్రేమ లేఖలు' మొదలైనవి పుస్తకాలుగా వచ్చాయి. యడవల్లి శైలజ 'హృదయరాగం' పేరున లేఖాసంపుటి తెస్తున్నారు. కె.మల్లీశ్వరి, షాజహాన, విమల లేఖలు రాస్తూన్నారు. నమస్తే తెలంగాణ, పాలపిట్ట, భూమిక, వాకిలి, చినుకు, సంచిక, కళాతపశ్వి వంటి పత్రికలు లేఖలను ప్రోత్సహిస్తున్నాయి. మీరూ రాయండి లేఖలు.

చూశారుగా లేఖలకు ఎంత చరిత్ర ఉందో... ఇప్పుడు 'లేఖావలోకనం' పేరుతో మీ ముందుకు వచ్చిన ఈ ఉత్తరాలు, పసి పిల్లలపై జరిగే లైంగిక హింసను ఖండిస్తూ తెలుగులో వచ్చిన మొట్టమొదటి లేఖా సంపుటి.

ఈ ప్రయత్నం 2020 నవంబర్ లో ప్రారంభించి 2021 ఫిబ్రవరిలో అంటే నాలుగు నెలల కాలంలో పూర్తి చేయడమైనది.

లేఖావలోకనం ద్వారా నేను ఆశించినది ఏమిటంటే? లేఖలు అంతరించిపోయి మెసేజ్ లై... ఎస్ఎంఎస్ లై మిగులుతున్న ఆలోచనలను, మరొక్కసారి.. ప్రియమైన.... పూజ్యులైన...తో మొదలు పెట్టి, ఉభయకుశలోపరి... మేము ఇక్కడ బాగున్నాం... మీరు అక్కడ బాగున్నారు అనుకుంటున్నా... అంటూ కొనసాగించి.. మీ శ్రేయోభిలాషి, నీ ఉత్తరానికి ఎదురుచూస్తూ.. అంటూ ముగించే కొన్ని పద్ధతులను గుర్తు చేసుకుంటూ... వీలైతే ఆ ఆనందాన్ని కొనసాగిద్దామని ఆకాంక్ష అన్నమాట.

మీరందరూ... అసలు విషయం మర్చిపోకుండా..

లేఖల్లో రాసినట్టుగా లైంగిక హింసను నిరోధించడం, అరికట్టడం మన సమిష్టి బాధ్యతగా భావిస్తారుగా... కవిత్వం, కథ, లేఖల రచనతో పాటు ఆచరణలో చూపిస్తారని ఆశిస్తూన్నాను...

(కవిత అంటే... గుర్తొచ్చింది పసిపిల్లల పై, లేఖల ప్రయోగశీలి 'యశస్వి' రాసి కవిత ఈ లింకులో చదవండి

https://www.facebook.com/groups/ka-visangamam/permalink/885639338155486.

అంతేనా మరికొందరి కవితల గురించి నేను రాసిన ఆర్టికల్

https://m.facebook.com/story.php?story_fbid=3462798293762983&id=100000985399037

వీలైతే ఓ లుక్ వెయ్యండి మరి...)

విసుగు పుట్టించానా మిత్రాస్... కావచ్చు లెండి.. అయితే మీరూ ఒక లేఖతో రివెంజ్ తీర్చుకోండి మరి..

ఇట్లు

మీ

జ్వలిత,

9989198943.

(లేఖావలోకనం – సంకలనానికి సంపాదకురాలి ముందుమాట)

కవిత

# పంచభూతాలు పరవశిస్తాయి



- బండి ఉష

ఆమె అవనికి మరో రూపం
సృష్టికి ప్రతిసృష్టి చేయగలదు
లాలించటం, పాలించటం
ఆమెకు వెన్నతో పెట్టిన విద్య
వికారాల విపణి వీధిని
లయం చేయగల శక్తి స్వరూపిణి.

త్రికాలాలలోను త్రిగుణాలు
ఆ అమ్మలపొదిలో నిక్షిప్తమై వున్నా
ప్రేమమయిగా పరిమితులతో
పునాదులను పదిల పరుచుకుంటోంది.

కలల సాకారానికి ఆలంబనై
ఓర్పుతో బాధ్యతల రధచక్రానికి
ఇరుసై గమ్యం చేరుస్తుంది.

హిమవన్నగాలనంటిన ధైర్యంతో
అవని నుండి ఆకసం దాకా
ఏ రంగమైనా తనదే గెలుపు.

అంతరంగం శోకసంద్రమైనా
అమృతధారలు కురిపిస్తూ
సహనంతో వెలిగే శాంత మూర్తి.

ఆమె విశ్వానికే ఆనవాలు
భవిష్యత్తును దిద్దగల నేర్పరి
ఈ లోకాన్ని నడిపించే దివిటి.

సూర్యచంద్రుల నడుమ శ్రమిస్తున్నా
ఆచారాల పేరుతో అణగ దొక్కుతూ
అమానుషంగా స్త్రీత్వాన్ని చిదిమేస్తుంటే
పాప భారాన్ని మోయలేక
ప్రకృతి పొగులుతోంది.

నాటి సీత నుండి నేటి స్త్రీ వరకు
యుగమేదైనా ఉనికి కోసం
అనుక్షణం పోరాటమే.

అస్తిత్వం కోసం గడప దాటితే
కనిపించని ఆంక్షల చక్రం
మారణాయుధమై నింగి సగాన్ని
నిలువెల్లా గాయం చేస్తుంటే
ఎరుపెక్కిన ఆ నయనాలు
అణువణువును అల్లకల్లోలం చేయటమే కాదు....

అర్ధనారీశ్వర తత్వానికై
ప్రశ్నల బాణాలు సంధిస్తే
తల దించుకోవటమే సమాధానమవుతుంది.

ఆమెకు ఆమే సాటి
ఇకనైనా మేలుకొని
ఆమెను ఆమెగా ఎదగనిస్తే
వికసించిన సమతౌల్యంతో
పంచభూతాలు పరవశిస్తాయి.

**బండి. ఉష**
ఖమ్మం, ఫోన్ : 9676377462

కవిత

# వృద్ధుల శరణాలయం

- చౌటపల్లి నీరజచంద్రన్



మూగజీవులకు
నీడనిచ్చే నిలయాలు కనిపిస్తున్నయో లేవో కానీ
వృద్ధులకు నీడనిస్తున్న
ఆలయాల సంఖ్య
నానాటికీ పెరుగుతున్నాయి

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ స్థానంలో
నేనూ, నా కుటుంబం  చాలు
మరే బంధాలూ బాంధవ్యాలూ
అక్కర్లేదనుకుని
ఇరుకు మనసుల్ని
పుట్టించుకున్న సమాజంలో
కన్నతల్లిదండ్రులకు ఆలయాలు
వృద్ధాశ్రమాలే పెద్ద దిక్కు

ఇక
తాతయ్యల, నానమ్మల, అమ్మమ్మల
ఆప్యాయానురాగాలకు తావేదీ
చిన్నప్పుడు చంకనేసుకుని
దిగిరాని చందమామనైనా
జాబిల్లి రావే కొండెక్కి రావే
గోగుపువ్వులు తేవే అంటూ
ముద్దు ముద్దు పాటలు పాడుతూ
గోరుముద్దలు తినిపించిన అమ్మలు
ముడతలు పడి వయస్సు మీదపడ్డప్పుడు
పిడికెడు అన్నం పెట్టకపోగా
ఇంకా ఎన్నిరోజులు
చూడాలి నిన్ను అని అనుకునే స్థితిలో ఉన్న
వృద్ధులకు ఆలయాలే వృద్ధాశ్రమాలు

"నువ్వు పుట్టినప్పుడు
ఊయల కట్టి అందులో నిన్ను పడుకోపెట్టి లాలిపాటలు
పాడిన మమ్మల్ని
ఎవరో కట్టిన ఇంటికి
తరలిస్తున్నావు బంధపాశాలు మరచి" అని
వృద్ధాశ్రమంలో
మగ్గుతున్న తల్లుల్ని తండ్రుల్ని చూడొచ్చు....

ప్రసవవేదనను మించిన ఆవేదన
ఏదైనా ఉందా అంటే
అది కన్నతల్లిని వృద్ధాశ్రమంలో
విడిచిపెట్టి నిర్దయగా
వెనుతిరిగి వచ్చేస్తున్నప్పుడు
ఆమె పడే వేదనను చెప్పడానికి ఆలోచించక్కర్లేదు

ప్రాణం పోసుకున్న వాళ్ళేమో
స్వేచ్ఛా ప్రపంచంలో
ప్రాణమిచ్చిన వాళ్ళేమో
ఎవరి కంటికీ కనిపించని
నాలుగ్గోడల మధ్య అదీనూ వృద్ధాశ్రమంలో.....

ఆకలినే ఆహారంగా తింటూ
కన్నబిడ్డల ఆకలి తీర్చే
తల్లులకూ
బయటకు చూపని
ప్రేమానురాగాలను
లోలోపలే దాచుకున్న తండ్రులకూ
వయస్సొచ్చిందంటే
దిగులు
తమను ఏ వృద్ధాశ్రమానికి తరలిస్తారోనని....

కారణమేదైనా కావచ్చు
సంకుచిత మనస్సులు కావచ్చు

వృద్ధాశ్రమాలకు చేరుతున్న తల్లిదండ్రుల
ప్రేమానురాగాలూ
కంటికి రెప్పలా అనే మాటకు
అక్షరసత్యాలైన వారి ఆప్యాయతా
ఏమాత్రమైనా హృదయాలను మీటితే
పుట్టిన రోజులనూ
పండగలూ, పబ్బాలనూ
వారుంటున్న వృద్ధాశ్రమాలకు వెళ్ళి
వారితో గడిపినప్పుడు
వారితోపాటూ మీ మనసులూ
పొందే ఆనందాన్ని ఒక్కసారి చవిచూస్తే
మీలోనూ మార్పు వస్తుంది...

వృద్ధాశ్రమాలకు
డబ్బులిద్దాం
వస్తువులిద్దాం
వస్త్రాలిద్దాం
ఆహారమిద్దాం
కానీ
మన కన్నతల్లిదండ్రులను
ఇచ్చుకోకూడదనే
మనస్తత్వం మీలోనూ తొంగి చూస్తుంది

కళ్ళు చిన్నవైనా పరవాలేదు
నష్టం లేదు
మనసుల్ని ఆకాశమంత విశాలం
చేసుకుని
తల్లిదండ్రులకు వారిచ్చిన ప్రేమానురాగాలను
రెట్టింపు చేసి తిరిగివ్వగలిగితే
జీవితం ధన్యం!!

★ ★ ★


చౌటపల్లి. నీరజచంద్రన్
8500878869


# 'ఎదురు చూపు'



రాత్రంతా నిశ్శబ్దాన్ని యుద్ధంగా మోస్తూ
పగలు సన్నగా నవ్వుతుంది
ఆ వక్రరేఖ పైన భారంగా వాలిన
వక్రబుద్ధులను బేరీజు వేస్తూ
యుద్ధం తప్పదని తెలిసాక
చేతిగాజులకు పోరాటం నేర్పుతుంది
కడుపులో సముద్రమంత కన్నీళ్లను దాచి
తెల్లని నురుగులా మెల్లగా నవ్వుతుంది
తెల్లవారక ఆవిరవుతాయేమో అన్న ఆశతో
కాలాలెన్ని మారుతున్నా
ఆమె కాలం వైపే
కాళ్ళు చాపుకు కూర్చుంది
వసంతమేదైనా.. కోకిలై కొత్తరాగమేదో తీస్తుందని
ఆమె ఆశకు ఎవరైన ఆయువు పోయండి
నీ ఆయుష్షుకి ఆమె ఆశీర్వాదం ఆయువుపట్టు
స్వేచ్ఛగా ఎగరాలనుకుంటుంది
ఆమె రెక్కలకు ఊతం ఇవ్వండి
ఊపిరున్నంత వరకు
నీ చిరునామా చెప్పుకుంటుంది
ఆమె కలలకు హద్దులు గీయకండి
వీలైతే మీరు ఒక కలకనండి
కాదనుకుని తాను చేయడానికి
కన్నీళ్లేం అడ్డుకాదు
నీ పై ఆమెకున్న గౌరవమే అడ్డుకట్ట
నిజానికి ఆమె కోరుకునేది
ఆకాశంలో సగం భాగమో
ఆస్తుల్లో అర్ధభాగమో కాదు
రంగాలేవైనా రాణిస్తుందన్న నమ్మకాన్ని
సాటి మనిషిగా గౌరవాన్ని,
సమాజంలో సమానంగా జీవించే హక్కుని

★★★


పి. సుష్మ
నారాయణపేట జిల్లా, 9959705519
psreddy9959@gmail.com

కథ

# నవనీతం



- రోహిణి వంజారి

హఠాత్తుగా మెలకువ వచ్చింది. కిటికీ అద్దంలోనుంచి మసక మసకగా వెలుతురు. కిటికీ కి అవతల ఉండే కానుగ చెట్టు కొమ్మల మధ్య నుంచి తొలిపొద్దు భానుడి కిరణాలు లేలేత కనకాంబరం పూల రంగులో కిటికీ అద్దంలో నుంచి ఏటవాలుగా గదిలో పడుతున్నాయి. నా కళ్ళు అప్రయత్నంగా గోడ గడియారం వైపు మళ్ళాయి. సమయం ఆరుంపావు అని గడియారం ముళ్ళు నన్ను వెక్కిరిస్తున్నాయి ఈ రోజు తాము గెలిచామని.

దిగ్గున లేవాలని చూసాను. పక్క మీద నుంచి అంగుళం కూడా కదలలేకపోయాను. తల అంతా దిమ్ముగా ఉంది. ఈ రోజు నుంచి స్కూల్లో యూనిట్ పరీక్షలు. పిల్లల సీటింగ్ అరేంజ్, నంబరింగ్ పని బాధ్యతను నాకు, తెలుగు మాస్టర్ సోమశేఖరంగారికి అప్పజెప్పారు మా ప్రిన్సిపాల్ మేడం సుభాషిణి గారు. నిన్న సాయంత్రమే కొంత పని పూర్తి చేసి మిగిలినది రాత్రి భోజనాల తర్వాత కూర్చుని పూర్తి చేసి మాస్టర్ కి ఆ పేపర్స్ వాట్సాప్ లో పంపేసరికి రాత్రి పదకండు అయింది.

బాగా తలనొప్పిగా ఉండి డిస్ప్రిన్ మాత్ర నీళ్లలో కలిపి తాగి పడుకుంటే ఇప్పటికి మెలుకువ వచ్చింది. బాబోయ్... ఈ రోజు లేవడం ఆలస్యం అయిపోయింది. ఇప్పుడు వంట మొదలు పెడితే ఎప్పటికి అయ్యేను. మళ్ళీ లేవాలని ప్రయత్నించాను కానీ లేవలేకపోయాను. తలంతా సూదులు గ్రుచ్చినట్టు విపరీతంగా నొప్పి. పొత్తికడుపు దగ్గర పేగులను మెలితిప్పినట్టు విపరీతంగా బాధ. నా పరిస్థితి నాకు అర్థం అయింది. ప్రతినెలా ఉండేదే అయినా ఈ మూడు రోజుల బాధ ఇప్పుడే రావాలా!?

పక్కకి తిరిగి చూసాను. శ్రీవారు గాఢ నిద్రలో ఉన్నారు. లేపి కాస్త పనిలో సాయం చేయమందామనుకున్నాను. సాయం అడిగితే స్కూలుకి సెలవు పెట్టమంటారు కానీ సాయం అందదు అని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. 'నొప్పి చాల ఎక్కువగా ఉంది. పోనీ సెలవు పెడితే' అనుకునే లోగానే సెల్ మోగింది. ఐదవ తరగతి స్టూడెంట్ " కైలాష్ " వాళ్ళ అమ్మ ఫోన్ చేసి " గుడ్ మార్నింగ్ మేడం.. డైరీలో ఎగ్జామ్స్ పోర్షన్ రాసుకోవడం మర్చిపోయాడు కైలాష్. కాస్త ఈ రోజు పరీక్ష జరిగే తెలుగు, మాథ్స్ సిలబస్ చెప్పండి. కైలాష్ ని చదివించాలి " అంది. "ఒక్క ఐదు నిముషాలు ఆగండి. నేను కాల్ చేస్తాను" అని చెప్పి జన్మనెత్తితిరా, అనుభవించితిరా అనుకుంటూ భారంగా మంచం మీది నుంచి దిగాను. మెల్లగా లేచి టేబుల్ మీద ఉండే బుక్ తెరచి సిలబస్ చూసి కైలాష్ వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి పరీక్షల పోర్షన్ చెప్పి సెల్ టేబుల్ మీద పెట్టేసాను.

ఇంకాసేపు పడుకోవాలనిపించింది. ఆ వెనువెంటనే స్కూల్ కి ఆలస్యంగా వెళితే , అదీ ఎగ్జామ్స్ మొదటి రోజు మా ప్రిన్సిపాల్ మేడం తీక్షణమైన చూపులు, ఉగ్ర రూపం గుర్తుకు వచ్చి 'ఇష్టమైనంత సేపు హాయిగా పడుకునే అదృష్టం నాకు లేదులే ' అనుకుంటూ నా అత్యాశకు విరక్తిగా నవ్వుకుని, కబోర్డులో నల్ల కవర్లో దాచివుంచిన సానిటరీ పాడ్, టవల్, డ్రెస్ తీసుకుని వాష్ రూంకి వెళ్ళాను.

సమయం 8.30 అయింది. ఇంకో పది నిముషాల్లో స్కూల్లో ఉండాలి నేను. దొండకాయ కూర కలిపిన అన్నం లంచ్ బాక్స్ లో పెట్టుకున్నాను. బాబు గదిలో చదువుకుంటున్నాడు . వాడు తొమ్మిదింటికి హడావిడిగా రెడీ అయి కాలేజీ కి వెళ్తాడు. ఓ పక్క తల తుడుచుకుంటూ, ఇడ్లి నోట్లో కుక్కుకుంటున్నాను. ఆయన ఇడ్లీలు తిని సింకులో ప్లేట్ వేసి నీళ్ళు తాగుతూ నా వంక చూసాడు.

"ఏంటి లతా ఇప్పుడు తలకి స్నానం చేసావు". అన్నాడు. "అది అదీ కడుపు నొప్పిగా ఉందండీ" అన్నాను. అర్థమైనట్టు తల పంకించాడు.

"మీ స్కూటీ లో నన్ను " నా మాట పూర్తి కాకముందే " నాకు ఆఫీస్ కి టైం అయింది. నువ్వు ఆటోలో వెళ్ళు. నేను వెళుతున్నా" అంటూ స్కూటీ స్టార్ట్ చేసి మరోసారి నా వైపు చూసాడు. మళ్ళీ నాలో ఆశ ఊపిరి పోసుకుని కాస్త దీనంగా ఆయన వంక చూసాను, రమ్మంటారేమో అని.

"కడుపు నొప్పి మరీ ఎక్కువగా ఉంటే స్కూల్ కి రాలేనని మీ మేడంకి ఫోన్ చేసి చెప్పి రెస్ట్ తీసుకో " మరో మాటకు చోటివ్వకుండా వెళ్ళిపోయాడు . అంతకంటే ఆయన నుంచి ఎక్కువ ఆశించడం నా అత్యాశ. ఓ పక్క కడుపు నొప్పి. మరోపక్క స్కూలుకి ఆలస్యం అవుతోందని కంగారుతో తినే ఇడ్లి గొంతులోకి దిగలేదు. ఇక తినలేక నీళ్ళు తాగి లంచ్ బాక్స్ హ్యాండ్ బ్యాగ్ లో పెట్టుకుని బాబు కి చెప్పి ఇంటి నుంచి బయట పడ్డాను.

రహ్మత్ నగర్ చౌరస్తా దగ్గర ఆటో కోసం ఎదురు చూస్తున్నా. నాలుగు షేర్ ఆటోలు వచ్చివెళ్లాయి. ప్రతి ఆటోలో పదిమందికి తక్కువలేకుండా జనం ఉన్నారు. సమయం ఎనిమిదీ నలభై అయింది. రిజిస్టర్ లో సంతకం పెట్టాల్సిన సమయం అయిపోయింది. ఇక ఈ రోజు లేట్ కమర్ లెక్కే. మేడం దగ్గర ఎలాగూ అక్షింతలు తప్పవు. ఏడుపు వస్తోంది నాకు. దీనంగా నిల్చున్న నా ముందుకు ఒక ఆటో వచ్చి ఆగింది. దాంట్లో కూడా దాదాపు ఎనిమిది మంది దాక ఉన్నారు.

ఇంకా ఎక్కించుకోవాలని ఆటోవాలా "బోరా బండ బోరా బండ " అంటూ దీర్ఘం తీస్తూ ఒక వింతైన రిథంలో అరుస్తున్నాడు. బస్సు కూడా ఇప్పట్లో వచ్చేటట్టు లేదు. ఇక ఉపేక్షిస్తే లాభం లేదనుకుని ఆటో ఎక్కి అంగుళం చోటు కూడా లేని సీట్ మీద అవతల వారిని నెట్టుకుంటూ కూర్చున్నాను. ఏం దయ తలచాడో కానీ ఆటోవాలా ఇక ఆలస్యం చేయక ఆటోని ముందుకు ఉరికించాడు. రహ్మత్ నగర్ చౌరస్తా నుంచి మెలికలు తిరిగిన కొండచిలువల్లా ఉన్న గల్లీల నుంచి ఆటో నేలమీది రాకెట్ లా దూసుకు పోతోంది. గుంతలు, మిట్టలు, స్పీడ్ బ్రేకర్లు వచ్చినప్పుడల్లా ఆటో ఎగిరెగిరి పడుతోంది. ఆటో ఎగిరినప్పుడల్లా నా కడుపు నొప్పి తారాస్థాయికి చేరి పేగులు లుంగచుట్టుకు పోతున్నట్టు అవుతోంది. బాధని పంటిబిగువున అణుచుకుంటున్నాను. ఆటోని కార్మికనగర్ చౌరస్తాలో ఆపాడు డ్రైవర్. అక్కడ దిగేవాళ్ళు, ఎక్కేవాళ్ళు. ఐదు నిముషాలు అయింది.

ఆటోవాలా ఇంకా "బోరబండ బోరబండ "అని అరుస్తూనే ఉన్నాడు. నా అసహాయత కోపంగా రూపాంతరం చెంది " భాయ్, జర ఆటో పోనీయ రాదు ఇక. స్కూల్ కి లేట్ అవుతుంది " ఎంత కోపంగా అందామనుకున్నా అంతకంటే కఠినంగా మాటలు రాలేదు నాకు.

"ఇంకోలని ఎక్కనీయండి మేడం" నిర్లష్యంగా జవాబిచ్చాడు ఆటోవాలా.

ఇక అతనికి చెప్పడం అంటే' చెవిటివాని ముందు శంఖం ఊదినట్టే' అని కిమ్మనకుండా కూర్చున్నాను ఆటో కమ్మీ పట్టుకుని. ఆటో లోపల రకరకాల మనుషులు. చెమట, జర్దా కిల్లి, సారా వాసనలు కలగలసి కడుపులో తిప్పేస్తున్నాయి. "హు.. ఈ షేర్ ఆటోలో ప్రయాణం అంటేనే డైరెక్టుగా నరకానికి పోవడమే. ఎన్నో సార్లు ఈ ప్రైవేట్ స్కూల్స్ లో జాబ్ మానేద్దాం అనుకున్నాను. ఆయనది చిన్న ఉద్యోగం. బాబు చదువు పూర్తయి వాడు ఓ దారికొచ్చేదాకా ఆయన సంపాదనకు, నా సంపాదన వేడినీళ్ళకు చన్నీళ్ళలా కాస్త ఆసరాగా ఈ జాబ్ చేయాల్సివస్తోంది. ప్రైవేట్ స్కూల్స్ లో టీచర్ అంటే అక్కడ చాకిరీ బారెడు. జీతం మూరెడు. అయినా తప్పదు. బి.ఎడ్. చేసిన నాకు ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. నా చదువుకి ఇంత కంటే పెద్ద జాబ్ ఎక్కడ వస్తుంది. ఇంకెన్నాళ్ళో నాకీ బాధ.

తీరుబడిగా ఆలోచించడానికి కూడా నీకు అర్హత లేదు అంటూ ఆటో బోరబండ చౌరస్తా లో ఆగింది. చేతిలో ఉన్న చిల్లర పైసలను ఆటోవాలా చేతిలో పెట్టి పరుగు లాంటి నడకతో స్కూల్ లోకి వెళ్ళాను. చేతిలో హాజరు పుస్తకం వంక, మరోవైపు గోడ గడియారం వంక మార్చి మార్చి చూస్తూ ఉంది ప్రిన్సిపాల్ మేడం సుభాషిణి.

"గుడ్ మార్నింగ్ మేడం " అన్నాను మేక పోతూ గాంభీర్యాన్ని ముఖంలో ప్రదర్శిస్తూ.

"ఎగ్జామ్స్ సమయంలోనే మీకందరికీ ఆలస్యం అవుతుందా? కట్టగట్టుకుని అంతా లేటుగా వస్తున్నారు " అన్న ఆమె భీకరమైన చూపులకు శక్తి ఉండే నేను అక్కడే మాడి మసైపోయుండేదాన్ని.

"మేడం పీరియడ్ వచ్చింది. బాగా కడుపు నొప్పిగా ఉంటే పనులు తొందరగా చేయలేక పోయాను " నీళ్ళు నములుతున్నట్టు వచ్చాయి మాటలు నాకు.

"అదేం కొత్తనా. ఎప్పుడూ ఉండేదేగా. నాకింకేం చెప్పొద్దు. స్టాఫ్ రూమ్ లో శోభారాణి టీచర్, సోమశేఖరం మాస్టర్ ఉన్నారు. వెళ్ళి ఎగ్జామ్స్ సీటింగ్ అరేంజ్మెంట్ విషయం చూడండి " తల తిప్పేసి ఎవరో పేరెంట్స్ తో మాట్లాడటం మొదలెట్టింది మేడం.

"బతుకు జీవుడా " అనుకుంటూ రెండు ఫ్లోర్లు ఎక్కలేక ఎక్కి సెకండ్ ఫ్లోర్ స్టాఫ్ రూమ్ లోకి వెళ్ళాను.

అక్కడ శోభారాణి టీచర్ నన్ను చూస్తూనే " రండి శ్రీలతా టీచర్. నేను ఇప్పుడే వచ్చాను. మేడం ఉగ్రావతారం చూసారా. మీకెందుకు లేట్ అయింది..? " అంటుంటే చిన్నగా నిట్టూర్చి బల్ల మీద కూర్చుని మెట్లెక్కిన అలుపు కాస్త తీర్చుకుని గట్టిగా ఊపిరి పీల్చి వదిలి

"శోభారాణి టీచర్ ఈ రోజు పొద్దున్న లేస్తూనే నాకు పీరియడ్ వచ్చింది. బాగా తలనొప్పి, కడుపు నొప్పి. ఇంటి పని సరిగా చేయలేక పోయాను. వంట అయి, తలంటు స్నానం చేసేసరికి బాగా లేట్ అయింది. ఆటో కూడా త్వరగా దొరకలేదు. ఇదుగో వచ్చేసరికి ఈ టైం అయింది. మేడం దగ్గర అష్టోత్తర శత, సహస్రనామాలు కూడా అయినాయి టీచర్"

అంటు నా ధోరణిలో చెప్తున్న దాన్ని హటాత్తుగా ఆగిపోయాను. స్టాఫ్ రూమ్ లో ఉన్న పెద్ద టేబుల్ చుట్టూ వేసి ఉన్న బల్లల్లో మా ఎదురు వైపు ఉన్న చివరి బల్ల మీద 'సోమశేఖరం ' సార్ కూర్చుని ఉన్నారు. ఆయన్ని గమనించకుండా నేను మాట్లాడుతూ ఉన్నాను. ఆయన మా మాటలను విన్నారో లేదో తెలియలేదు కానీ నాకు ఏదో గిల్టీగా అనిపించి చిన్నగా

"గుడ్ మార్నింగ్ సార్ ". "ఈ రోజు రావడం కాస్త ఆలస్యం అయింది. రాత్రి మీ వాట్సాప్ కి సీటింగ్ అరేంజ్మెంట్

రాసిన పేపర్ మెసేజ్ చేశాను. చూసారా సార్. అంతా ఓకే కదా " అన్నాను

ఓ చూపు నా వైపు చూసి తల ఊపి ఊపనట్లు ఆడించి మళ్ళీ పుస్తకం లోకి తల దూర్చారు ఆయన. ఇంతలోనే ఉపేంద్ర ఆయమ్మ ఫ్లాస్క్, డిస్పోజబుల్ గ్లాసులు తీసుకుని స్టాఫ్ రూంలోకి వచ్చి

"శోభమ్మ టీచర్, లతా టీచర్ ఈ రోజు నుంచి పిల్లోల్లకి పరీక్షలని హెడ్ మేడం టీచర్లందరికి 'ఛాయా ' నాచేత తెప్పిచ్చిర్రు . ఇందాక పొట్ట నొచ్చుతోందని మేడంకి చెప్పినవు కదా లతమ్మా . అందుకే ముంగడ మీ ఫ్లోర్ కే "ఛాయా " తెచ్చిన. ఇదుగో తాగుర్రి. స్కూల్ బస్సు తుడవడానికి రమ్మని డ్రైవర్ "సాయిలు " అన్న పిలిచిండు. మల్లా ఇంటర్వెల్ లోగా నేను పైకొచ్చియాలా దారాలు పంచనీకి" అంటు వెళ్ళిపోయింది ఉపేంద్ర ఆయమ్మ.

"అబ్బా ! ఈ రోజు మేడం కి మన మీద ఈ ప్రేమ ఏంటో, పొద్దున టిఫిన్ కూడా సరిగా తినలేదు టీచర్. టీ ' తాగితే కాస్త రిలీఫ్ గా ఉంటుంది " అంటూ నేను మూడు గ్లాసులలో టీ పోసి ఒకటి శోభారాణి టీచర్ కి ఇచ్చాను. రెండో గ్లాసును " సార్ టీ తీసుకోండి " అంటూ సోమా శేఖరం సార్ కి అందించాను.

రెప్ప పాటులో ఆయన లేచి నిలబడి " బైట చేరాను అని ఇందాకే కదా చెప్తున్నావు. ఓ మూల కూర్చుని ఉండక తగుదునమ్మా అంటూ ఇల్లు వాకిలి ఏకం చేస్తూ అన్ని ముట్టుకోవడం ఎందుకు. పైగా నీ చేత్తో నాకు టీ ఇస్తావా.." అంటూ విసురుగా స్టాఫ్ రూమ్ నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

ఒక్క క్షణం పాటు ఏం జరిగిందో తెలియలేదు నాకు. శోభారాణి టీచర్ కూడా విస్తుపోయింది ఆయన ప్రవర్తనకి.

"అయ్యో ! సార్ ఏంటి అలా అనేసారు " అంది.

టీచర్ మాటలు నాకు వినపడలేదు. పొద్దున్న నుంచి నొప్పి, నా పరిస్థితి తెలిసి కూడా మా వారు నన్ను స్కూల్ దగ్గర డ్రాప్ చేయకపోవడం, స్కూలుకి లేటుగా రావడం, మేడం దగ్గర తిట్లు, ఇప్పుడు సార్ దగ్గర ఈ అవమానం వెరసి గుండెల్లోని బాధ అంతా కట్టలు తెంచుకుని కన్నీటి రూపంలో బయటకు వచ్చింది నాకు.

" అయ్యో లతా టీచర్..! బాధ పడకండి. సార్ మాటలను లైట్ తీసుకోండి. ఇలాంటివి చాల సార్లు ఎదుర్కొన్నాను నేను. ఇప్పుడు సార్ అన్నారు. ఇంతకు ముందైతే సీనియర్ టీచర్లు కొందరు ఈ విషయంలో నన్ను, ఇంకొందరిని చాల బాధ పెట్టారు. మన ఆడవాళ్ళే మన సమస్యను అర్థం చేసుకోకుండా ఇదేదో మనం స్వయంగా చేసిన నేరం అన్నట్టు చూస్తారు" అంది శోభారాణి టీచర్ నా వైపు ఓదార్పుగా చూస్తూ.

నా బాధ, శోభారాణి టీచర్ మాటలు విని శ్రావణి, సుజాత టీచర్ లు కూడా స్టాఫ్ రూమ్ లోకి వచ్చారు ఏం జరిగింది అంటూ.

సోమశేఖరం సార్ ఆ స్కూల్లో చాల సీనియర్ టీచర్. దాదాపు రిటైర్మెంట్ కి దగ్గర వయసు. సనాతన సంప్రదాయంలను బాగా వంటబట్టించుకున్న వారు. రోజు టీచర్లలందరితో, నాతో సహా బాగా మాట్లాడుతారు. అడగక పోయిన 'ఇదిగో అమ్మాయి ఈ పాఠం ఇలా చెప్పాలి, ఈ పని ఇలా చెయ్యాలి ' అంటూ సలహాలిచ్చేవారు. అటువంటిది ఈ రోజు నా పట్ల ఆయన చూపిన ఏహ్య భావం నన్ను నా కడుపు నొప్పి కంటే ఎక్కువ బాధ పెట్టింది. అందరు టీచర్లు తలోమాట అంటుండగానే ఇంటర్వెల్ గంట మ్రోగింది.

లోపలి గంట కొట్టడంతోనే ప్రిన్సిపాల్ మేడం టీచర్లను వాళ్ళకి అలాట్ చేసిన రూంలకి పంపించింది ఎగ్జామ్స్ ఇన్విజిలేషన్ కోసం. పొద్దున ఓ పరీక్ష, మధ్యాహ్నం లంచ్ తర్వాత మరో పరీక్ష పూర్తైయేసరికి సాయంత్రం నాలుగయింది. ఆ తర్వాత ఓ గంట స్టడీ అవర్. అప్పటివరకు ఒక్క నిముషం కూడా కూర్చోవడానికి కుదరలేదు నాకు.

రిజిస్టర్ లో సాయంత్రపు సంతకం చేసి బయట పడేసరికి ఐదున్నర అయింది. రహ్మత్ నగర్ వైపు వెళ్ళేది నేను, సోమశేఖరం మాస్టర్. మేమిద్దరమే. ఆయన రహ్మత్ నగర్ దాటి యూసుఫ్ గూడ బస్తి అవతల ఉన్న మధురా నగర్ వెళ్ళాలి. రోజు పాత మోపెడ్ బండిలో ఆయన, షేర్ ఆటోలో నేను వెళ్ళేవాళ్ళం.

ఎంతసేపు బోరబండ చౌరస్తాలో నిలబడ్డా ఎందుకో ఈ రోజు ఒక్క షేర్ ఆటో కానీ, బస్సు కానీ రాలేదు. పొద్దున నుంచి జరిగిన అవమానాలు, తలనొప్పి నిలబడలేకపోతున్నాను నేను. ఇక లాభం లేదని కార్మిక నగర్ వరకు నడుచుకుంటూ పోయి అక్కడ ఆటో ఎక్కుదాం అనుకుని మెయిన్ గల్లీ నుంచి కాస్త పక్కకు ఉన్న సైడ్ గల్లిలో చిన్నగా నడుచుకుంటూ పోతున్నాను. గల్లిలో ఎక్కడా జనసంచారమే లేదు. సోమశేఖరం సార్ కూడా వెళ్లిపోయారేమో. ఆయన తీరు తలచుకుంటేనే మనసంతా బాధతో నిండిపోతోంది. గల్లిలో అంతా అడుగడునా పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. వాటిలో నీరు నిండి మురుగు వాసనా వస్తోంది. జాగ్రత్తగా అడుగు వేయక పోతే గుంటలో పడడం ఖాయం. ఆ గల్లిలో పెద్దగా ఇళ్ళు కానీ, షట్టర్లు కానీ లేవు.

అడుగులో అడుగేసుకుంటూ మెల్లగా నడుస్తున్నాను. అప్పటికే చీకటి "నా డ్యూటీకి నేను వచ్చేస్తున్నా" అంటూ బొగ్గు రంగు పులుముకుని చిక్కగా అల్లుకుంటోంది. వాహనాల ట్రాఫిక్ ఉండదని ఈ గల్లీ లోకి రావడం నా పొరపాటైంది. చీకట్లో ఎక్కడ గుంటలో అడుగు వేస్తానో అని భయంగా మెల్లిగా నడుస్తున్నాను.

ఉన్నట్టుండి వెనుక నుండి దబ్బున ఏదో పడ్డ చప్పుడైంది. వెనువెంటనే " అమ్మా" అన్న అరుపు గాల్లో ప్రతిధ్వనించింది.

దిగ్గున వెనక్కి తిరిగి చూసాను నేను. నాకు కాస్త దూరంలోనే గుంటలో పడ్డ సోమశేఖరం మాస్టర్ కనిపించారు. ఆయన మోపెడ్ బండి పక్కకు పడిపోయి ఉంది. పరీక్ష పేపర్లు అన్ని చెల్లా చెదురుగా పడిపోయాయి. గుంత అంచు బలంగా నుదుటికి కొట్టుకున్నట్లు ఉంది. నుదుటి నుంచి ధారగా రక్తం కారి మాస్టారి తెల్ల చొక్కాని ఎర్రగా తడిపేస్తోంది. గుంటలో నుంచి లేవడానికి విఫల ప్రయత్నం చేస్తూ నా వైపు చేయి చాచి రమ్మని సైగ చేస్తున్నాడు ఆయన.

"అయ్యో సార్, పడిపోయారా..! " అప్పటి దాకా ఆయన మీద ఉన్న కోపం, బాధ ఎగిరిపోయాయి నాకు. ఆయన్ని ఎలాగైనా కాపాడాలి. ఇదే ఆలోచన నాలో.

పరిగెత్తుకుంటూ ఆయన దగ్గరకి వెళ్ళి చేయి అందించబోయాను. ఆయన కూడా నాకు చేయి అందించ బోయారు. వెంటనే షాక్ కొట్టినట్టు చేయి వెనక్కి తీసుకుని దూరం జరిగి ఆగిపోయాను. ఆయన విస్మయంగా నా వైపు చూసారు.

" సార్ నేను మిమ్మల్ని ముట్టుకోకూడదేమో " అన్నాను.

"అమ్మా... లతా.. నన్ను మన్నించు. నువ్వు నా బిడ్డలాంటిదానవు. నా మాటలతో, చేతలతో నిన్ను బాధ పెట్టాను. నీ పరిస్థితి పట్ల సానుభూతి చూపాల్సిన నేను నీ పట్ల వివక్ష చూపాను. శారీరకంగా, మానసికంగా ఇబ్బందుల్లో ఉన్న వారిని అర్థం చేసుకోని, అవసరం అయితే వారిని ఆదుకుని సాంత్వన కలిగించడమే సదాచారం అని ఇన్నాళ్లకి గ్రహించాను తల్లి". అంటూ అతి ప్రయత్నం మీద చేతులు జోడించబోయారు.

"అయ్యో..! మీరు కదలవద్దు సర్ " అన్నాను నేను కంగారుగా చేయి ఊపుతూ.

"నువ్వు బయలుదేరిన కొంచెంసేపటి తర్వాత నేను కూడా స్కూల్ నుంచి బయలు దేరాను. ఆ గల్లీలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. త్వరగా వెళదామని ఈ గల్లీలోకి వచ్చాను. నువ్వు ఈ గల్లీలో ఉండడం నా అదృష్టం తల్లి. నడుం విరిగినట్టు నొప్పిపుడుతోంది. నన్ను పైకి లేపమ్మా " దీనంగా అన్నాడు ఆయన చేయి అందించి.

పొద్దున్నించి గాయపడి ఉన్న నా మనసుకి మాస్టారి మాటలు గాయానికి నవనీత లేపనం అద్దినట్లు ఉపశమనం కలిగించాయి. మనసు తేలిక పడింది. గుంట దగ్గరగా వచ్చి ఆయనను పైకి లేవదీయడానికి నా చేయి అందించాను.

**కవిత**

# జీవన వ్యాపారం



- శ్రీదేవి సురేష్ కుసుమంచి

ఏ స్వరపేటిక ఊపిరి పోసింది, "వృద్ధాప్యం వృధా వయసనే
ఆర్థత లేని ఎడారి పద భావనకి...

అనుభవలేఖినితో మనోపుస్తకముపై కాలము నేర్పే ప్రతీ
పాఠ్యాంశ సారాంశాలని శాశ్వతంగా లిఖించుకుంది...ఆ
వయసు

వణుకుతున్న ఆ చూపుడు వేలు ఎంత మంది జీవితాలకు
ఆదర్శ దిక్సూచై నిలిచి, దృఢమైన పునాదులకు శంఖుస్థాపన
చేసిందో...

నువ్వేమిటో నీకే తెలియని మనసుతో..
"నీకేమి తెల్సు" అనే భారమైన శరాన్ని
యవ్వన విల్లుతో జారవిడిచినప్పుడు,..

నీ వంశ వృక్షానికి ఆధారమైన
ఆ అనుభవ ఊడలు ఎంత విలవిల
లాడుతున్నాయో తెల్సా!

బుద్ధిని నిద్రలేపి..
సృష్టిలో ఉత్కృష్ట జన్మనిచ్చిన
తల్లిదండ్రుల వయసుకి ఊతకర్రగా మారండి...
"ఒడ్డుకి చేరేక తెప్ప తగలేసే "ఆలోచనలకు
స్థానమివ్వకండి...జీవితం వ్యాపారం
కాదు..అనుబంధాల వనం..ప్రేమను
పంచండి..మధుర పరిమళాలను
ఆస్వాదించండి..

★★★

కథ

# ఏదిజరిగినా మన మేలుకే !



- దామరాజు విశాలాక్షి

నాలుగు రోజులై పనమ్మాయి రావడం లేదు.

ఇల్లు వెతుక్కొని వెళ్ళాను నన్నుచూసి గుండెలు బాదుకొని ఏడవసాగింది ఆదమ్మ ..

ఏమయిందాదమ్మా? ఎందుకిలా ఏడుస్తున్నావంటే! పక్కన మంచంలో పడున్న పాతికేల్ల కొడుకుని చూపిస్తూ, మళ్ళీ ఘొళ్ళుమంది ఆదెమ్మ....!

"ముందునుండి దూకుడొద్దురా బాబూ !

చెడ్డవాళ్ల స్నేహాలొద్దు. వ్యసనాలు మనిషిని ఒంచిస్తాయి, ప్రమాదమని సెప్తనే ఉన్నానమ్మా! నామాట పెడసెవిని పెట్టాడు.. ఎదిగిన పిల్లలముందు ఎదవ్వేసా లేసిన నామొగుడి మాటంటే ఆడికసలే కాతర్నేదు ఏదేమయితే నేమమ్మా. ఈ రోజు అశ్రద్ధ వలన. అవిటితనమొచ్చి, అలో లక్ష్మణా! అని ఏడుస్తున్నాడమ్మా!

స్నేహితులతో పార్టీ అని వెళ్ళి, మితి మీరిన వేగంతో, తాగి బళ్లు నడుపుతూ, అర్ధరాత్రివస్తుంటే, ఏక్సిడెంటయి, బైక్ నడుపుతున్న ఫ్రెండు స్పాట్ లో చచ్చిపోతే, వీడికి కుడి కాలు మొదలులోనికి. విరిగి పోయిందమ్మా!" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ..

ఆదమ్మనెలా ఓదార్చాలో నాకు. అర్థం కాలేదు ..

ఇంటెర్మీడియెట్. ఇన్స్టాల్మెంట్స్లో అయిందనిపించి, ఇంట్లో గోల పెట్టగా పెట్టగా, ఆటో మొబైల్ కంపెనీలో మెకానిక్ గా చేరాడు ఆదెమ్మకొడుకు. తండ్రీ, కొడుకూ ఇద్దరూ సంపాదించినదల్లా తాగడం జల్సాచెయ్యడం పనిగా పెట్టుకున్నారు. నామొగుడి సంగతొదిలేయండమ్మా! కనీసం నాకొడుకైనా బాగుపడతాడనుకున్నాను. వీడికిప్పటినుండే చెడుస్నేహాలు... అలవాట్లు... తిరుగుళ్ళు... మాటవినడు. నారాతంతేనమ్మా! ఆడపిల్ల అన్యాయం అయిపోతాదని బతుకుతున్నాను. దాని కోసమే కష్టపడతన్నాను. అది చాలా బాగా చదువుతాదమ్మా ! దాన్ని హాస్టల్ లో పెట్టి చదివిస్తున్నాను. సెలవులిస్తే మా అమ్మ ఇంటికి పంపి, నేనే పోయి చూసి వస్తున్నా. ఎదిగిన పిల్ల.. మాఇంటి పరిస్థితి బాగాలేదని... చెప్పుకు ఏడ్చింది ఈమధ్య .... ఆదెమ్మ చాలా నమ్మకస్తురాలు. ఒక్క మాటలో చెప్పాలంటే.. నా కుడి భుజం... కుమిలి పోతున్న ఆదెమ్మను ఓదార్చి, కిరాణాదుకాణం పెట్టించు, గవర్నమెంటు ఆర్థిక సాయం చేసేలా చూస్తాను ...

మన ప్రభుత్వం అందరినీ అన్ని విధాలా ఆదుకుంటోంది, పుట్టుకతో అంగవైకల్యం వచ్చిన వారెందరో నాకు తెలిసి ఆత్మ ధైర్యంతో బతుకు తున్నారు. చెప్పిన మాటవినక చేజేతులా బ్రతుకు చిద్రం చేసుకుంటున్నారు చాలామంది. సాహసంపేరుతో మొండితనానికి పోయి యువకులు ప్రమాదాలకోరల్లో చిక్కి బంగారు భవిష్యత్తును దుర్భరం చేసుకుంటున్నారు.. ఆదమ్మ కొడుకు ఒకటే ఏడుపు చచ్చిపోతానమ్మగారూ! నేనీ అవిటి బ్రతుకు బ్రతకలేనమ్మా! అందరి దగ్గరా అవమానంగా ఉంటుంది అని..

దైవలీల సరిగ్గా అదే సమయంలో నా స్నేహితురాలి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. ఆమె కూతురు నారాయణమ్మ పుస్తకం ఆవిష్కరిస్తోంది .ఆపుస్తకం గురించి మాటాడాలని.. వెంటనే, ఆదమ్మ కొడుక్కి ఆ ఫోటో చూపెట్టాను. నాస్నేహితురాలు అనేక సమస్యలు అధిగమించింది. ఈమె కూతురు. అంధురాలు. ఆత్మవిశ్వాసం అంటే. ఆ అమ్మాయి నుండే నేర్చుకోవాలి. కష్టపడి చదువుకుంది.. ఇష్టపడి పాడుతుంది.

అనర్ఘలంగా ప్రసంగిస్తుంది.. వైకల్యం అనదు అననీయదు.. విపరీతమైన దైవభక్తి.. అనాదలందరినీ చేరదీసి ఆసరాగా ఉండి హాయిగా ఒక పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేస్తుంది. సంగీతంలో అన్ని అర్హతలున్నాయి గదా ! సంగీత ఉపాధ్యాయనిగా. చేయొచ్చు కదా అంటే, కళ్ళు లేని వారు, పాడడానికి తప్ప దేనికీ పనికిరారనే అపప్రథ. నాకెందు కండీ, హాయిగా బి.ఇ.డి. చేసాను. సోషల్ టీచరుగా. చేస్తున్నాను. నేను చెప్పే పిల్లలకు మంచిమార్కులొస్తున్నాయంది. ఆమెతో పాటు పని చేస్తున్న ఒక మాష్టారు అదేమాట చెప్పి ఆవిడ దగ్గరనుండి ఆత్మగౌరవంతో బ్రతకడం నేర్చా కోవాలన్నారు. నీకో ముఖ్యమైన విషయంచెప్పనా బాబూ! పదునాలుగేళ్ళకే. ఈ నారాయణమ్మ బ్రెయిలీ లిపిలో భగవద్గీత వ్రాసి ఆనాటి రాష్ట్రపతి చేతుల మీదుగా స్వర్ణపతకం తీసుకుంది.ఆడవాళ్ళు ఏమి చెయ్యగలరంటే అసలు. ఒప్పుకోదు. కేవలం. ఆడవాళ్ళు మాత్రమే అన్నీ చెయ్య గలరంటుంది. అనుక్షణం బాధ పడితే అంగ వైకల్యం శాపమే నాంటీ.... ఏ వైకల్యం లేని వారెవరుంటారండీ? కాకపోతే కొన్ని వైకల్యాలు కనబడతాయి.

కొందరివైకల్యాలు కనబడవు. అంటుంది అన్నాను.

అంతా ఆశ్చర్యంగావిని. ఆలోచిస్తున్నవాడికి కాలిన ఇనుం మీద దెబ్బ పడితేనే సాగుతుందన్నట్లు.

ఈసారి నాకు తెలిసిన ప్రభ గురించి చెప్పాను నీలాగే నిర్లక్ష్యం కారణంగా నిండు బ్రతుకు కష్టాల పాల్జేసుకుంది .గూడ్సు బండి ఆగి ఉందని అర్జెంటని, పాలపేకట్లు తెచ్చు కోడానికి రైలుపట్టాలుదాటుతూ, పాదం అందులో ఇరుక్కుపోయి అదేసమయంలో గూడ్స్ కదలడంతో కాలు చెయ్యి పోగొట్టు కుంది. పిల్లలకోసం బ్రతకాలని చక్కగ్గా అన్ని పనులూ చేస్తూ ,జైపూర్ కాలు చేయి సహాయంతో చక్కగా బ్రతుకుతోంది.

నేనుచాలాసేపు కూర్చొని ధైర్యం చెప్పి వచ్చాను.. పట్టుదల కలిగించాను. ప్రతీవారం కొన్నాళ్ళు వెళ్ళాను... తర్వాత చెప్పిన విధంగా సాయం చేసాను..

ఇప్పుడు ఆదమ్మ కొడుకు బడ్డీ పెట్టుకొని చక్కగా వ్యాపారం చేస్తున్నాడు. ప్రైవేటుగా డిగ్రీకి వ్రాస్తున్నాడు... ఆదమ్మమొగుడు కూడా ఆసంఘటనతో బాగామారాడు. ఇల్లు పిల్లలను పట్టించుకుని కష్ట పడుతున్నాడట.. కూతురు కూడా చదువు పూర్తిచేసుకొని ఉద్యోగంలో చేరింది.. ఇప్పుడు ఆదమ్మ ఆనందంగా ఉంటోంది. నన్ను తల్లిలా చూసుకుంటుది...

కాసింత ఆదరణ.. కూసింత ఓదార్పు లభిస్తే కూలిపోయిన బ్రతుకులైనా కూడగట్టుకు నిలబడతాయి అనుకున్నాను.

★ ★ ★

**దామరాజు విశాలాక్షి 9010902794**

# చెట్టూ -పిట్టా



**- స్వాతీ శ్రీపాద**

అంబులెన్స్ రొదల ప్రతిధ్వనుల మధ్య
బీడువారిన నగరపు నడివీధుల మధ్య
వెచ్చని ఊపిరులు నింగికెగసి
నిట్టూర్పుల పతాకాలను అవనతం చేసుకున్న వేళ
దిక్కుతోచని రోదన గమ్యమేమిటో తెలియక
మచ్చల చిరుతలా ఎక్కడా క్షణం కాలాగని
పగటి పరుగులూ
మసిపూసిన మారేడూ కాయలా
చంద్రోదయమూ మిణుగురుల సందడీ లేని
రాత్రులు
మెత్త మెత్తగా రెక్కలు సవరించుకునే
సంధ్యా సమయాలు తూర్పుగాలి అలలపై తేలి
గీస్తున్న ఆధునిక చిత్రాలు.

గుంపులు గుంపులుగా అంబర వీధులను చుట్టి వచ్చిన
లేత రెక్కల రేపటి ఆలోచనల సమూహాలు
ఎల్లలెరుగని ప్రపంచానికీ పంజరానికీ మధ్య
సమస్యలను మబ్బు తునకల్లా పక్కకు జరిపి
స్వప్న శకలాలను విత్తనపు గింజల్లా ముక్కున కరచుకు
మూల మూలలకూ విస్తరించే దేవదూతలు
విత్తనం రెండాకుల మొలకై
చెట్టై, మహా వృక్షమై ఊడలు పాతుకునే ఊహలు.

విపరీత ధోరణుల మధ్య విత్తనం నిద్రిస్తుంది
గూడు వదలకుండా రెక్కలు ముడుచుకు
కాలాన్ని పొదుగుతుంది విహాయసం
కలసి వచ్చే సమయానికి ఎదురుచూపుల్లో
మూసిన కనురెప్పలతో ధ్యాన నిష్టలో కొనసాగుతుంది
మనిషిలా మతిపోగొట్టుకుని
గుండెలో విరిగిన ముల్లు పట్టుకు
చుట్టూ విలవిలలు విసిరికొట్టవు
నిదానం తెలియనితనంలా
నిర్లజ్జగా వీధినపడవు.

**- స్వాతీ శ్రీపాద**

కథ



# పెళ్లి లొల్లి

- పెద్దపల్లి తేజస్వి

ఆ రోజు శుక్రవారం ...

"ఈ రోజు కూడా ఆలస్యంగా లేస్తే ఎలానే, భయం లేకుండాపోతుంది .. తొందరగా లెగు'' అంటూ తిడుతున్న స్వరంతోనే కూతుర్ని నిద్రలేపింది సరస్వతి.

అప్పుడే వదులుతున్న నిద్రమత్తులో నుండి ఒక స్వరం "అమ్మ నీతో ఎప్పుడూ ఇంతే.. నువ్వు పడుకోవు నన్ను పాడుకోనివ్వవు." అంటూ దుప్పటి మొహం మీదకి లాక్కొని కునుకేసింది.

పక్కన కూలర్ ద్వారా చల్లని గాలిని అందిస్తుంది ,వంటగది నుండి సరస్వతి తిట్లు ఆగిపోయాయి .. కొద్దిసేపటి తరువాత ఉలిక్కిపడి చటుక్కున దుప్పటి తీసి పరిగెత్తే నడకతో సరస్వతి దగ్గరకు వెళ్ళింది కూతురు శోభ.

"హా ఇంకా మొదలు పెట్టావే ఈ రోజు ఏం కల వచ్చింది.." కంగారుపడుతున్న కూతురుని చూసి అడిగింది సరస్వతి.

"నాకు కల వచ్చింది అని నీకెలా తెలుసమ్మా" అంటూ ఆశ్చర్యంగా అడిగింది శోభ.

"నువ్వు లేచి నా దగ్గరకు వచ్చేదే నీకు వచ్చిన కలలు చెప్పడానికి కదనే'' సరస్వతి తన పని చేసుకుంటూనే అన్నది.

"నీ తెలివితేటలు మాములుగా లేవమ్మా .. ఐనా నాకు వచ్చే విలువైన కలలను ఏదో తల్లివి కదా అని నీకు చెప్తుంటే .. వెటకారం చేస్తున్నావ్ .. అందుకే నీకు ఇవాళ నా కల చెప్పను పో " అంటూ డాన్స్ లాంటి నడకతో వెళ్ళిపోయింది శోభ ..

శోభ కి వేగం ఎక్కువ, ఆ మాటల్లో చేతల్లో రెండిటిలోనూ వేగమే అందుకే ఆ వీధి మొత్తానికి అల్లరి గడుగ్గాయి అని అంటుంటారు ..

శోభ తయారయ్యి పూజ చేసుకుంటున్న సరస్వతి దగ్గరకు చేరుకుంది. సరస్వతికి భక్తి ఎక్కువే. ఉదయాన్నే లేస్తుంది, భక్తితో పూజలు చేస్తుంది, కమ్మని ప్రసాదాలు వండుతుంది. సరస్వతి ఇంట్లో ఉదయం టిఫిన్స్ కంటే ప్రసాదాలే ఎక్కువగా ఉంటాయి.

"వచ్చేవారం అమ్మవారికి నువ్వే పూజ చెయ్యాలి...రేపు నువ్వు పెళ్లి చేసుకొని అత్తవారింటికి వెళ్ళాక పిల్లకి పూజలు కూడా రావు అంటే నేను భరించలేను బాబోయ్'' పాయసం నైవేద్యం పెడుతూ కూతురుతో చెప్పింది "అమ్మ నువ్వు భక్తితో దణ్ణం పెట్టుకో..నాకు పూజలు వచ్చా .. నా పెళ్ళెప్పుడు ఇలాంటివి కావు నీ మనసులో ఉండాల్సింది .. ముందు భక్తి ఆ తరువాత భుక్తి ..నువ్వు ఒక మంచి పాట పాడితే పూజ ముగించుకొని ప్రసాదం తిందాం'' అంటూ కొంచం కొంటెతనం తో ఆకలి అవుతుందని చెప్పకనే చెప్పింది శోభ.

శోభకు తన తల్లి చేసే ప్రసాదాలతో పాటు ఆమె పాడే భక్తి పాటలు అంటే చాలా ఇష్టం..

సౌభాగ్య లక్ష్మి రావమ్మా... అమ్మా... ఆఅ ఆ  
సౌభాగ్య లక్ష్మి రావమ్మా...  
నుదుట కుంకుమ రవిబింబముగా  
కన్నుల నిండుగా... కాటుక వెలుగా ||2||  
కాంచన హారము... గళమున మెరియగా  
పీతాంబరముల శోభలు నిండుగా...  
సౌభాగ్య లక్ష్మి రావమ్మా... అమ్మా... ఆఅ ఆ

సౌభాగ్య లక్ష్మి రావమ్మా.... "అంటూ చక్కని గొంతుతో సరస్వతి పాట పూర్తి చేసి కొబ్బరికాయ కొట్టడానికి తీసుకుంది. "నేను కొడతా'' అంటూ శోభ కొబ్బరికాయని తీస్కొని దణ్ణం పెట్టుకొని కొట్టడానికి ప్రయత్నించింది కానీ కొబ్బరికాయ గట్టిదో మరి శోభ భక్తి మెత్తదో కానీ కొబ్బరికాయ పగలడం లేదు ..

పక్కన ఉన్న చెట్టుమీద రెండు కోతులు శోభ కొబ్బరికాయ కొట్టగానే తీసుకొని వెళ్లి తినడానికి సిద్ధంగా కొబ్బరికాయనే చూస్తూ ఉన్నాయ్ .మరొకసారి కొబ్బరికాయ కొట్టడానికి సిద్ధమైన శోభ ఒకసారి కోతులవైపు చూసి భయంతో టెంకాయ కొట్టడం ఆపేసింది. "అమ్మో కోతులే.. నేను కొట్టను" అంటూ టెంకాయని కొట్టకుండా ఆపింది.

"పిచ్చి పిల్ల అమ్మవారికి కొబ్బరికాయ కొడతా అని కొట్టకుంటే అపచారమే ..ఏపని సరిగా చెయ్యవేంటే'' కొంచం

కోపం వస్తున్నా కూడా ఆ కోపాన్ని బయటకి చూపకుండా అనేసింది సరస్వతి. "అమ్మ నువ్వు ఎన్నెనా చెప్తావ్ ..ఆ కోతి చూడు నా వైపే చూస్తుంది ..కొబ్బరికాయ కొట్టగానే వచ్చి నన్ను కరిచో, రక్కో, గీరో ప్రసాదం తీస్కొని వెళ్ళిపోదామని సిద్ధంగా ఉంది .. తీస్కొని వెళ్తే వెళ్ళింది కానీ నన్ను కరిస్తేనే సమస్య "అని భయంతో తల్లికి తన పరిస్థితి చెప్పేసింది.''

"భగవంతుడు తనకి నచ్చినవారికి కొన్ని పరీక్షలు పెడతాడు.. వాటిని తట్టుకొని నిలబడ్డప్పుడే మన బలం తెలుస్తుంది.. ఈ కోతి కూడా నీ భక్తికి పరీక్ష పెట్టడానికే వచ్చిందేమో.. ఏమి కాదులే కొట్టు నేనున్నాగా..'' అని ధైర్యం చెప్పి కూతురికి జ్ఞానోదయం చేసింది సరస్వతి. కానీ తల్లి చేసిన జ్ఞానోదయం కోతి భయం ముందు అంతగా పనిచేయలేదు.

"దేవుడు ఏమైనా మా గురువు గారా అమ్మ ? పరీక్షలు టెస్టులు పెట్టడానికి.. నువ్వే పూజ మొదలు పెట్టావ్ కాబట్టి నువ్వే కొట్టు'' అని కొబ్బరికాయ చేతికిచ్చింది... ''అదేంటే కోతి నావైపే చూస్తుందే అంటే నన్ను కరిచినా పర్వాలేదా ?'' అర్థం కానట్టు అడిగింది సరస్వతి. "నిన్నెలా కరుస్తుందమ్మ భక్త శబరివి ..ఐనా పరమ భక్తులకు కోతులు కరిచినా ఏమి కాదు'' అంటూ నవ్వుతూ వెళ్ళబొయింది శోభ. "సరే ఆగు పూజ అయ్యాక వెళుదువు" అని కొబ్బరికాయ కొట్టడం మొదలుపెట్టింది సరస్వతి. కోతి వైపు శోభ, శోభ వైపు కోతి చూసుకుంటూ ఉన్నారు. శోభ ఉరిమి చూసే చూపులకి కోతికి కోపం వచ్చిందేమో ఒక్కసారిగా వారివైపు దూకేసింది." ఆమ్మో కోతి "అని చేతిలో కొబ్బరికాయని పక్కన పెట్టేసి భయంగా అరిచింది సరస్వతి.

ఇదంతా చుసిన శోభ తల్లికి జ్ఞానోదయం చేసే సమయం వచ్చింది అనుకొని "నేను చెప్పా కదా భయం అనేది దగ్గరకు వస్తే కానీ తెలియదు. అందుకే ఏ భక్తి అయినా సరే అతి ఉండకూడదు. ఉదాహరణకు ఒక పాము వచ్చింది అనుకో దాన్ని అమ్మవారు నాగదేవత అని నోరు తెరిపించి పాలు పొయ్యకూడదు "అని చెప్తున్న సమయం లోనే సరస్వతి కి కోపం వచ్చి" నాకే నీతులు చెప్తావానే రాక్షసి "అంటూ కూతుర్ని ప్రేమతో అరిచింది ..వీరి ప్రేమని పట్టించుకోని కోతి కరిచి ప్రసాదం తీసుకెళ్లడానికి సిద్ధంగా వస్తుంది.

"ఓ బావ .. రావే ఎక్కడ ఉన్నావ్ ..ఈ కోతి ఇవాళ పూజ చెయ్యనిచ్చేలా లేదు" అని భర్త యాకయ్యని పిలిచింది సరస్వతి. ఇన్ని సంవత్సరాల వారి వివాహబంధం లో భర్త యాకయ్యని ఎప్పుడు ఏమండి అని పిలవలేదు ఎప్పుడు బావ అనే పిలుస్తుంది సరస్వతి. "ఓ బావ" అని మరో సారి పిలిచిన పిలుపుకు యాకయ్య వచ్చి కోతిని బెదిరించి పంపాడు. "ఇప్పుడు నేను కొబ్బరికాయ కొడతా" అని తన తల్లి చేతిలో టెంకాయ తీస్కొని కొట్టింది శోభ.

తల్లి కూతుర్లు ఇద్దరు నడుచుకుంటూ ఇంట్లోకి రాబోతున్న సమయం లో కుక్క శోభ ని చూసి ఒక్కసారిగా గట్టిగా మొరిగింది. ఆ మొరుగుడికి శోభ ఉలిక్కిపడింది. "ఆమ్మో నా కూతురు జడుసుకుంది" అని వీపుమీద రెండు చరిచింది సరస్వతి. కోపంగా కొట్టిందా, ప్రేమగా కొట్టిందా అని కోపంగా చూసిన శోభకు అమ్మ అమాయకత్వానికి నవ్వొచ్చింది. తనంటే అమ్మకి చాలా ప్రేమ అని మనసులో ఆనందపడింది శోభ. కానీ వీపు మీద పడ్డ వాతలకు మాత్రం లోపల మంట ఉన్న పైకి మాత్రం నవ్వుతూ అమ్మకి ఉన్న ప్రేమని తలుచుకుని నవ్వుకుంది.

"ఏమైందే ఆలా నవ్వుతున్నావ్" సరస్వతి మాట పూర్తికాకముందే "కొడితే కొట్టావ్ అమ్మ కానీ పక్కింటి ఆంటీ వాళ్ళు చూడు చూసి నవ్వుతున్నారు .. ఈ సారి ఎవరూ లేనప్పుడు కొట్టు సరేనా ?" అన్న శోభ మాటలకి ఇంట్లో అందరూ నవ్వడం మొదలుపెట్టారు. "సరేలే ఎవరు చూడకుండా కొడతాలేకానీ ప్రసాదం అందరికి పెట్టు..ఈ యేడాది నీకు పెళ్ళైపోవాలి.. మంచి మనసున్న భర్త రావాలి "అంటూ కూతురిని ప్రేమగా చూసింది సరస్వతి. పెళ్లి మాట అంటే చాలు శోభకు చాలా కోపం వచ్చేస్తుంది. " అమ్మ ప్రతి సారి పెళ్లి గోల తియ్యకే, నీకు పుణ్యం ఉంటుంది. ఇవాలైనా కొంచం పుస్తకం తీసి చదువుకుందాం అనుకున్న.. ఈ పెళ్లి ప్రస్తావన తెస్తే చదువుకోవాలి అనే ఆలోచన కూడా ఉండదు ,నన్ను చదువుకోనివ్వు "నాన్న యాకయ్యని చూస్తూ అమ్మకి చెప్పేసింది శోభ." "అది కాదే బయటికి వెళ్తే మీ అమ్మాయి పెళ్ళెప్పుడు.. పప్పన్నం ఎప్పుడు పెడతారు అని అడుగుతున్నారే".

"వాళ్ళకి పప్పన్నం కావాలంటే కేజీ కందిపప్పు కొని వండి పెడదాం. ఐనా వాళ్ళ కోసం నన్ను ఇప్పుడు పెళ్లి చేసుకోమంటావా అమ్మ.. తప్పే "అని తల్లివైపు జాలిగా చూసింది శోభ..

"నేను అలా అన్నానానే.. వాళ్ళు అడుగుతున్నారు అని చెప్తున్నా అంతే" సరస్వతి స్వరం తగ్గించి చెప్పింది." అమ్మ వాళ్ళు అడుగుతున్నారని.. నువ్వు చెప్తున్నావని.. నేనైతే పెళ్లి చేసుకోను. బాగా చదువుకొని ఉద్యోగం సంపాదించిన తర్వాత పెళ్లి చేసుకుంటా.. సరే ప్రసాదం పెట్టు "అని చేయి చాచింది శోభ. "దేవుడా దీని మనసు మార్చి తొందరగా పెళ్లి అయ్యేలా చూడు స్వామి" అని శోభకు ప్రసాదం పెట్టింది సరస్వతి.

**పెద్దపల్లి తేజస్వి**
తెలుగు సాహిత్య పరిశోధకులు, పరిశోధక విద్యార్థిని,
(తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం)
ఖమ్మం.ఫోన్ 9603329474

# నా రాత మీన మన్నువడ



- సొన్నాయిల కృష్ణవేణి

అవ్వకు తొల్సూరు కాన్పుల
ఆడివిల్లనై పుడితి
సుక్కురారం పొద్దు అమాసగోలిగె
పుట్టిన్నని మాలచ్చిమనిరి
నా మొకం జూడకపోతె
మాఅయ్యకు పొద్దు పొడువదాయె
మా అవ్వకు పొద్దు గడువదాయె
నా బిడ్డ శెయ్యి వడితె
మట్టి సుత బంగారమయితదని
ఏ పని సురువు జేశినా
నాతోనే జేపిద్దురు
పొల్ల లగ్గం జూడకుంటనే సత్త గావచ్చని
మంచాలవడ్డ ముసలోడేడ్తె
పదమూడేండ్లకే లగ్గం జేసి సాగదోలిండ్రు
గొడ్డొచ్చిన యాల్ల బిడ్డొచ్చిన యాల్ల
నాకోడలు రాంగనే కొడుక్కు నౌకరచ్చిందని
నన్ను కండ్లకద్దుకునిరి అత్తమామలు
లచ్చింగల్ల మొకమని ఏ పనికి వొయ్యినా
ఎదురుంగ రమ్మందురు
వాడకట్టు మీన సుత
ఎవ్వలింట్ల శుభకార్యం జరిగినా
పిలిశి పసుపుగుంకుమ వెడుదురు
పెండ్లయ్యి యాడాదన్న గడువకపాయె
నా రాత మీన మన్ను వడ
నా రాత రాళ్ళ పాలాయె
పెండ్లి సూత్తనన్నోడు మంచిగనే ఉండె
శేసుకున్నోడు కాట్లె గలిశె
పదొద్దుల్ల పిట్టకు వెట్టి రాంగనే
తలలపూలు తీసేశి గాజులు వలగ్గొట్టి
నా పసుపు గుంకుమ గంగల గలిపిరి
తెల్లశీరె గట్టి శేతుల బెల్లం పెట్టిరి
తెల్లారి లేవంగనె అవ్వయ్య మొకం జూత్తె
శెరోదిక్కు మొకం దిప్పుకునిరి
మామకెదురైతె మామ తిట్టె
అత్తకెదురైతె అత్త గొట్టె
మొగడు సచ్చిన ముండవు
మూలగ్గూసుండక రంగుల రాట్నమోలె
ఇల్లంత ఎందుకు దిరుగుతానవు
ఇంకెవ్వల మింగి మంచీల్లు దాగుతవని
తలో దిక్కు కాకులోలె పొడిశిరి
శుభకార్యం జరిగే కాడ ముంగట నిలవడితె
జెట్ట మొకపు దాన జరుగటేటు అనిరి
పొద్దుగాల లేవంగనే ఎవ్వలకెదురయినా
పాడు మొకపుదాన పక్కకు జరుగుమనిరి
బొట్టు లేకపోతె మొకమెట్లనో ఉన్నదంటె
నీ రాతే సక్కగ లేదు మొకమెట్లుంటేందనిరి
పూలు ముద్దుగున్నయంటె
పూలకు నోసుకున్న పుటుకేనా నీదనిరి
శిన్నప్పుడు కాటుక పోదరేశి
మొకానికి బొట్టు వెట్టి
శేతులగ్గాజులు కాళ్ళకు గజ్జెలు
శికనిండ పూలువెట్టి శిటికెలిరిసిన
అవ్వ గుడ శీదరిచ్చుకోవట్టె నా మొకం జూసి
ఇన్నొద్దులు లచ్చింగల్ల మొకమన్నోల్లే
ఇప్పుడు తాశిలి మొకమనవట్టిరి
పుట్టినసంది లచ్చింగల్ల మొకం
గిప్పుడు తాశిలి మొకమెట్లయ్యింది
మొగడు గట్టిన పుస్తె మట్టె
మొగనితోని పోవాలంటె సరెగనీ
శిన్నప్పటి సంది వెట్టుకున్న
పువ్వులు గాజులు పసుపు కుంకుమ
గిప్పుడెందుకు తీసెయ్యాలె
నా బతుకంత సోంచాయించినా
సమజయ్యేటట్టు లేదు గీ ముచ్చటేందో....

★ ★ ★ ★ ★

సొన్నాయిల కృష్ణవేణి

# నేనూ.... నా ఆర్ట్



డా. లక్ష్మీ రాఘవ





















నాకు చిన్నప్పటినుండీ కళలపై మక్కువ. 4 తరగతి నుండీ పెన్సిల్ స్కెచ్స్ వేసేదాన్ని అదే ఇష్టం ఇప్పటికీ వుంది, పొట్రెయిట్ పెన్సిల్ స్కెచ్ స్ చేస్తాను

పెయింటింగ్స్ వేయడం వాటర్ కలర్స్ తో మొదలై ఆయిల్ పెయింటింగ్స్ దాకా వెళ్ళింది. ఒక విధంగా ఆయిల్ పెయింటింగ్స్ సులభం మళ్ళీ మళ్ళీ మారుస్తూ మంచి ఎఫెక్ట్ తీసుకు రావచ్చు. ఆ సులువు వాటర్ కలర్స్ లో వుండదు. చీరల మీద బ్లాక్ ప్రింటింగ్, ఫాబ్రిక్ పెయింటింగ్ చేయడంలో క్రియేటీవీటీ చూపవచ్చు.

ఇంకా రాజస్థాన్ లో చేసే ఆర్ట్ ఝరోకా. 3Dగా కనిపించే మురల్స్, కూజాల మీద అందమైన బొమ్మలు, ఇంటి ముందు పెట్టుకునే నేమ్ ప్లేట్స్. బంగారు రేకుతో చేసే Tanjore పెయింటింగ్స్, పేపర్ చింపులతో చేసే Decoupage, సిరామిక్ పౌడర్ తో చేసే Lamosa ఇలా కొత్తగా ఏ కళ చూసినా చేయడం నేర్చుకున్నాను.

ఆ పైన నాకు అత్యంత ప్రీతికరమైనది, ప్రత్యేక గుర్తింపు నిచ్చింది నేను చేసి exhibit చేసిన

"wealth out of waste" [వ్యర్థంతో సంపద] అన్న కళాకృతులు. దీనిని క్రియేటివ్ ఆర్ట్ లేదా సృజనాత్మక కళ.

ఒక విభిన్నమైన ఆలోచనతో ఏదైనా సృష్టించగలిగితే అది సృజనాత్మకత కళ లేదా క్రియేటివ్ హస్త కళ అనవచ్చు.

సృజనాత్మకత అంటే ఒక ఆలోచన. ఒక విలక్షణ మైన ఆలోచన తో ఏదైనా సృష్టించడానికి గల సామర్థ్యం. మామూలు గా కాక విభిన్నంగా ఆలోచన చేయటం కొత్త వస్తువును చేయగలిగే ప్రక్రియ. ఇక్కడ వేస్ట్ అనుకున్న వాటికి విభిన్నరూపాలు ఇస్తూ ఉపయోగ యోగ్యంగా చేస్తే అది రీసైకిల్ లేదా పునర్వినియోగా యోగ్యంగా మార్పు చేయటం.

అలా ఏదీ వేస్ట్ అనుకోకుండా కొత్త ఆలోచనలతో వ్యర్థ పదార్థాలతో నా చేత రూపొందించబడిన కళా రూపాలు ఎన్నో. దీనివలన మన జీవితంలో వాడినవి ఎన్నో కళా రూపాలుగా నిలిచిపోయి, గడిచిన కాలాన్నీ, వ్యక్తులనూ గుర్తు చేస్తాయి. మనసుకు ఆహ్లాదాన్నీ కలుగ జేస్తాయి.

మచ్చుకి మా పిల్లలు వాడిన స్కూల్ వాటర్ బాటల్, బొంగరం, బాల్, మామగారి కుర్చీ భాగం.. మనం పూజకు కొట్టిన కొబ్బరి చిప్ప, వాడిన నీటి కుండా.. పారేయ వీలుకాని వెడ్డింగ్ కార్డ్స్ ...ముందుతరం లో వేసిన ద్వారపు పూసల తోరణం...ఇలా చెబుతూ బోతే ఎన్నో!

ఇలా చేసి వుంచడం వల్ల తర్వాత తరానికి అప్పటి సాంప్రదాయాలను మరచిపోకుండా, చేయడమే!!!

ఈ క్రియేటివ్ ఆర్ట్ ఎంతో సంతృప్తినిచ్చింది.

ఒక పత్రిక వారు "హస్తకళల విదుషీమణి" అని అభివర్ణించడం స్ఫూర్తి దాయకం అయ్యింది.







కవిత

# చదువు



చదువు అవుతుంది నీ మెదడుకు ఎరువు

ఆ ఎరువుతో వస్తుంది నీకు కొలువు

కొలువుతో తీరుతుంది నీకు కరువు

కరువు తీరి వస్తుంది నీ జీవితానికి వెలుగు

ఆ వెలుగును పది మందికి పంచి పెంచుకో నీ పరువు..

D. Sai Harshita
9th class
Tswrs girl's rebbena Gurukula School

# బాల బహుళ






హర్షిత,
8వ తరగతి,
రెబ్బెన గురుకుల
పాఠశాల










సాన్వి కలిత,
2వ తరగతి,
ఆర్కేడ్స్
అంతర్జాతీయ
పాఠశాల








టి. శ్రేష్ఠ సాయి,
5వ తరగతి,
పోలాక్స్ ఇన్టెల్లి స్కూల్,
వైజాగ్

# దీపావళి కథల పోటీ విజేతలు


'బహుళ' దీపావళి కథల పోటీల
విజేతల ప్రశంసా పత్రం

బహుళ త్రైమాసిక పత్రిక & కథాసాగరం సంయుక్తంగా నిర్వహించిన
దీపావళి కథల పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి (ఎర్రరేగళ్ళు) పొందిన
శ్రీమతి / కుమారి డా. తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి గారిని 01-11-2021 నాడు
బహుళ అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక ప్రారంభోత్సవం సమావేశంలో అభినందిస్తూ.....

Sumathi
కథాసాగరం వ్యవస్థాపకులు

బహుళ వ్యవస్థాపకులు


'బహుళ' దీపావళి కథల పోటీల
విజేతల ప్రశంసా పత్రం

బహుళ త్రైమాసిక పత్రిక & కథాసాగరం సంయుక్తంగా నిర్వహించిన
దీపావళి కథల పోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి (దా లాస్ట్ ఫ్యామిలీ) పొందిన
శ్రీమతి / కుమారి తోట సుభాషిణి గారిని 01-11-2021 నాడు
బహుళ అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక ప్రారంభోత్సవం సమావేశంలో అభినందిస్తూ.....

Sumathi
కథాసాగరం వ్యవస్థాపకులు

బహుళ వ్యవస్థాపకులు


'బహుళ' దీపావళి కథల పోటీల
విజేతల ప్రశంసా పత్రం

బహుళ త్రైమాసిక పత్రిక & కథాసాగరం సంయుక్తంగా నిర్వహించిన
దీపావళి కథల పోటీలో పాల్గొని తృతీయ బహుమతి (లచ్చుమమ్మ) పొందిన
శ్రీమతి / కుమారి బి. కళాగోపాల్ గారిని 01-11-2021 నాడు
బహుళ అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక ప్రారంభోత్సవం సమావేశంలో అభినందిస్తూ.....

Sumathi
కథాసాగరం వ్యవస్థాపకులు

బహుళ వ్యవస్థాపకులు

## కొత్త పుస్తకాలు



జ్వలిత - ఎన్నెల (కథల జుగల్బంది)



విముక్తి (దళిత స్త్రీ నవల) - సిస్టర్ అనసూయ



మేరా జహాఁ (ముస్లిం స్త్రీ నవల) డా. షాజహానా



మాట్లాడే సమయం (కవిత్వం) - పార్శియాదేవి



గొంతు విప్పిన గువ్వ (నవల) - ఝాన్సీ కొప్పిశెట్టి






## మునికుంట్ల అశోక్ కుమార్

### శనార్థులు

'బహుళ' త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక మొదటి సంచికను ప్రింటింగ్ లో తెస్తే బాగుంటుందని సలహా చెప్పి సావిత్రిబాయిపూలే ముఖచిత్రంతో వెలువడుతున్న బహుళకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించిన తెలంగాణ ఉద్యమకారుడు మునికుంట్ల అశోక్ కుమార్ గారికి శనార్థి..

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనవంతు పాత్రను క్రియాశీలంగా పోషించారు వీరు. మునికుంట్ల అశోక్ కుమార్ గారు ఉద్యమకారులకు, సోషల్ మీడియా, యాక్టివిష్ట్ మిత్రులకు చిరపరిచితులే. బహుజన రాజ్యాధికారం సాధన దిశలోఎప్పటికప్పుడు పూలే –అంబేద్కర్ స్ఫూర్తితో వినిపిస్తున్నారు. అందుకు సమస్త వృత్తులవారిని, విద్యావంతులనీ కలుపుకొని పనిజేస్తున్నారు. అందుకోసం 'బహుజన రాష్ట్ర సమితి' అనే పార్టీని ఏర్పాటు చేసి, దాని ద్వార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రశ్నించే తత్వాన్ని వ్యాపింప జేస్తూ మహిళలకు పెద్దన్నగా ప్రోత్సహిస్తూన్న అశోక్ కుమార్ అన్నకు శనార్థులు.

- బహుళ సంపాదక వర్గం

# దీపావళి కథలపోటీ ఫలితాలు

**'బహుళ అంతర్జాతీయ అంతర్జాల త్రైమాసిక మహిళా పత్రిక' & కథాసాగరం సంయుక్తంగా దీపావళి కథలపోటీ కోసం, సెప్టంబర్ 19, 2021 నాడు ప్రకటన ఇచ్చాము.. 20 అక్టోబర్ 2021 చివరి తేదీ నాటికి 39 కథలు వచ్చాయి. అందరికీ అభినందనలు.**

ప్రథమ బహుమతి డా. తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి గారి కథ 'ఎర్రరేగళ్ళు' - రూ. 1500/- లు
ద్వితీయ బహుమతి శ్రీమతి తోట సుభాషిణి గారి కథ 'ది లాస్ట్ ఫ్యామిలీ' రూ. 1000/-లు
తృతీయ బహుమతి శ్రీమతో బి. కళాగోపాల్ గారి కథ 'లచ్చుమమ్మ' . రూ. 500/-

కన్సోలేషన్ బహుమతులు వరుసగా ఇద్దరికి ఒక్కొరికి రూ 300/- చొప్పున
(1) శ్రీమతి నామని సుజనాదేవిగారి, 'చివరి కోరిక' అనేకథ,
(2) అనసూయ ఉయ్యూరు గారి 'నిర్లక్ష్యం' అనే కథ గెలుచుకున్నాయని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

తమ కథలు పంపి పోటీనీ విజయవంతం చేసిన రచయిత్రులందరకు అభినందనలు. ప్రతిరోజు ఎన్నో సాహిత్య కార్యక్రమలతో బిజీగా ఉన్నప్పటికీ తక్కువ సమయంలో ఎంతో బాధ్యతగా న్యాయనిర్ణేతగా విశ్లేషణాత్మక తీర్పును అందించారు, ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు, బహుగ్రంథకర్త, ప్రభుత్వ డిగ్రీకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. సుశీల గారు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**జ్వలిత**
'బహుళ ' వ్యవస్థాపక సంపాదకురాలు

**సుమతి చురుకంటి**
కథాసాగరం, బాధ్యులు

(కథాసాగరం గురించి ఒక మాట చెప్పాలి, కథా చరిత్రలో మహిళలు రాసిన కథల వివరాలను కుల మత ప్రాంతాలతో సంబంధం లేకుండా తెలుగు కథను భద్రపరచడం ద్వారా రేపటి తరానికి అందించడం, పరిశోధకులకు సహకరించడం, మనని మనం గౌరవించుకోవడం. కథయిత్రుల వివరాలు కథలను వీడియోలుగా భద్రపరచడం ఉద్దేశ్యంతో 02-08-2020 తేదీన కథయిత్రుల సమూహం ఏర్పాటు చేశాము. "కథాసాగరం" యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాము. కారణం సాహిత్య చరిత్రలో జెండర్ వివక్ష ఉంది కదా... లేదంటారా)

Printed at JD Publications, Hyderabad Price : 60/-